

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

కూతురి ఆత్మహత్యతో రగిలిపోయి..

వియ్యంకుడి దారుణ హత్య

వాస్తవానికి అల్లుడే టార్గెట్.. ఆ టైంలో లేకపోవడంతో అతడికి తప్పిన ముప్పు

వియ్యంకుడి కంట్లో కారం కొట్టి కర్రతో విచక్షణారహితంగా దాడి.. అక్కడికక్కడే మృతి

నిజామాబాద్ జిల్లాలో ఘటన

14

శుక్రవారం | 27-9-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 181 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, బహుళపక్షం, తిథి: దశమి మ. 1.21 తదుపరి ఏకాదశి; నక్షత్రం: పుష్యమి రా. 1.20 తదుపరి ఆశ్లేష; వర్జ్యం: ఉ.8.09-9.52; దుర్ముహూర్తం: ఉ.8.31-9.18, మ.12.29-1.17; అమృతఘడియలు: రా.6.27-8.10; రాహుకాలం: ఉ.10.30-12.00; సూర్యోదయం: 6.08; సూర్యాస్తమయం: 6.03 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

కాళేశ్వరం ఇంజనీర్లపై చర్యలు తీసుకుంటే..

డిపార్టుమెంటే ఉండదు

నీటిపారుదల శాఖలో సగానికి పైగా ఆ ప్రాజెక్టులో పనిచేసిన వాళ్లే

- వందేళ్ల కిందట కట్టినవి నిక్షేపంగా ఉన్నాయి
- లక్ష కోట్ల కాళేశ్వరం కట్టడం, కూలడం మన కళ్ల ముందే..
- తప్పిదం ప్రజా ప్రతినిధులదా!? ఈఎన్సీ, ఇతర ఇంజనీర్లదా?
- ఎలాంటి తప్పు చేయకూడదో చెప్పే ప్రత్యక్ష సాక్షి కాళేశ్వరం
- 1.9 లక్షల కోట్లు ఖర్చు చేసినా ఒక్క ప్రాజెక్టు పూర్తి కాలేదు
- ఈ రాష్ట్రం మనది.. అంతా కలిసికట్టుగా నిర్మించుకుందాం
- కొత్త ఇంజనీర్లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపు
- పైరవీలు చేస్తే అడవిలో పోస్టింగ్ ఇస్తామని హెచ్చరిక
- 687 మంది ఏఈఈలకు నియామక పత్రాల అందజేత
- కొత్త ఇంజనీర్లకు క్షేత్రస్థాయిలోనే పోస్టింగ్: మంత్రి ఉత్తమ్


నీటిపారుదల శాఖలో చేరిన ఏఈఈకి నియామకపత్రాన్ని అందజేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు పొన్నం, ఉత్తమ్

హైదరాబాద్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): "నీటిపారుదల శాఖలో 50 శాతానికిపైగా కాళేశ్వరం ప్రాజెక్టులో పని చేసిన ఇంజనీర్లే ఉన్నారు. వాళ్లందరిపై చర్యలు తీసుకుంటే డిపార్ట్‌మెంటే ఉండదు. చర్యలు తీసుకోకపోతే.. వారినే కొనసాగిస్తున్నారని మేం ఆరోపణలను ఎదుర్కోవాల్సిన పరిస్థితి. దీన్ని ఏరకంగా విశ్లేషించాలో తెలియడం లేదు. ప్రతిరోజూ వీళ్లంతా జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ కమిషన్ ముందుకు వెళ్లి.. ప్రాజెక్టు అద్భుతమని ఆయనకు చెప్పడానికి ప్రయత్నం చేస్తున్నారు. కానీ, ఆయన అడిగిన ప్రశ్నలకు మాత్రం వీళ్ల దగ్గర సమాధానాలు లేవు. ఎవర్ని ఎవరు రక్షించాలో వాళ్లకు అర్థం కావడం లేదు" అంటూ ఇంజనీర్లకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి చురకలు అంటించారు. ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ కట్టి వందేళ్లు దాటాయని, హైదరాబాద్‌కు తాగునీటిని అందిస్తూ నగరాన్ని రక్షిస్తున్నాయంటే వాటి నిర్మాణంలో భాగస్వామి అయిన మోక్షగుండం విశ్వేశ్వరయ్యే కారణమని చెప్పారు. "లక్ష కోట్లతో కట్టిన తర్వాత కూలిన కాళేశ్వరం ఇంజనీర్లను ఆదర్శంగా తీసుకుంటారా!? వందేళ్లైనా చెక్కుచెదరని ప్రాజెక్టులు కట్టిన విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకుంటారో తొలిరోజు ఉద్యోగంలో చేరుతున్న ఇంజనీర్లే ఆలోచించుకోవాలి" అని పిలుపునిచ్చారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా కొత్తగా నియమితులైన ఇంజనీర్లకు గురువారం జలసౌధలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి ఆయన నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన

మిగతా 3వ పేజీలో...

30 రోజుల్లో హెల్త్ కార్డులు

- ఒక్క క్లిక్‌తో హెల్త్ ప్రొఫైల్
- రాష్ట్రంలోని 4 కోట్ల మంది వివరాల డిజిటలీకరణ: రేవంత్

13

గుడెందొడ్డి రిజర్వాయర్ సామర్థ్యం 1.5 నుంచి 15 టీఎంసీల పెంపునకు సీఎం ఓకే



ఈ ఏడాదే 10 లక్షల ఇళ్లు

- ఇందిరమ్మ ఇళ్ల సంఖ్య రెట్టింపు.. తొలుత లక్ష్యం 4.5 లక్షలే
- అర్హుల ఎంపికకు అత్యాధునిక సాఫ్ట్‌వేర్, శాటిలైట్ జియో ట్యాగింగ్
- ఇళ్ల కమిటీకి అధ్యక్షుడిగా జిల్లా ఇంఛార్జి మంత్రి, చైర్మన్‌గా కలెక్టర్
- నవంబరు 1 నుంచి కొత్త రిజిస్ట్రేషన్ చార్జీలు!.. అక్టోబరు నుంచి కొత్త ఆర్వోఆర్ చట్టం
- పరీక్ష ద్వారా గ్రామ రెవెన్యూ ఉద్యోగుల ఎంపిక: మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

13




సర్వేకు వ్యతిరేకంగా స్థానికుల ఆందోళన, అడ్డుకుంటున్న పోలీసులు

మూసీ సర్వే ఉద్రిక్తం

- అడ్డుకున్న నివాసితులు
- అధికారుల నుంచి పత్రాలు లాక్కుని చించివేత
- మార్కింగ్ రంగును విసిరేసిన ఓ యువకుడు
- తమకు విషమిచ్చి ముందుకు వెళ్లాలంటూ నిరసన
- భారీ బందోబస్తు మధ్య నదీ గర్భంలో మార్కింగ్
- 'డబుల్' ఇళ్లకు వెళ్లిన 10 నిర్వాసిత కుటుంబాలు

12

పేదల ఇళ్లను కూల్చే హక్కు ప్రభుత్వానికి లేదు

- హఠాత్తుగా అక్రమ నిర్మాణం అంటే వాళ్లు ఎక్కడకు వెళ్లాలి
- రూ.కోట్లు ఖర్చు చేసి మౌలిక వసతులు ఎలా కల్పించారు?
- సీఎంకు కిషన్‌రెడ్డి లేఖ



ఏఐ పండించిన పంట

ప్రపంచంలోనే తొలి ఇండోర్, ఏఐ ఆధారిత వర్టికల్ బెర్రీ ఫామ్
వర్జీనియాలో ఏర్పాటు.. కృత్రిమ మేధ పర్యవేక్షణతో 90% నీరు ఆదా





న్యూయార్క్, సెప్టెంబరు 26: వర్టికల్ ఫార్మింగ్ గురించి మనకు తెలుసు! నియంత్రిత వాతావరణంలో మొక్కలను పెంచడమూ కొత్త కాదు!! కానీ.. ఈ రెండింటికీ కృత్రిమ మేధను కూడా జోడిస్తే? పసిపాపల్లా జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన మొక్కలను ఏఐ ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, ఫొటోలు తీసి వాటికి ఏం కావాలో విశ్లేషిస్తూ, కావాల్సిన పోషకాలు ఎప్పటికప్పుడు అందేలా చేస్తే? అదుగో.. అలాంటి ఆలోచనకు ప్రతిఫలమే ఇక్కడ కనిపిస్తున్న స్ట్రాబెరీ పంట. అమెరికాలోని వర్జీనియా రాష్ట్రం రిచ్‌మండ్‌లో ఈ అద్భుతం ఆవిష్కృతమైంది. ప్రపంచంలోనే మొట్టమొదటి ఇండోర్, ఏఐ-ఆధారిత వర్టికల్ బెర్రీ ఫామ్.. 'ద ప్లెంటీ రిచ్‌మండ్ ఫామ్' ఈ సరికొత్త వ్యవసాయ ప్రాజెక్టును ప్రారంభించింది. ఈ ప్రాజెక్టులో భాగంగా.. కేవలం 0.91 ఎకరా విస్తీర్ణంలో ఏడాదికి 18 లక్షల కిలోల స్ట్రాబెరీలను పండించడమే లక్ష్యంగా 30 అడుగుల ఎత్తున్న టవర్లను నిర్మించింది. ఆ టవర్లలో నాటిన మొక్కలకు కావాల్సిన వేడి, వెలుతురు, తేమ వంటివాటిని ఏఐ సాయంతో నియంత్రించింది. దానివల్ల మొక్కలు చాలా ఆరోగ్యంగా పెరగడమే కాక.. అత్యుత్తమ నాణ్యతతో కూడిన స్ట్రాబెరీలు పండుతున్నాయి. మామూలుగా అయితే స్ట్రాబెరీ పంట వేయాలంటే ఎకరానికి దాదాపుగా 22 వేల మొక్కలు నాటుతారు. ఎకరాకు దాదాపు 8 టన్నుల దిగుబడి వస్తుంది! కానీ.. కృత్రిమ మేధ పర్యవేక్షణ, వర్టికల్ విధానంలో సాగు చేయడం వల్ల.. సంప్రదాయ విధానంలో పండించే పంట కన్నా 90 శాతం తక్కువ నీటిని, 97 శాతం తక్కువ భూమిని ఈ ఫామ్ వినియోగించుకుంటోంది. భవిష్యత్తు ఆహారోత్పత్తికి కొత్త భరోసానిస్తోంది. కాగా.. ఈ ఆలోచనను అమల్లోకి తేవడానికి ప్రపంచంలోని పలు దేశాలకు చెందిన శాస్త్రవేత్తలు ఆరేళ్లపాటు కృషి చేశారు. 200కు పైగా ట్రయల్స్ చేసి.. చివరికి అత్యుత్తమ విధానాన్ని రూపొందించారు. పర్యావరణానికి ఎలాంటి హానీ కలిగించకుండా మానవాళికి తగినంత ఆహారాన్ని సరఫరా చేయడానికి ఈ విధానం ఎంతగానో ఉపయోగపడుతుందని వారు చెబుతున్నారు.

లెబనాన్‌పై భూతల దాడులకు సర్వం సిద్ధం!

సిరియా-లెబనాన్ సరిహద్దులపై భీకర దాడులు

- కుప్పకూలిన అపార్ట్‌మెంట్.. 23 మంది మృతి
- హిజ్బుల్లా వైమానిక దళ కమాండర్ సోరౌర్ కూడా
- ఆయుధాల స్మగ్లింగ్ టన్నెళ్ల ధ్వంసం
- హిజ్బుల్లా అంతమే మా లక్ష్యం: నెతన్యాహు
- భారతీయులు.. వెనక్కి రండి: విదేశాంగ శాఖ



లెబనాన్ భూభాగంలో ఇజ్రాయెల్ జెండా

టెల్‌అవీవ్/న్యూఢిల్లీ, సెప్టెంబరు 26: ఇజ్రాయెల్ పదాతి దళాలు లెబనాన్‌లోకి చొచ్చుకుపోయి.. భూతల దాడులకు సర్వం సిద్ధం చేస్తున్నాయి. సరిహద్దుల్లో వైమానిక దళాలు, పారాట్రూపర్లతోపాటు.. ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) పదాతి దళాలు యుద్ధ ట్యాంకర్లను మోహరించినట్లు అధికారులు తెలిపారు. ఓ దశలో అమెరికా, ఫ్రాన్స్ చొరవతో చర్చల ప్రతిపాదన తెరపైకి వచ్చినా.. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మాత్రం తమ దాడులు కొనసాగుతాయని గురువారం తేల్చిచెప్పారు. ఆ వెంటనే ఐడీఎఫ్ 7వ బ్రిగేడ్ భూతల దాడులపై సరిహద్దుల వద్ద విన్యాసాలు చేసింది. 'నేషనల్ ల్యాండ్ ట్రైనింగ్ సెంటర్' నేతృత్వంలో ఈ విన్యాసాలు జరిగాయి. మరోవైపు బీరుట్, ఇతర ప్రాంతాలపై ఐడీఎఫ్ వైమానిక దళం వరుసగా నాలుగో రోజు-గురువారం కూడా గగనతల దాడులను కొనసాగించింది. బీరుట్‌లోని అల్-ఖైమ్, పశ్చిమ అల్-బెక, మష్రా, మిదౌన్, అల్-మయాదీన్ పట్టణాలపై దాడులు జరిగాయి. అల్-ఖైమ్‌లో జరిపిన దాడుల్లో ఓ అపార్ట్‌మెంట్ నేలమట్టమవ్వగా.. పలు దుకాణాలు, భవనాలు దెబ్బతిన్నట్లు లెబనాన్ వార్తాసంస్థలు తెలిపాయి. హిజ్బుల్లా ఎయిర్ యూనిట్ కమాండర్ మహమ్మద్ హుస్సేన్ సోరౌర్ లక్ష్యంగా ఈ దాడుల్లో.. ఆయనతోపాటు నలుగురు మృతి చెందినట్లు పేర్కొన్నాయి. సిరియా-లెబనాన్ సరిహద్దుల్లోని బాల్బెక్‌పై జరిగిన దాడుల్లో 23 మంది సిరియా శరణార్థులు చనిపోయారని గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకటించింది. మృతుల్లో ప్రముఖ సిరియా గాయకుడు అహ్మద్ అల్-ఖాన్సా కుమారుడు ఉన్నట్లు తెలిపింది. ఈ పరిసరాల్లో.. ముఖ్యంగా బెకా లోయలో సిరియాకు చెందిన 7.8 లక్షల మంది శరణార్థులు ఆశ్రయం పొందుతున్నట్లు వివరించింది. గడిచిన నాలుగు రోజుల్లో ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో మరణాల సంఖ్య 630కి చేరినట్లు వెల్లడించింది. కాగా.. అల్-అరబీ టీవీ చానల్ ప్రతినిధి రమీజ్ అల్-ఖాదీ గురువారం లైవ్‌లో ఉండగా.. అతని పైనుంచి ఓ క్షిపణి దూసుకెళ్లిన దృశ్యం నెట్టింట వైరల్‌గా మారింది. తాజా దాడుల్లో లెబనాన్-సిరియా మధ్య ఆయుధాల స్మగ్లింగ్ కోసం ఉగ్రవాదులు ఉపయోగించే సొరంగాలను ధ్వంసం చేసినట్లు ఐడీఎఫ్ ప్రకటించింది. ఐక్య రాజ్య సమితి(ఐరాస) సర్వసభ్య సమావేశాలకు న్యూయార్క్ బయలు దేరిన ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు.. విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడుతూ.. హిజ్బుల్లా అంతమే తమ ధ్యేయమని పునరుద్ఘాటించారు. నెతన్యాహుకు మద్దతిస్తున్న విపక్ష నేతలు కూడా.. కాల్పుల విరమణకు ఎట్టిపరిస్థితుల్లోనూ అంగీకరించకూడదని డిమాండ్ చేశారు. ఒకవేళ అదే జరిగితే.. తాము సంకీర్ణ ప్రభుత్వం నుంచి వైదొలగుతామని జేపీపీ చీఫ్ ఇతమార్ బెన్-గ్విర్ తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. ఇంకోవైపు.. లెబనాన్‌లోని భారతీయులు వెనక్కి రావాలని విదేశాంగ శాఖ కోరింది. లెబనాన్‌లోని భారతీయ దౌత్య కార్యాలయం ఈ మేరకు వరుస ట్వీట్లు చేసింది. లెబనాన్‌లో 4 వేల మంది వరకు భారతీయులున్నట్లు వెల్లడించింది. గాజాలో వెంటనే కాల్పుల విరమణను పాటించాలని భారత్‌కు చెందిన ఏడు వామపక్ష పార్టీలు-సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్), ఏఐఎఫ్‌బీ, ఆర్ఎస్‌పీ డిమాండ్ చేశాయి. గురువారం ఢిల్లీలో జరిగిన సమావేశంలో ఆయా పార్టీల ముఖ్య నేతలు ఈ తీర్మానంపై సంతకాలు చేశారు.

కళ్లజోడు కాదు.. కంప్యూటర్!

బ్రెయిన్ సిగ్నల్స్‌తో, కంటిచూపుతో, చేతి కదలికతో నియంత్రించగలిగే ఏఆర్ గ్లాసెస్ 'ఓరియన్'ను ఆవిష్కరించిన మెటా సీఈవో జుకెర్‌బెర్గ్



న్యూయార్క్, సెప్టెంబరు 26: రేడియో, టేప్‌రికార్డర్, కాలుక్యులేటర్.. ఇలా ఎన్నో ఉపకరణాలను కాలగర్భంలో కలిపేసిన స్మార్ట్‌ఫోన్‌ను మరిపించే 'ఆగ్మెంటెడ్ రియాలిటీ గ్లాసెస్'ను మెటా సీఈవో మార్క్ జుకెర్‌బెర్గ్ ప్రపంచానికి ప్రదర్శించారు. 'ఓరియన్' పేరుతో రూపొందించిన ఈ ఏఆర్ గ్లాసెస్‌ను.. మన మెదడు సంకేతాలతో, కంటి చూపుతో, చేతికదలికలతో నియంత్రించవచ్చు (అలా నియంత్రించడానికి మన చేతి మణికట్టుకు ఒక బ్యాండ్‌ను ధరించాల్సి ఉంటుంది). డిజిటల్ కంటెంట్‌ను నిరంతరాయంగా వీక్షించవచ్చు. కంప్యూటర్ల తరహాలోనే.. ఒకేసారి పలు వర్చువల్ విండోలు ఓపెన్ చేసి.. మల్టీ టాస్కింగ్ చేయొచ్చు. ఆ విండోల్లో మనకు కనిపించేవాటిలో ఒకదాన్ని ఎంచుకోవడానికి.. మన కళ్లే 'మౌస్ పాయింటర్'లా పనిచేస్తాయి. దాన్ని క్లిక్ చేయడానికి మన చేతి వేళ్ల కదలికలే సంకేతాలవుతాయి. దీంతో వీడియో గేమ్స్ ఆడొచ్చు. వీడియో కాల్స్ కూడా చేసుకోవచ్చు. వీడియోకాల్ చేసినప్పుడు అవతలి వ్యక్తుల లైఫ్ సైజ్ హోలోగ్రామ్‌లను మన ముందు ప్రదర్శిస్తాయి. ఈ కళ్లజోడును ధరించి మన ముందున్న వస్తువులను చూస్తే.. ఇందులో ఉండే ఏఐ వాటిని గుర్తించి, వాటి పేర్లను డిస్‌ప్లే చేస్తుంది. అక్కడున్న పదార్థాలతో ఏ వంటకాన్ని తయారుచేయొచ్చో అడిగితే సలహాలిస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే.. కళ్లజోడును కాదు.. ఒక కంప్యూటర్‌ని కళ్లకు ధరించినట్టే ఉంటుందన్నమాట!! ఈ కళ్లజోడు తయారీలో వినియోగించిన అద్దాలు గాజువి కావు. సిలికాన్ కార్బైడ్ మెటీరియల్‌తో తయారుచేసినవి. ఫ్రేమ్‌ని మెగ్నీషియంతో తయారుచేశారు. ఇందులో ఉండే మైక్రో ఎల్ఈడీ ప్రొజెక్టర్లు.. 70 డిగ్రీల ఫీల్డ్ ఆఫ్ వ్యూ ఉండే హోలోగ్రాఫిక్ డిస్‌ప్లేను మన కళ్ల ముందు ఆవిష్కరిస్తాయి. అందుకే దీన్ని "ప్రపంచంలోనే అత్యంత అధునాతనమైన కళ్లజోడు"గా జుకెర్‌బెర్గ్ అభివర్ణించారు. నిజానికి మెటా సంస్థ దశాబ్దకాలంగా వీటిపై కృషి చేస్తోంది. మెటాతోపాటు ఇంకా చాలా కంపెనీలు ఈ తరహా ఏఆర్ గ్లాసెస్‌ను తయారుచేయడంలో బిజీగా ఉన్నాయి. వాటిలో.. 'స్నాప్' అనే కంపెనీ 'స్పెక్టకిల్స్ 5' పేరుతో ఇటీవలే ఒక కళ్లజోడును మార్కెట్లోకి తేనున్నట్టు ప్రకటించింది. దాంతో పోలిస్తే 'ఓరియన్' గ్లాసెస్ చాలా చిన్నగా.. మామూలు కళ్లద్దాల్లా కనిపించడం గమనార్హం. అయితే, ఈ కళ్లజోళ్ల ఉత్పత్తి ఖర్చు ఒక్కొక్కదానికీ 10 వేల డాలర్లు అవుతోంది. అంత ధర పెడితే కొనే వారి సంఖ్య చాలా తక్కువగా ఉంటుంది కాబట్టి.. ప్రజలకు అందుబాటు ధరల్లోకి తెచ్చేందుకు మెటా కృషి చేస్తోంది. ప్రస్తుతం ప్రపంచమంతా వినియోగిస్తున్న స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌ల ధరకే ఏఆర్ గ్లాసెస్ కూడా మరికొన్నేళ్లలో ప్రజలకు అందుబాటు ధరల్లోకి వస్తాయని జుకెర్‌బెర్గ్ ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే దీని బరువు 98గ్రాములు. దీన్ని కూడా తగ్గించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

డ్రోన్ దాడులు చేసినా అణ్వస్త్ర ప్రయోగం!

- ప్రత్యర్థులు భారీ వైమానిక, క్షిపణి దాడులు చేసినా..
- రష్యా అణు విధానంలో అత్యంత కీలకమైన మార్పులు
- పాశ్చాత్య దేశాలకు ఇది హెచ్చరికగా పేర్కొన్న క్రెమ్లిన్




మాస్కో, సెప్టెంబరు 26: ఉక్రెయిన్ నుంచి డ్రోన్ దాడులు భయపెడుతున్న వేళ.. రెండున్నరేళ్లుగా సాగుతున్న యుద్ధం కొలిక్కిరాని సమయంలో.. పాశ్చాత్య దేశాలు మరిన్ని ఆయుధాలిస్తే ప్రత్యర్థిని ఓడిస్తామని జెలెన్ స్కీ కోరుతున్న సందర్భంలో రష్యా అత్యంత కీలక నిర్ణయం తీసుకుంది. తమ అణ్వస్త్ర స్పందన విధానంలో అత్యంత కీలక మార్పులు చేసింది. ఇప్పటివరకు రష్యా లేదా దాని మిత్ర దేశాలను లక్ష్యంగా చేసుకుని బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగిస్తే.. అణ్వాయుధాలను వాడేందుకు రష్యా సిద్ధపడుతుంది. కొత్తగా చేపట్టిన సవరణల ప్రకారం.. వ్యూహాత్మక ఆయుధాలు, వైమానిక, హైపర్ సోనిక్, క్రూయిజ్ క్షిపణులతో పాటు డ్రోన్ దాడులు చేసినా అణ్వస్త్రాలను వాడేందుకు తగిన నిర్ణయం తీసుకుంటుంది. సన్నిహిత దేశమైన బెలారస్‌పై దాడికి దిగినా రష్యా అణ్వాయుధాలను ప్రయోగిస్తుంది. ఇది ఉక్రెయిన్‌కు సాయం చేస్తున్న పాశ్చాత్య దేశాలకు ఓ గట్టి హెచ్చరిక అని రష్యా అధ్యక్ష భవనం క్రెమ్లిన్ ప్రకటించింది. అణ్వాయుధాలే కాక.. ఇతర మార్గాల్లో దాడులకు దిగినా స్పందన ఎలా ఉంటుందో చెప్పేందుకు ఈ మార్పులు చేసినట్లు వివరించింది. రష్యా అధ్యక్షుడు పుతిన్ దేశ భద్రతా మండలి సమావేశంలోనూ కీలక వ్యాఖ్యలు చేశారు. అణ్వస్త్ర విధానంలో మార్పుల గురించి ప్రస్తావించారు. తమపై దాడి చేస్తోన్న అణ్వస్త్రాలు లేని దేశానికి (ఉక్రెయిన్).. అణ్వస్త్రాలున్న మరో దేశం అండగా నిలుస్తోందంటూ మండిపడ్డారు. దీనిని ఆ రెండు దేశాలు కలిపి చేస్తున్న దాడిగానే చూస్తామన్నారు. పాశ్చాత్య దేశాలు సరఫరా చేసిన దీర్ఘశ్రేణి ఆయుధాలతో తమ మీద దాడి చేసేందుకు ఉక్రెయిన్‌కు అనుమతిస్తే.. నాటో కూటమి కూడా యుద్ధంలో చేరినట్లేనని భావిస్తామని స్పష్టం చేశారు.

21 మంది పిల్లలపై అత్యాచారం..

హాస్టల్ వార్డెన్‌కు మరణశిక్ష

- మరో టీచరు, హెడ్మాస్టర్‌కు 20 ఏళ్ల వంతున జైలు
- బాధితుల్లో 15 మంది బాలికలు, ఆరుగురు బాలురు
- అరుణాచల్ ప్రదేశ్ పోక్సో కోర్టు తీర్పు



ఇటానగర్, సెప్టెంబరు 26: నైతిక విలువలు మరిచిన గురువులకు న్యాయస్థానం కఠిన శిక్షలు విధించింది. 21 మంది పిల్లలపై అత్యాచారం చేసిన హాస్టల్ వార్డెన్ యుమ్‌కెన్ బగ్రాకు మరణశిక్ష విధిస్తూ అరుణాచల్ ప్రదేశ్‌లోని యుపియాకు చెందిన ప్రత్యేక పోక్సో కోర్టు గురువారం తీర్పు చెప్పింది. ఇందుకు సహకరించిన మరో ఇద్దరికి 20 ఏళ్ల వంతున జైలు శిక్ష విధించింది. బాధితుల్లో 15 మంది బాలికలు, ఆరుగురు బాలురు ఉన్నారు. వారంతా 6-15 ఏళ్లలోపు ఉన్నవారే. షియోమీ జిల్లాలోని కారో గవర్నమెంట్ రెసిడెన్షియల్ స్కూల్‌లో పనిచేసిన ఆ వార్డెన్ 2019-2022 మధ్య ఈ దారుణానికి పాల్పడినట్టు కేసు నమోదయింది. ఈ సంగతి తెలిసినా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయకుండా సహకరించినందుకు అప్పటి హెడ్మాస్టర్ సింగటున్ యోర్పెన్, హిందీ టీచరు మార్‌బోమ్ నగోమ్‌దిర్‌లకు 20 ఏళ్ల వంతున కఠిన కారాగార శిక్ష విధించింది. పిల్లలకు మత్తుమందు ఇచ్చి, వారు నిద్రలోకి జారుకున్న తరువాత అత్యాచారం చేసినట్టు 'సిట్' దర్యాప్తులో తేలింది. ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించడంతో ఎవరూ నోరు మెదపలేకపోయారు. కానీ గత ఏడాది నవంబరులో కవలలైన తన ఇద్దరు కుమార్తె(12 ఏళ్ల)లపై అత్యాచారం చేసినట్టు ఓ తండ్రి ఫిర్యాదు చేయడంతో జరిగిన నేరం వెలుగులోకి వచ్చింది. అనంతరం మరికొందరు ఫిర్యాదు చేయడంతో మొత్తం 21 మందిపై లైంగిక వేధింపులకు పాల్పడినట్టు కేసులు నమోదయ్యాయి. వీటిని చూసి వార్డెన్ యుమ్‌కెన్ బగ్రా పరారవగా, పోలీసులు గాలించి ఆ నెల చివర్లో అరెస్టు చేశారు. అనంతరం కోర్టు నిందితునికి బెయిల్ మంజూరు చేసింది. తీవ్రమైన నేరాలు ఉన్నా బెయిల్ ఇవ్వడంపై గౌహతి హైకోర్టు ఇటానగర్ బెంచ్ సుమోటోగా విచారణ జరిపింది. నేర తీవ్రత దృష్ట్యా ఈ ఏడాది జూలైలో బెయిల్‌ను రద్దు చేసింది. పోక్సో కోర్టు విచారణ జరిపి కఠినాతికఠిన శిక్షలు విధించింది. దీనిపై ఎస్పీ రోహిత్ రాజ్‌బీర్ సింగ్ మాట్లాడుతూ ప్రస్తుత కేసు తీవ్రతను దృష్టిలో పెట్టుకోవడంతో పాటు, భవిష్యత్తులో ఇలాంటివి జరగకూడదన్న ఉద్దేశంతో కోర్టు గరిష్ఠ శిక్షలు విధించిందని తెలిపారు.

పథకం ప్రకారమే హసీనాకు ఉద్వాసన

అది యాదృచ్ఛికంగా వచ్చిన తిరుగుబాటు కాదు.. పక్కా ప్రణాళికతోనే బంగ్లాదేశ్‌లో ఆందోళనలు

- సూత్రధారులను పరిచయం చేసిన తాత్కాలిక ప్రభుత్వ సారథి యూనస్



న్యూఢిల్లీ, సెప్టెంబరు 26: బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా ప్రభుత్వ పతనానికి కారణమైన ఇటీవలి ఆందోళనల వెనుక ఉన్న 'సూత్రధారుల'ను ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వ సారధి మొహమ్మద్ యూనస్ ప్రపంచానికి పరిచయం చేశారు. అవి పక్కా ప్రణాళికతో నిర్వహించిన ఆందోళనలని, అదో క్రమశిక్షణతో కూడిన తిరుగుబాటు అని యూనస్ వెల్లడించారు. ఏ ఒక్కరినో నాయకుడిగా గుర్తించడానికి లేదా అరెస్టు చేయడానికి అవకాశమే లేకుండా నిర్వహించడం వల్ల ఆ ఆందోళనలు మరింత శక్తిమంతంగా మారాయని పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ 79వ సమావేశాల్లో పాల్గొనేందుకు అమెరికా వెళ్లిన ఆయన అక్కడ క్లింటన్ గ్లోబల్ ఇనీషియేటివ్ కార్యక్రమంలో ప్రసంగించారు. ఇటీవలి బంగ్లాదేశ్ ఆందోళనలను ఆయన ఆ కార్యక్రమంలో ప్రస్తావించారు. అవి యాదృచ్ఛికంగా జరిగిన ఆందోళనలు కావని, అవి ఎంతో జాగ్రత్తగా రూపొందించిన ఆందోళనలని యూనస్ తెలిపారు. ఢాకా ట్రిబ్యూన్ పత్రిక కథనం మేరకు తన ప్రత్యేక సహాయకుడు మహఫూజ్ ఆలంను ఆ కార్యక్రమంలో యూనస్ పరిచయం చేశారు. 'మేం సంయుక్తంగా తీసుకున్న బాధ్యత ఇది. ఆ ఆందోళనల్లో వారు ఇతర యువకుల్లాగే కనిపిస్తారు. మీరు వారిని గుర్తించలేరు. అయితే, వారు కార్యాచరణకు దిగినప్పుడు మీరు గనుక చూశారంటే, వారు మాట్లాడినప్పుడు మీరు విన్నారంటే షాక్‌కు గురవుతారు. వారు తమ ప్రసంగాలు, అంకితభావం, నిబద్ధత ద్వారా దేశం మొత్తాన్ని కదిలించారు. ఈయననే ఆ మొత్తం ఆందోళనల వెనుక సూత్రధారిగా భావిస్తున్నారు. ఈయన మాత్రం తాను కాదని, వేరే చాలా మంది ఉన్నారనే పదేపదే అంటున్నారు. ఆ విధంగా ఆయన అంతా పకడ్బందీగా నిర్వహించారు. అది అకస్మాత్తుగా వచ్చిన ఆందోళన కాదు. పక్కాగా, చాలా జాగ్రత్తగా రూపొందించిన ఆందోళన. నాయకత్వ బాధ్యతల్లో ఉన్నవారికి కూడా నాయకుడెవరూ తెలియలేదు. అదో అద్భుతం. ప్రపంచంలో ఎక్కడైనా సరే, వారు మాట్లాడే భాష ఏ ప్రాంతంలోనైనా, ఏ యువతకైనా స్ఫూర్తిదాయకంగా ఉంటుంది. వారే వీరు. వీరిని చప్పట్లతో అభినందించండి. వీరు కొత్త బంగ్లాదేశ్‌ను సృష్టిస్తున్నారు. వీరి ప్రయత్నం విజయవంతమవ్వాలని ఆకాంక్షిద్దాం' అని యూనస్ తెలిపారు. ఉద్యోగాల్లో రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ విద్యార్థులు చేపట్టిన ఆందోళనలు తీవ్ర రూపం దాల్చడంతో నాటి ప్రధానమంత్రి హసీనా ఆగస్టు 5న బంగ్లాదేశ్‌ను వీడి భారతదేశానికి పరారైన విషయం తెలిసిందే.

ఇకపై 'విజయ' నెయ్యితో ప్రసాదాల తయారీ..!

- ప్రముఖ దేవాలయాలకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశం
- ధర ఖరారుపై సంస్థను సంప్రదించిన భద్రాద్రి దేవస్థానం





భద్రాచలం, సెప్టెంబరు 26: రాష్ట్రంలోని ప్రధాన దేవస్థానాల్లో ఇకపై విజయ నెయ్యితోనే ప్రసాదాల తయారీ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. టెండర్ల ప్రక్రియతో సంబంధం లేకుండా ఇక నుంచి ఆలయాల్లో విజయ నెయ్యినే వినియోగించాలని తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భద్రాద్రి దేవస్థానంలోనూ ఇకపై ప్రసాదాల తయారీకి ఈ నెయ్యినే వినియోగించనున్నారు. ప్రస్తుతం భద్రాద్రి దేవస్థానం అధికారులు నెయ్యి ధరపై విజయ డెయిరీ ప్రతినిధులతో చర్చిస్తున్నారు. సదరు సంస్థ నెయ్యి కేజీ రూ. 609 చెబుతున్నట్లు సమాచారం. అయితే భద్రాద్రి దేవస్థానం అధికారులు ఈ ధరను కొంత తగ్గించాలని కోరినట్లు తెలిసింది. అధికారికంగా మాత్రం రాష్ట్ర ప్రభుత్వం విజయ నెయ్యినే వినియోగించాలని ఆదేశాలు జారీ చేయడంతో భారమైనా భద్రాద్రి దేవస్థానం కూడా విజయ నెయ్యినే వినియోగించే అవకాశాలున్నాయి. గత 16 ఏళ్లుగా కరీంనగర్ మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ నుంచి నెయ్యిని కేజీ రూ.621కి కొనుగోలు చేశారు. అయితే దేవస్థానం అధికారులు ఆగస్టు నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం జంగారెడ్డిగూడెంలోని లక్కవరానికి చెందిన రైతు డైరీ నుంచి ఆవు నెయ్యిని రూ.534కు కొనుగోలు చేస్తున్నారు. ఇటీవల తిరుమల లడ్డూ ప్రసాద తయారీలో వినియోగించే నెయ్యి నాణ్యతపై ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో భద్రాద్రి దేవస్థానం అధికారులు ఇప్పటికే ఆహార భద్రత అధికారులకు అధికారికంగా లేఖ రాయగా ఇటీవల వారు వచ్చి ఆలయంలో ప్రసాదాల తయారీకి వినియోగించే నెయ్యి, బియ్యం, శనగపిండి, కిస్‌మిస్, జీడిపప్పు ఇతర ముడిసరుకుల నమూనాలను తీసుకెళ్లారు. పరీక్షల అనంతరం వాటి నివేదికను దేవస్థానం అధికారులకు అందజేయనున్నారు.

ఇద్దరు హేమంత్ సోరెన్‌లు..!



మనుషులను పోలిన మనుషులు లోకంలో చాలా మందే ఉంటారు. అయితే.. అలా పోలిక ఉన్న వారిలో ప్రముఖులు ఉంటే.. అది ఆసక్తికర చర్చకు దారి తీస్తుంది. ఇక్కడ కనిపిస్తున్న ఇద్దరూ ఎవరూ గుర్తుపట్టలేనంతగా ఒకే పోలికతో ఉన్నారు. వీరిలో ఎడమ వైపున ఉన్న వ్యక్తి ఝార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్.. మరొకరు రాంచీకి చెందిన థియేటర్ ఆర్టిస్ట్ మున్నా లోహ్రా. సీఎం నివాసంలో సోరెన్‌ను మున్నా తన కుటుంబ సభ్యులతో కలిశారు. ఈ సందర్భంగా ఇద్దరూ సరదాగా సంభాషించుకున్నారు. ఈ ఫొటోను సోరెన్.. తన అధికారిక 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. "హేమంత్ సోరెన్‌ను కలిసిన హేమంత్" అంటూ క్యాప్షన్ పెట్టారు. ఈ ఫొటో వైరల్ కావడంతో పలువురు నెటిజన్లు సరదాగా రకరకాలుగా వ్యాఖ్యలు చేశారు.

బికినీ వేసుకుతిరగడానికి కావాలొక దీవి!

- భార్య సరదా కోసం రూ.418 కోట్లతో దీవినే కొన్న దుబాయ్ వ్యాపారవేత్త



న్యూఢిల్లీ, సెప్టెంబరు 26: భార్య బికినీ వేసుకోవాలి.. బీచ్‌లో హ్యాపీగా, జాలీగా తిరుగుతూ ఎంజాయ్ చేయాలి! అయితే తాను ఎవరి కంటనో పడి ఇబ్బంది పడటం అంటూ జరగొద్దు!! ఎలా సాధ్యం? సౌదీకి చెందిన వ్యాపారవేత్త జమాల్ అల్ నదాక్ అనే బడా వ్యాపారవేత్తకు ఇదే సవాలు ఎదురైతే చిటికెలో సుసాధ్యం చేసుకున్నాడు. భార్య 'సరదా' కోసం ప్రత్యేకంగా ఓ దీవినే కొన్నాడు. ఇందుకు రూ.418 కోట్లు ఖర్చు చేశాడు! తనకు బికినీ ధరించి.. బీచ్‌లో తిరగాలనుందని భార్యామణి సౌదీ అల్ నదాక్ (26) చెప్పడంతోనే అదెంత పని అంటూ ఆమెకు హిందూ మహాసముద్రంలో ఓ దీవినే కొనిచ్చేశాడు. ఈ విషయాన్ని స్వయంగా సౌదీ అల్ నదాక్ ఇన్‌స్టా వేదికగా పంచుకొని.. ఆ ఐలెండ్ వీడియోనూ షేర్ చేసింది. "నేను బికినీ ధరించి.. బీచ్‌లో తిరగాలనుకున్నాను. అయితే బీచ్‌లో నేను సురక్షితంగా సేదతీరాలని నా భర్త అనుకున్నారు. ఆ ఆలోచన నుంచే ఓ దీవిని సొంతం చేసుకోవాలనే ఆలోచన వచ్చింది" అంటూ ఆమె ఓ మీడియా సంస్థకు వెల్లడించారు. అయితే గోప్యత, భద్రతకు ప్రాధాన్యమిస్తూ ఆ ద్వీపం వివరాలు వెల్లడించలేదు.

లోకం తీరు



బృందావనం ఆలయాల్లో పురాతన ప్రసాదాలు

మధుర: తిరుమల లడ్డూ ప్రసాదంపై నెలకొన్న వివాదం నేపథ్యంలో బృందావనంలోని ఆలయాల్లో భక్తులకు మార్కెట్‌లో లభించే మిఠాయిలు పంపిణీ చేయకూడదని ధర్మ రక్షా సంఘం నిర్ణయించింది. దీనికి బదులు కాలానుగుణంగా లభించే పండ్లు, పూలు, డ్రైఫ్రూట్స్, యాలకులు, పంచదారతో తయారుచేసిన పురాతన ప్రసాదాలను అందించాలని ప్రతిపాదించింది. దేశవ్యాప్తంగా దేవాలయాల్లో అనుసరిస్తున్న ప్రసాదాల పంపిణీ విధానంలో సంస్కరణలు అవసరమని సంఘం జాతీయ అధ్యక్షుడు సౌరబ్ గౌర్ అన్నారు.

కాళేశ్వరం ఇంజనీర్లపై చర్యలు తీసుకుంటే..

డిపార్టుమెంటే ఉండదు



(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ.. 'కాళేశ్వరం ప్రాజెక్టును మ్యాన్‌మేడ్ వండర్ అని ప్రచారం చేసుకున్నారు. కానీ, ఇండియాలో మ్యాన్ మేడ్ వండర్స్ భాక్రానంగల్ నుంచి నాగార్జునసాగర్ వరకు.. శ్రీశైలం నుంచి శ్రీరాంసాగర్ దాకా ఇంజనీర్లు కట్టినవే. మ్యాన్ మేడ్ వండర్ అంటే ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌లు. హైదరాబాద్‌కు వరదలు వచ్చి వేలాదిమంది చనిపోతే నిజాం గ్లోబల్ టెండర్లు పిలిచి వాటిని నిర్మించారు. విశ్వేశ్వరయ్యకు బాధ్యతలు అప్పగించి, కట్టిస్తే నిక్షేపంగా ఉన్నాయి. కానీ, లక్ష కోట్లు ఖర్చు చేసిన కాళేశ్వరం నుంచి నికరంగా లక్ష ఎకరాలకు కూడా నీళ్ల ఇవ్వలేదు. లక్ష కోట్లు ఖర్చు పెట్టిన కాళేశ్వరం కట్టడం.. కూలడం మన కళ్ల ముందే జరిగింది. ఈ తప్పిదం ఎందుకు జరిగింది? ప్రజాప్రతినిధుల వల్లా!? ఈఎన్‌సీ, సీఈ, ఎస్ఈల వల్లా!? అనే విషయాలను ఆ శాఖలో చేరే ఇంజనీర్లు తేల్చాలి. ఎవరిని బాధ్యులను చేయాలో మీరే చెప్పాలి. వారికి ఇదొక మోడల్ స్టడీగా రీసెర్చి చేయడానికి పనికొస్తుంది' అని సీఎం అన్నారు.

ప్రత్యక్ష సాక్షిలా కాళేశ్వరం

అధికారులు ఎలాంటి తప్పు చేయకూడదో చెప్పేందుకు మన కళ్ల ముందు ప్రత్యక్ష సాక్షిలా కాళేశ్వరం ప్రాజెక్టు ఉందని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. "గతంలో ఏదైనా ఇంజనీరింగ్ మిస్టేక్ జరిగితే.. లేదా డిజైన్లు/డ్రాయింగ్‌లకు సీఈ సీడీవో ఆమోదం లేకపోతే క్షేత్రస్థాయిలో పని చేసే ఇంజనీర్లు తిరస్కరించేవారు. నోట్స్ రాసేవారు. తిరిగి సరైన మార్గనిర్దేశం చేయాలని చెప్పేవారు. రాజకీయ నాయకులు తీసుకునే తప్పుడు నిర్ణయాలను క్షేత్రస్థాయిలో అడ్డుకొని, వెనక్కి పంపిస్తే తప్పులు జరగవు" అని వివరించారు. ఒక దేశ గొప్పతనాన్ని చూపించాలంటే అక్కడ కట్టిన నిర్మాణాలను చూపుతారని, స్టాచూ ఆఫ్ లిబర్టీ, ఈఫిల్ టవర్ ఇంజనీర్లు కట్టినవేనని, ఇంజనీర్లు కొత్త ప్రపంచాన్ని సృష్టించగలరని, వారి శక్తి అలాంటిదని వ్యాఖ్యానించారు. "ఉమ్మడి రాష్ట్రంలో నిర్మాణం మొదలు పెట్టిన ప్రాణహిత- చేవెళ్ల పూర్తికాలేదు. పాలమూరు-రంగారెడ్డి, ఎస్ఎల్‌బీసీ, కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, దేవాదుల ఎక్కడున్నాయో మీకు తెలుసు. రూ.1.90 లక్షల కోట్ల నిధులు ఖర్చు చేసినా పదేళ్లలో ఏ ప్రాజెక్టూ పూర్తికాకపోవడానికి కారణమేంటి!? దీనికి కారకులు ఎవరని ఒకరిపై మరొకరు విమర్శలు చేసుకుంటే ఫలితముండదు. భవిష్యత్తులో తప్పిదాలు జరగకుండా చూసుకోవాలి. ఈ రాష్ట్రం మనది. ఈ రాష్ట్రాన్ని నిర్మించుకోవాల్సిన బాధ్యత మనది. మీరు, నేను అంతా కలిసికట్టుగా రాష్ట్రాన్ని నిర్మించుకుందాం" అని రేవంత్ పిలుపునిచ్చారు.

పైరవీలు చేస్తే అడవిలోనే పోస్టింగ్

"ఇంజనీర్లంతా క్షేత్రస్థాయిలో పని చేయాల్సిందే. పోస్టింగ్‌ల కోసం సిఫారసులు తెస్తే.. దూరంగా అడవిలో పోస్టింగ్ వేయాలి" అని మంత్రి ఉత్తమ్‌ను ముఖ్యమంత్రి రేవంత్ కోరారు. ఎవరైనా కాగితం పట్టుకొని వస్తే.. ఉదయం తిని ఫీల్డ్‌కు పోతే మళ్లీ రాత్రి ఇంటికి వచ్చే ప్రాంతంలో పోస్టింగ్ వేయాలని, అప్పుడే పని మీద ఫోకస్ ఉంటుందని వ్యాఖ్యానించారు. మీకందరికీ ఇది మంచి అవకాశమని, ఐదేళ్లలో నిర్దేశిత లక్ష్యాలతో పనిచేద్దామని అన్నారు. కాళేశ్వరం, ఎస్ఎల్‌బీసీ, పాలమూరు-రంగారెడ్డి పూర్తి చేసుకుంటే ఏ రాష్ట్రం పోటీ పడనంతగా ముందుకు వెళతామని అన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలు వస్తే పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నానని, వాటిపై ఎప్పుడైనా తన వద్దకు రావచ్చని భరోసా ఇచ్చారు.

నీళ్లతో ప్రజల భావోద్వేగం ముడిపడి ఉంది

"తెలంగాణ రాష్ట్ర సాధనలో నీళ్ల పాత్ర కీలకం. ఆ నీటికి మీరే ప్రతినిధులు. రెండోది నియామకాలు! తెలంగాణ వచ్చిన తర్వాత 11 ఏళ్ల పాటు మీకు ఉద్యోగాలు ఇవ్వలేదు. ప్రత్యేకంగా మంత్రి ఉత్తమ్ చొరవ తీసుకొని నియామక ప్రక్రియను పూర్తి చేశారు. నీటి తో తెలంగాణ ప్రజల భావోద్వేగం ముడిపడి ఉంది. ఉద్యోగాలు కావాలంటే ఎక్కడైనా దొరుకుతాయి. ఆ నీళ్లను ఒడిసి పట్టుకొని ప్రజలకు అందించే బాధ్యత మీది" అని సీఎం స్పష్టం చేశారు. చాలామంది అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలకు వెళ్లడం లేదని, కానీ, క్షేత్రస్థాయిలో అనుభవం ఉన్న వారే ఉన్నతస్థాయిలో రాణిస్తారని హితవు పలికారు. క్షేత్రస్థాయిలో తిరిగే అధికారులకే పదోన్నతులు ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చామన్నారు.

మోక్షగుండం, నవాబ్ జంగ్ వారసత్వాన్ని అందిపుచ్చుకోవాలి: మంత్రి ఉత్తమ్

కొత్తగా నియమితులయ్యే ఇంజనీర్లు ప్రఖ్యాత ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య, అలీ నవాబ్ జంగ్‌ల వారసత్వాన్ని అందిపుచ్చుకోవాలని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి కోరారు. వారు నిర్మించిన ప్రాజెక్టులు వందేళ్లైనా చెక్కు చెదరలేదని గుర్తు చేశారు. కొత్తగా నియమితులయ్యే 687 మందికి హైదరాబాద్‌లో కాకుండా క్షేత్రస్థాయిలోనే పోస్టింగులు ఇస్తున్నామని, నీటిపారుదల శాఖను బలోపేతం చేయడానికి 281 మంది హెల్పర్లు, 1597 మంది లష్కర్‌ల నియామకానికి సీఎం అంగీకారం తెలిపారని చెప్పారు. కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఆదిత్యనాథ్‌దాస్, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్‌సీ (జనరల్) జి.అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా కేటగిరీల్లో అగ్రస్థానంలో నిలిచిన తొలి 10 మంది ఇంజనీర్లకు సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు అందించారు.

కాళేశ్వరం కట్టిన ఇంజనీర్లను ఆదర్శంగా తీసుకోకండి

» అలాంటి వారిని కలలోకీ రానివ్వొద్దు: మంత్రి కోమటిరెడ్డి
» నూతన ఏఈఈల ఓరియెంటేషన్ కార్యక్రమంలో సెటైర్లు



హైదరాబాద్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కొత్తగా వచ్చే ఇంజనీర్లు మోక్షగుండం విశ్వేశ్వరయ్య, నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహదూర్ వంటి వారినే ఆదర్శంగా తీసుకోవాలని, కాళేశ్వరం కట్టిన ఇంజనీర్లను కాదని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సూచించారు. రాష్ట్రంలో కొన్ని ప్రాజెక్టులు కట్టిన వెంటనే కూలిపోయి ఇంజనీర్ల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసిన సంఘటనలను చూశామంటూ ఆయన కాళేశ్వరం ప్రాజెక్టును గుర్తుచేశారు. అలాంటి నిర్మాణాలను సూచించిన ఇంజనీర్లను కనీసం కలలోకి కూడా రానివ్వొద్దంటూ ఆయన నూతన ఏఈఈలకు సలహా ఇచ్చారు. హైదరాబాద్, హైటెక్స్ ప్రాంగణంలోని న్యాక్‌లో ఆర్ అండ్ బీ శాఖకు కొత్తగా రాబోతున్న 156 మంది అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లకు శాఖపరమైన అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న 5 రోజుల ఓరియెంటేషన్ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గత ప్రభుత్వం 10 మండలాలకు ఒక ఇంజనీర్ కూడా లేని దుస్థితికి రాష్ట్రాన్ని తీసుకొచ్చిందని, తాము నియామకాలను పూర్తి చేస్తూ ఆర్ అండ్ బీని పటిష్ఠం చేస్తున్నామని తెలిపారు. కొందరు పాలకులు, అతికొద్దిమంది ఇంజనీర్ల స్వార్థం ఇంజనీర్లందరికి మాయని మచ్చగా మారిందన్నారు. కాగా ఆర్ అండ్ బీకి ఎంపికైన ఇంజనీర్లకు త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా నియామక పత్రాలను అందజేయనున్నట్టు శాఖ ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందన ప్రకటించారు.

నేటి నుంచి ప్రజాభవన్‌లో 'ప్రవాసీ ప్రజావాణి'

హైదరాబాద్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గల్ఫ్, ఇతర దేశాల్లో పని చేస్తున్న కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం నుంచి ప్రజాభవన్‌లో 'ప్రవాసీ ప్రజావాణి' నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. నేటి నుంచి ప్రతి బుధ, శుక్రవారాల్లో ఇక్కడ ప్రత్యేక కౌంటర్ అందుబాటులో ఉంటుందని చెప్పారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మరో గాజా దిశగా...!

మీరు ఈ వీడియో చూడటం హిజ్బొల్లాకు ఇష్టం లేదు, ఇతరులకు షేర్ చేయడం దానికి అస్సలు నచ్చదు అంటూ ట్విటర్‌లో ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ (ఐడీఎఫ్) దానిని పోస్టు చేసింది. దక్షిణ లెబనాన్‌మీద ఇజ్రాయెల్ సాగిస్తున్న భయానకదాడుల్లో ఇప్పటికే లక్షమంది నిరాశ్రయులైన నేపథ్యంలో, తన చర్యలను సమర్థించుకోవడానికి ఇజ్రాయెల్ ఈ వీడియో విడుదల చేసింది. హిజ్బొల్లా ఎంత దుర్మార్గమైనదో, భయానకమైనదో తెలియచెప్పడం దీని లక్ష్యం. దక్షిణ లెబనాన్ అంతటా హిజ్బొల్లా తన ఉగ్రవాద వ్యవస్థను విస్తరించిందని, భూగర్భంలో సొరంగాలు నిర్మించిందని, మారణాయుధాలను దాచిందని, సామాన్యుల ఇళ్ళను ఆయుధాగారాలుగా మార్చేసిందని ఇజ్రాయెల్ వాదన. కొన్ని చిత్రాలు, మరికొన్ని గ్రాఫిక్స్‌తో తయారైన ఈ వీడియోలో ఇజ్రాయెల్ తాను మిగతా ప్రపంచానికి చెప్పదల్చుకున్నదీ, ఆరోపించదల్చుకున్నదీ ఉంది. ఇదంతా ఆత్మరక్షణలో భాగమేననీ, లెబనాన్‌మీద దాడిచేయకపోతే తాను నాశనమైపోతాయని ఇజ్రాయెల్ చెప్పుకుంటోంది. హిజ్బొల్లాతో చర్చలు, కాల్పుల విరమణ వంటి ప్రతిపాదనలను తిరస్కరించడమే కాక, లెబనాన్‌లోకి చొరబడటానికి సిద్ధంగా ఉండమని తన సైన్యాన్ని ఇజ్రాయెల్ ఆదేశించడంతో గాజాయుద్ధం కొత్త మలుపు తీసుకుంది.

మరో పదిరోజుల్లో అక్టోబర్ 7 ఘటనకు ఏడాది అవుతుంది. ఇజ్రాయెల్ మీద హమాస్ అమానుష దాడికి ప్రతీకారంగా, గాజామీద యుద్ధానికి దిగుతూ ఇజ్రాయెల్ ప్రధాని బెంజమీన్ నెతన్యాహూ రెండు ప్రధాన లక్ష్యాలు ప్రకటించారు. హమాస్ అపహరించుకుపోయిన వారిని భద్రంగా వెనక్కుతెచ్చి కుటుంబీకులకు అప్పగించడం, ఇజ్రాయెల్ ఉనికికి ప్రమాదకరంగా పరిణమించిన ఉగ్రవాద హమాస్‌ను పూర్తిగా తుడిచిపెట్టేయడం. మధ్యలో కొద్దిమందిని హమాస్ తనకు తానుగా అప్పగించడం, మరికొందరు చనిపోవడం కాక ఇంకా చాలామంది ఇజ్రాయెలీలు హమాస్ నిర్బంధంలోనే ఉన్నారు. అమెరికా ఆర్థిక, ఆయుధ సాయంతో ఏడాదిగా ఇజ్రాయెల్ సాగిస్తున్న యుద్ధంలో గాజా పూర్తిగా నేలమట్టమై, దాదాపు యాభైవేలమంది మరణించి, లక్షలమంది నిరాశ్రయులైన నేపథ్యంలో, హమాస్ సైతం బాగా దెబ్బతిన్నమాట నిజం. కానీ, అది నాశనమైందని ఐడీఎఫ్ ఉన్నతాధికారులు కూడా అనడం లేదు. హమాస్‌తో అవగాహనకు వచ్చి మిగిలిన బందీలను సైతం విడిపించనందుకు నెతన్యాహూమీద ప్రజాగ్రహం అధికంగా ఉంది. ఆయన విధానాలకు వ్యతిరేకంగా నిరసనలు, ర్యాలీల దశదాటి ఇటీవల దేశవ్యాప్త సమ్మె కూడా జరిగింది. కాలు ఎలా వెనక్కుతీసుకోవాలో తెలియని స్థితిలో, ఇప్పుడు నెతన్యాహూ తన యుద్ధక్షేత్రాన్ని మరింత విస్తరించుకుంటూ పోతున్నారు. హమాస్ మాదిరిగానే హిజ్బొల్లాను కూడా కూకటివేళ్ళతో సహా పెకిలించివేస్తానని, అప్పుడు మాత్రమే ఇజ్రాయెలీలు నిశ్చింతగా ఉండగలరని చెబుతున్నాడు.

హిజ్బొల్లాతో యుద్ధం ఇప్పటికిప్పుడు ఆరంభమైందేమీ కాదు కానీ, అమీతుమీ తేల్చుకొనే పని జరుగుతోంది. ఎప్పటిలాగానే అమెరికా సహా ఇజ్రాయెల్ మిత్ర, ఆప్తదేశాలన్నీ ఏవేవో సుద్దులు చెబుతూ, యుద్ధానికి హద్దులు గీస్తూంటే ఇజ్రాయెల్ మాత్రం తాను అనుకున్నది చేసుకుపోతోంది. అద్భుతమైన సాంకేతిక పరిజ్ఞానంతో ముందుగా పేజర్లు, ఆ తరువాత వాకీటాకీల పేల్చివేతతో వందలాదిమంది ఫైటర్లని క్షణాల్లో ఎందుకూ కొరగానివారిని చేసి, హిజ్బొల్లా పునాదులను ఇజ్రాయెల్ కుదిపేసింది. ఆ తరువాత క్షిపణిదాడుల్లో అగ్రశ్రేణి నాయకత్వాన్ని వరుస పెట్టి హతమారుస్తోంది. లెబనాన్ పౌరుల మొబైల్‌ఫోన్లలోకి నేరుగా మెసేజ్‌లు పంపి ఇజ్రాయెల్ వారికి హితవులు చెబుతోంది, హెచ్చరికలు జారీ చేస్తోంది. ఇప్పుడు నేరుగా పొరుగుదేశంలోకి చొచ్చి, భూతల దాడులతో యుద్ధాన్ని పైదశకు తీసుకుపోవాలన్నది నెతన్యాహూ కోరిక. ఇజ్రాయెల్ వరుస దెబ్బలకు హిజ్బొల్లా గిలగిల్లాడుతున్నమాట నిజం. రెండు దశాబ్దాల తరువాత ఇజ్రాయెల్ చేతిలో ఈ స్థాయిలో చావుదెబ్బతిన్నప్పటికీ, మళ్ళీ కోలుకోదన్న హామీ ఏమీ లేదు. కానీ, హిజ్బొల్లాను నాశనం చేసే పేరిట లెబనాన్‌లోకి చొరబడి, అక్కడ మరో గాజాని సృష్టించే ఇజ్రాయెల్ విధానం ఏమాత్రం సరికాదు. ప్రస్తుతానికి హెచ్చరికలతో సరిపెడుతున్న ఇరాన్‌ను యుద్ధబరిలోకి లాగడానికి ఇటువంటి చర్యలు తోడ్పడతాయి. నెతన్యాహూ నిజంగానే ఇజ్రాయెలీల క్షేమాన్ని కాంక్షిస్తున్న పక్షంలో ఇప్పటికైనా యుద్ధానికి కాక, దౌత్యానికి ప్రాధాన్యం ఇవ్వడం ఉత్తమం.

ఎన్నికల వ్యవస్థకు ఈ ‘శస్త్రచికిత్స’ అవసరమా?

ఒక నిజమైన ప్రశ్న కోసం ఎదురు చూస్తున్న తెలివైన సమాధానాలు ప్రపంచంలో సమృద్ధిగా ఉంటాయి. ఒకే దేశం ఒకే ఎన్నిక గురించి చర్చ ప్రారంభమయినప్పుడు, అది విధాన సంబంధమైన ఒక అసాధారణ పరిష్కారం ఒక అసలైన సమస్యను వెతుకుతున్నట్టుగా కనిపించింది. ఒక రుగ్మతను అన్వేషిస్తున్న ఒక గోసాయి చిట్కా లేదా రోగం కంటే ప్రమాదకరమైన మందుగా అది కనిపించింది. అంతేనా? అది, నోట్ల రద్దు (డిమానిటైజేషన్)కు కొనసాగింపుగా ఉన్నది. అవును మరి, ఒక దార్శనికత లేదా ఒక విపుల ప్రణాళిక లేకుండా ఏదో ఒక మహత్కార్యాన్ని నిర్వహించడానికి పూనుకునే ఆధునిక తుగ్లక్ ప్రవృత్తిని ప్రతిబింబించిన ఆలోచనే ఒకే దేశం ఒకే ఎన్నిక.



> పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో కార్యనిర్వాహక వర్గం శాసన వ్యవస్థకు జవాబుదారీగా ఉండాలనే మౌలిక సూత్రాన్ని ఒకే దేశం ఒకే ఎన్నిక ప్రతిపాదన తలకిందులు చేస్తుంది. శాసనసభల, మునిసిపల్, పంచాయత్ ఎన్నికలను లోక్‌సభ ఎన్నికలతో పాటు ఒకేసారి నిర్వహించడమనేది మన సమాఖ్య పాలనా విధానానికి విరుద్ధం. ఏకకాలంలో ఎన్నికల నిర్వహణ అనేది మన రాజ్యాంగ ‘మౌలిక నిర్మాణాన్ని’ ఉల్లంఘించడమే అవుతుంది.

ఒకే దేశం ఒకే ఎన్నిక గురించి దేశ పాలకులు ఎంత చలాకీగా చర్చిస్తున్నారో కదా. వారి ఉత్సాహాన్ని గమనించి ఏక కాలంలో ఎన్నికల నిర్వహణపై అత్యున్నత స్థాయి కమిటీ (హెచ్ఎల్‌సి) రూపొందించిన నివేదికను చదివాను. చదివిన తరువాత నాకు అనిపించిందేమిటంటే ఒకే దేశం ఒకే ఎన్నిక ఒక విడ్డూరమైనదే అయినప్పటికీ, ఒక నిరపాయకరమైన ప్రతిపాదన అనే భావన కలిగింది. చాలా కాలంగా ప్రత్యక్షంగానో పరోక్షంగానో అమలవుతున్న ఒక విస్తృత రాజకీయ ప్రణాళికలో భాగమే ఆ ప్రతిపాదన. జనసమ్మతమైన అంశాలకు తావు లేనిదిగా ప్రజాస్వామ్యాన్ని మిగిల్చి మన ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యాన్ని రక్షించుకోవాలనే మధ్యతరగతి ప్రజల కాల్పనిక భావనల ఆ ప్రతిపాదన అంకురించింది. ఇప్పుడది, ప్రజాస్వామ్యాన్ని వశపరచుకుని దాన్ని శక్తి హీనం చేయాలనే ప్రస్తుత పాలకుల ఆకాంక్షతో జత కట్టింది.

281 పేజీల (అనుబంధాలతో కలుపుకుంటే మొత్తం 18,345 పేజీల) హెచ్ఎల్‌సి నివేదిక తమను నియమించిన వారి అభీష్టాల ప్రకారం రూపొందించిన పత్రం. ఆ కమిటీ నిర్ణయాలు, సిఫారసులు దానికి నిర్దేశించిన పరిశీలనాంశాలలోనే ఉన్నాయి సుమా! నోట్ల రద్దు నిర్ణయ సుగుణాలను సృష్టించాలని రిజర్వ్ బ్యాంక్‌ను ఆదేశించినట్టుగానే ఒకే దేశం ఒకే ఎన్నిక సహేతుకతను ఆవిష్కరించేందుకు హెచ్ఎల్‌సిని ఉద్దేశించారు. ప్రభుత్వ అనుకూల, ఒకే దేశం ఒకే ఎన్నిక భావనను సమర్థించేవారితో నిండిపోయిన హెచ్ఎల్‌సి విధేయపూర్వకంగా, దాన్ని అమలుపరిచేందుకు అవసరమైన శాసన, రాజ్యాంగ పరమైన లాంఛనాలు, పరిపాలనా పరమైన ఏర్పాట్ల వివరాలతో నివేదికను నింపివేసింది.

ఒకే దేశం ఒకే ఎన్నిక ప్రతిపాదన సహేతుకతను ఆవిష్కరించాల్సిన అనివార్యత వల్ల ఆ నివేదిక ఒక విచిత్రమైన పఠనానుభవాన్ని కలిగిస్తోంది. నిరంతర ఎన్నికల వల్ల మహారాష్ట్ర లాంటి కొన్ని రాష్ట్రాలలో 300 రోజులు వృథా అయిపోతున్నాయని విచారం వ్యక్తం చేసింది. ఒకే నాయకుడు ఎమ్మెల్యే, ఎంపి స్థానాలకు ఏక కాలంలో పోటీ చేసేందుకు వీలు కాదు కనుక ఒకే దేశం ఒకే ఎన్నికతో రాజకీయ కార్యకర్తలు అందరికీ సమాన అవకాశాలు లభిస్తాయని హెచ్ఎల్‌సి నివేదిక ముక్తాయించింది. అంతేకాదు విద్వేష ప్రసంగాల సందర్భాలను గణనీయంగా తగ్గిస్తుందని కూడా పేర్కొంది. మరీ ముఖ్యంగా ‘ఓటరు అలసట’ సమస్యను పరిష్కరిస్తుందని ఉద్ఘాటించింది. భారతదేశంలో ఎన్నికలపై రెండు దశాబ్దాలుగా పరిశోధనలు చేస్తున్న నేను ఈ సమస్య గురించి ఎప్పుడూ వినలేదు!

హెచ్ఎల్‌సిలో ‘రాజ్యాంగ నిపుణుడు’ అయిన సభ్యుడి రాజ్యాంగ విజ్ఞత ఏమిటో చూడండి: భారత్ ప్రజాస్వామ్య వ్యవస్థ అధ్యక్ష తరహా, పార్లమెంటరీ విధాన ప్రభుత్వాల కలయిక అట! ఈ ఆలోచనా రీతి ఇంకా ఎలా ఉన్నదో చూడండి! ‘కేంద్ర, రాష్ట్ర స్థాయి, స్థానిక పాలనా సంస్థల ఎన్నికలను ఒకేసారి నిర్వహించడం వల్ల పౌర సంలగ్నత, జాతీయ సమైక్యత పెంపొందుతాయి. ప్రజాస్వామ్య పండుగలో దేశ పౌరులు అందరూ సమష్టిగా పాల్గొనడం వల్ల పౌరసత్వ బంధాలు, సౌభ్రాతృత్వం బలోపేతమవుతాయి’. పాఠశాల బాలలు ఒక సైన్స్ ప్రాజెక్ట్‌లో తమ ‘నవకల్పన’ ప్రయోజనాలు ఎంత అపారంగా ఉంటాయో వివరించినట్టుగా లేదూ ఇది?


■ యోగేంద్ర యాదవ్

ఈ శబ్దాడంబరం మాటకేమిగానీ నివేదిక కీలక వాదన ఇది. ఏక కాలంలో ఎన్నికల నిర్వహణ పాలనా నాణ్యతను మెరుగుపరుస్తుంది. ప్రభుత్వ యంత్రాంగాన్ని ఎన్నికల విధులకు మళ్లించడాన్ని తగ్గించడం, ప్రభుత్వ నిధులను ఆదా చేయడం, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న కారణంగా విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడంపై ప్రభావాన్ని తగ్గించడం మొదలైనవి ఏక కాలంలో ఎన్నికల నిర్వహణతో ఒనగూరుతాయి. ఇవన్నీ యుక్తియుక్తమైన వాదనలు, సందేహం లేదు. అయితే వాటిని చాలా జాగ్రత్తగా అంచనా వేయవలసి ఉన్నది.

మరి ప్రపంచ నాయకుల పర్యటనలు, మత పరమైన సమావేశాల వల్ల పాలనకు అంతరాయాలు కలగడం లేదా? సరే, ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వ బడ్జెట్ నుంచి ఏ నిష్పత్తిలో ఖర్చు పెడుతున్నారు? అభ్యర్థులు, పార్టీలు చేస్తున్న వ్యయాలతో ప్రభుత్వం చేస్తున్న ఖర్చును సరి చూడండి. ఇక విధాన వైకల్యం అనే వాదనను చూద్దాం. ఎన్నికల వల్ల ప్రతి రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతి ఐదేళ్లలో కేవలం నాలుగు నెలల పాటు మాత్రమే పాలనా వ్యవహారాలకు భంగం కలుగుతోంది. రాష్ట్ర శాసనసభల ఎన్నికలు కేంద్ర ప్రభుత్వానికి తరచూ ప్రతిబంధకమవుతున్నాయన్న వాదనలో నిజమెంత?

ఆరు నెలలలోగా అసెంబ్లీ ఎన్నికలు జరగవలసిన అన్ని రాష్ట్రాలలోను సదరు ఎన్నికలను ఏక కాలంలో నిర్వహించేందుకు ఎన్నికల సంఘానికి అధికారాలు ఉన్నాయి. మరి మహారాష్ట్ర, జార్ఖండ్, ఢిల్లీ విషయంలో ఇటువంటి నిర్ణయాన్ని ఎందుకు తీసుకోలేదు? ఈ ఆరు నెలల వ్యవధి నిబంధనను 12 నెలలకు పొడిగించడం సబబుగా ఉంటుంది. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను ఏకకాలంలో నిర్వహించే ఎన్నికల సంఘం ఆ ఎన్నికల నిర్వహణ వ్యవధిని ఒక పక్షం రోజులకు, మూడుకు మించని దశలకు తప్పక కుదించగలదు. ఎన్నికల సమయంలో పరిపాలన యథావిధిగా కొనసాగేందుకు వీలుగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని సవరించాలి. సాధారణ మాత్రలతో తగ్గే రుగ్మతకు శస్త్రచికిత్స చేయవలసిన అవసరం ఏమిటి?

ఏక కాలంలో ఎన్నికల నిర్వహణతో సమకూరే ప్రయోజనాలను అంగీకరించినప్పటికీ ఆ ప్రతిపాదనను అమలు పరచడం వల్ల మన రాజ్యాంగబద్ధ ప్రజాస్వామిక వ్యవస్థకు జరిగే తీవ్ర నష్టాన్ని విధిగా గమనంలోకి తీసుకోవాలి. ఇండియా కూటమికి చెందిన 15 రాజకీయ పక్షాలు ఆ ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. కొట్టివేయలేని వాస్తవమేమిటంటే ఎన్నికల కాలెండర్‌లో అది కేవలం ఒక పరిపాలనాపరమైన మార్పు కాదు. పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో కార్యనిర్వాహకవర్గం శాసన వ్యవస్థకు జవాబుదారీగా ఉండాలనే మౌలిక సూత్రాన్ని అది తలకిందులు చేస్తుంది. శాసనసభల, మునిసిపల్, పంచాయత్ ఎన్నికలను లోక్‌సభ ఎన్నికలతో పాటు ఒకేసారి నిర్వహించడమనేది మన సమాఖ్య పాలనా విధానానికి విరుద్ధం. ఈ విధంగా ఏకకాలంలో ఎన్నికల నిర్వహణ అనేది మన రాజ్యాంగ ‘మౌలిక నిర్మాణాన్ని’ ఉల్లంఘించడమే అవుతుంది.

జాతీయ, రాష్ట్ర స్థాయి ఎన్నికలను ఒకేసారి నిర్వహించడం వల్ల ఓటర్ల మొగ్గు స్పష్టంగా జాతీయ పార్టీలకు అనుకూలంగాను, ప్రాంతీయ పార్టీలకు వ్యతిరేకంగాను ఉంటుంది. ఈ ఏడాది వేసవిలో ఒడిషాలో జరిగిన లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు ఏకకాలంలో జరగడం వల్లే బీజేపీకి మెజారిటీ లభించిందనేది నా అభిప్రాయం.

ప్రజాస్వామిక రాజకీయాలలోని గలాభాను తగ్గించడమే ఆ ప్రతిపాదనలో ఉన్న ఆకాంక్ష అని చెప్పవచ్చు. ఏకకాల ఎన్నికల నిర్వహణకు సంబంధించిన రాజకీయ అర్థికత వివరించేందుకు హెచ్ఎల్‌సి నివేదిక తన దృష్టిని కేంద్రీకరించడంలో ఆశ్చర్యమేమీ లేదు. నవీన గణితాత్మక ఆర్థిక నమూనాల ప్రాతిపదికన ఏకకాల ఎన్నికల నిర్వహణ రాజకీయ సుస్థిరతకు, సత్వర ఆర్థికాభివృద్ధికి, సదా సానుకూల విధాన వాతావరణానికి, జనాకర్షణీయ ఒత్తిళ్లను తగ్గించేందుకు దోహదం చేయగలదని ఆ నివేదిక వాదించింది. ఇది, నేను ఒకప్పుడు ‘మధ్యతరగతి ప్రజల స్వైర కల్పన’లుగా గుర్తించిన ధోరణికి అనుకూలంగా ఉన్నది. ఈ ధోరణి మన ప్రజా జీవితంలో సుదీర్ఘకాలంగా ఉన్నది.

ఈ దేశ సామాజిక, ఆర్థిక జీవనంలో ప్రభావశీలురుగా ఉన్నవారు మన అసహ్యకరమైన రాజకీయాల పట్ల సహనం కోల్పోతున్నారు. ఈ పరిస్థితిని తొలగించేందుకు వారు వివిధ పరిష్కారాలతో ముందుకు వస్తున్నారు. రాజకీయాలను సమూలంగా ప్రక్షాళన చేసేందుకు పోటీ చేసే అభ్యర్థుల సంఖ్యను పరిమితం చేయాలని, ప్రాంతీయ పార్టీలకు విధిగా కనీస ఓట్ల నిబంధన, రాజకీయ పార్టీలు విచక్షణారహితంగా వాగ్దానం చేస్తున్న ‘ఉచితాల’కు వ్యతిరేకంగా చట్టాలు తీసుకురావడం మొదలైనవి ప్రతిపాదించారు. రాజకీయ వర్గాలలో కొన్ని బీజేపీ నాయకత్వంలో– ఈ పార్టీకి మాత్రమే పరిమితమైనవి కావు– ఒకే దేశం ఒకే ఎన్నిక పట్ల సానుకూలత చూపుతున్నాయి. ఎన్నికల తలనొప్పిని తగ్గించుకునేందుకు నిరంతరం జవాబుదారీగా ఉండాల్సిన ప్రయాసను తొలగించుకునేందుకు ఒక దేశం ఒకే ఎన్నిక ప్రతిపాదన సత్వరమే అమలు కావాలని వారు కోరుకుంటున్నారు. ఎన్నికలను పూర్తిగా రద్దు చేయడం సాధ్యం కాదు కదా. అది సాధ్యం కానప్పుడు చేయగల ఉత్తమ పని సకల ఎన్నికలను ప్రతి ఐదేళ్లకొకసారికి మాత్రమే పరిమితం చేయడం. తద్వారా పాలనా వ్యవహారాలకు ప్రజల నుంచి నాలుగు సంవత్సరాల తొమ్మిది నెలలపాటు ఎటువంటి అంతరాయం ఏర్పడకుండా ఉండేందుకు వారు జాగ్రత్త పడుతున్నారు. మొత్తం మీద ఒకే దేశం ఒకే ఎన్నిక ప్రతిపాదనలోని ముఖ్యాంశాలను నిశితంగా పరిశీలిస్తే అది ప్రజాస్వామ్యానికి పూర్తిగా విరుద్ధమైనది అని చెప్పక తప్పదు.

(వ్యాసకర్త ‘స్వరాజ్ ఇండియా’ అధ్యక్షుడు)

ఈ అనుకోని ‘గ్రామీణ డిమాండ్’ ఎక్కడిది?

సెప్టెంబర్ 10, 2024న ‘మింట్’ పత్రికలో మొదటి పేజీలోనే ఒక కథనం వచ్చింది. దాని ప్రకారం– గ్రామీణ డిమాండ్ పెరగటం వల్ల ప్రైవేట్ వినియోగం తిరిగి పుంజుకుంది. ఇది నిజమా? అసలు ఈ ప్రైవేట్ వినియోగం అంటే ఏమిటి? ప్రైవేట్ వినియోగం అంటే వినియోగదారులు చేసే అన్ని రకాల కొనుగోళ్ళు, ఉదాహరణకు: ఆహారం, గృహాలు (కిరాయి లేదా అద్దె), ఇంధన అవసరాలు, దుస్తులు, ఆరోగ్యం, ఆట విడుపు (విరామం), విద్య, మొబైల్ ఫోన్‌ల వంటి సమాచార అవసరాలు, రవాణా, హోటళ్ళు లేదా రెస్టారెంట్లు తదితరాలపై దేశంలోని ప్రజలు పెట్టే ఖర్చులన్నీ ఈ తరహా క్రిందకే వస్తాయి.

అంటే, ప్రస్తుతం ‘మింట్’ పత్రిక కథనం ఈ ప్రైవేటు వ్యక్తులూ లేదా కుటుంబాల వినియోగం పెరిగిందని చెబుతోంది. దీని ప్రకారంగా, ఈ కొనుగోళ్ళ పెరుగుదల, ఈ సంవత్సరం ఏప్రిల్–జూన్ కాలంలో జరిగింది (ఇది 2024–25 ఆర్థిక సంవత్సరం తాలూకు తొలి త్రైమాసిక కాలం). ఏడు త్రైమాసికాలుగా (21 నెలల పైబడి) నేల చూపులు చూస్తోన్న వినియోగ వ్యయాలు ఈ 2024–25 తొలి త్రైమాసికంలో ఒక్కసారిగా, అంతకు ముందరి త్రైమాసికం అయిన 2023–24 తాలూకు నాల్గవ త్రైమాసిక (జనవరి–మార్చి) కాలంలోని 4శాతం స్థాయి కంటే, అధిక స్థాయిలో 7.4శాతంగా నమోదు అయ్యింది.

ఈ విధంగా, గ్రామీణ వినియోగం పుంజుకోవడం అనేది దేశీయ ఆర్థిక వృద్ధికి భారీగా లబ్ధి చేకూర్చగలదనేది ఆ పత్రిక కథనం తాలూకు సారాంశం. గ్రామీణ డిమాండ్ పెరుగుదలకు కారణాలుగా ఉండగల మెరుగైన ఋతుపవనాలు, మంచి వ్యవసాయ ఉత్పత్తి, తగిన గిట్టుబాటు ధర లభించడం వంటివన్నీ నేడు పరిస్థితి మెరుగుదలకు కారణంగా ఉన్నాయని ఆ పత్రిక చెబుతోంది. ఫలితంగానే, ఈ మధ్యన ప్రపంచ బ్యాంకు భారతదేశపు, 2025 ఆర్థిక సంవత్సరం తాలూకు స్థూల జాతీయ ఉత్పత్తి అంచనాలను పెంచిందట. అంటే, ప్రస్తుత గ్రామీణ వినియోగం పెరుగుదల వలన దేశ స్థూల జాతి ఉత్పత్తికి ఒక్క శాతం మేరకు అదనపు ప్రయోజనం చేకూరగలదట. అదీ విషయం...! అయితే ఇదంతా వాస్తవంలో సాధ్యమయ్యేదేనా? సందేహాస్పదమే! కానీ, కారణాలు ఏవైనా నేడు 2025 ఆర్థిక సంవత్సర తొలి త్రైమాసికంలో గ్రామీణ ప్రైవేటు వినియోగం గణనీయంగా పుంజుకుందన్నది నిజం. మరి, మన గ్రామాలలో ఈ వృద్ధి ఎక్కడ నుంచి ఎలా వచ్చింది? బహుశా మనం ఇక్కడ ఏదో ఒక కీలక అంశాన్ని మిస్ అవుతున్నాం.



> కేవలం గ్రామీణ ప్రైవేటు వినియోగం మాత్రమే ఒంటరిగా ఈ తొలి త్రైమాసికంలో దేశానికి మెరుగైన ఆర్థిక స్థితిని ఇవ్వగలిగిందా? నూటికి నూరు పాళ్ళు ఇది సాధ్యం అయ్యేది కాదు. మరేం జరిగింది?

మన దేశం తాలూకు, స్థూల జాతి ఉత్పత్తిలో ఈ ప్రైవేటు వినియోగం వాటా 50శాతం పైనే ఉంటుంది. కాబట్టి దేశ ఆర్థిక వ్యవస్థ ఆరోగ్యంగా ఉండడంలో ఈ అంశం తాలూకు పాత్ర చాలా కీలకమైంది. నిజానికి దేశీయ ఆర్థిక వ్యవస్థకు చోదక శక్తులూ లేదా ఇంజన్లుగా నాలుగు అంశాలను చూస్తారు: 1) ప్రైవేటు వినియోగం 2) ప్రైవేటు పెట్టుబడులు 3) ప్రభుత్వ పెట్టుబడులు 4) ఎగుమతులు. వీటిలో మొదటిది అయిన ప్రైవేటు వినియోగం గత 21 మాసాల పైబడి దిగజారుతూ వచ్చింది. అదే ఇప్పుడు 2024–25 తొలి త్రైమాసికంలో తిరిగి పుంజుకుందని మింట్ పత్రిక చెబుతోంది. కాగా రెండవది, ప్రైవేట్ కార్పొరేట్ పెట్టుబడులు. ఈ ఇంజన్ చాలా కాలంగా మొరాయిస్తోంది. ప్రభుత్వం, ప్రైవేట్ కార్పొరేట్ రంగానికి కార్పొరేట్ పన్నును 32శాతం నుంచి సుమారు 22శాతానికి తగ్గించినా, కార్మిక చట్టాలు తదితరాలను కార్పొరేట్‌లకు అనుకూలంగా సవరించినా, ఉత్పత్తి అనుసంధానిత ప్రోత్సాహకాల (పి.ఎల్.ఐ) పేరిట రాయితీలు ఇచ్చినా కార్పొరేట్లు మాత్రం కొత్తగా పెట్టుబడులు పెట్టడం లేదు. దేశంలో ప్రజల కొనుగోలు శక్తి దిగజారి, డిమాండ్ లేకపోవడమే దీనికి కారణం. ఇక మూడవది, ప్రభుత్వ పెట్టుబడులు, నాల్గవది, ఎగుమతులు. గత కొద్ది సంవత్సరాలుగా దేశీయ ఎగుమతులు బాగా దెబ్బతిన్నాయి. దీనికి కారణం మన దగ్గర నుంచి, దిగుమతులు చేసుకొనే అనేక దేశాలలో ఆర్థిక పరిస్థితులు దిగజారి, డిమాండ్ పతనం కావడం. అంతిమంగా, దేశంలో ప్రస్తుతం ఈ నాలుగు ఇంజన్‌లలో పూర్తి స్థాయిలో పని చేస్తోంది కేవలం, ప్రభుత్వ పెట్టుబడులే! గత కొద్ది సంవత్సరాలుగా, దేశంలో కొనుగోలు శక్తినీ, డిమాండ్‌నూ నిలిపి ఉంచుతోంది ప్రధానంగా ఈ ప్రభుత్వ పెట్టుబడులే. కాగా, ప్రస్తుతం గ్రామీణ వినియోగం పుంజుకున్న 2024–25 కాలంలోనే (పార్లమెంట్ ఎన్నిక జరిగిన కాలం) ప్రభుత్వ పెట్టుబడులు బలహీనపడ్డాయి. అంటే, స్థూలంగా ఈ కాలంలో దేశ ఆర్థిక స్థితి మెరుగుదలకు ప్రభుత్వ పెట్టుబడులు కూడా కారణం కాదు. మరి అయితే, కేవలం గ్రామీణ ప్రైవేటు వినియోగం మాత్రమే ఒంటరిగా ఈ తొలి త్రైమాసికంలో, దేశానికి మెరుగైన ఆర్థిక స్థితిని ఇవ్వగలిగిందా? నూటికి నూరు పాళ్ళు ఇది సాధ్యం అయ్యేది కాదు. మరేం జరిగింది?

ఇక్కడ గమనించవలసింది 2024 ఏప్రిల్ – జూన్ కాలం అనేది దేశంలో పార్లమెంటరీ ఎన్నికల కాలం. ఈ కాలం తాలూకు ప్రత్యేకత ఎన్నికల సంఘం, రాజకీయ పక్షాలు, పోటీ చేసే అభ్యర్థులు అటు తెల్ల డబ్బు, ఇటు నల్ల డబ్బు కలగలిపి భారీగా ఖర్చులు చేయడం. ఈ ఖర్చులు అనేక రకాలు ప్రచారానికి వచ్చినందుకు జనాలకు అభ్యర్థులు ముట్టజెప్పే ‘కూలీ’ డబ్బు, ఎన్నికల ప్రచారం కోసం బ్యానర్‌లు, పోస్టర్‌లు, మీడియా ప్రచారాలు, బాడుగ కార్లు వగైరా వగైరా అన్నీ కూడా జనాలకు తాత్కాలిక ఉపాధిని, ఆర్థిక వ్యవస్థకు తాత్కాలిక ఉద్దీపనను కల్పించేవే. వీటన్నింటికీ తోడుగా ‘ఓటుకు నోటు’ ఎటుకూడీ ఉండనే ఉంది. అదీ అసలు కథ!

ఇక్కడ మరో వాణిజ్య పత్రిక కథనం ప్రకారం 2024 పార్లమెంటరీ ఎన్నికలలో దేశం మొత్తంలో అయిన ఖర్చులు లక్ష కోట్ల రూపాయల మేరకు ఉన్నాయి. ఈ ఖర్చు 2019 పార్లమెంటరీ ఎన్నికలతో పోలిస్తే దాదాపు రెట్టింపు. ప్రస్తుతం పెరిగిన ఆర్థిక వృద్ధి రేటు తాలూకు పజిల్‌కు సమాధానం ఈ ఎన్నికల వ్యయాలలోనే ఉంది. ఈ లక్ష కోట్ల రూపాయలు, 2024 ఏప్రిల్ – జూన్ కాలంలో దేశ ఆర్థిక వ్యవస్థకు ఉద్దీపనగా పని చేసాయి. అందులో భాగంగానే అప్పటికి అనేక త్రైమాసికాలుగా కుదేలైవున్న గ్రామీణ ప్రాంతాలు కూడా గణనీయంగా మెరుగుదలను చూపించాయి. కాబట్టి మనం, ఆ ఒక్క త్రైమాసికం తాలూకు ఆర్థిక మెరుగుదలను చూసి ఆర్థిక వ్యవస్థ తిరిగి కోలుకుందని సంబరపడడం తొందరపాటే అవుతుంది. కనీసం ఇంకా ఒకటి రెండు త్రైమాసికాలైనా అంటే 2024 డిసెంబర్ వరకు అయినా పరిస్థితులను గమనించి మాత్రమే, దేశ వాస్తవ ఆర్థిక స్థితి గురించిన అంచనాలకు రాగలం.

◆ డి. పాపారావు

కమ్యూనిస్టులు స్వాతంత్ర్యం సాధించారా?

సెప్టెంబర్ 17న ముగ్గురు కమ్యూనిస్టు నాయకులు రాసినవి (ధీర ప్రజాకోటి పోరాటాన్ని గుర్తించరా?: చాడ వెంకటరెడ్డి; అది ప్రజా విముక్తిపోరు...: పోటు రంగారావు; ముమ్మాటికీ విద్రోహమే: మెంతెన సంజీవరావు) కేవలం అర్ధ సత్యాలు. చాడ వెంకటరెడ్డి ప్రకారం 1945 లో రావి నారాయణ రెడ్డి అధ్యక్షతన భువనగిరి సమావేశంలో నిర్ణయం మేరకు ఉద్యమం మొదలు పెట్టారని రాశారు. నిజమేమిటి?

1937లో మహారాష్ట్ర పరిషత్, కర్ణాటక పరిషత్‌లు వారి వారి ప్రాంతాల్లో ఏర్పడ్డాయి. స్వదేశీ రాజుల సంస్థానాలు ‘భారతదేశంలో అంతర్భాగం’ అని హరిపుర కాంగ్రెస్ మహాసభ తీర్మానం స్పష్టం చేసింది. 1938లో హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ కమిటీని ఏర్పాటు చేశారు. దీనిని చట్టవిరుద్ధమని నిజాం నిషేధించాడు. 1938 సెప్టెంబర్ 24న మధిరలో గోవిందరావు నానక్, జనార్ధన్ రావు దేశాయ్, రావి నారాయణ రెడ్డి మొదలైనవారితో కలసి సర్దార్ జమలాపురం కేశవరావు సత్యాగ్రహ దీక్షకు సిద్ధమయ్యారు. ఎట్టి పరిస్థితి లోను సర్దార్ దీక్షను జరగనివ్వకూడదని భావించిన నిజాం నవాబు మధిరలో అడుగడుగునా పోలీసులను మోహరించాడు. అయినా రైతు వేషంలో వచ్చి జెండా ఎగుర వేసిన కేశవరావుకు 18 నెలల శిక్ష విధించింది నిజాం ప్రభుత్వం. దీనిని స్ఫూర్తిగా తీసుకొన్న రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు దీక్ష చేసి, జెండాలు ఎగరవేసి జైళ్ళకు వెళ్ళటం మొదలు పెట్టారు.

తెలంగాణ కాంగ్రెస్ నాయకులు 1942లో క్విట్ ఇండియా ఉద్యమంతో కలసి పనిచేశారు. 1946లో స్టేట్ కాంగ్రెస్‌పై నిషేధం తొలగించారు. 1946లోనే మెదక్ జిల్లా కందిలో జరిగిన 13వ ఆంధ్ర మహాసభ ఊరేగింపు ప్రజలకు ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చింది. 1947 ఆగస్టు ఏడును ‘జాయిన్ ఇండియన్ యూనియన్ దినం’గా పాటించాలని స్టేట్ కాంగ్రెస్ కమిటీ పిలుపునిచ్చింది. రాష్ట్ర వ్యాపితంగా నిరసనలు, సమ్మెలు, జెండాలు ఎగుర వేయటం చేశారు, దీంతో నిజాం మరొకసారి స్టేట్ కాంగ్రెస్‌ను నిషేధించారు.

సర్దార్ పటేల్ ఆదేశాలతో జరిగిన పోలీస్ చర్యతో 1948 సెప్టెంబర్ 17న నిజాం నవాబు లొంగిపోయి హైదరాబాద్ రాష్ట్రాన్ని భారతదేశంలో కలపటం జరిగింది. కమ్యూనిస్టు నాయకులు ఇదేమీ చెప్పకుండా కేవలం తమ సాయుధ పోరాటం ద్వారా హైదరాబాద్ విముక్తి జరిగిందని చెప్పుకోవటం సత్యదూరం. అంతే కాకుండా విముక్తి జరిగాక ఇంకా మూడు నాలుగు సంవత్సరాల పాటు సాయుధ పోరాటం చేసి హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో కలపటానికి వీలు లేదంటూ భారత సైన్యంపై చేసిన యుద్ధం గురించి కమ్యూనిస్టు నాయకులు ఇప్పుడు మాట్లాడరు! స్వాతంత్ర్య పోరాటంలో అమరులు అయింది 1500 మంది అయితే, భారత సైన్యంతో పోరాడి చనిపోయింది 2500 మంది. అయితే కమ్యూనిస్ట్ నాయకులు ఈ సత్యాన్ని దాచి అందరూ స్వాతంత్ర్య పోరాటంలో అమరులు అయ్యారని చెప్పుతారు.

భారతదేశం నడిబొడ్డున ఇంకొక స్వతంత్ర రాజ్యం ఏర్పడి చైనాకు తొత్తుగా ఆ ప్రభుత్వం ఉంటే ఈ రోజు దేశం పరిస్థితి ఏమయ్యేది? పీపుల్స్ డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ హైదరాబాద్ అనే స్వతంత్ర దేశాన్ని ఏర్పాటు చేయాలన్న కుట్రను భగ్నం చేసేందుకు భారతసైన్యం ఎంతో కష్టపడవలసి వచ్చింది. సర్దార్ పటేల్ పట్టుదల వల్ల కమ్యూనిస్టుల ప్రయత్నం ఫలించలేదు. భారత ప్రజలకు తాము చేసిన దానిని చెప్పి క్షమార్పణ అడగవలసిన కమ్యూనిస్టులు, తామే స్వాతంత్ర్యం తెచ్చామనటం ముమ్మాటికీ అర్థసత్యం.

– జమలాపురపు శ్రీనివాస్


ప్రకృతికి, స్త్రీకి అండగా ‘బహుజన బతుకమ్మ’

తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమంలో సాంస్కృతిక పతాకగా ఎగిరిన బహుజన బతకమ్మ 2024అక్టోబర్‌తో 15వ ఏడు లోనికి అడుగు పెట్టింది. ఈ ఏట సెప్టెంబర్ 27, 2024న ఉస్మానియాలో ప్రారంభమై అక్టోబర్ 10న ముగిసే బహుజన బతుకమ్మ స్త్రీలపై అత్యాచారాలను ఖండిస్తూ, పర్యావరణ విధ్వంసాన్ని నిరసిస్తూ ఒక ఉద్యమంలా జరగనుంది. అందుకే చైతన్యయుతమైన తెలంగాణ సమాజం వివక్ష నుండి స్త్రీలను, విధ్వంసం నుంచి ప్రకృతిని రక్షించుకోవడానికి సాగుతున్న బహుజన బతుకమ్మ ఉద్యమంలో భాగం కావాలని కోరుకుంటున్నాం. ఇప్పటికే 2010లోనే పార్లమెంటులో తెలంగాణ బిల్లు పెట్టాలనే అంశంతో మొదలై వనరుల విధ్వంసాన్ని, చెరువులు–కుంటలు కూల్చడాన్ని, మద్యం మత్తును, అంటరానితనాన్ని, యురేనియం తవ్వకాలను వ్యతిరేకిస్తూ, ప్రకృతి వ్యవసాయాన్ని ఎత్తిపడుతూ వచ్చాం. ఈ ఏడు అత్యాచారాల నుంచి స్త్రీల ఆత్మరక్షణకై–పర్యావరణ పరిరక్షణలకై ఉద్యమంగా సాగుదామని పిలుపునిస్తున్నాం.

> ప్రకృతి విధ్వంసం, స్త్రీలపై అత్యాచారాలు దేశమంతా ఒకేసారి చుట్టుముట్టి జన జీవితాన్ని అతలాకుతులం చేస్తున్నాయి. కోల్‌కత్తాలోని ఆర్జీకార్ ప్రభుత్వ దవాఖానలో ట్రైనీ డాక్టర్‌పై జరిగిన అఘాయిత్యం వ్యవస్థాగతంగా వేళ్ళూనుకుంటున్న మాఫియా సంస్కృతిని వెల్లడిస్తూ దేశమంతా మరొకసారి చర్చనీయాంశం చేస్తున్నది. అందుకే వీటిపై ఉద్యమించడం తక్షణ అంశంగానే కాకుండా దీర్ఘకాలిక లక్ష్యం కావాల్సిన అవసరం ఉందని బహుజన బతుకమ్మ భావిస్తున్నది.

ప్రకృతిని పార్వతి గానూ, స్త్రీ గాను సరిపోల్చడం మన దేశంలోని మెజారిటీ ప్రజల రివాజు. బతుకమ్మ కులమతాలకు అతీతంగా అందరూ ఆడిపాడుకునే ఒక పంటల పండుగ అయినా ప్రధానంగా ఒక ఆచార సాంప్రదాయాలు గల ప్రజలు బతుకమ్మ ఉత్సవాల్లో ప్రధాన భాగస్వాములుగా ఉంటున్నారు. పునరుత్పత్తి, -పిల్లల పెంపకం, ఇంటి పనులతో పాటు, ఉత్పత్తి–సేవా రంగాల్లోనూ స్త్రీలు ప్రధాన భూమిక పోషిస్తున్నారు. అందుకే ప్రజలు స్త్రీలకు భూమికి ఉన్నంత ఓపిక, సహనం ఉందంటారు. అలాంటి స్త్రీలపై పితృస్వామ్య దోపిడీ, -వివక్షలకు పరాకాష్ఠగా అత్యాచారాలు–, హత్యాకాండ రోజురోజుకూ తీవ్రమవుతున్నది. పితృస్వామ్యంతో పాటు స్త్రీల శరీరాలను లాభసాటి సరుకుగా మార్చి అంగట్లో అమ్ముతున్న దేశ–విదేశీ బహుళ జాతి కంపెనీల వ్యాపార సరళి స్త్రీలపై అత్యాచారాలకు ప్రధాన వనరుగా ఉంది. ఇదే దోపిడీ వర్గాలు ప్రకృతినీ కొల్లగొడుతూ, కాలుష్యం సృష్టిస్తూ భూమిని వేడెక్కిస్తున్నాయి. ప్రతి ఏటా ఏడతెగని వర్షాలకు, అదే సమయంలో కరువూ–కాటకాలకు కారణమవుతున్నారు. ఇలా ప్రకృతి విధ్వంసం, స్త్రీలపై అత్యాచారాలు దేశమంతా ఒకేసారి చుట్టుముట్టి జన జీవితాన్ని అతలాకుతులం చేస్తున్నాయి. కోల్‌కత్తాలోని ఆర్జీకార్ ప్రభుత్వ దవాఖానలో ట్రైనీ డాక్టర్‌పై జరిగిన అఘాయిత్యం వ్యవస్థాగతంగా వేళ్ళూనుకుంటున్న మాఫియా సంస్కృతిని వెల్లడిస్తూ దేశమంతా మరొకసారి చర్చనీయాంశం చేస్తుంది. అందుకే వీటిపై ఉద్యమించడం తక్షణ అంశంగానే కాకుండా దీర్ఘకాలిక లక్ష్యం కావాల్సిన అవసరం ఉందని బహుజన బతుకమ్మ భావిస్తున్నది.

ఒక సమాజాభివృద్ధికి కొలమానం ఆ సమాజం లోని స్త్రీల స్థితిగతుల ఆధారంగానే తెలుసుకోవచ్చని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పేర్కొన్నారు. కానీ స్త్రీ పురుష అసమానత్వం, పితృస్వామ్య పీడనలో మన దేశ మహిళలు అట్టడుగు స్థితిని ఎదుర్కొంటున్నారని ప్రపంచ ఆర్థిక వేదిక (WEF) వెల్లడించింది. ప్రపంచ నోబెల్ బహుమతి గ్రహీత, ప్రముఖ ఆర్థికవేత్త అమర్త్య సేన్ రెండున్నర కోట్ల గర్భస్థ శిశువులు ఆడపిల్లలైన పాపానికి తల్లి కడుపులోనే చిదిమివేయబడుతున్నారని వెల్లడించారు. ఈ విషయంలో 134 దేశాలపై జరిగిన పరిశోధనల్లో మన దేశం 114వ స్థానంలో ఉందని, మన కంటే శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్‌లు మెరుగైన స్థితిలో ఉన్నాయని వెల్లడించారు. 1901 లో 1,000 మంది పురుషులకు 985 మంది మహిళలుంటే, వంద సంవత్సరాల తర్వాత 2001లో అది 978కి పడిపోయింది. 2001 నుండి 2010 మధ్య దశాబ్ద కాలంలోనే అది 876కి దిగజారింది. ఆర్థిక అసమానతల గురించి చెప్పాలంటే మన రాష్ట్రంలో కోటీ పందొమ్మిది లక్షల మందికి భూములుంటే అందులో మహిళలు 9.12 శాతం మాత్రమే నంటున్నారు. కానీ అన్ని రంగాల్లో స్త్రీలు అభివృద్ధిలో దూసుకుపోతున్నారని భావిస్తున్న సమయంలో ఈ గణాంకాలు మనల్ని ఎంతగానో వణికిస్తున్నాయి.




పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసులు ఆధారంగా ఎన్‌సిఆర్‌బి వెల్లడించిన వివరాల ప్రకారం ప్రతిరోజు 77 మంది స్త్రీలపై అత్యాచారాలు జరుగుతున్నాయి. షెడ్యూల్డ్ కులాలు–తెగలపై జరుగుతున్న కేసుల్లో 1989 ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టంలోని పలు సెక్షన్లు జత చేయాలనే పట్టింపే లేకుండా పోతున్నది. ఎందుకంటే తరచుగా ఇలాంటి నిమ్న కులాలు, జాతుల వారిని అన్ని నిబంధనలు ఉల్లంఘించి దొంగతనాలు కారణం చూపి పోలీసులు కూడా సులభంగా వేధిస్తుండడం, అది తెలంగాణతో పాటు పలు రాష్ట్రాల్లో మరణాల దాకా పోవడం మనం చూస్తూనే ఉన్నాం. రోజురోజుకు బాలికలపై జరుగుతున్న అత్యాచారాలను నిరోధించడానికి 2012లో తెచ్చిన పోక్సో చట్టం ద్వారా 1,023 ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పర్చి త్వరితగతిన విచారణ పూర్తి చేయాలనుకున్నా, ఇప్పటికీ 597 కోర్టులు మాత్రమే పని చేస్తున్నాయి. ఆన్‌లైన్ ఇన్వెస్టిగేషన్, ట్రాకింగ్ సిస్టమ్, ఫోరెన్సిక్ లాబరేటరీ, పాన్ ఇండియా హెల్ప్ లైన్, బాధితులకు వసతి గృహాలు, 33 శాతం ఆడ పోలీసుల నియామకం ఇలా ఏ ఒక్కటి ఆచరణ రూపం తీసుకోలేదు. నిర్భయ ఫండ్స్‌లో కేవలం 39శాతం నిధులే ఖర్చు పెట్టబడ్డాయని ఆరోపణలు ఉన్నాయి. ఏదో ఒక సంఘటన జరిగినప్పుడు గగ్గోలు పెట్టడం తప్ప విద్యాలయాల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో, పంట పొలాల్లో, కుటుంబాల్లో వేధింపులు, కుటుంబ హింస లాంటి అంశాల్లో మన దేశ పరిస్థితి ఏమంత మెరుగ్గా లేదు.

స్త్రీలపై నేరాల పెరుగుదలలో మద్యం, గంజాయి, మాదక ద్రవ్యాలు, బూతు మీడియా, సులభ పద్ధతుల్లో కొందరికే సమకూరుతున్న సంపద, క్లబ్బులు, పబ్బులు అన్నీ పాత్ర వహిస్తున్నాయి. పైగా స్త్రీలు అబలలు, విలాస వస్తువులనే భూస్వామ్య–సామ్రాజ్యవాద విష సంస్కృతి వేళ్లూనుకొని ఇలాంటి దుర్మార్గాలన్నీ సర్వసాధారణమైపోయాయి. ఒక్క సినిమా రంగమే కాదు, అన్ని రంగాల్లోనూ అవకాశాల కోసం స్త్రీలను లొంగదీసుకోవడమనే కాస్టింగ్ కౌచ్ పద్ధతి సర్వసాధారణమైపోయింది. ప్రపంచంలోనే దేశ ప్రతిష్ఠను పెంచిన మల్లయోధులైన వారు సైతం లైంగిక వేధింపులకు అతీతం కాలేకపోతున్నారు.

ముంచెత్తుతున్న వరదల్లో అత్యాచారాలు, అఘాయిత్యాల పాలవుతున్న స్త్రీల కన్నీళ్లు కలిసి పారుతున్న సమయంలో పకృతిని, స్త్రీలను కాపాడుకునే లక్ష్యంగా సాగుతున్న బహుజన బతుకమ్మ ఉద్యమంలో యావత్ తెలంగాణ సమాజం భాగం కావాలని విజ్ఞప్తి చేస్తున్నాం. లౌకిక–ప్రజాస్వామిక–విప్లవ శక్తులు ఈ ఉద్యమానికి అండగా నిలబడాలని కోరుతున్నాం.

• విమలక్క, ప్రొ. కె.లక్ష్మి
బహుజన బతుకమ్మ నిర్వహణ కమిటీ





మిల్లర్ల దొంగాట!

- వానాకాలం, యాసంగిలో 2.48లక్షల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ పెండింగ్
- ఎఫ్‌సీఐకి బియ్యం ఇవ్వకుండా విల్లర్ల కుంటిసాకులు
- మిల్లుల్లోనే మూడు సీజన్లకు సంబంధించిన ధాన్యం
- రేషన్ బియ్యాన్ని సీఎంఆర్‌గా మార్చేందుకు కొందరి యత్నాలు
- మిల్లుల్లో అక్రమాలపై విజిలెన్స్ దాడులు.. యజమానులపై క్రిమినల్ కేసులు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో సీఎంఆర్ లక్ష్యం చేరని మిల్లులు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

ఓరుగల్లు మిల్లుల్లో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) నిల్వలు పేరుకుపోతున్నాయి. నిర్ణీత గడువులోపు సీఎంఆర్ ఇవ్వకుండా ఎఫ్‌సీఐ, పౌరసరఫరాల శాఖతో మిల్లర్లు దొంగాట ఆడుతున్నారు. 2023-24లో వానాకాలం, యాసంగిలతో పాటు 2022-23 యాసంగి పంటలకు సంబంధించిన సీఎంఆర్ లక్ష్యాలను మిల్లర్లు పూర్తి చేయటం లేదు. ప్రభుత్వం రైతుల వద్ద ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లింగ్ కోసం ఇస్తే, మిల్లర్లు అడ్డదారిలో అక్రమ వ్యాపారం చేస్తున్నారు. పీడీఎస్ బియ్యాన్ని వివిధ రూపాల్లో సేకరించి తిరిగి ఎఫ్‌సీఐ, పౌరసరఫరాల శాఖకు మిల్లర్లు అప్పగిస్తున్నారు. రీసైక్లింగ్ చేసిన బియ్యాన్ని అంటగడుతూ మిల్లర్లు కోట్లాది రుపాయల అక్రమ దందాకు పాల్పడుతున్న విషయాన్ని పసిగట్టిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు.. దాడులు నిర్వహిస్తుండటంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మిల్లర్ల అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి.

రైతుల నుంచి మిల్లర్లకు

ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల నుంచి సేకరిస్తుంది. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 2023-24 సంవత్సరంలోని వానాకాలంలో 4,26,576 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసింది. అలాగే యాసంగిలో 5,16,974 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసింది. మొత్తం 9,43,550 మెట్రిక్ టన్నుల వడ్లను కొనుగోలు చేసి మారాడించేందుకు (సీఎంఆర్) మిల్లర్లకు అప్పగించింది. మిల్లర్లు క్వింటాల్ వడ్లకు 67కిలోల చొప్పున సీఎంఆర్‌ను తిరిగి ప్రభుత్వానికి అప్పగించాలి. వడ్లను మరాడించినందుకు ప్రభుత్వం మిల్లర్లకు చార్జీలు చెల్లిస్తుంది. అయితే నిర్ణీత సమయంలో మిల్లింగ్ చేసి ప్రభుత్వానికి బియ్యాన్ని అప్పగించాల్సి ఉన్నప్పటికీ మిల్లర్లు లక్ష్యాన్ని సకాలంలో పూర్తి చేయటం లేదు. సీఎంఆర్ గడువును ప్రభుత్వం పలుమార్లు పొడిగించినా ఫలితం లేకుండా పోతోంది.

ఓరుగల్లులో అధికమొత్తంలో పెండింగ్

ఉమ్మడి వరంగల్ జిల్లాలో సీఎంఆర్ నిల్వలు అధికమొత్తంలో పెండింగ్‌లో ఉంటున్నాయి. 2023-24 వానాకాలంలో ప్రభుత్వం ఉమ్మడి వరంగల్ జిల్లాలో 4,26,576 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసింది. ఈ ధాన్యాన్ని మరాడించి 2,85,972మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఎఫ్‌సీఐకి మిల్లర్లు ఇవ్వాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2,21,268 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మాత్రమే మిల్లర్లు అప్పగించారు. సుమారు ఏడాది కాలంగా ఇంకా 64,702 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మిల్లర్లు ప్రభుత్వానికి అప్పగించటం లేదు. అత్యధికంగా ములుగు జిల్లా నుంచి 15,219 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ ప్రభుత్వానికి చేరాల్సి ఉంది. అలాగే మహబూబాబాద్ జిల్లా నుంచి 12,179మెట్రిక్ టన్నుల బియ్యం మిల్లర్ల నుంచి ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంది. అలాగే ఇదే ఏడాది యాసంగిలో ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యాన్ని 5,16,974 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసి మిల్లర్లుకు మరాడించేందుకు సరఫరా చేశారు. ఈ ధాన్యంతో 3,50,492 మెట్రిక్ టన్నులే కస్టమ్ మిల్లింగ్ రైస్ అందించాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు కేవలం ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 1,66,737 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ అందించారు. ఇంకా 1,83,171 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ప్రభుత్వానికి అందించాల్సి ఉంది. అత్యధికంగా హనుమకొండ జిల్లాలో 50,773మెట్రిక్‌ల సీఎంఆర్, జనగామ జిల్లాలో 42,983 మెట్రిక్ టన్నులు, వరంగల్ జిల్లాలో 38,144 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ పెండింగ్‌లో ఉంది. ఖరీఫ్, యాసంగిలో కలిపి మొత్తం 2,47,873 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉంది. గత 2022-23లో యాసంగి ధాన్యంకు సంబంధించి కూడా ఇంకా 50వేల మెట్రిక్ టన్నుల

మిగతా 7వ పేజీలో..

2023-24 వానాకాలంలో సీఎంఆర్ వివరాలు (మెట్రిక్ టన్నుల్లో)

జిల్లా	మిల్లర్లకు ధాన్యం	సీఎంఆర్	మిల్లర్లు ఇచ్చింది	సీఎంఆర్ పెండింగ్
వరంగల్	56,968	38,256	29,164	9,092
హనుమకొండ	79,161	53,117	44,827	8,290
జనగామ	80,864	54,179	44,449	9,730
మహ-బాద్	56,775	38,039	25860	12,179
భూపాలపల్లి	51,620	34,585	24,391	10,194
ములుగు	1,01,188	67,796	52,577	15,219
మొత్తం	4,26,576	2,85,972	2,21,268	64,702

2023-24 యాసంగిలో సీఎంఆర్ వివరాలు (మెట్రిక్ టన్నుల్లో)

జిల్లా	మిల్లర్లకు ధాన్యం	సీఎంఆర్	మిల్లర్లు ఇచ్చింది	సీఎంఆర్ పెండింగ్
వరంగల్	1,04,133	70,588	32,444	38,144
హనుమకొండ	1,37,820	93,457	42,684	50,773
జనగామ	1,42,806	97,018	54,025	42,983
మహ-బాద్	31,103	21,150	13,804	7,340
భూపాలపల్లి	57,683	39,182	18,444	20,170
ములుగు	43,429	29,097	5,336	23,761
మొత్తం	5,16,974	3,50,492	1,66,737	1,83,171

రేషన్ రీసైక్లింగ్‌తో సీఎంఆర్‌కు..

సీఎంఆర్ విధానంలో భారీగా అక్రమాలు జరుగుతున్నాయనే ప్రచారం జరుగుతోంది. ధాన్యం తీసుకున్న మిల్లర్లు గడువులోపు మరాడించి బియ్యాన్ని అప్పగించాల్సి ఉన్నా కొందరు మిల్లర్లు ప్రభుత్వ ధాన్యంతో అక్రమ వ్యాపారం చేస్తున్నారనే చర్చ జరుగుతోంది. ప్రభుత్వం నుంచి తీసుకున్న ధాన్యాన్ని మిల్లర్లు మరాడించి, ఆ బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలించి వ్యాపారం చేస్తున్నారని తెలుస్తోంది. ఇటీవల దాడుల్లో బియ్యం పక్కదారి కేసులో అధికంగా వెలుగులోకి వస్తున్నాయి. రూపాయి పెట్టుబడి లేకుండా మిల్లర్లు లక్షల్లో దందా సాగిస్తున్నారు. ఒకవేళ నిర్ణీత కాలంలో బియ్యం అప్పగించాలని అధికారులు ఒత్తిడి చేస్తే రేషన్ బియ్యాన్నే రీసైక్లింగ్ చేసి అప్పగిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. అధికార పార్టీ నేతలు, అధికారుల అండతో కొందరు మిల్లుల నిర్వాహకులు డీలర్లు, దళారుల వద్ద కిలో రూ.10 నుంచి రూ.12 వరకు కొనుగోలు చేసి, వాటికి పాలిష్ చేసి సీఎంఆర్ అప్పగిస్తున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే ధాన్యాన్ని మరాడించి బయట మార్కెట్‌లో కిలో రూ.20 నుంచి రూ.25 వరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్న మిల్లర్లు.. రేషన్ బియ్యాన్ని గ్రామాల్లో వివిధ రూపాల్లో రూ.10కి కొనుగోలు చేసి రీసైక్లింగ్‌తో ప్రభుత్వానికి అప్పగిస్తూ రూ.లక్షల్లో అక్రమార్జనకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



అద్భుతాల నెలవు..

- పర్యాటక ప్రాంతాల కూడలి ఓరుగల్లు
- కాకతీయ కాలం నాటి ఆలయాలు.. రమణీయ ప్రకృతి ప్రదేశాలు సొంతం
- ఏటా లక్ష మందికిపైగా సందర్శకుల రాక
- అయినా పర్యాటకాభివృద్ధికి చర్యలు అంతంత మాత్రమే
- నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం



చారిత్రక వారసత్వ సంపద.. అద్భుత శిల్పకళతో అలరారుతూ ఆధ్యాత్మికత తొణికిసలాడే పురాతన ఆలయాలు.. ప్రకృతి రమణీయ అరణ్యాలు.. మైమరిపింపజేసే జలపాతాలు ఉమ్మడి వరంగల్ జిల్లా సొంతం. ఎన్నో అద్భుతాలకు నెలవైన ఓరుగల్లు.. వెయ్యేళ్లకు పైగా చరిత్రకు సాక్ష్యంగా, ఇంజనీరింగ్ నైపుణ్యానికి నిదర్శనంగా ఉన్న కాకతీయ కట్టడాలు, సుందర సరస్సులు, అందమైన చెరువులను సిగలో దాచుకుంది. దట్టమైన అడవుల్లో కొండల మధ్య కనువిందు చేసే జలపాతాలే కాదు.. ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప ఆలయం, ఆ అడవి మధ్యన కొలువైన సమ్మక్క, సారక్కల క్షేత్రం నుంచి రాష్ట్ర రెండో రాజధాని స్థాయిలో అభివృద్ధి చెందుతున్న ట్రైసిటీలోని వేయి స్తంభాల గుడి, భద్రకాళి ఆలయాల వరకూ అన్నీ అద్భుతాలే దర్శనమిస్తాయి. వీటిని తిలకించి తరించేందుకు ఏటా లక్ష మందికిపైగా వస్తుంటారు. ఇంతలా పర్యాటకంగా ఆకట్టుకుంటున్న ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వాలు తీసుకుంటున్న చొరవ మాత్రం అంతంతమాత్రమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



\- హనుమకొండ

వివరాలు 7లో..



ఐలమ్మ జయంతి సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

ఐలమ్మ పోరాటాన్ని నేటి తరం స్ఫూర్తిగా తీసుకోవాలి

- చాకలి ఐలమ్మ జయంతి కార్యక్రమంలో పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- నివాళులర్పించిన ఎంపీ, మేయర్, కలెక్టర్లు

న్యూశాయంపేట, సెప్టెంబర్ 26: ఐలమ్మ పోరాటాన్ని నేటి మహిళలు స్ఫూర్తిగా తీసుకుని, ప్రజాసమస్యలపై స్పందించాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా గురువారం న్యూశాయంపేట జంక్షన్‌లోని ఐలమ్మ విగ్రహం వద్ద నిర్వహించిన అధికారిక వేడుకలకు ఎంపీ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్.నాగరాజు, మేయర్ గుండు సుధారాణి, హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు ప్రావీణ్య సత్య శారదాదేవి హాజరై ఐలమ్మకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ.. గడీలలో గడ్డి మొలవాలనే చాకలి ఐలమ్మ నినాదాన్ని ఆదర్శంగా తీసుకుని తమ ప్రభుత్వం ముందుకెళుతోందన్నారు. భూమి, భుక్తి కోసం రజాకార్లపై రైతాంగ సాయుధ పోరాటాలు చేసి ప్రపంచానికి ఆదర్శంగా నిలిచి న ఘనత ఐలమ్మకు దక్కిందన్నారు. నాటి తన పోరాట పటిమ నేటితరానికి ఆదర్శమన్నారు. గత పాలకులు ఐలమ్మను చిన్నచూపు చూశారని, తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆమె సేవలకు గౌరవంగా హైదరాబాద్‌లోని కోఠి మహిళా వర్సిటీకి ఐలమ్మ పేరు పెట్టామని, ఆమె మనవరాలు శ్వేతను రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలిగా నియమించామన్నారు. ఎంపీ కడియం కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, మేయర్ గుండు సుధారాణిలు ఐలమ్మ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతు ల సంక్షేమ శాఖ ఉప సంచాలకులు జి.రాం రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలరాజు, హనుమకొండ ఆర్‌డీవో వెంకటేష్, 31వ డివిజన్ కార్పొరేటర్ మామిండ్ల రాజు, కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు కుసుమ శ్యాంసుందర్, రజక సంఘం నాయకు లు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పులి గుట్ట భూమిని సర్వే చేయండి

- హద్దులు గుర్తించి ఫెన్సింగ్ పెట్టండి
- కబ్జాలుంటే తొలగించండి
- ఆర్డీవో, తహసీల్దార్‌కు కలెక్టర్ ప్రావీణ్య ఆదేశాలు

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

హనుమకొండ టౌన్, సెప్టెంబర్ 26: హనుమకొండ హంటర్‌రోడ్డులో సైన్స్ సెంటర్ నిర్మించిన పులిగుట్ట భూములను సర్వే చేయాలని హనుమకొండ ఆర్డీవో వెంకటేశ్, తహసీల్దార్ కర్ర శ్రీపాల్‌రెడ్డిని కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. సైన్స్ సెంటర్ భూమలు స్వాహా' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో గురువారం ప్రచురితమైన కథనానికి కలెక్టర్ ప్రావీణ్య స్పందించారు. సర్వే నెంబర్ 964, 966 నెంబర్లలో ఉన్న 49 ఎకరాల ప్రభుత్వ భూమిని సత్వరమే గుర్తించి హద్దులు పెట్టాలని ఆదేశించడంతో వెంటనే సర్వే ప్రారంభించి హద్దులు ఏర్పాటు చేస్తామని ఆర్డీవో వెంకటేశ్, తహసీల్దార్ శ్రీపాల్‌రెడ్డి వెల్లడించారు. కాగా, 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే కాకుండా రాష్ట్రస్థాయిలో చర్చనీయాంశమైంది. ప్రభుత్వం కూడా కబ్జారాయుళ్లపై సీరియస్‌గా ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో ఈ కబ్జాపర్వంలో సహకరించిన మాజీ ఎమ్మెల్యేలు, అధికారులతో పాటు తాజా, మాజీ కార్పొరేటర్లు, గత ప్రభుత్వ హయాంలో నాయకులుగా చెలామణి అయిన వారు, కబ్జా చేసిన వారు హడలిపోతున్నారు. ఇక కబ్జాదారుల మాటల నమ్మి డబ్బులు అప్పగించి నిర్మాణాలు చేసుకున్న వ్యక్తులు ఆందోళన చెందుతున్నారు. కబ్జాదారులకు ఫోన్లు చేసి తమ భూమి పోతే మాత్రం మీరే బాధ్యులంటూ హెచ్చరించినట్టు సమాచారం.



దీంతో కబ్జాదారులు తమ పలుకుబడిని ఉపయోగిస్తామని, ఎలాంటి ఇబ్బంది ఉండదని వారికి హామీ ఇచ్చినట్టుగా ప్రచారం జరుగుతోంది. గురువారం నగరంలో ప్రజలు 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ఆసక్తిగా చదవగా.. నలుగురు ఎక్కడ కలిసినా పులిగుట్ట కబ్జా గురించి చర్చించుకోవడం కనిపించింది. కొన్నేళ్లుగా రాజకీయాన్ని అడ్డుపెట్టుకొని కబ్జాపర్వానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ వినిపిస్తోంది.



కమిషనరేట్‌లో జరిగిన నేర సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

రౌడీ షీటర్లపై కఠినంగా వ్యవహరించాలి

- బాధితులకు సత్వరమే న్యాయం అందించండి
- ప్రజావాణి ఫిర్యాదులపై స్పందించాలి
- నేర సమీక్షలో పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం, సెప్టెంబరు 26: రౌడీషీటర్లపై కఠినంగా వ్యవహరించాలని, పోలీస్‌స్టేషన్‌లకు వచ్చే బాధితులకు చట్టాలకు లోబడి న్యాయం అందించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అధికారులకు సూచించారు. గురువారం హనుమకొండలోని కమిషనరేట్ కార్యాలయంలో నేర సమీక్షా సమావేశం జరిగింది. స్టేషన్‌ల వారిగా పెండింగ్ కేసుల వివరాలు, కేసుల పురోగతి వివరాలు సీపీ సమీక్షించారు. అనంతరం అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ.. ప్రస్తుతం అందుబాటులో ఉన్న టెక్నాలజీతో పాటు శాస్త్రీయ పద్ధతిని అనుసరిస్తూ కేసుల దర్యాప్తు చేపట్టాలన్నారు. దర్యాప్తులో ఉన్న కేసుల్లో వీలైనంతవరకు బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ప్రజావాణి, డీజీపీ కార్యాలయం నుంచి వచ్చే ఫిర్యాదులపై స్పందించాలని ఆయన సూచించారు. బాలికలు, మహిళల మిస్సింగ్ కేసులలో అలసత్వం వహించకూడదన్నారు. స్టేషన్‌ల పరిధిలో నిరంతరం కార్డన్‌సెర్చ్‌లు నిర్వహించాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టాలన్నారు.

ఈ సమావేశంలో డీసీపీలు షేక్ సలీమా, రాజ మహేంద్ర నాయక్, రవిందర్, అదనపు డీసీపీలు సంజీవ్, సురేష్‌కుమార్, ఏసీపీలు, ఇన్స్‌పెక్టర్లు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

యువత శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి

- ప్రొఫెసర్లు నారాయణ, వెంకయ్య
- కేయూలో పీడీఎస్‌యూ స్వర్ణోత్సవాలు



వర్సిటీలో ర్యాలీ తీస్తున్న పీడీఎస్‌యూ విద్యార్థులు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 26: యువతతో పాటు అందరూ శాస్త్రీయ దృక్పథంతో ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలని కాకతీయ యూనివర్సిటీ జంతుశాస్త్ర విభాగం ప్రొఫెసర్, కేయూ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ, కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్యలు పిలుపునిచ్చారు. గురువారం కేయూలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ నేతృత్వంలో 50వ స్వర్ణోత్సవ సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేయూ మొదటి గేటు నుంచి రెండో గేటు వరకు భారీ ప్రదర్శనలు చేపట్టారు. అనంతరం కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం సెమినార్ హాల్‌లో జరిగిన సభలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అలువాల నరేశ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులుగా హాజరైన కేయూ ప్రొఫెసర్లు ఈసం నారాయణ, వై.వెంకయ్య పాల్గొని మాట్లాడారు. దేశాభివృద్ధికి ప్రధాన ఆటంకంగా మారిన కులం, మతం, లింగం, ఆర్థిక అసమానతలను కూకటి వేళ్లతో పెకిలించాలని పిలుపునిచ్చారు. దోపిడీ, పీడన, అణచివేత లేని సమానత్వ సమాజ స్థాపనకు విద్యార్థులందరూ శాస్త్రీయ దృక్పథంతో కూడిన ప్రశ్నించేతత్వాన్ని, ప్రజాస్వామిక లక్షణాలను అలవర్చుకోవాలని అన్నారు. పీడీఎస్‌యూ యువతలో ప్రగతిశీల భావాలను నింపి సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటలను నిర్వహించిందని పేర్కొన్నారు. ప్రాశ్చాత్య సంస్కృతిలో యువతలో ప్రగతిశీల భావాలను లోపిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్, మారకద్రవ్యాలు, ధూమపానం, మద్యపానంలాంటి దురవాట్లకు బానిసలుగా మారుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. యువత నిండు జీవితాలను నాశనం చేసుకుని కన్న తల్లిదండ్రులను ఆశలను అవిరి చేస్తున్నారని వివరించారు. దేశంలో విద్యారంగంలో వస్తున్న మార్పులు దళిత, గిరిజన, అట్టడుగు పేద వర్గాలకు గొడ్డలిపెట్టుగా మారుతున్నాయని అన్నారు. దేశంలో ఉచిత, నాణ్యమైన కామన్ విద్యను అందించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కొఠారి కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని అన్నారు.

పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయకార్యదర్శి కంపాటి పృథ్వీ, పూర్వ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రవి, రాష్ట్రనాయకులు ముల్కా రవి, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీనరసింహరావు, జిల్లా నాయకులు వినయ్, సంగీత, స్వాతి పాల్గొని మాట్లాడారు. దేశంలో పేదరికం, నిరుద్యోగం, ఆకలి చావులు, వలసలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పీడీఎస్‌యూ 50 ఏళ్ల ప్రస్థానంలో విద్యారంగ సమస్యలతో పాటు సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలు చేసిందన్నారు. విద్యార్థుల్లో సమాజంలో ప్రగతిశీల నింపిందన్నారు సభ ప్రారంభంలో పీడీఎస్‌యూ విప్లవ విద్యార్థి అమరులైన జార్జిరెడ్డి, జంపాల చంద్రశేఖర్, ప్రసాద్, శ్రీహరి, బొమ్మ సాంబయ్య, కోలా శంకర్, దుస్స చేరాలు, రంగవల్లి, మధు సూదన్, రాజ్, వరహాలు, రమణయ్య, చాంద్ పాషా, మారోజు వీరన్నలాంటి అమరవీరులకు స్మరిస్తూ మౌనం పాటించి నివాళులర్పించారు.

29న ఉమ్మడి జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, సెప్టెంబరు 26: వరంగల్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 29న హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం (జేఎన్‌ఎస్)లో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి బాల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వీరన్న ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్స్ బాలబాలికల విభాగంలో నిర్వహించనున్న జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు అక్టోబరు 4 నుంచి 6వరకు కామారెడ్డిలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన క్రీడాకారులు తమ ఒరిజినల్ ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రం వెంట తీసుకొని ఈనెల 29న ఉదయం 8గంటలకు జేఎన్‌లోని బాడ్మింటన్ కోర్టులో రిపోర్టు చేయాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్ 9849201467 నెంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు సురేష్



సమావేశంలో మాట్లాడుతున్న దాసు సురేష్

కాళోజీ జంక్షన్, సెప్టెంబరు 26: బీసీలకు రాజ్యాధికారం కోసం ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు దాసు సురేష్ అన్నారు. ఆధిపత్య వర్గాలు పెత్తందారి విధానాలకు వ్యతిరేకంగా పోరాడిన దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, ప్రొఫెసర్ జయశంకర్, కొండా లక్ష్మణ్ బాపూజీల స్ఫూర్తితో బీసీలకు రాజ్యాధికారం సాధిస్తామని తెలిపారు. బీసీల ఉద్యమాన్ని రాజ్యాధికారం దిశగా పయనింపచేసేందుకు హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో గురువారం నిర్వహించిన బీసీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వరంగల్‌లో త్వరలోనే బీసీల భారీ బహి రంగ సభ నిర్వహించేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నట్లు ఆయన తెలిపారు. కామారెడ్డి డిక్లరేషన్ ద్వారా బీసీల హక్కులను గుర్తించిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడిచినప్ప టికీ ఇంతవరకు అమలు చేయకపోవడం బీసీలకు తీవ్ర నిరాశను కలిగించిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బీసీల హక్కుల కోసం పోస్టు కార్డు ఉద్యమాలు, నిరాహార దీక్షలు, ర్యాలీలు, మహా ధర్నాలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నట్లు ఆయన వివరిం చారు. తెలంగాణ ఉద్యమానికి కేంద్ర బిందువైన వరంగల్ నుంచే ఉద్యమాన్ని ప్రారంభించి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో కుల సంఘాలు, విద్యార్థి సం ఘాలు, ఉద్యమ సంఘాలను సమీకరించి ఉద్యమాన్ని తీవ్రం చేయ నున్నట్లు, బీసీ ఎమ్మెల్యేలు ఇకనైనా కళ్లు తెరిచి బీసీలు కోరుతు న్నట్లుగా రాష్ట్రంలో కులాల జనగణనకు మద్దతు తెలుపాలని కోరారు. ఈ కార్యక్ర మంలో బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దారం జనార్దన్, ఉమ్మడి వరంగల్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బుట్టి శ్యాం యాదవ్, ప్రొఫెసర్ తిరునహరి శేషు, ఆల్ ఇండియా ఓబీసీ జాక్ ఛైర్మన్ సాయిని నరేందర్, బీసీ సంక్షేమ సంఘం మహిళా అధ్యక్షురాలు కవిత పాల్గొన్నారు.

విదేశాల్లో ఉద్యోగాలకు దరఖాస్తులు

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 26: విదేశాల్లో ఉద్యోగావకాశాల కోసం టామ్‌కామ్ నిర్వహిస్తున్న ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమంలో దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా జిల్లా ఎంప్లామెంట్ ఆఫీసర్ సీహెచ్.ఉమారాణి గురువారం ఒక ప్రకటనలో కోరారు. శుక్రవారం ములుగురోడ్‌లోని ప్రభుత్వ బాలుర ఐటీఐలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని ఆసక్తిగల, అర్హతగల వారు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. గల్ఫ్‌దేశాలతో పాటు ఆస్ట్రేలియా, కెనడా, జర్మనీ, హంగేరీ, జపాన్, పోలండ్, రుమేనియా యూకే లాంటి దేశాల్లో ఉద్యోగాలు చేసేందుకు టామ్‌కామ్ అవకాశం కల్పిస్తుందని పేర్కొన్నారు. ఐటీఐ, డిప్లొమా, ఇంజనీరింగ్ పూర్తి చేసి కనీసం రెండు నుంచి నాలుగేళ్ల అనుభవం ఉండి 20 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్కులు ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చునని తెలిపారు. పూర్తి వివరాలకు 9985483931/ 7995957779/ 7893566493 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఎంజీఎం సూపరింటెండెంట్‌గా మురళి

- కేఎంసీ ప్రిన్సిపాల్‌గా రామ్‌కుమార్‌రెడ్డి
- ములుగు వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా మోహన్‌లాల్



మురళి



రామ్‌కుమార్‌రెడ్డి

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 26: ఎంజీఎం సూపరింటెండెంట్‌గా డాక్టర్ సీహెచ్.మురళికి పూర్తి అదనపు బాధ్యతలు కేటాయిస్తూ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కుటుంబ సంక్షేమశాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జడ్ చోంగ్తూ జీవో ఆర్‌టీ నెం బరు 562ను విడుదల చేశారు. డాక్టర్ మురళి జూలై 23న డాక్టర్ చంద్రశేఖర్ బదిలీపై వెళ్లిన సమయంలో సూపరింటెండెంట్‌గా చార్జి తీసుకున్నారు. అప్పటి నుంచి ప్రభుత్వ ఉత్తర్వుల కోసం వేచి చూశారు. అదేవిధంగా కాకతీయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ రామ్ కుమార్‌రెడ్డి నియమితులయ్యారు. హను మకొండలోని టీబీ, ఛాతివ్యాధుల ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ పి.సునీత నియమితులయ్యారు. ములుగు జిల్లాలోని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సి పాల్‌గా డాక్టర్ బి.మోహన్‌లాల్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర వైద్య విద్యా సంచాలకులు ఆర్‌సీ నెంబరు 41208/డి-1/2024ను విడుదల చేసింది.





వేడుకల్లో ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు

ఉత్కర్ష వేడుకలతో సందడిగా కేఎంసీ

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 26: కాకతీయ వైద్య కళాశాల వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న ఉత్కర్ష-24 వేడుకల్లో భాగంగా ఆరోరోజు అయిన గురువారం ట్రెజర్ హంట్ నిర్వహించారు. ఇందులో విద్యార్థులు నిధి కోసం సమూహాలుగా ఏర్పడి ఉత్సాహంగా పాల్గొన్నారు. సాయంత్రం ఫ్యాషన్ షో ఏర్పాటు చేయగా, వైద్య విద్యార్థులు వివిధ వేషాధారణలో సందడి చేశారు. డీజే పాటలతో ఉత్సాహంగా నృత్యాలు చేసి వైద్య విద్యార్థులు అలరించారు.


అద్భుతాల నెలవు..

● పర్యాటక ప్రాంతాల కూడలి ఓరుగల్లు ● నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం

హనుమకొండ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి రమణీయ ప్రదేశాలు.. సుప్రసిద్ధ ఆలయాలు.. చారిత్రక వారసత్వ సంపద కలగలిసిన ఉమ్మడి వరంగల్‌జిల్లా రాష్ట్రంలోనే ప్రముఖ పర్యాటక కేంద్రాలకు నిలయంగా పేరొందింది. వెయ్యేళ్లకు పైగా చరిత్రకు సాక్ష్యంగా, ఇంజనీరింగ్ నైపుణ్యానికి నిదర్శనంగా ఉన్న కాకతీయ కట్టడాలు, అబ్బురపరిచే శిల్ప సౌందర్యంతో అలరారే ఆలయాలు, సుందర సరస్సులు, అందమైన చెరువులెన్నో ఓరుగల్లు సిగలో మణిహారాలుగా ఉన్నాయి. దట్టమైన అడవుల్లో కొండల మధ్య నిండుకుండల్లా కనువిందు చేసే రామప్ప, లక్నవరం, పాకాల, గణపురం, ధర్మసాగర్, కటాక్షపురం, భద్రకాళి చెరువులతో కూడిన ఎకో టూరిజం ఓవైపు, గోదావరి పరీవాహక ప్రాంతంలోని తాడ్వాయి, ఏటూరునాగారం అభయారణ్యం (టైగర్ పార్క్) మొదలుకొని పాకాల సరస్సు పరిసర ప్రాంతాల్లోని అభయారణ్యం (జింకల పార్క్)లతో కూడిన గిరిజన ఆవాసాల ట్రైబల్ టూరిజయం మరోవైపు, ప్రాచీన చారిత్రకు కట్టడాలతో ముడిపడిన హెరిటేజ్ టూరిజం ఇంకోవైపు సందర్శకులకు కనువిందు చేస్తాయి. ఇలాంటి జీవ వైవిధ్య పర్యాటకం ఒక్క వరంగల్ జిల్లాకే సొంతం. కాకతీయు చరిత్ర, నాటి వైభవాన్ని చాటే వరంగల్ కోట, వేయిస్తంభాల గుడి, రామప్పగుడి, కోటగుళ్లు, జఫర్‌గడ్ కోట, భద్రకాళి దేవాలయం, ఐనవోలు, పాలకుర్తి, మల్లూరు ఆలయాలు, పాండవులగుట్టలోని రాక్ పెయింటింగ్ తదితర పర్యాటక ప్రాంతాలు సందర్శకులను కట్టిపడేస్తాయి. శుక్రవారం ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని పర్యాటక ప్రదేశాలు, వాటి అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలపై ప్రత్యేక కథనం. అయితే ప్రభుత్వం ఈ పర్యాటక ప్రాంతాలను చూసేందుకు వచ్చేవారి వసతి కోసం రూ.88 కోట్ల వ్యయంతో రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో హరిత హటళ్లను నిర్మించింది.

ఎన్నో ఆధ్యాత్మిక ఆనవాళ్లు..

యునెస్కో గుర్తింపుపొందిన రామప్ప ప్రపంచ వారసత్వ సంపదగా ఉమ్మడి వరంగల్ ఖ్యాతిని మరింత ఇనుమడింపజేసింది. ములుగు జిల్లా కేంద్రానికి 15కి.మీ. దూరంలో వెంకటాపూరం మండలం పాలంపేట గ్రామంలో ఉన్న ఈ ఆలయం కాకతీయ అపురూప శిల్పకళావైభవానికి ప్రతీకగా నిలిచింది. ఆలయం ఎదురుగా ఉన్న నంది జగత్ప్రసిద్ధమైంది. రామప్ప ఆలయాన్ని అనుకొని సరస్సు ఉండటంతో ప్రకృతి సోయగాలు పర్యాటకుల సొంతమవుతున్నాయి. సకల దేవుళ్ల సాక్షాత్కారం. శివకేశం సమారాధనగా, భూలోక్కైలాసంగా ఏకకూట ఆలయంగా నిర్మించడం ఇక్కడి విశిష్టత. కాకతీయుల నాటి అద్భుత నిర్మాణంగా.. హనుమకొండ నడిబొడ్డున ఉన్న శ్రీ రుద్రేశ్వర స్వామివారి వేయిస్తంభాల గుడి భాసిల్లుతోంది. క్రీశ.1163లో కాకతి రుద్రమ దేవుడు నిర్మించిన ఈ త్రికూటాలయంలోని ఎత్తైన పానవట్టంపై వేంచేసిన శివలింగం నుంచి మండప నిర్మాణం, జీవం ఉట్టిపడేలా కనిపించే నందీశ్వరుడి విగ్రహం వరకూ అన్నీ అద్భుతాలే. ఇక ఓరుగల్లు ప్రజలకు ఇలవేల్పుగా విరాజిల్లుతున్న భద్రకాళి దేవాలయాన్ని క్రీస్తుశకం 10వ శతాబ్దంలో ఎర్ర భూపాలుడు నిర్మించాడు. భద్రేశ్వరీ అనే మరో పేరు కూడా భద్రకాళి దేవికి పూజలందుకుంటున్నారు. దేశంలోని ప్రసిద్ధ దేవాలయల్లో ఒకటిగా శక్తిపీఠంగా ప్రసిద్ధి చెంది.. ఒక పక్క చెరువు, మరో పక్క కొండలు, ఆహ్లాదకరమైన వాతావరణం మధ్య నిత్య ధూప, దీప నైవేద్యాలతో కీలక ఉత్సవాలతో ఈ ఆలయం వెలుగొందుతోంది. హనుమకొండలోని మరో దర్శనీయ స్థలం పద్మాక్షి దేవాలయం. కాకతీయరాజుల మూల పురుషుడు మాధవ వర్మ క్రీశ 4వ శతాబ్దిలో తమ ఆరాధ్య దేవతైన పద్మాక్షికి ఆలయాన్ని దీనిని నిర్మించాడు. చుట్టూ ఎత్తైన కొండలు, ప్రకృతి అందాలతో ఈ ప్రాంతం అలరారుతోంది. ఈ గుడికి దగ్గరలోనే మహిమాన్వితమైన ప్రాచీన సిద్ధేశ్వరాలయం, జైనతీర్థంకులు కొలువుదీరిన అగ్గలయ్య గుట్ట ఉంది. ఇటీవలే దీనిని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దారు. వీటితో పాటు హనుమకొండ జిల్లా కేంద్రం నుంచి సుమారు 15 కి.మీ. దూరంలో ఉన్న కాకతీయుల కాలం


భద్రకాళి బండ్


మేడారంలోని వనదేవతల గద్దెల ప్రాంగణం

నాటి మరో ఆలయం ఐనవోలు మల్లికార్జునస్వామి దేవాలయం. ప్రతీ ఏటా సంక్రాంతి నుంచి ఉగాది వరకు మహాజాతర జరగడం ఇక్కడి ప్రత్యేకత. క్రీ.శ 11వ శతాబ్దంలో ఈప్రాంతాన్ని పాలించిన త్రిభువనమల్లుడి కాలంలో ఈ ప్రాంతాన్ని అయ్యనవోలు అని పిలిచేవారని, అందుకే దీనికి ఐనవోలు అని పేరొచ్చినట్టు శాసనాలు చెబుతున్నాయి. కాకతీయుల సామంతుడైన అయ్యన మంత్రి ఈ ఆలయాన్ని కట్టించాడు. ములుగు జిల్లా మంగపేట మండల కేంద్రానికి ఒక కిలోమీటర్ దూరంలోని మల్లూరులోని హేమాచల కొండపై వేంచేసిన లక్ష్మీనరసింహుడు ఉగ్రరూపంలో ఉన్న అర్చామూర్తిగా పూజలందుకుంటున్నాడు. ఐదు దశాబ్దాల కిందట దీపకర్ణి అనే రాజు ఈ ఆలయాన్ని నిర్మించగా త్రేతాయుగం నుంచి ప్రాచీన పుణ్యక్షేత్రంగా భాసిల్లుతోంది. ఈ ఆలయాన్ని ఆనుకొని కైరన్‌లనే ప్రాచీన సమాధాలున్నాయి. వీటితో పాటు మహబూబాబాద్‌లోని కురవి వీరభద్రస్వామి ఆలయం, అనంతారంలోని శ్రీ వెంకటేశ్వరాలయం, కందగిరిలోని శ్రీ లక్ష్మీనర్సింహాస్వామి ఆలయం, నర్సింహులపేటలోని ఇంద్రకీలాద్రి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం, జనగామ జిల్లాలోని చిలుపూరుగుట్ట శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం, ఖిలాషాపూర్‌లోని సర్వాయి పాపన్న కోట, పాలకుర్తిలోని శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆలయం, జఫర్‌గడ్ ఖిలా, బచ్చన్నపేట మండలం కొడవటూరులోని సిద్ధేశ్వరాలయం మొదలైన దర్శనీయ ప్రాంతాలున్నాయి.

గిరిజన తల్లుల కొలువు.. మేడారం


ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర జరిగే సమ్మక్క సారలమ్మలు కొలువు దీరిన మేడారానికి పర్యాటకుల రాక పెరుగుతోంది. ములుగు జిల్లా కేంద్రానికి 45 కి.మీ. దూరంలో తాడ్వాయి మండల కేంద్రానికి 16కి.మీ. దూరంలో మారుమూల అభయారణ్యంలో ఉన్న ఈ సమ్మక్క సారలమ్మ గద్దెలను రెండేళ్లకోసారి జరిగే జాతర సమయంలో కోటి మందికిపైగా భక్తులు వస్తుండగా.. ప్రస్తుతం సెలవు రోజుల్లో వేలాది మంది దర్శించుకుంటున్నారు. ఇక్కడకొచ్చే పర్యాటకుల కోసం గద్దెలకు సమీపంలోనే పర్యాటక శాఖ హరితహోటల్‌ను నిర్మించింది.

అద్భుత దర్శనీయ ప్రాంతాలు ఉమ్మడి జిల్లా సొంతం

ఉమ్మడి జిల్లాలోని ప్రఖ్యాత పర్యాటక ప్రాంతం ఓరుగల్లు కోట. 12,546 అడుగుల వైశాల్యంతో చుట్టూ ఎత్తైన ఏడు ప్రాకారాలతో 77 బురుజులతో కాకతీయ రాజు రుద్రదేవుడి కాలంలో నిర్మితమైంది. 800 ఏళ్లు అవుతున్నా- కోట ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉంది. ఈ కోటలోని నాలుగు కీర్తితోరణాలు కాకతీయరాజుల ప్రాభవానికి నిలువెత్తు ప్రతీకలుగా దర్శనమిస్తాయి. కోటలో అద్భుతమైన శిల్ప సంపద కనిపిస్తుంది. కోటలోని స్వయం భూ దేవాలయం కాకతీయుల కాలంలో నిర్మించిందే. పర్యాటకుల సందర్శనార్థం కోట మధ్య కాలంలో ప్రతీరోజు కాకతీయుల చరిత్రను తెలియచెప్పే సౌండ్ అండ్ లైట్ షోను ప్రదర్శిస్తున్నారు. కోటలోని గుండు చెరువులో బోటింగ్ సౌకర్యం ఉంది. ములుగు జిల్లా కేంద్రానికి 22 కి.మీ. దూరంలో గోవిందరావుపేట మండలంలోని చల్వాయికి సుమారు 7 కి.మీ.(బుస్సాపూర్) దూరంలో ఉన్న లక్నవరం సరస్సు కూడా చూడదగ్గర ప్రదేశం. వేలాడే వంతెన, సరస్సులో బోటింగ్ ఇక్కడి ప్రత్యేకతలు. ఒక రోజు బస చేయడానికి వీలుగా హరిత హోటల్ ఉంది. ఇదే ములుగు జిల్లా కేంద్రానికి 65 కి.మీ. దూరంలో వాజేడు మండలంలో దట్టమైన అడవి లో పచ్చదనాన్ని అల్లుకొని నీటి హొయలతో హోరెత్తించే బొగత జలపాతం వానాకాలంలో పర్యాటకులను ఆకర్షిస్తోంది. వేసవిలో కళతప్పుతూ.. వానాకాలంలో ఉప్పొంగుతూ.. సహజ అందాలను పంచుతోంది. ఇది సినిమా షూటింగ్‌లు, షార్ట్ ఫిల్మ్‌ల చిత్రీకరణకు అనువైన ప్రాంతం కూడా. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రానికి సుమారు 30 కి.మీ. దూరంలో పరకాల-భూపాలపల్లి రోడ్డులో రేగొండ మండలం తిరుమలగిరి శివారులో పాండువుల గుట్టలున్నాయి. పాండువులు దుర్యోధనుడి కంట పడకుండా కొంత కాలం అజ్ఞావవాసం చేశారని చెప్పుకొనే పాండవుల గుట్టలపై క్రీస్తుపూర్వం 8వేల ఏళ్ల నాటి అపురూప రేఖా చిత్రాలు ఉన్నాయి. ఈగుట్టల శ్రేణిలోనే బుగులు వేంకటేశ్వర స్వామి ఆలయం కూడా ఉంది.


పర్యాటకాభివృద్ధికి ప్రణాళికేదీ?

ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ఇప్పటి వరకు సమగ్రమైన ప్రణాళిక అమల్లోకి రాలేదు. గత ప్రభుత్వం పెద్దగా తీసుకున్న చర్యలు కూడా ఏమీ లేవు. కేంద్ర ప్రభుత్వమే ఎకో, ట్రైబల్ టూరిజాన్ని ప్రోత్సహించేందుకు రూ.90కోట్లను విడుదల చేసింది. ఈ నిధులతోనే గిరిజన, అటవీ ప్రాంతాల్లో ట్రైబల్ టూరిజాన్ని అభివృద్ధి చేశారు. స్మార్ట్ సిటీ నిధులతో వరంగల్ నగరంలోని భద్రకాళి చెరువు, జైన క్షేత్రమైన అగ్గలయ్య గుట్ట, కాజీపేటలోని దర్గా తదితర ప్రదేశాలను అభివృద్ధి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆశించినమేర నిధులు ఇవ్వడం లేదన్న విమర్శలున్నాయి. పర్యాటక ప్రాంతాల సందర్శనకు ఏటా ఉమ్మడి వరంగల్‌కు లక్ష మందికిపైగా దేశ, 15వేల మందికిపైగా విదేశీ సందర్శకులు వస్తుంటారు.


రామప్ప ఆలయం


కాకతీయుల కోటలోని కళాతోరణం


లక్నవరం చెరువు


చిల్పూర్ ఆలయం

విద్యాసంస్థల్లో యువ టూరిజం క్లబ్‌లు

పర్యాటకంపై అవగాహనే లక్ష్యంగా నిర్వహణకు ఏర్పాట్లు

జనగామ కల్చరల్, సెప్టెంబరు 25: సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడేందుకు, పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసింది. విద్యార్థులకు, యువతకు పర్యాటకంపై అవగాహన కల్పించేందుకు 'యువ టూరిజం క్లబ్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో నిర్వహించే ఈ క్లబ్‌లు పర్యాటక రంగానికి సంబంధించిన వివిధ అంశాలపై దృష్టి సారిస్తాయి. ఈ క్లబ్‌లలో 7వ తరగతి నుంచి కళాశాలలో చదివే అంటే 12వ తరగతి విద్యార్థుల వరకు సభ్యులుగా ఉంటారు. ప్రతీ క్లబ్‌కు ఒక విద్యార్థి నాయకుడిగా, ఒక ఉపాధ్యాయుడు సమన్వయకర్తగా నాయకత్వం వహిస్తారు. అన్ని పాఠశాలలు ఆన్‌లైన్ ద్వారా ytc.tourism.gov.in/club.rigistration వెబ్‌సైట్‌లో తమ పాఠశాల యువ టూరిజం క్లబ్ వివరాలజూజీ రిజిస్టర్ చేసుకొని సర్టిఫికెట్ పొందాలి.

యువ టూరిజం క్లబ్‌ల లక్ష్యాలివీ..

దేశంలోని ముఖ్యంగా రాష్ట్రంలోని విభిన్న సంస్కృతులు, భౌగోళిక పరిస్థితుల గురించి విద్యార్థులకు, యువతకు అవగాహన కల్పించడం. పర్యాటకం, పర్యావరణం, ప్రకృతి పట్ల స్నేహం, ప్రయాణ మనస్తత్వాన్ని నేటి యువతలో పెంపొందిస్తాయి. యువత మరియు రాబోయే తరానికి పర్యాటక ప్రాముఖ్యతను వివరిస్తూ దేశంలోని అనేక కళలు, సాంస్కృతిక రూపాల ప్రశంసలకు దోహదపడే విభిన్న కార్యకలాపాలను చేపడతాయి. అలాగే పర్యాటకం, తెలంగాణ సాంస్కృతిక వారసత్వ పరిరక్షణకు సంబంధించిన కార్యక్రమాల్లో పాలుపంచుకుంటాయి. విద్యార్థులతో తమ ప్రాంత పర్యాటకాన్ని ప్రచారం చేయించడాన్ని కూడా ఈ క్లబ్‌ల బాధ్యతగా తీసుకుంటాయి.

పర్యాటకంపై అవగాహన కల్పించడమే లక్ష్యం

కె.రాము, డీఈవో, జనగామ



ప్రభుత్వ విద్యనభ్యసించే విద్యార్థులకు పర్యాటకంపై అవగాహన కల్పించే లక్ష్యంతో యువ టూరిజం క్లబ్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం సమాయత్తమైంది. 7వ తరగతి నుంచి 12వ తరగతి చదివే విద్యార్థులు ఈ క్లబ్‌లో సభ్యులుగా ఉంటారు. బాలురు, బాలికల ప్రాతినిధ్యం సమానంగా ఉండాలి. దీనికి ఒక ఉపాధ్యాయుడు ఇన్‌చార్జ్‌గా ఉంటాడు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బాధ్యతగా క్లబ్‌లను ఏర్పాటు చేస్తారు.

కోకరిక్యులర్ యాక్టివిటీగా క్లబ్‌ల నిర్వహణ

బొమ్మనబోయిన శ్రీనివాస్, జిల్లా గుణాత్మక విద్య సమన్వయ అధికారి, జనగామ



ప్రభుత్వం విద్యార్థులకు కోకరిక్యులర్ యాక్టివిటీగా క్లబ్‌లను ఏర్పాటు చేయాలని నిర్దేశించింది. ఇవి విద్యార్థుల్లో ఉత్సుకత, సాహసోపేత, సృజనాత్మకత, ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తాయి. ఫీల్డ్ ట్రిప్స్, విజ్ఞాన విహార యాత్ర, శాస్త్ర సాంకేతిక ఉన్నత విద్యా సంస్థల, చారిత్రక కట్టడాల సందర్శనలో ఈ క్లబ్‌లు తోటి విద్యార్థులకు మార్గదర్శనం చేస్తాయి.

క్లబ్‌ల అభివృద్ధికి సమర్థవంతంగా కృషి

బి.వెంకట్‌రెడ్డి, జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి, జనగామ



ప్రభుత్వం విద్యార్థులకు పర్యాటక రంగంపై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన ఈ క్లబ్‌ల అభివృద్ధికి కృషి చేస్తాం. విద్యార్థులకు, యువతకు సంస్కృతి, సంప్రదాయాలు, దేశంలోని విభిన్న సంస్కృతిపై అవగాహన కల్పిస్తూ కింది తరం వారికి ఈ క్లబ్‌ల ద్వారా సాంస్కృతిక వారసత్వాన్ని కల్పించనున్నారు.

మిల్లర్ల దొంగాట!

(5వ పేజీ తరువాయి)

సీఎంఆర్ పెండింగ్‌లో ఉన్నట్లుగా సమాచారం. మూడు సీజన్‌లకు సంబంధించి సుమారు 3లక్షల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ పెండింగ్‌లో ఉండటంతో పౌరసరఫరాల శాఖ అధికారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

అధికారుల దాడులతో అక్రమాలు వెలుగులోకి..

ఇటీవల ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, పౌరసరఫరాల శాఖ అధికారుల బృందాలు వేర్వేరుగా సీఎంఆర్ ఇవ్వని మిల్లర్లపై దాడులు నిర్వహిస్తున్నారు. దీంతో మిల్లుల్లో అక్రమంగా సీఎంఆర్ అమ్ముకోవటంతో పాటు రీసైక్లింగ్ దందా వెలుగులోకి వస్తోంది. ఇటీవల ఐనవోలు మండలం పున్నేలు గ్రామంలో నారాయణ ఆగ్రో ఇండస్ట్రీస్ 2022-23 రబీలో 4,298.200 టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కేటాయించింది. ఇందులో 2,922.776 టన్నుల బియ్యాన్ని ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉండగా, 1,345.535టన్నులు అప్పగించారు. మిగిలిన 1,577.246టన్నులను ప్రభుత్వానికి అప్పగించలేదు. ఈ మొత్తం బియ్యం 57,987బస్తాల్లో నిల్వ ఉండాలి, కానీ, మిల్లులో కేవలం 7,224 బస్తాలే ఉన్నాయి. మిగతా 50,763బస్తాల్లో రూ.7,12,40,546ల విలువైన బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించకుండా, బయట మార్కెట్‌లో అక్రమంగా అమ్ముకున్నట్లుగా సివిల్ సప్లయీస్ అధికారులు గుర్తించి కేసు నమోదు చేశారు. అలాగే మహబూబాబాద్ జిల్లా కురవి మండలం మొగిలిచర్ల గ్రామంలో శ్రీనవ్య రైస్‌మిల్లుపై గత శనివారం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. 2022-23కు సంబంధించిన 53,560 క్వింటాళ్ల వడ్లు మరాడించి 36,420క్వింటాళ్ల బియ్యాన్ని ఎఫ్‌సీఐకి అప్పగించాల్సి ఉంది. అయితే 8,871క్వింటాల్ మాత్రమే సీఎంఆర్ అప్పగించారు. వేరే చోట కొంత ధాన్యం చూపించినా ఇంకా రూ.8.37కోట్ల విలువైన 34,273 క్వింటాళ్ల ధాన్యం లేకపోవడంతో విజిలెన్స్ అధికారులు కేసు నమోదు చేశారు. ఇలా ఇటీవల కాలంలో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా దాడులు నిర్వహించి, మిల్లర్ల అక్రమాలను ప్రభుత్వం వెలుగులోకి తీసుకవస్తుంది. దీంతో ఇన్నాళ్లు సీఎంఆర్ ఇవ్వకుండా దొంగాటాడిన మిల్లర్లలో ఆందోళన వ్యక్తమవుతోంది.

ఇటీవల పలు మిల్లుల్లో జరిగిన దాడులు ఇలా..

- మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఎల్లంపేటలోని లక్ష్మీపారా బాయిల్డ్ రైస్ మిల్లుపై విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి రూ.6.49కోట్ల విలువైన ధాన్యం మరాడించి అమ్ముకున్నట్లుగా గుర్తిం చి కేసులు నమోదు చేశారు.
- హనుమకొండ జిల్లా ఎలకతుర్తి మండలం పెంచికలపేట గ్రామశివారులోని బాలాజీ పారాబయిల్డ్ ఇండస్ట్రీస్‌లో రూ.7.50కోట్ల విలువైన ధాన్యాన్ని మాయం చేసినట్లు గుర్తించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మిల్లు యాజమానిపై క్రిమినల్ కేసు నమోదు చేశారు.
- వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలో లక్ష్మీగణపతి ఇండస్ట్రీస్‌లో రూ.15.36కోట్ల ధాన్యాన్ని పక్కదారి పట్టించటంతో యాజమానిపై కేసు నమోదు చేశారు.
- జనగామ జిల్లా దేవురుప్పుల మండలం మచ్‌పహడ్ గ్రామంలోని శ్రీసాయిరాం బిన్నీ రైస్ మిల్లులో రూ.5.67కోట్ల ధాన్యాన్ని పక్కదారి పట్టించినట్లు గుర్తించి కేసులు నమోదు చేశారు.

తీరు మార్చుకోని నకిలీ వైద్యులు

టీజీఎంసీ అధికారుల తనిఖీలు

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 26: తెలంగాణ వైద్య మండలి అధికారులు, వరంగల్ యాంటీక్వాకరీ బృందం సభ్యులు వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో తనిఖీలు నిర్విహిస్తున్నా పలువురు నకిలీ వైద్యులు తీరు మార్చుకోవడం లేదు. ఐఎంఏ, హెచ్‌ఆర్‌డీఏ జిల్లా సభ్యులు డాక్టర్ వి.నరేశ్ కుమార్, డాక్టర్ వద్దిరాజు రాకేశ్, డాక్టర్ అన్వర్‌మియా, డాక్టర్ వెంకటస్వామి, డాక్టర్ అజిత్‌పాషాలు హనుమకొండలోని భీమారం, దీన్‌దయాల్‌నగర్ కాలనీ, వరంగల్‌లోని రామన్నపేట ప్రాంతాల్లో నకిలీ వైద్యులు ఆర్‌ఎంపీ, పీఎంఆపీ సెంటర్లపై గురువారం తనిఖీలు నిర్వహించారు. భీమారంలోని ఇందిరాగాంధీ విగ్రహం వెనుకాల శ్రీకళ ఫస్ట్ ఎయిడ్ సెంటర్ నిర్వాహకుడు నకిలీ వైద్యుడు గొర్రె నరేశ్, రాజ్ హోటల్ దగ్గర దీన్‌దయాల్‌నగర్ అభిరామ్ క్లినిక్ నిర్వాహకుడు నకిలీ వైద్యుడు ఈసంపల్లి మహేందర్, జనరల్ నర్సింగ్ చదివి వైద్యుడి వలె క్లినిక్ బోర్డు ఏర్పాటు చేసి అధిక మొతాదులో ఎలాంటి శాస్త్రీయత లేకుండా యాంటీబయాటిక్, స్టెరాయిడ్స్ ఇస్తున్నట్లు టీజీఎంసీ అధికారులు గుర్తించారు. రామన్నపేటలోని నకిలీ వైద్యుడు ఆర్‌ఎంపీ బి.జ్ఞానేశ్వర్, ఏఎన్‌ఎం చదివి డాక్టర్‌గా స్టెరాయిడ్స్, నొప్పి నివారణ ఇంజక్షన్లు, యాంటీబయోటిక్ ఇంజక్షన్లు, సెలైన్ బాటిల్స్ ఇస్తున్నట్లు గుర్తించి ఆధారాలను కౌన్సిల్‌కు పంపించారు. ఈ ముగ్గురు నకిలీవైద్యులపై ఎన్‌ఎంసీ 34, 54 ప్రకారం కేసులు నమోదు చేయనున్నట్లు టీజీఎంసీ అధికారి, పబ్లిక్ రిలేషన్ కమిటీ చైర్మన్ డాక్టర్ వి.నరేశ్‌కుమార్ తెలిపారు.

టాస్క్‌ఫోర్స్ కొరడా

రూ.8లక్షల సామగ్రి స్వాధీనం

వరంగల్ క్రైం, సెప్టెంబర్ 26: కాలం చెల్లిన బేకరి ఉత్పత్తులపై టాస్క్‌ఫోర్స్ కొరడా ఝుళిపించింది. ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వరంగల్‌లో సంతోష్‌కుమార్ నకిలీ బేకరి ఉత్పత్తులు విక్రయిస్తున్నారనే సమాచారంతో గురువారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న రూ.8లక్షల విలువైన 196 రకాల నకిలీ బేకరి ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు సంతోష్‌కుమార్‌ను విచారణ నిమిత్తం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రవికుమార్ తెలిపారు.

డిగ్రీ పరీక్షల ఫీజు గడువు పొడిగింపు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 26: కేయూ పరిధిలో డిగ్రీ 1, 3, 5వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షల ఫీజు చెల్లింపు గడువును అక్టోబరు 5 వరకు పొడిగించినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి తిరుమలదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.50 అపరాధ రుసుంతో అక్టోబరు 15 వరకు గడువు పొడిగించినట్లు వివరించారు. ఇతర వివరాలకు కేయూ వెబ్‌సైట్ http://www.kuonline.లో చూడాలని పేర్కొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

వరంగల్ క్రైం, సెప్టెంబరు 26: మిల్స్ కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శాంతినగర్‌లో పెయింట్‌షాపులో పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం దాడి చేశారు. రూ.30వేల నగదు స్వాధీనం చేసుకుని పేకాట అడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. విచారణ నిమిత్తం ఆరుగురిని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ ఎస్. రవికుమార్ ధ్రువీకరించారు.

ఒకే ఘటనలో రెండు కేసులు నమోదు

- విధులకు ఆటంకం.. విచారణలో బెదిరింపులు
- నిందితుడి అరెస్టు, కోర్టులో రిమాండ్

బయ్యారం, సెప్టెంబరు 26 : విధులకు ఆటంకం కల్పించగా, కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తున్న క్రమంలో ఆత్మహత్యాయత్నంతో బెదిరింపులకు పాల్పడిన నిందితుడిపై మరోకేసు నమోదు చేసి.. గురువారం అరెస్టు చేసి కోర్టులో రిమాండ్ పరిచినట్లు ఎస్సై తిరుపతి పేర్కొన్నారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం కస్తూరినగరం గ్రామంలో గతనెల 13న ఓ ఏఎన్‌ఎం విధులు నిర్వర్తిస్తుండగా.. అదే గ్రామానికి చెందిన ధరావత్ మోహన్ ఏఎన్‌ఎం విధులను ఆటంక పర్చడంతో పాటు దూషించి, అవమాన పరిచాడు. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు ఐపీసీ సెక్షన్ 132/బీఎన్‌ఎస్ ప్రకారం తొలుత కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. కేసు దర్యాప్తులో భాగంగా తాను సిబ్బందితో కలిసి కస్తూరినగరం గ్రామానికి విచారణకు వెళ్లగా, మీరు విచారణకు ఎందుకు వచ్చారంటూ నిందితుడు విచారణకు అడ్డుతగులటంతో పాటు ఆత్మహత్యాయత్నాంతో బెదిరింపులకు పాల్పడగా నూతన చట్టం ప్రకారం ఐసీఈ సెక్షన్ 132/ బీఎన్‌ఎస్, 226/ బీఎన్‌ఎస్ కింద మరో కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ రెండు కేసులలో నిందితుడైన మోహన్‌ను గురువారం ఆరెస్టు చేసి, కోర్టులో రిమాండ్ పరిచినట్లు ఎస్సై తెలిపారు. కాగా, నూతన చట్టం ప్రకారం విధులకు ఆటంకం కల్పించడం, విచారణలో బెదిరింపులకు పాల్పడటంపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

యశ్వంతాపూర్ విషాదానికి 70 ఏళ్లు

- నాటి రైలు ప్రమాదంలో 300 మంది జలసమాధి
- శవాల గుట్టలతో తల్లడిల్లిన పల్లెలు
- కలత చెందిన నాటి రైల్వేశాఖ మంత్రి లాల్ బహదూర్‌శాస్త్రి
- నైతిక బాధ్యత వహించి పదవికి రాజీనామా

లింగాలఘణపురం/జనగామ కల్చరల్, సెప్టెంబరు 26: బ్రిటీష్ పాలనను అంతమొందించి స్వతంత్ర స్వేచ్ఛావాయువులను పీల్చుకుంటున్న తరుణమది.. అప్పటికి దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడేళ్లు మాత్రమే అయ్యింది. సరికొత్త రాజ్యాంగం రూపుదిద్దుకున్న నాలుగేళ్లకు.. అప్పుడప్పుడే పాలన గాడినపడుతున్న వేళ.. ఓ నిశిరాత్రి జరిగిన పెనుప్రమాదం యావత్ దేశాన్ని కుదిపేసింది. అంతేకాదు.. ఓ కేంద్ర మంత్రి కలతకు కూడా కారణమైంది. అదే 300 మంది ప్రయాణికులను పొట్టనబెట్టుకున్న యశ్వంతాపూర్ రైలు ప్రమాదం. ఈ ప్రమాదం జరిగి శుక్రవారానికి 70 ఏళ్లు పూర్తవుతోంది.

ఏడు దశాబ్దాల కన్నీటి చరిత్ర..

1954 సెప్టెంబరు 27న సోమవారం రాత్రి 7 గంటలకు హైదరాబాద్ నుంచి ఢిల్లీకి జీటీ- గ్రాండ్ టాంక్(నిజాముద్దీన్) ఎక్స్‌ప్రెస్ బయలుదేరింది. అప్పటికే భారీ వర్షం పడి.. యశ్వంతాపూర్ వద్ద వాగు ఉప్పొంగుతోంది. ఈ క్రమంలోనే ఆ రైలు జనగామ రైల్వేస్టేషన్ దాటి.. 5నిమిషాల వ్యవధిలో రాత్రి 11:15గంటలకు యశ్వంతాపూర్ వాగుపైనున్న రైల్వేబ్రిడ్జిని దాటుతోంది. కానీ వాగు మరింత ఉగ్రరూపం దాల్చడంతో రైలు ఇంజన్, ఆ వెనుక రెండు బోగీలు రైల్వేబ్రిడ్జిని దాటి ముందుకు వెళ్లగా.. ఒక్కసారి బ్రిడ్జికూలిపోయింది. దీంతో వెనుక ఉన్న నాలుగు బోగీల లింకు ఊడిపోయి అమాంతం వరదప్రవాహంలో పడటంతో ఆ బోగీల్లో ప్రయాణిస్తున్న సుమారు 300మంది ప్రవాహంలో కొట్టుకుపోయారు. అప్పటికే గాఢ నిద్రలో ఉన్న ప్రయాణికులు ఏం జరిగిందో తెలుసుకునే ప్రాణాలు నీటిలో కలిసిపోయాయి. అయితే ప్రమాదం జరిగిన రెండు రోజుల దాకా మృతదేహాలు లభ్యం కాలేదు. చివరకు ఘటనా స్థలం నుంచి లింగాలఘణపురం మండలం నెల్లుట్ల, పటేల్‌గూడెం, నవాబుపేట, వడ్డిచర్ల, దేవరుప్పుల మండలం


నాడు కూలిన వంతెన స్థానంలో నిర్మాణమైన వంతెన

చిన్నమడూరు గ్రామాల మీదుగా కొట్టుకుపోయి 15కిలోమీటర్ల దూరంలో లభ్యమయ్యాయి. అలా లభ్యమైన వందలమంది మృతదేహాలను నాలుగు చోట్లకు చేర్చారు. నాడు ఆ శవాలగుట్టలను చూసి స్థానికులు కన్నీటిపర్యంతమయ్యారు. అంతేకాదు వాగు పరిసర గ్రామాల మృతదేహాలు కుళ్లిన వాసనను తట్టుకోలేకపోయారని చెబుతుంటారు. ఈ ఘటనను జనగామ ప్రాంత ప్రజలు ఇప్పటికీ మూఢవిశ్వాసాలతో జోడించి చర్చించుకుంటారు. అంతేకాకుండా చాలామంది కళాకారులు పల్లెసుద్దులు, వీధినాటకాలు, భాగవతాలు, ఒగ్గుకథల రూపంలో దుర్ఘటనను కళ్లకు కట్టినట్టుగా వివరించడం విశేషం.

ప్రయాణికుల ఆర్తనాదాలతో ఉలిక్కిపడిన పల్లెలు

గ్రాండ్‌టాంక్ నిజాముద్దీన్ ఎక్స్‌ప్రెస్ ప్రమాదానికి గురవడంతో ప్రయాణికులు చేసిన హాహాకారాలతో సమీప గ్రామాలు ఉలిక్కిపడ్డాయి. గాఢ నిద్రలో ఉన్న నెల్లుట్ల, యశ్వంతాపూర్, జనగామ ప్రజలను వారి ఆర్తనాదాలు ఉలిక్కిపడి లేచేలా చేశాయి. భారీ వర్షంలో ధైర్యం చేసి అటుగా వెళ్లి ప్రయత్నించిన కొద్దిమంది జరిగిన ఘటనను చూసి చలించిపోయారు. తమ వాళ్లను కాపాడాలని ఆర్తనాదాలు చేస్తున్న తీరుతో కన్నీటిపర్యంతమయ్యారు. అప్రమత్తమై ఆదుకునేలోపే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఆ పరిస్థితుల్లో ఎంత ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది.

నైతిక బాధ్యత వహించిన రైల్వేశాఖ మంత్రి

యశ్వంతాపూర్ ప్రమాద ఘటనలో 300మంది ప్రయాణికులు జలసమాధి కావడంతో అప్పటి రైల్వేశాఖ మంత్రి లాల్‌బహదూర్ శాస్త్రి తీవ్రంగా కలత చెందారు. తన శాఖలో జరిగిన వైఫల్యం కావడంతో నైతిక బాధ్యత వహిస్తూ తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. ఇది నాటి దేశ రాజకీయాల్లో సంచలనమైంది.

శవాలపై ఆభరణాల చోరీ..

రైలు ప్రమాదం జరిగిన తర్వాత మృతదేహాలను వెలికితీసేందుకు ఓ వైపుసహాయక చర్యలు జరుగుతుండగానే మరోవైపు కొందరు మానవత్వాన్ని మరిచి మృతదేహాలపై ఉన్న బంగారు ఆభరణాలను, బ్యాగుల్లోని డబ్బులు, సామగ్రిని దోచుకున్నట్టు స్థానికులు ఇప్పటికీ చెబుతుంటారు. దుండగులు శవాలపై ఎగబడి మరీ కిలోల కొద్దీ బంగారు, వెండి ఆభరణాలు, బంగారు నాణేలు, రూ.లక్షల నగదును దోచుకు దోచుకున్న వారిలో నేడు ఆర్థికంగా నిలదొక్కుకున్న కుటుంబాలు ఇప్పటికీ ఉన్నాయని చర్చించుకుంటూ ఉంటారు.

ఉప ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధం

- ప్రతిపక్షాలకు డిపాజిట్లు కూడా దక్కవు
- అవినితీ అక్రమాలకు మారుపేరు బీఆర్ఎస్
- కేసీఆర్ కుటుంబం దోపిడీకి తెగబడింది
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 26: ఇప్పట్లో ఉప ఎన్నికలు రావని, ఒకవేళ వచ్చినా తాము ఎదుర్కోవడా నికి సిద్ధంగా ఉన్నామని, ప్రజలు కాంగ్రెస్‌కు అనుకూలం గా ఉన్నారని జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొ న్నారు. గురువారం స్టేషన్ ఘన్‌పూర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ప లు కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ తాటాకుచప్పు ళ్లకు బెదిరేది లేదని, అసలు ఉప ఎన్నికలంటూ వస్తే ప్రతిపక్షాలకు డిపాజిట్లు కూడా రావని, ముఖ్యంగా తమ పార్టీకి డిపాజిట్ వస్తుందో రాదో బీఆర్ఎస్ వాళ్లే ఆలోచించుకోవాలన్నారు. తన మూడు దశాబ్దాల రాజకీయ జీవితంలో ఇలాంటివెన్నో ఎదుర్కొన్నానని, తన ఎదుట ఎగిరెగిరి పడిన వారెందరో కనుమరుగయ్యారన్నారు.

ప్రజాస్వామ్యం పట్ల, కోర్టులు, ఎన్నికల వ్యవస్థల పట్ల తనకు గౌరవం ఉందని, ఏ పరిస్థితి వచ్చిన ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని తెలి పారు. సిగ్గు లేకుండా బీఆర్ఎస్ నా యకులు ఫిరాయింపులపైన మాట్లాడుతున్నారని, పదేళ్ల కాలంలో 38 మంది ఎమ్మెల్యేలను తమ పార్టీలో చేర్చుకున్నది వాళ్లు అని, చివరకు రాజకీయ పార్టీల శాసనసభ పక్షాలను సైతం విలీనం చేసుకున్నది వారు కాదా అని ప్రశ్నించారు. అప్పుడు వారికి ప్రజాస్వామ్యం, నైతిక విలువలు, ఫిరాయింపుల చట్టం గుర్తుకురాలేదా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ అవినీతి అక్రమాలకు మారు పేరని, ఉమ్మడి వరంగల్ జిల్లాను ఆరు ముక్కలు చేయవద్దు, జిల్లాకు ఉన్న చరిత్రను నాశనం చేయవద్దు అని మొత్తుకున్నా కేసీఆర్ వినలేదని, ఈ విషయమై తాను ఎదురు తిరిగినందున రెండోసారి తనకు మంత్రిపదవి ఇవ్వలేదని ఆరోపించిన ఆయన ఈ విషయంలో తాను బాధ పడలేదన్నారు. ఎలాంటి కారణాలు లేకుండానే జిల్లాను ఆరు ముక్కలు చేశారన్నారు.

వరంగల్ జిల్లా గొప్పదనం, చరిత్రను నాశనం చేయడానికే కేసీఆర్ ఆరు ముక్కలు చేశారన్నారు. కేసీఆర్ కుటుంబం ప్రజాస్వా మ్యవాదుల నోళ్లు నొక్కి ఇష్టారీతిన దోపిడీ చేశారని, మొత్తం కుటుంబం దోపిడీకి తెగబడిందని, కుటుం బం చేతిలో తెలంగాణ బందీగా మారిందని గుర్తు చేశారు. హైదరాబాద్‌లో వేల ఎకరాల భూములు, కోట్ల విలువైన భవనాలు కేసీఆర్ కుటుంబానికి ఎక్కడి నుంచి వచ్చాయో తెలంగాణ ప్రజలకు తెలపా ల్సిన అవసరం ఉందన్నారు. తొమ్మిది నెలలు పూర్తి కాని కాంగ్రెస్ ప్రభుత్వం పైన చౌకబారు విమర్శలు చేయడం మానుకోవాలన్నారు. పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేయని విధంగా సీఎం రేవంత్ రెడ్డి 23 లక్షల మంది రైతులకు రూ.18వేల కోట్ల రుణమాఫీ చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో నాయకులు బెలిదె వెంకన్న, జగదీష్‌చందర్ రెడ్డి, శిరీష్ రెడ్డి నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

న్యూశాయంపేట, సెప్టెంబర్ 26: వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా రజక ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం న్యూశాయంపేటలో ఉన్న రజక ఉద్యోగుల సంక్షేమ సంఘం భవనంలో మెగా రక్త దాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని వరంగల్ ఎంపీ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, మేయర్ గుండు సుధారాణి, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు పి.ప్రావీణ్య సత్యశారదలు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం రక్తదానం చేసిన వారికి అతిథుల చేతుల మీదుగా సర్టిఫికెట్‌లు అందజేశారు. ఈ సందర్భంగా 55 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ విజయచందర్‌రెడ్డి, కమిటీ మెంబర్ పుల్లూరి వేణుగోపాల్, రజక ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఉల్లెంగుల కొమురెల్లి, ఉపాధ్యక్షులు నూతనకంటి బాబు, ప్రధాన కార్యదర్శి పతంగి సమ్మయ్య, కోశాధికారి సత్తు సోమయ్య, గౌరవ సలహాదారులు ఎన్.సదానందం, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట యూఎస్ఎఫ్ఐ ధర్నా

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబర్ 26: నాలుగేళ్లుగా జిల్లావ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.1600కోట్ల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూఎస్ఎఫ్ఐ) నాయకులు డిమాండ్ చేశారు. పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం కలెక్టరేట్ ఎదుట విద్యార్థులతో కలిసి యూఎస్ఎఫ్ఐ నాయకులు ధర్నా చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని డీఈవో వై.వి.గణేష్‌కు అందజేశారు. కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ నాయకులు మాదం తిరుపతి, మాలోత్ రాజేష్ నాయక్‌తోపాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులకు రూపే కార్డులు అందజేయాలి

అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబర్ 26: అర్హత ఉన్న ప్రతీ ఖాతాదారుడికి రూపే కార్డును ఇవ్వాలని జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి కోరారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బ్యాంకర్లు, జిల్లా అధికారులతో గురువారం అదనపు కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. బ్యాంకింగ్ కరస్పాండెంట్స్ రూల్స్ ప్రకారం నడుచుకోవాలని, ఖాతాదారుల వద్ద కమీషన్ తీసుకోవద్దన్నారు. బ్యాంకర్లు అన్ని శాఖలు సమన్వయంతో అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికి బీమా వర్తింపచేయాలన్నారు. 2023-24 సంవత్సరానికిగాను 120శాతం లక్ష్యాన్ని సాధించినందుకు బ్యాంకర్లను ఈ సంద్భంగా అదనపు కలెక్టర్ అభినందించారు. ఈ సమావేశంలో నాబార్డ్ ఏజీఎం చంద్రశేఖర్, ఆర్‌బీఐ మేనేజర్ పల్లవి, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్, వివిధ బ్యాంకుల అధికారులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రపంచ పర్యాటక ఉత్సవాలు

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబర్ 26: ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లాలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 'పర్యాటకం - శాంతి' అనే అంశంపై జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పర్యాటకంపై అవగాహన కల్పించడానికి పాఠశాల నుంచి ఉన్నత విద్యాస్థాయిలో ఎకో టూరిజం క్లబ్‌లను ఏర్పాటు చేశామని, మరిన్ని విద్యాసంస్థలు రిజిస్ట్రేషన్‌లు చేసుకుంటున్నాయని తెలిపారు.

హరిత కాకతీయ హోటల్‌లో ఫుడ్‌ఫెస్టివల్

కాళోజీ జంక్షన్, సెప్టెంబరు 26: ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా శుక్రవారం హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో తెలంగాణ టూరిజం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నారు. ఫుడ్ ఫెస్టివల్‌లో ఖరీదైన నోరూరించే మటన్ ధమ్ బిర్యానీ, నాటుకోడి కూర, ధమ్ కా ముర్గ్, తవా మచి ఫిష్, బోటీఫ్రై, కడాయి పన్నీర్, తలకాయ కూర, నిజాం హండీ బిర్యానీ తదితర మాంసాహార వంటకాలు వడ్డించనున్నారు. అదే విధంగా శాఖాహారుల కోసం వంకాయ వేపుడు, తోటకూర పప్పు, చైనీస్ ఫుడ్, తందూరి రోటీ, నాన్, పుల్కా అందుబాటులో ఉంచుతున్నారు. పెద్దలకు రూ.750, పిల్లలకు రూ.500 చెల్లించాల్సి ఉంటుంది. ఇంకా రుమాలీ రోటీ, సర్వపిండి, సకినాలు, అరిశెలు, మడుగూలు, తదితర పిండి వంటలు వడ్డించనున్నారు. మధ్యాహ్నం ఒంటిగంటకు లంచ్, సాయంత్రం 8 గంటలకు డిన్నర్ ప్రారంభమవుతుంది. జిల్లా ప్రజలు ఈ పసందైన వంటకాలను ఆస్వాదించాల్సిందిగా టూరిజం అధికారులు కోరారు.

ఐలమ్మ స్ఫూర్తిని అందిపుచ్చుకోవాలి

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 26: తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని అందిపుచ్చుకోవాలని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి అన్నారు. గురువారం కేయూ బీసీసెల్ ప్రాంగణంలో బీసీ సెల్‌డైరెక్టర్ డాక్టర్ ఆకుతోట శ్రీనివాసు నేతృత్వంలో 129వ ఐలమ్మ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కేయూ రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి, వర్సిటీ పాలక మండలి సభ్యులు, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, డాక్టర్ నిమ్మ సుదర్శన్, డాక్టర్‌బొద్దిరెడ్డి రమారెడ్డి, కారుకాల అనితారెడ్డిలు హాజరై నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ టి.యాదగిరిరావు, ప్రొఫెసర్ ఈసం నారాయణ, ప్రొఫెసర్ ఎమ్డీ ముస్తాఫా, డాక్టర్ కెబిక్షాలు, రాధికారాణి తదితరులు పాల్గొన్నారు.

● కేయూ బీఎస్ఎఫ్ అధ్యక్షుడు బొట్ల మనోహర్ నేతృత్వంలో కేయూ మెయిన్ లైబ్రరీ ఎదుట ఐలమ్మ జయంతి నిర్వహించారు. కేయూ బీసీ విద్యార్థి సంఘం నేతృత్వంలో ఐలమ్మ చిత్రపటా నికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా కేయూ మొదటి గేటు వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం కేయూ ఇన్‌చార్జి అరెగంటి నాగరాజు అధ్యక్షతనజరిగిన సమా వేశంలో కేయూ కాంట్రాక్టు ధ్యాపకుడు డాక్టర్‌చీకటి శ్రీనివాస్ హాజరై మాట్లాడారు.

● హనుమకొండ టౌన్: తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ పాత్ర శక్తివంతమైనదని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. ఐలమ్మ జయంతిని పురస్కరించుకొని హనుమకొండ నక్కలగుట్టలోని కార్పొరేట్ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి సీఎండీ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డైరెక్టర్స్ వి.తిరుపతిరెడ్డి, టి.మధుసూదన్, సీజీయంలు కె.తిరుమల్‌రావు, కె.కిషన్, రవీంద్రనాథ్, కె.ఎస్.గుప్త, జాయింట్ సెక్రెటరీ రమేశ్, డీఈలు అనిల్‌కుమార్, శ్రీధర చారి, ఏ.ఎస్. రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● హనుమకొండ చౌరస్తా: ఐలమ్మ జయంతిని చాకలి ఐలమ్మ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. హనుమకొండ కాపువాడలోని భద్రకాళి చెరువు మత్తడి సమీపంలో ఏర్పాటు చేసిన ఐలమ్మ జయంతిని వేయిస్తంభాల ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ ముఖ్య అతిథిగా హాజరై ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చాకలి ఐలమ్మ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రావుల సుదర్శన్, సభ్యులు పాల్గొన్నారు.

● కాజీపేట: కాజీపేట ఫాతిమానగర్ జంక్షన్ వద్ద ఐలమ్మ జయంతిని నిర్వహించారు. ఐలమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ చైర్మన్ నార్లగిరి రామలింగం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు బీఆర్ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి నార్లగిరి రమేశ్ హాజరై ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు గబ్బెట శ్రీనివాస్, ఎండీ అఫ్జల్, మిట్టపల్లి రమేశ్, చాంద్‌పాష, సమ్మయ్య, సురేందర్, రజక సంఘం నాయకులు పాల్గొన్నారు. బాపూజీనగర్ చౌరస్తాలో జరిగిన వేడుకల్లో కాంగ్రెస్ నాయకుడు మైసారపు సిరిల్ లారెన్స్ ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గోల్కొండ రాంబాబు, ఎస్. సుధాకర్, సిలువేరు విజయ్ భాస్కర్, ఇప్ప శ్రీకాంత్, బబ్లూ, రాజ్‌కుమార్, బి. శ్రీనివాస్ పాల్గొన్నారు.

● హసన్‌పర్తి : మండలంలోని ముచ్చర్లలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో 129వ చాకలి ఐలమ్మ జయంతిని నిర్వహించారు. ఈసందర్భంగా బీఆర్ఎస్ జిల్లా నాయకుడు చల్ల వెంకటేశ్వర్‌రెడ్డి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చిర్ర రాజేష్, చిర్ర శ్రవణ్, కుమార్‌రెడ్డి, కామారపు కిషన్, సతీష్, రవికిరణ్, మహెందర్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



కాజీపేటలో ఐలమ్మ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

● వరంగల్ క్రైం: చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను గురువారం హనుమకొండలోని పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించారు. సీపీ అంబర్ కిషోర్ ఝాతో పాటు పలువురు అధికారులు ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు షేక్ సలీమా, రాజమహేంద్రనాయక్, రవిందర్, అదనపు డీసీపీలు, ఏసీపీలు తదితరులు పాల్గొన్నారు.

● చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తామని మాజీ కుడా చైర్మన్ సుందర్‌రాజ్ తెలిపారు. గురువారం హనుమకొండలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఐలమ్మ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు ఐలమ్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నేతలు పులి రజనీకాంత్, లక్ష్మీనారాయణ, సారంగపాణి, కనకరాజు, సల్వాజు రవీందర్‌రావు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం..

పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

కాళోజీ జంక్షన్, సెప్టెంబరు 26 : జర్నలిస్టుల సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. గురువారం హనుమకొండ నక్కలగుట్టలోని ఓ ప్రైవేటు సమావేశ మందిరంలో జరిగిన కాకతీయ జర్నలిస్టు హౌసింగ్ కోఆపరేటివ్ సొసైటీ 28వ వార్షికోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సొసైటీ అధ్యక్షుడు ఎం.రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. 28 ఏళ్ల చరిత్ర కలిగిన కాకతీయ జర్నలిస్టు హౌసింగ్ కో ఆపరేటివ్ సొసైటీ సభ్యులంతా తనకు సుపరిచితులేనన్నారు. వరంగల్‌లోని రెండు సొసైటీలకు 2009 సంవత్సరంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన స్థలాన్ని అప్పగించేందుకు తాను కట్టుబడి ఉన్నానని, త్వరలోనే జర్నలిస్టులు శుభవార్త వింటారని అన్నారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి సోమ నర్సయ్య, డైరెక్టర్ పి.వేణుమాధవరావు, మాజీ కార్యదర్శి మదన్‌మోహన్, ఉపాధ్యక్షులు రమేష్‌బాబు, డైరెక్టర్ దయాసాగర్, సభ్యులు పాల్గొన్నారు.

మాజీ కార్పొరేటర్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే

న్యూశాయంపేట: అనారోగ్య సమస్యతో చికిత్స పొందుతున్న మాజీ కార్పొరేటర్ మిర్యాల్‌కార్ దేవేందర్‌ను ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి గురువారం పరామర్శించారు.మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు.

ఉపాధ్యాయులే జాతి నిర్మాతలు

● రాంనగర్: ఉపాధ్యాయులే జాతి నిర్మాతలని, సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. గురువారం భీమారంలోని ఎస్వీఎస్ కళాశాలలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు అందించారు. రోటరీ క్లబ్ అధ్యక్షులు శారు ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు డా.శరత్‌బాబు, క్లబ్ కార్యదర్శి ప్రవీణ్‌రావు, కోశాధికారి విజయ్‌కుమార్, అవార్డ్ కమిటీ చైర్మన్ సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం

● పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

● బల్దియాలో పారిశుధ్య కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 26: గ్రేటర్ వరంగల్ పరిధిలో పని చేస్తున్న పారిశుధ్య సిబ్బంది ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా పని చేస్తున్నామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. స్వచ్ఛతాహీ సేవా- 2024 కార్యక్రమంలో భాగంగా బల్దియా ఇండోర్ స్టేడియంలో గురువారం పారిశుధ్య కార్మికులకు, సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ సిబ్బందికి ప్రతిమ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ వారి సహాయంతో ఉచిత క్యాన్సర్ వైద్య పరీక్షలు చేశారు. నాయిని రాజేందర్‌రెడ్డితో పాటు మేయర్ గుండు సుధారాణి, బల్దియా కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడేతో కలిసి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ముందుగా ఎమ్మెల్యే చేతుల మీదుగా పారిశుధ్య కార్మికులకు హెల్త్‌కార్డులు, హెల్త్ పీపీఈ కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, జక్కుల రవీందర్ యాదవ్, సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, టీపీవో రాజేశ్ గౌడ్, డీఎఫ్‌వో శంకర్‌లింగం, బయాలజిస్ట్ మాధవరెడ్డి, ప్రతిమ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ అవినాశ్ తిప్పని, డాక్టర్ రాహుల్ నారాయణన్, ఆంకాలజిస్ట్ డాక్టర్ సుచిత్రతో పాటు బల్దియా సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతీ విద్యార్థి జీవితంలో ఉన్నతంగా ఎదగాలి

హసన్‌పర్తి, సెప్టెంబరు 26: ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివే ప్రతీ విద్యార్థి జీవితంలో గొప్పగా రాణించినప్పుడే సమాజానికి ఆదర్శమని జడ్పీ సీఈవో విద్యా లత అన్నారు. మండలంలోని ఎల్లాపూర్ శివారులోని తిమ్మాపూర్ శాఖకు చెందిన మహాత్మాజ్యోతిరావుపూలే బాలికల గురుకుల విద్యాలయంలో గురువారం గురుకుల ప్రిన్సిపాల్ శోభ అధ్యక్షతన చాకలి ఐలమ్మ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీ సీఈవో విద్యాలత, ఎల్కతుర్తి ఎంపీడీవో విజయ్‌కుమార్, గురుకుల ప్రిన్సిపాల్ శోభలు చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జడ్పీ సీఈవో విద్యాలత గురుకుల పరిసరాలను, వంటగది, విద్యార్థుల భోజన వసతి, ఆహారపదార్థాల స్టోర్ రూం పర్యవేక్షించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. గురుకుల ఆవరణలో మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో జీపీ కార్యదర్శి శ్రీనివాస్, గురుకుల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

టెలిఫోన్ భవనంలో కంప చెట్ల తొలగింపు

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

వడ్డెపల్లి, సెప్టెంబరు 26 : గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాల్‌పూర్ పాత గ్రామ పంచాయతీ కార్యాలయం వెనుక ఉన్న టెలిఫోన్ ఎక్స్చేంజ్ భవన ఆవరణలో ఉన్న నిరుపయోగమైన కంప చెట్లను గురువారం తొలగించారు. ఈ నెల 23న 'ఆంధ్రజ్యోతి' మినీ సంచికలో 'నిరుపయోగంగా టెలిఫోన్ భవనం' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. స్థానిక కాంగ్రెస్ నేత కందుకూరి రజినీకాంత్ 56వ డివిజన్ సిరంగి సునిల్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. కార్పొరేటర్ స్పందించి వెంటనే ఎక్స్‌కవేటర్ ద్వారా నిరుపయోగమైన చెట్లు, పిచ్చి మొక్కలను తొలగించారు.

ఎమ్మెల్యే, మేయర్‌ను కలిసిన జేఏసీ నాయకులు

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 26: బల్దియా జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు గురువారం పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందించారు. బల్దియా ఇండోర్ స్టేడియంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమానికి హాజరైన నాయినితో పాటు మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడేను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షుడు బొట్ల రమేష్, ప్రధాన కార్యదర్శి భాగం సంతోష్, కోశాధికారి స్వర్ణన్ రాజు, కార్యదర్శి బాలునాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజారపు భాస్కర్‌తో పాటు సంఘం గౌరవ అధ్యక్షుడు బిరు శ్రీనివాస్, ముఖ్య సలహాదారులు బొట్ల బిక్షపతి మాదిగ, వేల్పుల దర్మరాజు యాదవ్, పుల్ల రమేష్, జన్ను ప్రకాశ్, జీవన్, పాశం రవి, సత్యం, దేవేందర్‌లు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే, మేయర్‌కు పుష్పగుచ్ఛాలు అందిస్తున్న జేఏసీ నాయకులు

బయోటెక్నాలజీకి యువశాస్త్రవేత్తల అవసరం

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 26: బయోటెక్నాలజీ రంగంలో యువశాస్త్రవేత్తల అవసరం ఏర్పడుతోందని హైదరాబాద్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ యానిమల్ బయోటెక్నాలజీ డైరెక్టర్ డాక్టర్ జి.తారుశర్మ అన్నారు. కేయూ జంతుశాస్త్ర విభాగం నేతృత్వంలో రెండు రోజులుగా రీసెంట్ ట్రెండ్స్ ఇన్ యానిమల్ బయోటెక్నాలజీ అనే అంశంపై జరిగిన సదస్సు ముగిసింది. ఈ సందర్భంగా కేయూ జంతుశాస్త్ర విభాగంలో జరిగిన ముగింపు సమావేశంలో తారుశర్మ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా బయోటెక్నాలజీ రంగానికి అధికప్రాధాన్యత ఏర్పడుతోందని తెలిపారు. బయో టెక్నాలజీ పరిశోధనల్లో దేశం వెనుకబడి ఉందన్నారు. జంతువుల నుంచి పాలతోపాటు ఇతర పోషకాహార పదార్థాలు లభ్యం అవుతున్నాయని వీటిపై మరింత సమగ్రమైన పరిశోధనలు జరుగాలన్నారు. విశిష్ట అతిథులుగా హాజరైన కేయూ యూజీసీ కోఆర్డినేటింగ్ ఆఫీసర్ ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ.. రెండు రోజుల జాతీయ సదస్సులో విలువైన పరిశోధన పత్రాలు వచ్చాయని చెప్పారు. డైరెక్టర్, జంతుశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ జి.షమిత మాట్లాడుతూ.. రెండు రోజుల సదస్సులో 12 వర్సిటీ నుంచి 50కి పైగా పరిశోధనపత్రాలతో పాటు మరో 50 పోస్టర్ ప్రజంటేషన్‌లు వచ్చినట్లు వెల్లడించారు. ఎన్ఐఎన్ నుంచి డాక్టర్ రాజేందర్, ఎంటీఐ నుంచి డాక్టర్ పర్వ శ్రీనివాస్, పెరుగు శ్యామ్‌లు ప్రసంగించిన అంశాలు పరిశోధకులను ఆకట్టుకున్నాయని తెలిపారు. బెస్ట్ ఓవర్ ప్రజంటేషన్, బెస్ట్ పోస్టర్ ప్రజంటేషన్ అవార్డులను పరిశోధకులకు అందచేశారు. ఈకార్యక్రమంలో జంతుశాస్త్ర విభాగం ప్రొఫెసర్లు వై.వెంకయ్య, ప్రొఫెసర్ ఈసం నారాయణ, డాక్టర్ మామిడాల ఇస్తారి, డాక్టర్ కనీజ్ ఫాతిమా, డాక్టర్ సుజాత పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబర్ 26: హనుమకొండలోని సుబేదారి, అదాలత్, నక్కలగుట్ట జంక్షన్‌లలో ఎక్కడ స్థలం ఖాళీగా ఉంటే అక్కడ కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర పద్మశాలీ సంఘం జిల్లా వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ చందా మల్లయ్య జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్యను కోరారు. ఈ మేరకు పద్మశాలీ సంఘం నాయకులు గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ ప్రావీణ్యను కలిసి వినతిపత్రం అందజేశారు.

● హనుమకొండ సిటీ: హనుమకొండలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని తెలంగాణ పద్మశాలి సంఘం హనుమకొండ జిల్లా ప్రతినిధులు పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. గురువారం హనుమకొండలోని ప్రజాభవన్ కార్యాలయంలో రాజేందర్‌రెడ్డిని కలిసి ఈ మేరకు వినతిపత్రం అందచేశారు. సుబేదారి పోస్టు ఆఫీస్ కార్యాలయం నుంచి నక్కలగుట్ట మార్గంలో ఒక చోట విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయింపు చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ చందా మల్లయ్య, పోప అధ్యక్షుడు ప్రొఫెసర్ రామస్వామి, ప్రధాన కార్యదర్శి పరికిపండ్ల వేణు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పద్మశాలీ సంఘం నాయకులు

సృజనాత్మకతకు ఎగ్జిబిట్స్ దోహదం

హనుమకొండ టౌన్, సెప్టెంబర్ 26: విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ ఎగ్జిబిషన్ దోహదం చేస్తుందని కేయూ రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి అన్నారు. వాగ్దేవి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో గురువారం కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో సీబీఎం ఎక్స్‌పో-2024 పేరుతో ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రిజిస్ట్రార్ మాట్లాడుతూ.. ఇలాంటి ఎక్స్‌పోలు విద్యార్థుల అభ్యాసానికి వినూత్నమైన, అనుభవ పూర్వకమైన విధానాన్ని తెలియజేస్తాయన్నారు. విద్యార్థులు ఒక అంశాన్ని పూర్తిగా అర్థం చేసుకోవడానికి ప్రయోగాత్మక అనుభవం చాలా అవసరమన్నారు. ఎగ్జిబిట్‌లో వివిధ అంశాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్స్, బహుమతులు అందజేశారు. న్యాయనిర్ణేతలుగా డాక్టర్ రాజశేఖర్, రజనీ వ్యవహరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శేషాచలం, వైస్‌ప్రి న్సిపాల్, హరిందర్‌రెడ్డి, ఎంబీఏ డైరెక్టర్ రాజిరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

వరంగల్ బల్దియాలో దొంగల హల్‌చల్

పట్టపగలే బల్దియా గేటు గ్రీల్స్ చోరీ

పోలీసులకు అప్పగించిన సిబ్బంది

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 26: గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కార్యాలయంలో దొంగలు రెచ్చిపోతున్నారు. కొద్దిరోజుల కిందట ద్విచక్రవాహనాలు, పెట్రోల్ దొంగిలించిన వ్యక్తులు.. ప్రస్తుతం వారి రూటు మార్చి బల్దియాలోని ఇనుప సామగ్రి చోరీకి స్కెచ్ వేశారు. గురువారం బల్దియా ప్రధాన గేటు పక్క ఉన్న ఇనుప ప్రహరీ గ్రిల్స్‌ను చోరీ చేసి అక్కడి సెక్యూరిటీ సిబ్బందికి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. బల్దియా సిబ్బంది, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వారం రోజులుగా బల్దియా కార్యాలయం ప్రధాన గేటు పక్కనే ఉన్న ఇనుప గేటు గ్రిల్స్ తరుచుగా చోరీ అవుతున్నాయి. దీంతో బల్దియా సిబ్బంది నిఘా పెట్టారు. ఈ క్రమంలో గురువారం నలుగురు ఇతర రాష్ట్రానికి చెందిన నలుగురు వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చారు. పక్కనే పార్కింగ్ చేసి రెండు ఇనుప గేటు గ్రిల్స్‌ను తీసి వాహనంపై పెట్టుకుని అక్కడి నుంచి వెళ్లే ప్రయత్నం చేశారు. ఇది గమనించిన అక్కడి సెక్యూరిటీ సిబ్బంది వారిని గమనించి పట్టుకునే ప్రయత్నం చేయగా ఒక వ్యక్తి వాహనంతో పట్టుబడ్డాడు. విచారించగా దొంగిలించి పాత ఇనుప సామాను షాపులో అమ్ముకుంటున్నట్లు వెల్లడించాడు. వెంటనే బల్దియా సెక్యూరిటీ సిబ్బంది విషయం ఉన్నతాధికారులకు తెలియజేసి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే మట్టెవాడ పోలీసులు వచ్చి చోరీకి పాల్పడిన వ్యక్తితో పాటు ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నారు. ఇలా ఆరు గేట్లను చోరీ చేసి విక్రయించి జల్సాలు చేసినట్లు తెలిపారు. విచారణ తర్వాత వివరాలను వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.



చోరీ చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు, మధ్యలో వ్యక్తి నిందితుడు

నేడు డయల్ యువర్ డీఎం

బాలసముద్రం, సెప్టెంబరు 26: హనుమకొండ డిపోలో డయల్ యువర్ డీఎం కార్యక్రమం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు హనుమకొండ డిపో మేనేజర్ భూక్య ధరమ్‌సింగ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ డిపో పరిధిలోని జమ్మికుంట, ధర్మసాగర్, వేలేరు, ఐనవోలు, పర్వతగిరి, సంగెం, ఖిలావరంగల్, హనుమకొండ, హసన్‌పర్తి, కమలాపూర్, వరంగల్, కాజీపేట మండలాల పరిధిలోని గ్రామాల ప్రజలు బస్సు సర్వీసులు సౌకర్యవంతమైన ప్రయాణం కోసం సూచనలు, సలహాలు అందించాలని కోరారు. శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల మధ్య ప్రయాణికులు ఫోన్ నెంబరు 99592 26049 సంప్రదించాలని కోరారు.

మరమ్మతుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

హనుమకొండ టౌన్, సెప్టెంబర్ 26: ట్రాన్స్‌ఫార్మర్‌ల మరమ్మతులో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ తరుచుగా వైఫల్యాలు లేకుండా చూడాలని టీజీ ఎన్పీడీసీఎల్ ఇన్‌చార్జి డైరెక్టర్ ఆపరేషన్ టి.మధుసూదన్ అన్నారు. సీఎండీ ఆదేశాల మేరకు ఎన్పీడీసీఎల్ శిక్షణ కేంద్రంలో వరంగల్ సర్కిల్‌లోని ఎస్పీఎం ట్రాన్స్‌ఫార్మర్ల రిపేరు షెడ్ల యాజమానులు, సూపర్‌వైజర్లు, స్కిల్డ్ సిబ్బందికి తోషిబా ట్రాన్స్‌ఫార్మర్ల కంపెనీ నిపుణులచే గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మధుసూదన్ మాట్లాడుతూ.. కంపెనీపై ఆర్థికభారం తగ్గిస్తూ వినియోగదారులకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. వరంగల్ సర్కి ల్ ఎస్ఈ మధుసూదన్ మాట్లాడుతూ.. ట్రాన్స్‌ఫార్మర్ వైఫల్యం చెందినప్పుడు 1912 టోల్‌ఫ్రీ నెంబర్ ఫిర్యాదు వస్తుందని, ఆ సమయంలో అధికారులు మొబైల్ యాప్‌లో రిపేర్ సెంటర్‌కు సమాచారం ఇస్తారన్నారు. సమాచారం అందగానే ట్రాన్స్‌ఫార్మర్‌ను పంపించేందుకు రిపేరు నిర్వాహకులు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ టెక్నికల్ ఆనందం, డీఈ ఎంఆర్‌టీ ఆర్జీ, ఏడీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

హసన్‌పర్తి, సెప్టెంబరు 26: గ్రేటర్ 66వ డివిజన్ కేంద్రం హసన్‌పర్తిలో గురువారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు పర్యటించి పలువురు మృతుల కుటుంబాలను పరామర్శించారు. వివిధ అనారోగ్య సమస్యలతో మృతిచెందిన గుడి కందుల ఎర్రగట్టు, ఆకుతోట భిక్షపతి, పెద్దమ్మ సమ్మక్క, గాజుల రాధమ్మ కుటుంబాలను కలిసి వారికి మనోధైర్యాన్ని కల్పించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్, మాజీ జడ్పీటీసీ విజమూరి వెంకన్న, మాజీ డైరెక్టర్లు వీసం సురేందర్‌రెడ్డి, ఆరెల్లి వెంకటస్వామి, మాజీ సర్పంచ్ రవిందర్, తదితరులున్నారు.

● మడికొండ: కాజీపేట మండలం మడికొండకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు బోగి ఇస్తారు అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. విషయాన్ని తెలుసుకున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు మృతుడి భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన వెంట కాజీపేట మండల అధ్యక్షుడు సారంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు కుర్ల మోహన్, బోగి కృష్ణమూర్తి, బైరి లింగమూర్తి, మాజీ కార్పొరేటర్ తొట్ల రాజు యాదవ్, హరీష్‌రెడ్డి, వెంకటయ్య, ప్రసాద్, కృష్ణ, విజయ్, అర్జున్, తదితరులు ఉన్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
నివేదన
శుక్రవారం • 27 సెప్టెంబరు 2024

రోజుకొక్క తీరున...

అక్టోబర్ 2: బుధవారం - ఎంగిలి పూల బతుకమ్మ
అక్టోబర్ 3: గురువారం - అటుకుల బతుకమ్మ
అక్టోబర్ 4: శుక్రవారం - ముద్దపప్పు బతుకమ్మ
అక్టోబర్ 5: శనివారం - నానే బియ్యం బతుకమ్మ
అక్టోబర్ 6: ఆదివారం - అట్ల బతుకమ్మ
అక్టోబర్ 7: సోమవారం - అలిగిన బతుకమ్మ
అక్టోబర్ 8: మంగళవారం - వేపకాయల బతుకమ్మ
అక్టోబర్ 9: బుధవారం - వెన్నముద్దల బతుకమ్మ
అక్టోబర్ 10: గురువారం - సద్దుల బతుకమ్మ



విశేషం



శ్రీగౌరి నీ పూజ ఉయ్యాలో...

విశ్వం అంతా శక్తిమయం. ప్రకృతే పరాశక్తి. ఆ మాత అనేక రూపాల్లో అభివ్యక్తమవుతుంది. దుర్గగా, గౌరిగా... ఇలా ఎన్నో విధాలుగా పూజలందుకుంటుంది. గౌరిగా ఆరాధించే రూపానికి ప్రతిరూపమే బతుకమ్మ. ఇది తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టే వేడుక.

ఆశ్వయుజ మాసం శరద్రుతువులో తొలి మాసం. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి దుర్గా నవరాత్రులు ప్రారంభమవుతాయి. అంతకు ఒక రోజు ముందుగానే... అంటే బాద్రపద అమావాస్య నాటి నుంచే బతుకమ్మ సంబరాలు మొదలవుతాయి. ఇది ప్రకృతిని ఆరాధించడానికి అనువైన మాసం. పరిసరాలన్నీ శోభాయమానంగా ఉంటాయి. చంద్రుడు షోడశ కళలతో చల్లని వెన్నెల కురిపిస్తాడు. రంగురంగుల పూలతో చెట్లు కనువిందు చేస్తాయి. వాటి సువాసనలతో గాలి గుబాళిస్తూ ఉంటుంది. అర్చనలో పూలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ఆ పూలనే బతుకమ్మగా ఆరాధించడం విలక్షణమైన సంస్కృతి.



కైలాసంలో మెట్టినింట ఉన్న గౌరిని (పార్వతిని) మహాలయ అమావాస్యకు ముందుగానే పుట్టినింటికి ఆహ్వానిస్తారు. మహాలయ అమావాస్య నాడు గౌరిని యథావిధిగా అలంకరించినా... ఆ రోజు పితృ అమావాస్య కాబట్టి... పితృదేవతలకు నివేదనలు ప్రధానం కనుక ఆ రోజు ప్రత్యేక పూజలు ఉండవు. వరిపిండిలో నువ్వులు, బెల్లం కలిపిన పదార్థాన్ని బతుకమ్మకు నైవేద్యం పెడతారు. ముందురోజు సేకరించిన పువ్వులతో బతుకమ్మను పేరుస్తారు కాబట్టి... తొలి రోజున గౌరీదేవిని 'ఎంగిలి పూల బతుకమ్మ' అని వ్యవహరిస్తారు. బతుకమ్మ పుట్టు పూర్వోత్తరాల గురించి ఎన్నో కథలు పాటల రూపంలో ఉన్నాయి. పూర్వం ధర్మాంగదుడనే రాజు ఉండేవాడనీ, అతను, అతని భార్య సత్యవతి శివ భక్తులని, ఆ దేవదేవుడి అనుగ్రహంతో జన్మించిన కుమార్తెకు 'బతుకమ్మ' అని పేరు పెట్టుకున్నారనీ ఒక కథ ఉంది.



ఈ సంబరాల్లో ప్రతి రోజూ మహిళలు వివిధ రకాల పూలతో బతుకమ్మలను తయారు చేస్తారు. రోజుకో విధమైన నివేదనలు సమర్పిస్తారు. చెరువులు, కుంటల దగ్గర బతుకమ్మలతో చేరుకుంటారు. వాటిని పేర్చి చుట్టూ తిరుగుతూ బతుకమ్మ పాటలు పాడుతారు. ఆఖరి రోజున బతుకమ్మలను నిమజ్జనం చేస్తారు. బతుకమ్మను పేర్చడానికి పూల సేకరణను తెల్లవారుజామునే ప్రారంభిస్తారు. బంతి, చామంతి, గునుగు, గుమ్మడి, తంగేడు... ఇలా ఎన్ని పూలు ఉన్నా తంగేడుకే ప్రాధాన్యం. ఇది పసుపు వర్ణంలో ఉంటుంది. పసుపు అయిదవతనానికి సంకేతం. అలాగే పసుపును ముద్దగా చేసి, గోపురం రూపంలో నిర్మించి, దాని మధ్యలో నొక్కి రెండు శిఖరాలుగా చేస్తారు. అది అర్ధనారీశ్వరులకు సంకేతం. ఆ గోపురం చుట్టూ పూల దండలను అలంకరిస్తారు. రోజుకో నైవేద్యాన్ని పెడతారు. 'తీరొక్క పువ్వేసి, తీరొక్క కూర్పుగా ఉయ్యాలో' అంటూ బతుకమ్మల కూర్పును, పేర్పును ప్రస్తావిస్తారు. 'చిక్కుడూ ఆకులో ఉయ్యాలో... సద్దులు పెట్టేము ఉయ్యాలో' అంటూ నైవేద్యాల విశేషాలను వివరిస్తారు. వేడుకల్లో చివరి రోజైన ఆశ్వయుజ శుద్ధ అష్టమి నాడు గౌరిని మెట్టినింటికి పంపే సంరంభం వైభవంగా జరుగుతుంది. ఇంటి ఆడపడుచులకు ఒడిబియ్యం పోసి, చీరసారెలతో మెట్టినింటికి పంపినట్టు... బతుకమ్మను సాగనంపుతారు.

శ్రీగౌరి నీ పూజ ఉయ్యాలో - చిత్రములో తలతుమమ్మ ఉయ్యాలో
మా లక్ష్మి మా గౌరి ఉయ్యాలో - పోయి రావమ్మ ఉయ్యాలో
కైలాసగిరివాసి ఉయ్యాలో - శంకరీ పార్వతీ ఉయ్యాలో

... అంటూ బరువెక్కిన హృదయాలతో వీడ్కోలు చెబుతారు. అష్టమినాటి చంద్రకళలు ప్రసరిస్తూ ఉండగా... బతుకమ్మలను నిమజ్జనం చేస్తారు. అంతటితో బతుకమ్మ సంబరాలు ముగుస్తాయి. ఇది పూల పండుగ, ఆడపిల్లల పండుగ, అక్కచెల్లెళ్ళ పండుగ, అమ్మ అమ్మమ్మల పండుగ. అందరికీ ఆటా పాటా నేర్పే పండుగ. సంగీత, సాహిత్య, నాట్యాల మేళవింపుగా... వర్ణ, వర్గ విచక్షణ లేకుండా సమైక్యతను చాటి చెప్పే పండుగ.

• ఆయపిళ్ళ రాజపాప

(అక్టోబర్ 2 నుంచి బతుకమ్మ పండుగ)

సద్బోధ

సన్యాసి హితవు

ఒక ఊరిలో ఒక వ్యక్తి తన భార్యతో కలిసి చిన్న గుడిసెలో నివసించేవాడు. చిన్న చిన్న పనులు చేసేవాడు. వచ్చిన దానితోనే ఆ భార్యాభర్తలు సంతోషంగా జీవించేవారు. వారికి ప్రాపంచికమైన వేరే ఆశయాలు కానీ, కోరికలు కానీ, ఎవరి మీదా అసూయ కానీ, ద్వేషం కానీ ఉండేవి కావు.

వారికి పొరుగున చాలా ధనవంతుడు ఉండేవాడు. అతను ఎప్పుడూ ఆందోళనతో ఉండేవాడు. తన సంపదను కాపాడుకోవడం మీదే దృష్టి ఉండడంతో... అతనిలో సంతోషం కనిపించేది కాదు.

ఒకసారి ఆ ఊరికి ఒక సన్యాసి వచ్చాడు. గ్రామస్థులందరూ ఆయనను తమ ఇళ్ళకు ఆహ్వానించారు. పేదా, గొప్పా అనే తారతమ్యం లేకుండా అందరి ఇళ్ళనూ ఆయన సందర్శించాడు. అలాగే ఆ ధనవంతుడి భవనానికి కూడా వచ్చాడు. ధనవంతుడు ఆయనను సాదరంగా ఆహ్వానించాడు. మంచి ఆతిథ్యం ఇచ్చాడు. సన్యాసి విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో ఆయనను సమీపించి "స్వామీ! నాకు ఎప్పుడూ ఆందోళనగా ఉంటుంది. భయం వేస్తూ ఉంటుంది. మనసులో స్థిమితం ఉండదు. దీన్ని ఎలా తగ్గించుకోవాలి?" అని అడిగాడు.

"నువ్వు నీ ఆధీనంలో లేవు. నీ సంపద ఆధీనంలో ఉన్నావు. నీకు మనశ్శాంతి లేకపోవడానికి కారణం అదే" అన్నాడు సన్యాసి.

"అదేమిటి స్వామీ? సంపదకూ, మనశ్శాంతి లేకపోవడానికి సంబంధం ఏమిటి?" అని ప్రశ్నించాడు ధనికుడు.

అప్పుడు అతని పొరుగున ఉన్న పేదవాణ్ణి ఆ సన్యాసి చూపిస్తూ "అతణ్ణి చూడు. అతనికి ఆస్తిపాస్తులేవీ లేవు. అతని ముఖంలో సంతోషాన్ని గమనించు. అతను ఎప్పుడూ ఏదో ఒక పని చేస్తూ ఉంటాడు. కనుక దృఢంగా ఉన్నాడు. శారీరకంగా కష్టపడతాడు కాబట్టి ఆరోగ్యంగా ఉన్నాడు. ఇంకా ఏదో కావాలని ఆశించడు కాబట్టి మానసిక ప్రశాంతతతో ఉన్నాడు" అన్నాడు.

"అతను ఎప్పుడూ అలాగే ఉన్నాడు. డబ్బు వల్ల మనిషిలో మార్పు వస్తుందంటే నేను నమ్మను. అలాగే డబ్బు కారణంగానే మనశ్శాంతి ఉండదనే మాటలో కూడా నాకు విశ్వాసం లేదు" అన్నాడు ధనవంతుడు.

"సరే! ఆ సంగతి ప్రత్యక్షంగానే తెలుసుకుందాం" అన్నాడు సన్యాసి.

సన్యాసి ఇచ్చిన సలహా ప్రకారం... ఆ రోజు రాత్రి పేదవాడి ఇంట్లో 99 వెండి నాణేలను ధనవంతుడు దొంగతనంగా పడేశాడు.

మర్నాడు తెల్లవారింది. ధనవంతుడు, సన్యాసి ఆ పొరుగింట్లో ఏం జరుగుతోందో గమనిస్తున్నారు. రోజూ ఆ సమయానికి ఆ ఇంటి ఇల్లాలు వంట పనుల్లో నిమగ్నమై ఉండేది. కానీ పగటిపూట అలాంటి ఛాయలేమీ కనిపించలేదు. ఆ పేద వ్యక్తి ఎప్పటిలాగే పనిలోకి వెళ్ళాడు. రాత్రికి తిరిగి వచ్చాడు. అప్పుడు కూడా ఆ ఇంట్లో వంట జరిగిన సూచనలేవీ లేవు. ఆ మరుసటి రోజు పొద్దున్న కూడా అదే పరిస్థితి. మరికాసేపట్లో ఆ పేదవాడు ఇంటినుంచి బయలుదేరుతాడనగా... సన్యాసి, ధనవంతుడు అతని ఇంటికి వెళ్ళారు.



"నిన్నటి నుంచి గమనిస్తున్నాను. మీ ఇంట్లో వంట చేస్తున్నట్టు కానీ, మీరు భోజనం చేస్తున్నట్టు కానీ కనిపించడం లేదు. ఏం జరిగింది?" అని సన్యాసి ప్రశ్నించాడు.

అప్పుడు ఆ పేదవాడు "స్వామీ! నిన్న తెల్లవారుజామున మా ఇంటి గుమ్మం ముందు ఏ దేవతో 99 వెండి నాణేల మూటను పడేసింది. వాటిని చూడగానే... వంద నాణేలు చేస్తే బాగుంటుందని నేను, నా భార్య అనుకున్నాం. దానికోసం డబ్బు దాచాలనుకున్నాం. రోజు విడిచి రోజు భోజనం చేస్తే... రెండు వారాల్లో మరో వెండి నాణేనికి సరిపడే డబ్బు పోగవుతుందని నిర్ణయించుకున్నాం. అందుకే నిన్న సరుకులు తేలేదు, వండుకోలేదు. ఇవాళ రాత్రి మళ్ళీ వండుకుంటాం" అని వివరించాడు.

అప్పుడు సన్యాసి "మనకు ఉన్నదానితో సంతృప్తి చెందితే ఈ సమస్యా ఉండదు. సంపద ఎక్కువయిన కొద్దీ ఇంకా సంపాదించాలనే అత్యాశ పెరుగుతుంది. దానివల్ల సంతోషం దూరమవుతుంది. కూడబెట్టుకోవలసింది ఆనందాన్నే తప్ప సంపదను కాదు. 99 నాణేలు కంటికి కనబడగానే ఆ పేద దంపతులకు వాటిని వంద చెయ్యాలనే ఆశ కలిగింది. అది వాళ్ళను తిండికి, మనశ్శాంతికి దూరం చేసింది. అలాంటిది ఇంత సంపద ఉన్న నువ్వు మనశ్శాంతిగా ఎలా ఉండగలవు? ఉన్నది చాలు... ఇంకా ఇంకా కావాలని వెంపర్లాడడం మానుకో. ఆ తరువాత నీలో కలిగే మార్పు నీకే స్పష్టంగా తెలుస్తుంది" అని ధనవంతుడికి హితవు చెప్పాడు.

• స్వామి రామతీర్థ

చింతన

ఆచరణాత్మకతే ప్రమాణం

సముద్రపు లోతును ఒక చేప ఎప్పటికీ కొలవలేదు. అదే విధంగా అనంతుడైన భగవంతుణ్ణి పరిమితమైన మేధస్సుతో మనం ఎన్నటికీ కొలవలేం. కాబట్టి మనకు ఉన్న పరిమితులలోనే దైవాన్ని అవగాహన చేసుకోవడానికి ప్రయత్నించాలి. మన అందరి లోపలా దైవికమైన స్పృహ ఉంటుంది. దానిని మనం గుర్తించం. ఎందుకంటే... అంతరంగంకన్నా మనకు శరీరం ప్రధానం. శరీరం ద్వారానే ఇతరులను గుర్తిస్తాం, మనల్ని గుర్తించాలని కోరుకుంటాం. అందంగా కనిపించాలనుకుంటాం. దానికోసం ఎన్నో సౌందర్య సాధనాలను ఉపయోగిస్తాం. మన శరీరం నుంచి చెమట వాసన రాకుండా ఉండడానికి అత్తరులు పూసుకుంటాం. కానీ అంతర్గత శుద్ధి కోసం మనం ఏం చేస్తున్నాం? ఈ స్పృహ మనలో కలగాలంటే... జ్ఞానాన్ని పొందడం అవసరం. అది పొందినప్పుడు... జీవితం ఒక మహా గ్రంథం అవుతుంది. ఇతరులు దాని నుంచి మంచి విషయాలు నేర్చుకోగలుగుతారు.

జీవితంలో మనకు ఎదురయ్యే ప్రతి సందర్భం ఆ భగవంతుడు మనకు పెడుతున్న పరీక్ష అనే అవగాహనను మనలో అభివృద్ధి చేసుకోవాలి. మనం నేర్చుకున్నవాటిని బాగా గుర్తుంచుకోవాలి. మనకు ఎదురయ్యే పరీక్షలో నెగ్గడానికి సాధనాలుగా వాటిని ఉపయోగించుకోవాలి.

గొప్ప గ్రంథాలు చదివితే గొప్ప జ్ఞానం వస్తుందని మనం అనుకుంటాం. అది సత్యమే కానీ... మన చుట్టూ ఉన్నవాళ్ళను పరిశీలిస్తే అంతకన్నా గొప్ప విషయాలు తెలుస్తాయి. గ్రంథాలలోని విశేషాలను ఆశ్రమాల్లో బోధిస్తూ ఉంటారు. అక్కడికి వెళ్ళిన ప్రతి ఒక్కరూ వాటి గురించి తెలుసుకుంటారు. కానీ ఏ గ్రంథం సారాంశమైనా క్రియారూపంలోకి వచ్చినప్పుడే రాణిస్తుంది. ఆచరణాత్మకతే దేనికైనా ప్రమాణం. మనం చదివిన, విన్న గ్రంథాల సారాన్ని ఇతరులతో మనం వ్యవహరించేటప్పుడు ఆచరణలోకి తీసుకురావాలి. ఆ బోధలను జీవితంలో అనుసరించినప్పుడే వాటికి సార్థకత.



జీవితంలో మనకు ఎదురయ్యే ప్రతి సందర్భం ఆ భగవంతుడు మనకు పెడుతున్న పరీక్ష అనే అవగాహనను మనలో అభివృద్ధి చేసుకోవాలి. మనం నేర్చుకున్నవాటిని బాగా గుర్తుంచుకోవాలి. మనకు ఎదురయ్యే పరీక్షలో నెగ్గడానికి సాధనాలుగా వాటిని ఉపయోగించుకోవాలి. ఇతరులతో వ్యవహరిస్తున్నప్పుడు ప్రశాంతంగా, సహనంతో, సామరస్యంతో ఉండగలుగుతున్నామా? యాంత్రికంగా ప్రవర్తిస్తున్నామా? గ్రంథాల్లో చదివిన మంచి విషయాలను ఇతరుల ముందు వల్లె వెయ్యడానికి మాత్రమే పరిమితం చేస్తున్నామా? అలాంటప్పుడు మనకూ, టేప్ రికార్డర్‌కూ మధ్య తేడా ఏముటుంది?

మంచి విషయాలను ఆచరించి ఎదుటివారికి చూపించాలి. వారిలో ప్రేరణ కలిగించాలి. 'తేనె' అనే పదాన్ని కాగితం మీద రాసి, దాన్ని నాకినంతమాత్రాన... తేనె తియ్యదనాన్ని రుచి చూడగలమా? ప్రతి ఒక్కరి ముందూ 'మేము మంచి వాళ్ళం' అని చెప్పుకోగలమేమో... కానీ మన మంచితనం రుచి మన ప్రవర్తన ద్వారానే వాళ్ళకు కనిపిస్తుంది.

• మాతా అమృతానందమయి

(నేడు మాతా అమృతానందమయి 71వ జన్మదినం)

గీతాసారం

కర్మాచరణ తప్పనిసరి

"నీవు శాస్త్రవిహితమైన కర్తవ్య కర్మలను ఆచరించు. ఎందుకంటే కర్మలను చెయ్యకుండా ఉండడం కన్నా చెయ్యడం ఉత్తమం. కర్మలను ఆచరించకపోతే... నీ శరీర నిర్వహణ కూడా సాధ్యం కాదు" అని శ్రీకృష్ణుడు స్పష్టం చేశాడు. ఆహారాన్ని సేకరించడం, భోజనం చేయడం లాంటి చర్యలు మానవ శరీరం మనుగడకు అవసరం. మానవ శరీరం అనేక అవయవాలను, వ్యవస్థలను, రసాయనాలను కలిగి ఉంటుంది. ఇవి క్రమం తప్పకుండా వేలాది అంతర్గత చర్యలను సాగిస్తూ ఉంటాయి. వాటిలో ఒక్కటి క్రమం తప్పినా... శరీరం తన అంతర్గత సామరస్యాన్ని కోల్పోతుంది, రోగగ్రస్తం అవుతుంది, లేదా నశిస్తుంది. అంటే శరీర నిర్వహణ... నిష్క్రియాత్మకంగా సాధ్యం కాదు.



శ్రీకృష్ణుడు నియత కార్యాలు లేదా నియత చర్యల గురించి మాట్లాడాడు. అది ఒక క్లిష్టమైన తత్త్వ జ్ఞానం. సమాజం మనమీద విధించిన కట్టుబాట్లు, పవిత్ర గ్రంథాలు ప్రశంసించిన ఆచారాలు లేదా విధులు సాధారణంగా నియత కార్యాలుగా పరిగణన పొందుతాయి. కానీ శ్రీకృష్ణుడు ఏది చెబుతున్నాడో దాన్ని ప్రతిఫలించడంలో ఈ రెండూ విఫలమవుతాయి. చిన్న విత్తనం విశాలమైన చెట్టుగా మారినట్టు, చిన్న కణం జన్యువులలో (జీన్స్ లో) ఉన్న సూచనలను అమలు చేయడం ద్వారా సంక్లిష్టమైన మానవ శరీరంగా అభివృద్ధి చెందినట్టు ఈ భౌతిక ప్రపంచంలో అత్యున్నత సామర్థ్యాన్ని సాధించడమే మన బాధ్యత. కణాల కోసం జన్యువులలోని సూచనల మాదిరిగా... ప్రతి ఒక్కరి కర్మ వారి గుణాల ద్వారా ఎంపిక అవుతుందని అర్థం చేసుకోవాలి.



ఇది మన పూర్తి సామర్థ్యాలతో సర్వోత్తమమైన కృషిని చేయడం. ఇదంతా 'మనం ఏం చేస్తున్నాం?' అనే దాని గురించి కాదు. 'ఏ పనినైనా ఎంత బాగా చేస్తున్నాం?' అనే దాని గురించి. మన భౌతిక శక్తి, అనుభవం, సమయం తదితరాల మీద ఆధారపడి మనలోని ప్రతి ఒక్కరికీ సర్వశ్రేష్ఠం అనే నిర్వచనం వేర్వేరుగా ఉంటుందనే విషయాన్ని అర్థం చేసుకోవాలి. అది కొన్నిసార్లు కేవలం ఉనికి, నిశ్శబ్దం లేదా సానుభూతితో వినడం కూడా కావచ్చు. ఇది మనల్ని ఆ శాశ్వతమైన స్థితి అయిన మోక్షానికి (గుణాలను అధిగమించడం) తీసుకువెళ్తుంది. ఇదే మన నియత కార్యం. దాన్ని మనం చెయ్యాల్సిందే తప్ప ఎంచుకోలేం. ఎందుకంటే మన జీవితంలో అతి పెద్ద సంఘటన అయిన పుట్టుకే మనం చేసుకున్న ఎంపిక కాదు.



కె. శివప్రసాద్
ఐఎఎస్

సద్గురువాణి

జ్ఞానోదయం అంటే...

ఆధ్యాత్మిక చింతనకు సంబంధించి అనేక పదాలను మనం వింటూ ఉంటాం. వాటిలో 'జ్ఞానోదయం' అనే మాట ఒకటి. ఇది చాలా దుర్వినియోగం అవుతున్న మాట. నిజంగా జ్ఞానోదయం పొందడానికి, కేవలం మాటలతో మభ్యపెట్టడానికి చాలా తేడా ఉంది.

యమవోకా టెస్సు ఒక జెన్ విద్యార్థి. అతను అనేక మంది జెన్ గురువుల దగ్గర విద్యాభ్యాసం చేస్తూ... జపాన్ అంతటా తిరుగుతూ ఉండేవాడు. ఒక రోజు అతను షోకోకు దేవాలయానికి వెళ్ళాడు. అక్కడ డొకువాన్ అనే సన్యాసిని కలుసుకున్నాడు. తన జ్ఞానాన్ని ఆయన ముందు ప్రదర్శించాలనుకున్నాడు.

"మనసు, బుద్ధుడు, ఇంకా అన్ని జీవులు శూన్యమే. అన్నిటి వాస్తవ స్వభావం శూన్యమే. జ్ఞానోదయం లేదు, మాయ లేదు, సన్యాసులు లేరు, సామాన్యులు లేరు, శ్రమ లేదు, ప్రతిఫలం లేదు... అంతా శూన్యం" అన్నాడు డొకువాన్‌తో.



ఆ మాటలు విన్న డొకువాన్ కొద్దిసేపు నిశ్శబ్దంగా ఉన్నాడు. తరువాత టెస్సు తల మీద గట్టిగా కొట్టాడు.

"ఎందుకిలా చేశారు?" అని అడిగాడు టెస్సు కోపంగా.

అప్పుడు డొకువాన్ "అంతా శూన్యమే అయితే... ఈ కోపం ఎక్కడినుంచి వచ్చింది?" అని ప్రశ్నించాడు.

టెస్సు ఎక్కడో చదివినదాన్ని పట్టుకొని వేలాడుతూ... తాను శూన్యమనీ, ప్రతిదీ శూన్యమనీ చెబుతూ వస్తున్నాడు. ఒక్కసారి తల మీద దెబ్బ తగలగానే అతనికి కోపం వచ్చింది. అంతా శూన్యమే అయి ఉంటే... మీలో ఎటువంటి నిర్బంధం లేకపోతే... ఆ కోపం ఎలా వస్తుంది? ఇది ఏదైనా లక్ష్యంకోసం ఎరుకతో ప్రదర్శించిన కోపం కాదు. ఎవరో తలమీద కొట్టగానే ఒక్కసారిగా ముంచుకొచ్చిన కోపం.

ఇలాంటి తీవ్రమైన ప్రతిస్పందనలను, అహంకారాన్ని విడిచిపెడితేనే జ్ఞానోదయం అవుతుంది. జ్ఞానోదయం అంటే అది ప్రత్యేకంగా సాధించే విషయం కాదు. అది తిరిగి ఇంటికి రావడం లాంటిది. అందులోని విశేషం ఏమిటంటే... మీరు పరమ సాధారణంగా మారిపోతారు. ఆ తరువాత మీ సొంత విషయాలంటూ ఏవీ ఉండవు. మీదంటూ ఏదీ ఉండదు. అంతా మీదే అయినట్టు లేదా ఏదీ మీది కానట్టు... ఈ స్థితికి చేరుకుంటారు. అటువంటి స్థితిలో ఎలాంటి నిర్బంధత్వం ఉండదు.

ఈ సంగతి గ్రహించకుండా... జ్ఞానోదయం గురించి మాట్లాడడం బాధ్యతారాహిత్యం. ఎందుకంటే మూర్ఖులందరూ ఈ పదాలను పట్టుకొని... ఇతరులను మోసం చేయడానికో, మరీ ముఖ్యంగా తమను తాము భ్రమింపజేసుకోవడానికో ఉపయోగిస్తారు. ఇలా ప్రతిచోటా జరుగుతూనే ఉంటుంది. పాతికవేల రూపాయలు పుచ్చుకొని... మీకు జ్ఞానోదయం అయిందని ప్రకటించే చిత్తశుద్ధిలేని గురువులు కూడా నేటి సమాజంలో ఉన్నారు. అలాంటి జ్ఞానోదయమే మీకు కావాలంటే... మీ డబ్బు వృథా చేసుకోకండి. "నాకు జ్ఞానోదయం అయింది" అని మీకు మీరే ప్రకటించుకోండి. ఎందుకంటే... ఈ రెండిటికీ పెద్ద తేడా ఏమీ లేదు.

• సద్గురు జగ్గీవాసుదేవ్


సుభాషితం

తొందరపాటు కూడదు

గుణవ దగుణవ ద్వా కుర్వతా కార్య మాదౌ
పరిణతి రవధార్యా యత్నతః పండితేన
అతిరభస కృతానాం కర్మణా మావిపత్తే
ర్భవతి హృదయదాహీ శల్యతుల్యో విపాకః

ఏదైనా పని చేయడానికి ముందు ఆలోచించాల్సిన అవసరం గురించి నీతి శతకంలో భర్తృహరి వివరించిన శ్లోకం ఇది. దాన్ని...

సగుణ నిర్గుణ కార్యముల్ సలుపు సుమతి
చేత పరిణతి గడు ప్రతీక్షింపదగును
బరుష కర్మ విపాకంబు ఫలముదనుక
హృదయము దహించు శల్యంబు రీతి జగత్...




అంటూ ఏనుగు లక్ష్మణకవి తెలుగువారికి సమర్పించారు.

భావం: పండితుడు, బుద్ధిమంతుడు అయిన వ్యక్తి తను ఏదైనా పని చెయ్యాలని అనుకున్నప్పుడు... 'ఈ పని మంచిదా? చెడ్డదా? దాని పర్యవసానం ఏమిటి? దానివల్ల ఎలాంటి ఫలితం కలుగుతుంది?' అని బాగా ఆలోచించాలి. ఆ తరువాతే ఆ పని చెయ్యాలి. అలాకాకుండా తొందరపాటుతో ఏదైనా పని చేసి, దాని వల్ల దుష్ఫలితం కలిగినప్పుడు కలిగే వేదన... మరణించే వరకూ గుండెల్లో బాణం గుచ్చుకున్నట్టు మరణించేవరకూ మనిషిని బాధపెడుతూనే ఉంటుంది, నిరంతరం దహిస్తూనే ఉంటుంది.

ఆ సన్నివేశాలు తొలగిస్తే ఓకే

• హైకోర్టుకు తెలిపిన సెన్సార్ బోర్డు



తాము సూచించిన సన్నివేశాలకు కత్తెర వేస్తే 'ఎమర్జెన్సీ' చిత్రానికి సెన్సార్ సర్టిఫికెట్ ఇస్తామని సెన్సార్ బోర్డు బాంబే హైకోర్టుకు తెలిపింది. కంగనా రనౌత్ నటించిన 'ఎమర్జెన్సీ' చిత్రానికి సెన్సార్ సర్టిఫికెట్ రాకపోవడంతో పలుమార్లు విడుదల వాయిదా పడింది. దీంతో ఆమె బాంబే హైకోర్టును ఆశ్రయించగా, సర్టిఫికెట్ జారీ చేసే విషయంలో ఈ నెల 25లోగా ఓ నిర్ణయం తీసుకోవాలని సెన్సార్ బోర్డ్‌ను హైకోర్టు ఆదేశించింది. ఈ కేసు గురువారం విచారణకు రాగా, కొన్ని సన్నివేశాల్లో కట్స్‌ను సూచించిన సెన్సార్‌బోర్డ్ అందుకు అంగీకరిస్తే సెన్సార్ సర్టిఫికెట్ ఇస్తామని కోర్టుకు నివేదించింది. దీనిపై నిర్ణయం తీసుకోవడానికి చిత్రబృందం సమయం కోరింది. దీంతో కోర్టు తదుపరి విచారణను ఈ నెల 30కు వాయిదా వేసింది. ఆలోగా ఓ నిర్ణయానికి రావాలని నిర్మాణసంస్థను ఆదేశించింది. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జీవితం, ఎమర్జెన్సీ నాటి సంఘటనల నేపథ్యంలో 'ఎమర్జెన్సీ' తెరకెక్కింది. కంగన ఇందిరాగాంధీ పాత్రను పోషించడంతో పాటు స్వీయ దర్శకత్వంలో నిర్మించారు.

జస్ట్ ఆస్కింగ్.. అంటూ ట్వీట్ల మీద ట్వీట్లు



విలక్షణ నటుడు ప్రకాశ్ రాజ్ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటారు. వివిధ అంశాలపై స్పందిస్తూ 'జస్ట్ ఆస్కింగ్' అంటూ ప్రశ్నలు సంధిస్తుంటారు. తిరుమల లడ్డు వివాదంపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు, ప్రకాశ్‌రాజ్‌కు మధ్య మూడు రోజుల క్రితం మొదలైన ట్వీట్ యుద్ధం ఇంకా కొనసాగుతూనే ఉంది. ప్రకాశ్‌రాజ్ పోస్టులపై పవన్‌కల్యాణ్ అసహనం వ్యక్తం చేయడమే కాకుండా సనాతన ధర్మంపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని మీడియా సమావేశంలో హెచ్చరించడంతో ఈ ట్వీట్ల అటాక్ మొదలైంది. 'నేను విదేశాల్లో ఉన్నా.. ఇండియా వచ్చిన తర్వాత మీ ప్రశ్నలకు సమాధానం చెబుతా' అని ప్రకాశ్‌రాజ్ ట్వీట్ చేశారు. అంతటితో ఈ వ్యవహారం ముగిసిందని అందరూ భావించారు. కానీ ప్రకాశ్‌రాజ్ ఊరుకోలేదు. తమిళ హీరో కార్తీ లడ్డు వ్యవహారంపై క్షమాపణ చెప్పడాన్ని ప్రస్తావిస్తూ 'చేయని తప్పునకు క్షమాపణలు చెప్పించుకోవడంలో ఆనందం ఏమిటో.. జస్ట్ ఆస్కింగ్' అంటూనే వ్యంగ్య బాణం వదిలారు. అయితే ఈ ట్వీట్‌పై పవన్‌కల్యాణ్ స్పందించలేదు. ఆయన మౌనంగా ఉన్నా ఊరుకోకుండా గురువారం మరో ట్వీట్ బాణం వదిలారు ప్రకాశ్‌రాజ్. 'గెలిచే ముందు ఒక అవతారం.. గెలిచాక మరో అవతారం .. ఏమిటీ అవాంతరం.. ఎందుకీ అయోమయం.. ఏది నిజం.. జస్ట్ ఆస్కింగ్' అంటూ తనదైన శైలిలో ప్రశ్నించారు. ప్రకాశ్‌రాజ్ పెట్టిన ఈ ట్వీట్ పై నెటిజన్లు రకరకాలుగా కామెంట్లు పెడుతున్నారు.



ఉత్సవంలా సాగే పాట

శంకర్

రామ్‌చరణ్ కథానాయకుడిగా శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన పాన్ ఇండియా చిత్రం 'గేమ్ చేంజర్'. కియారా అద్వానీ కథానాయిక. దిల్‌రాజు-శిరీష్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం నుంచి రెండో గీతాన్ని ఈ నెల 30న విడుదల చేయనున్నారు. గురువారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో శంకర్, సంగీత దర్శకుడు తమన్ ఈ పాట చిత్రీకరణకు సంబంధించిన విశేషాలను పంచుకున్నారు. శంకర్ మాట్లాడుతూ 'ఈ పాట చిత్రీకరణ కోసం చాలా పరిశోధన చేశాం. దేశంలోని భిన్న ప్రాంతాలకు చెందిన నృత్యరీతులను పాటలో భాగం చేశాం. ఒక ఉత్సవంలా ఈ పాట సాగుతుంది. రామ్‌చరణ్ అద్భుతంగా నర్తించారు' అని చెప్పారు. తమన్ మాట్లాడుతూ "రా మచ్చా... పాటలో విభిన్న సంస్కృతులను చూపించబోతున్నాం. పాటను తెరపై చూస్తున్నప్పుడు ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తారు' అని తెలిపారు.



టాలీవుడ్ అగ్ర దర్శకులు రాజమౌళి, సుకుమార్ అనూహ్య కలయిక అందరినీ సర్‌ప్రైజ్ చేసింది. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు స్టూడియోలో 'పుష్ప2' చిత్రీకరణ జరుగుతోంది. మహేశ్‌బాబుతో తాను చేయబోయే సినిమా పనుల కోసం రాజమౌళి కూడా అదే స్టూడియోకు వెళ్లారు. అక్కడ వారిద్దరు కలుసుకున్నారు.

ఆకట్టుకునే అలియా పోరాటం



బాలీవుడ్ హీరోయిన్ అలియాభట్ ప్రధాన పాత్ర పోషించిన చిత్రం 'జిగ్రా'. వాసన్ బాలా దర్శకత్వంలో కరణ్ జోహార్ నిర్మించారు. అలియాభట్ సోదరుడి పాత్రలో వేదాంగ్ రైనా నటించాడు. అక్టోబర్ 11న విడుదలవుతోంది. చిత్రబృందం గురువారం ట్రైలర్‌ను విడుదల చేసింది. హంతక ముఠాల నుంచి తమ్ముణ్ణి కాపాడుకునేందుకు అక్క చేసిన పోరాటం నేపథ్యంలో తెరకెక్కిన చిత్రమిది. యాక్షన్ సన్నివేశాల్లో అలియా నటన ఆకట్టుకుంది.

మనసుకి హత్తుకొనే తల్లి కథ



సీనియర్ దర్శకుడు ముత్యాల సుబ్బయ్య ఆశీస్సులతో ఆయన తనయుడు కిశోర్ చిత్రనిర్మాణరంగంలోకి అడుగుపెట్టి నిర్మిస్తున్న 'తల్లి మనసు' చిత్ర షూటింగ్ పార్ట్ పూర్తయింది. రచిత మహాలక్ష్మి, కమల్ కామరాజు, సాత్విక్, సాహిత్య ప్రధాన తారాగణం. ఈ సినిమాతో వి.శ్రీనివాస్ (సిప్పి) దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈ సందర్భంగా నిర్మాత ముత్యాల కిశోర్ మాట్లాడుతూ 'సినిమా ప్రారంభోత్సవం నాడు సింగిల్ షెడ్యూల్‌లో చిత్రాన్ని పూర్తి చేస్తామని చెప్పినట్టే హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఏకధాటిగా షూటింగ్ చేసి వర్క్ పూర్తి చేశాం. మంచి కథ, కథనాలు సినిమాకు ప్రధాన బలం. అందుకు తగ్గ ఆర్టిస్టులు దొరికారు. వారందరి సహకారంతో మనసు కట్టి పడేసే అద్భుత చిత్రంగా రూపుదిద్దుకుంది. నాన్నగారి పర్యవేక్షణలో దర్శకుడు చక్కగా సినిమా తీశారు. తొలి ప్రయత్నంలోనే ఒక మంచి సినిమా తీసినందుకు ఆనందంగా ఉంది' అన్నారు. వాస్తవిక జీవితానికి అద్దం పట్టే విధంగా 'తల్లి మనసు' ఉంటుందని, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయని ముత్యాల సుబ్బయ్య చెప్పారు.



యాభై సెకన్ల యాడ్‌కు రూ. ఐదు కోట్లా!?

కాలం కలిసి రావాలే కానీ సినిమా తారలకు ఇప్పుడు రెండు చేతులా సంపాదనే!. అయితే సినిమా షూటింగ్ లేకపోతే యాడ్ షూటింగ్ అన్నట్లుగా ఉంది కొంతమంది తారల బిజీ షెడ్యూల్. రెండు చోట్లా మంచి డబ్బు వస్తుండడంతో మరింత హుషారుగా పని చేస్తున్నారు. ఒక సినిమా కోసం మూడు, నాలుగు నెలలు కష్టపడితే వచ్చే పారితోషికం కంటే ఒక నిముషం పాటు కనిపించే యాడ్ ఫిల్మ్ సంపాదనే ఎక్కువగా ఉండడంతో తెలుగులోనూ చాలా మంది తారలు ఇప్పుడు యాడ్ ఫిల్మ్స్‌లో నటించడానికి ఆసక్తి చూపిస్తున్నారు. అందరి కంటే ఒక అడుగు ముందుకు వేసి యాభై సెకన్ల యాడ్ ఫిల్మ్‌లో నటించినందుకు అక్షరాలా రూ. ఐదు కోట్లు వసూలు చేసి వార్తల్లో నిలిచారు నయనతార. ఇంతకుముందు నయనతార పారితోషికం రూ. ఐదు కోట్లే ఉండేది. కానీ హిందీ చిత్రం 'జవాన్' సూపర్ హిట్ అయిన తర్వాత అమాంతం తన పారితోషికాన్ని పది కోట్ల రూపాయలకు నయనతార పెంచేసిందని నిర్మాతలు చెబుతున్నారు. అంటే సౌత్‌లో నే అత్యధిక పారితోషికం తీసుకొనే హీరోయిన్ నయనతారే అన్నమాట. ఇప్పుడు యాడ్ ఫిల్మ్స్‌తోనూ ఆమె మోత మోగిస్తోంది. ప్రస్తుతం నయనతార తన భర్త విఘ్నేశ్, కవల పిల్లలతో గ్రీస్‌లో జాలీగా విహరిస్తోంది.

అక్టోబర్‌లో గ్యాంగ్‌స్టర్



మాఫియా ముఠాల మధ్య ఆధిపత్య పోరును సరికొత్తగా వెండితెరపై ఆవిష్కరించిన పలు చిత్రాలు విజయం అందుకున్నాయి. ఇప్పుడు ఇదే తరహా కథాంశంతో తెరకెక్కుతోన్న చిత్రం 'గ్యాంగ్‌స్టర్'. చంద్రశేఖర్ రాథోడ్, కాశ్వీ కాంచన్ జంటగా నటిస్తున్నారు. చంద్రశేఖర్ రాథోడ్ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. అక్టోబర్ 25న విడుదల చేస్తున్నట్లు చిత్రబృందం గురువారం ప్రకటించింది. ఈ సందర్భంగా రచయిత సాయిమాధవ్ బుర్రా చేతుల మీదుగా రిలీజ్ డేట్ పోస్టర్‌ను యూనిట్ విడుదల చేసింది. ఈ చిత్రంలో ప్రతి సన్నివేశం ప్రేక్షకలను ఆకట్టుకునేలా ఉంటుందనీ, కథలోని మలుపులు ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తాయని చంద్రశేఖర్ రాథోడ్ తెలిపారు.

అప్‌డేట్స్


మా మనవడినీ ఆదరించండి

- పరుచూరి బ్రదర్స్




సుదర్శన్ పరుచూరి హీరోగా పరిచమయవుతున్న 'మిస్టర్ సెలబ్రిటీ' చిత్రం అక్టోబర్ 4న విడుదల కానుంది. రవికిశోర్ దర్శకత్వంలో చిన్న రెడ్డయ్య, ఎన్. పాండురంగారావు నిర్మించారు. వరలక్ష్మి శరత్‌కుమార్, నాజర్, రఘుబాబు ఇతర ముఖ్య పాత్రధారులు. ఈ సినిమా రిలీజ్ పోస్టర్‌ను పరుచూరి గోపాలకృష్ణ విడుదల చేసి 'మమ్మల్ని ఆదరించినట్లుగానే మా మనవడు సుదర్శన్‌ను ఆదరించాలని కోరుతున్నా. కొత్త దర్శకుడైనా రవికిశోర్ సినిమా బాగా తీశాడు' అని అభినందించారు. పరుచూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 'మమ్మల్ని నలభై ఏళ్లుగా ఆదరిస్తున్నారు. మా మనవడు సుదర్శన్ 'మిస్టర్ సెలబ్రిటీ' హీరోగా మీ ముందుకు వస్తున్నాడు. తనని ఆశీర్వదించి, సినిమాను హిట్ చేయండి' అని కోరారు.

మాస్ లుక్‌తో



యువ చంద్రకృష్ణ, అనన్య నాగళ్ల లీడ్‌రోల్స్‌లో నటిస్తున్న చిత్రం 'పొట్టేల్'. దసరాకు ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. నటుడు అజయ్ కీలకపాత్ర పోషిస్తున్నారు. తాజాగా ఆయన లుక్‌ను యూనిట్ విడుదల చేసింది. మాస్ లుక్‌లో పవర్‌ఫుల్‌గా కనిపించారు అజయ్. సాహిత్ మోత్కూరి దర్శకత్వంలో నిశాంక్‌రెడ్డి కె, సురేశ్ కుమార్ సడిగె ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సంగీతం: శేఖర్ చంద్ర, సినిమాటోగ్రఫీ: మోనిష్ భూపతి రాజు



కొండా లక్ష్మణ్ వర్సిటీలో ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ



సిద్దిపేట్ జిల్లా ములుగులోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ స్టేట్ హార్టికల్చరల్ యూనివర్సిటీ(ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ)- ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. అకడమిక్ ప్రతిభ, నిర్దేశిత ఎంట్రెన్స్ ఎగ్జామ్ స్కోర్, కౌన్సెలింగ్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.

ఎమ్మెస్సీ(హార్టికల్చర్): ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. మొత్తం 30 సీట్లు ఉన్నాయి. వీటిలో ఫ్రూట్ సైన్స్ 8, వెజిటబుల్ సైన్స్ 11, ఫ్లోరికల్చర్ అండ్ ల్యాండ్ స్కేప్ ఆర్కిటెక్చర్ 8, ప్లాంటేషన్-స్పయిసెస్-మెడిసినల్ అండ్ అరోమాటిక్ క్రాప్స్ 3 సీట్లు ఉన్నాయి.

అర్హత: ఐకార్ గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బీఎస్సీ ఆనర్స్(హార్టికల్చర్)/బీఎస్సీ(హార్టికల్చర్) ఉత్తీర్ణులై ఉండాలి. 10 పాయింట్ల స్కేల్ మీద కనీసం 5.5 ఓజీపీఏ ఉండాలి. ఐకార్ ఏఐఈఈఏ(పీజీ)2024 ఎంట్రెన్స్ ఎగ్జామ్‌లో స్కోర్ సాధించి ఉండాలి.

ఎంపిక: బీఎస్సీ మార్కులకు 40 శాతం, ఐకార్ ఏఐఈఈఏ(పీజీ)2024 ఎంట్రెన్స్ ఎగ్జామ్ స్కోర్‌కు 60 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేసి కౌన్సెలింగ్, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ నిర్వహిస్తారు.

పీహెచ్‌డీ(హార్టికల్చర్): ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. మొత్తం 6 సీట్లు ఉన్నాయి. వీటిలో ఫ్లోరికల్చర్ అండ్ ల్యాండ్‌స్కేప్ ఆర్కిటెక్చర్ 1, ప్లాంటేషన్-స్పయిసెస్-మెడిసినల్ అరోమాటిక్ క్రాప్స్ 1, ఫ్రూట్ సైన్స్ 2, వెజిటబుల్ సైన్స్ 2 సీట్లు ఉన్నాయి.

అర్హత: సంబంధిత స్పెషలైజేషన్‌తో ఎమ్మెస్సీ (హార్టికల్చర్) ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. 10 పాయింట్ల స్కేల్ మీద కనీసం 6.5 ఓజీపీఏ ఉండాలి. ఐకార్ ఏఐసీఈ-జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్(పీహెచ్‌డీ)2024 ఎంట్రెన్స్ ఎగ్జామ్‌లో స్కోర్ సాధించి ఉండాలి. అభ్యర్థుల వయసు డిసెంబరు 31 నాటికి 40 ఏళ్లు మించకూడదు.

ఎంపిక: బీఎస్సీ మార్కులకు 20 శాతం, ఎమ్మెస్సీ మార్కులకు 20 శాతం, ఐకార్ ఏఐసీఈ-జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్(పీహెచ్‌డీ)2024 ఎంట్రెన్స్ ఎగ్జామ్ స్కోర్‌కు 60 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేసి కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. తరవాత డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ ఉంటుంది.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 14
- **వెబ్‌సైట్:** skltshu.ac.in

దిక్సూచి

ఐఐఎఫ్‌టీలో
పీజీ సర్టిఫికెట్ ఇన్ మేనేజ్‌మెంట్

న్యూఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ)- పోస్ట్ గ్రాడ్యుయేట్ సర్టిఫికెట్ ఇన్ మేనేజ్‌మెంట్(ఇంటర్నేషనల్ బిజినెస్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. దీని వ్యవధి ఏడాది. ఇది వీకెండ్ ఆన్ క్యాంపస్ ప్రోగ్రామ్. దీనికి ఏఐసీటీఈ గుర్తింపు ఉంది.

ప్రోగ్రామ్ వివరాలు: ఇందులో మూడు ట్రైమెస్టర్లు ఉంటాయి. ప్రతి ట్రైమెస్టర్ ప్రారంభంలో మూడు రోజులు కాంటాక్ట్ వీక్ నిర్వహిస్తారు. రెండో ట్రైమెస్టర్‌లో పోర్ట్ విజిట్ ఉంటుంది.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. రిజర్వ్‌డ్ వర్గాలవారికి 45 శాతం మార్కులు చాలు. వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ఈ ప్రోగ్రామ్ అనుకూలంగా ఉంటుంది.


- **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 5
- **వెబ్‌సైట్:** www.iift.ac.in



86,000 దిశగా సెన్సెక్స్

సూచీ మరో 666 పాయింట్లు అప్ .. ఇంట్రాడేలో 26,250 స్థాయికి నిఫ్టీ

దలాల్‌స్ట్రీట్‌లో మళ్లీ రికార్డుల మోత



ముంబై: భారత స్టాక్ మార్కెట్లో బుల్ జైత్రయాత్ర కొనసాగుతోంది. ప్రామాణిక సూచీలు గురువారం సరికొత్త శిఖరాలకు ఎగబాకాయి. ఆసియా, ఐరోపా మార్కెట్ల సానుకూల సంకేతాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు బ్యాంకింగ్, ఆటో, మెటల్ రంగ షేర్లలో కొనుగోళ్లు పెంచడం ఇందుకు దోహదపడింది. సెన్సెక్స్ ఒక దశలో 760.56 పాయింట్ల వృద్ధితో 85,930.43 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. చివరికి సూచీ 666.25 పాయింట్ల లాభంతో 85,836.12 వద్ద స్థిరపడింది. సూచీకిది సరికొత్త జీవితకాల గరిష్ఠ ముగింపు కూడా. అంతేకాదు, 86,000 మైలురాయిని చేరుకునేందుకు సూచీ కేవలం 69.57 పాయింట్ల దూరంలో ఉంది. కాగా, నిఫ్టీ వరుసగా ఆరో రోజూ బలపడింది. ఒక దశలో సూచీ 246.75 పాయింట్లు ఎగబాకి 25,250.90 సరికొత్త ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివర్లో 211.90 పాయింట్ల లాభంతో 26,216.05 వద్ద ఆల్‌టైం రికార్డు ముగింపును సైతం నమోదు చేసుకుంది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 28 లాభపడ్డాయి. మారుతి సుజుకీ షేరు 4.76 శాతం రాణించి సూచీ టాప్ గెయినర్‌గా అవతరించింది. టాటా మోటార్స్ 3.08 శాతం, ఎం అండ్ ఎం 2.97 శాతం పుంజుకున్నాయి. బజాజ్ ఫిన్‌సర్వ్, టాటా స్టీల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, నెస్లే, అల్ట్రాటెక్ షేర్లు సైతం రెండు శాతానికి పైగా పెరిగాయి. బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు మాత్రం 0.39 శాతం వరకు నష్టపోయాయి.

రంగాలవారీ సూచీల్లో ఆటో, మెటల్ 2 శాతానికి పైగా వృద్ధి చెందగా.. కమోడిటీస్ ఇండెక్స్ 1.32 శాతం పెరిగింది. ఫారెక్స్ ట్రేడింగ్ విషయానికొస్తే, డాలర్‌తో రూపాయి మారకం విలువ 8 పైసలు క్షీణించి 83.66 వద్ద ముగిసింది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ ముడిచమురు ధర ఒకదశలో 3.20 శాతం తగ్గి 71.11 డాలర్లకు దిగివచ్చింది.

మారీ టెక్ రూ.1,500 కోట్ల ఐపీఓ

హైదరాబాద్‌కు చెందిన ఐటీ సొల్యూషన్స్ అండ్ సర్వీసెస్ కంపెనీ మారీ టెక్ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)కు రాబోతోంది. ఇందుకు అనుమతి కోరుతూ క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీకి కంపెనీ ప్రాథమిక ముసాయిదా పత్రాలు (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించింది. పబ్లిక్ ఆఫరింగ్‌లో భాగంగా రూ.440 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత ప్రమోటర్లు, వాటాదారులకు చెందిన రూ.1,060 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) పద్ధతిన విక్రయించనున్నట్లు డీఆర్‌హెచ్‌పీలో కంపెనీ వెల్లడించింది. ఐపీఓ ద్వారా కంపెనీ ప్రమోటర్లైన సుజయ్ పాటూరు రూ.615 కోట్లు, అనిల్ రెడ్డి యెర్రంరెడ్డి రూ.316 కోట్లు, నాన్-ప్రమోటర్ వాటాదారు ఎస్ శ్రీనివాస రావు రూ.129 కోట్ల విలువైన షేర్లను విక్రయించనున్నారు.

3 రోజుల్లో డెట్ సెక్యూరిటీల లిస్టింగ్

డెట్ సెక్యూరిటీల పబ్లిక్ ఇష్యూలు, నాన్ కన్వర్టబుల్ రిడీమబుల్ ప్రిఫరెన్షియల్ షేర్ల (ఎన్‌సీఆర్‌పీఎస్) లిస్టింగ్ సమయాన్ని ప్రస్తుత ఆరు రోజుల (టీ+6) నుంచి మూడు రోజుల(టీ+3)కు తగ్గించాలని క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ గురువారం నిర్ణయించింది. ఈ నవంబరు 1న, ఆ తర్వాత ప్రారంభమయ్యే డెట్ సెక్యూరిటీల పబ్లిక్ ఇష్యూలకు కొత్త గడువు ఐచ్ఛికమే అయినప్పటికీ, 2025 నవంబరు 1, ఆ తర్వాత నుంచి ఇష్యూలు తప్పనిసరిగా మూడు పనిదినాల్లో మార్కెట్లో లిస్ట్ కావాల్సి ఉంటుందని సెబీ తన సర్క్యులర్‌లో స్పష్టం చేసింది.

డీలిస్టింగ్‌కు స్థిర ధర విధానం: ఫిక్స్‌డ్ ప్రైస్ మెకానిజం (స్థిర ధర విధానం) ద్వారా కంపెనీలు తమ షేర్లను స్టాక్ మార్కెట్ నుంచి డీలిస్ట్ చేసేందుకు అనుమతించే కొత్త నియమావళిని సెబీ గురువారం ప్రకటించింది. తద్వారా కంపెనీలకు డీలిస్టింగ్ మరింత సులువు కానుంది.

హురున్ యువ పారిశ్రామికవేత్తల జాబితాలో

ఇషా, ఆకాశ్ అంబానీకి చోటు

తెలుగు రాష్ట్రాల నుంచి 10 మంది..



న్యూఢిల్లీ: దేశంలో 35 ఏళ్ల లోపు వయసున్న అత్యుత్తమ యువ పారిశ్రామికవేత్తల్లో భారత కుబేరుడు, ఆర్ఐఎల్ చైర్మన్ ముకేశ్ అంబానీ పెద్ద కుమారుడు ఆకాశ్ అంబానీ, కుమార్తె ఇషా అంబానీకి చోటు దక్కింది. హురున్ ఇండియా ఈ ఏడాదికి గాను మొత్తం 150 మంది యువ పారిశ్రామికవేత్తల వివరాలతో కూడిన జాబితాను గురువారం విడుదల చేసింది. హురున్ ఈ లిస్ట్‌ను విడుదల చేయడం ఇదే తొలిసారి. కాగా, తెలుగు రాష్ట్రాల నుంచి 10 మందికి ఇందులో స్థానం లభించింది. నగరాల విషయానికొస్తే, 29 మంది యువ పారిశ్రామికవేత్తలతో బెంగళూరు అగ్రస్థానంలో నిలిచింది. ముంబై (26 మంది), ఢిల్లీ (21 మంది),హైదరాబాద్ (9 మంది) ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయి. జాబితాలోని 123 మంది తొలితరం పారిశ్రామికవేత్తలే కావడం గమనార్హం. మిగతావారు తమ కుటుంబ వ్యాపారాలను మరింత విజయవంతంగా ముందుకు తీసుకెళ్తున్నారని హురున్ పేర్కొంది.

'హురున్ అండర్ 35'లో తెలుగు రాష్ట్రాలకు చెందినవారు

పేరు	కంపెనీ	ప్రాంతం
అక్షిత్ జైన్	గోల్డ్‌మెడల్ ఎలక్ట్రికల్స్	విజయవాడ
కేశవ్ రెడ్డి	అరాజెన్ లైఫ్‌సైన్సెస్	హైదరాబాద్
వెంకట సంజీవ్ అల్లూరి	అవంతి ఫీడ్స్	హైదరాబాద్
నవీశ్ రెడ్డి	ఫైనాన్స్‌పీర్	హైదరాబాద్
రాహుల్ అత్తులూరి	నెక్స్‌వేవ్	హైదరాబాద్
పవన్ గుంటుపల్లి	ర్యాపిడో	హైదరాబాద్
పవన్ కుమార్ చందన	స్కైరూట్ ఏరోస్పేస్	హైదరాబాద్
ఆశిష్ గోయెంకా	3ఎఫ్ ఆయిల్ పామ్	హైదరాబాద్
డీ నాగ భరత్	స్కైరూట్ ఏరోస్పేస్	హైదరాబాద్
సంజయ్ జగన్నాథ్	ఎక్స్‌పోనెంట్ ఎనర్జీ	హైదరాబాద్

కార్యాలయ స్థలాలకు భారీ డిమాండ్

న్యూఢిల్లీ: దేశంలోని ఆరు ప్రధాన నగరాల్లో కార్యాలయ స్థలాలకు డిమాండ్ జూలై-సెప్టెంబరు త్రైమాసికంలో 31 శాతం పెరిగినట్టు కోలియెర్స్ ఇండియా తాజా నివేదికలో తెలిపింది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే కార్యాలయ స్థలాల లీజింగ్ 1.32 కోట్ల చదరపు అడుగుల నుంచి 1.73 కోట్ల చదరపు అడుగులకు పెరిగినట్టు తెలియచేసింది.

హైదరాబాద్ జోరు: కార్యాలయ స్థలాల డిమాండ్‌లో బెంగళూరు, హైదరాబాద్ అగ్రస్థానంలో నిలిచాయి. మూడో త్రైమాసికంలో లీజుకి తీసుకున్న కార్యాలయ స్థలాల్లో సగం పైగా వాటా ఈ రెండు నగరాలదే. బెంగళూరులో చారిత్రక గరిష్ఠ స్థాయిలో 63 లక్షల చదరపు అడుగుల స్థలం అమ్ముడుపోయింది. 29 లక్షల చదరపు అడుగులతో హైదరాబాద్ రెండో స్థానంలో నిలిచింది. గత ఏడాది ఇదే కాలంలో లీజుకి తీసుకున్న 25 లక్షల చదరపు అడుగులతో పోల్చితే డిమాండ్ 16 శాతం పెరిగింది. అయితే ఇళ్ల డిమాండ్ మాత్రం 22%క్షీణించి 16,735 యూనిట్ల నుంచి 12,735 యూనిట్లకు తగ్గింది. కాగా దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో జూలై-సెప్టెంబరు త్రైమాసికంలో ఇళ్ల అమ్మకాలు 11 శాతం క్షీణించాయి. ఇళ్ల ధర మాత్రం 23 శాతం పెరిగింది. కొత్త ప్రాజెక్టులేవీ ప్రారంభం కాకపోవడమే ఇళ్ల అమ్మకాలు క్షీణించడానికి కారణమని రియల్ ఎస్టేట్ కన్సల్టింగ్ సంస్థ అనరాక్ తాజా నివేదికలో తెలిపింది.

- ఆర్గానిక్ నిత్యావసరాలు అందించే ది ఆర్గానిక్ వరల్డ్ తన కార్యకలాపాలను హైదరాబాద్‌కు విస్తరించింది. ఇందులో భాగంగా ప్రగతి నగర్‌లో ఒక స్టోర్ ప్రారంభించింది. ముందు ముందు హైదరాబాద్‌లో మరిన్ని స్టోర్స్ ప్రారంభిస్తామని ది ఆర్గానిక్ వరల్డ్ మాతృసంస్థ నిమిడా అధినేత గౌరవ్ మన్‌చందా తెలిపారు.

అభివృద్ధిలో 'ఎంఎస్ఎంఈ'లది

కీలక పాత్ర

తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అభివృద్ధిలో ఎంఎస్ఎంఈలది కీలక పాత్ర అని తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డీ శ్రీధర్ బాబు అన్నారు. ఈ సంస్థలు అంతర్జాతీయ స్థాయికి ఎదిగేందుకు అవసరమైన వసతులు కల్పించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గురువారం నాడిక్కడ హైటెక్స్‌లో అనకాన్ ఇండియా, ఇండియా ల్యాబ్ ఎక్స్‌పో, ఫార్మా ప్రో అండ్ ప్యాక్ ఎక్స్‌పో- 2024ను ప్రారంభించిన అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ విషయం చెప్పారు. అంతర్జాతీయ ఫార్మా మార్కెట్లో ప్రస్తుతం 35 శాతంగా ఉన్న మన వాటాను వచ్చే కొద్ది సంవత్సరాల్లో 50 శాతానికి పెంచేందుకు పరిశ్రమ వర్గాలు కృషి చేయాలని శ్రీధర్ బాబు కోరారు. రాష్ట్ర ఫార్మా రంగంలో పెద్ద కంపెనీలతో పాటు ఎంఎస్ఎంఈల అభివృద్ధికి అవసరమైన అన్ని వసతులను తమ ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేస్తున్న జీనోమ్ వ్యాలీ ఫోర్త్ ఫేజ్ జోన్ రాష్ట్రంలో జీవ శాస్త్రాల అభివృద్ధికి మరింత దోహదం చేస్తుందని శ్రీధర్ బాబు చెప్పారు.

ఢిల్లీలో 'డబ్ల్యూటీఎస్ఏ-2024' సదస్సు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఢిల్లీ మరో అంతర్జాతీయ సదస్సుకు వేదికవుతోంది. వచ్చే నెల 14-24 తేదీల మధ్య 'వరల్డ్ టెలికమ్యూనికేషన్ స్టాండర్డైజేషన్ అసెంబ్లీ (డబ్ల్యూటీఎస్ఏ-2024) సదస్సు ఢిల్లీలో జరగనుంది. దీనికి సంబంధించి టెలికాం శాఖ (డీఓటీ) గురువారం ఢిల్లీ టెక్నికల్ యూనివర్సిటీ, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (బెంగళూరు), ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (హైదరాబాద్)లతో సన్నాహక కార్యక్రమాలు నిర్వహించింది. ఇంటర్నేషనల్ టెలికమ్యూనికేషన్ యూనియన్ చరిత్రలో ఈ సదస్సు మన దేశంలో జరగడం ఇదే మొదటిసారి.

జెన్ టెక్నాలజీస్ నుంచి 4 కొత్త ఉత్పత్తులు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జెన్ టెక్నాలజీస్ లిమిటెడ్ సైనిక దళాల కోసం మరో నాలుగు సరికొత్త రిమోట్ కంట్రోల్డ్ వెపన్ అండ్ సర్వైలెన్స్ వ్యవస్థలను అభివృద్ధి చేసిది. ఆత్మ నిర్భర్ భారత్‌లో భాగంగా ఈ ఉత్పత్తులను అభివృద్ధి చేసినట్టు తెలిపింది. పరశు, ఫనీష్, షరూర్, దుర్గం పేరుతో అభివృద్ధి చేసిన ఈ సరికొత్త ఆయుధ వ్యవస్థలతో దేశ రక్షణ మరింత బలోపేతం అవుతుందని పేర్కొంది.

రూ.78,000 దాటిన పసిడి

న్యూఢిల్లీ: అంతర్జాతీయ మార్కెట్లో ట్రెండ్‌కు అనుగుణంగా దేశీయంగానూ బులియన్ ధరలు సరికొత్త రికార్డు గరిష్ఠాలకు ఎగబాకాయి. పసిడి తొలిసారిగా రూ.78,000 మైలురాయిని దాటేసింది. ఢిల్లీ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర గురువారం మరో రూ.400 పెరుగుదలతో రూ.78,250కి చేరుకుంది. కిలో వెండి సైతం రూ.1,000 పెరిగి రూ.94,000 ధర పలికింది. కాగా, అంతర్జాతీయ కమోడిటీ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ ఒకదశలో 0.61 శాతం వృద్ధితో తొలిసారిగా 2,700 డాలర్లకు చేరుకుంది. సిల్వర్ 32.86 డాలర్ల స్థాయిలో ట్రేడైంది.

మహారాష్ట్రలో రెండు పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులు

రూ.21,100 కోట్ల పెట్టుబడి: మేఘా ఇంజనీరింగ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఈఐఎల్).. మహారాష్ట్రలో రెండు పంప్డ్ స్టోరేజ్ హైడ్రో ప్రాజెక్టులు చేపడుతోంది. దీనికి సంబంధించి గురువారం మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సమక్షంలో ఆ రాష్ట్ర జలవనరుల శాఖ, ఎంఈఐఎల్ ప్రతినిధుల మధ్య అవగాహనా ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. 4,000 మెగావాట్ల సామర్థ్యం ఉన్న ఈ రెండు ప్రాజెక్టుల కోసం కంపెనీ రూ.21,100 కోట్ల వరకు ఖర్చు చేయనుంది. ఈ రెండు ప్రాజెక్టులను ఐదేళ్లలో పూర్తి చేయనున్నట్టు తెలిపింది.

స్పాన్ ఎక్రాస్, మొబైల్‌వేర్‌లో జాగిల్ ప్రీపెయిడ్‌కు వాటాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఫిన్‌టెక్ సంస్థ జాగిల్ ప్రీపెయిడ్ ఓషన్ సర్వీసెస్ లిమిటెడ్.. స్పాన్ ఎక్రాస్ ఐటీ సొల్యూషన్స్, మొబైల్‌వేర్ కంపెనీల్లో వాటాలు కొనుగోలు చేసినట్లు ప్రకటించింది. ఇందుకోసం మొత్తం రూ.48 కోట్లు వెచ్చించినట్లు వెల్లడించింది. స్పాన్ ఎక్రాస్‌లో రూ.32.07 కోట్లతో 98.32 శాతం వాటాను దక్కించుకోగా, మొబైల్‌వేర్‌లో రూ.15.60 కోట్లతో 26 శాతం వాటాను చేజిక్కించుకున్నట్లు జాగిల్ తెలిపింది. టాక్స్‌స్పానర్ పేరుతో స్పాన్ ఎక్రాస్.. ఆదాయ పన్ను సన్నాహకాలు, ఈ-ఫైలింగ్ కంపెనీలకు సేవలందిస్తుండా మొబైల్‌వేర్.. డిజిటల్ చెల్లింపులకు అవసరమైన సొల్యూషన్స్‌ను అందిస్తోంది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,000 ▼	70,050 ▼	1,00,000 ▼
ముంబై	75,750 ▲	69,387 ▲	92,522 ▲



ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

27వ తేదీ			
హైదరాబాద్	505	విజయవాడ	530
వరంగల్	507	గోదావరి	530
చిత్తూరు	543	విశాఖపట్నం	530
		డజను గుడ్లు రూ. 78	



ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	125	విజయవాడ	121
వరంగల్	125	గుంటూరు	126
కరీంనగర్	125	ఒంగోలు	126
మహబూబ్‌నగర్	125	చిత్తూరు	126
కర్నూలు	125	నెల్లూరు	126
విశాఖపట్నం	107	అనంతపురం	126
గోదావరి	121		

క్లీన్‌స్వీప్‌పై గురి


గంభీర్ రోహిత్ అశ్విన్

జట్లు (అంచనా)


బంగ్లా కెప్టెన్ షంటో

ఉదయం 9.30 నుంచి స్పోర్ట్స్18, జియో సినిమాలో..

- జోరు మీదున్న భారత్
- సమం కోసం బంగ్లాదేశ్
- నేటి నుంచి తుది టెస్టు

కాన్పూర్: బంగ్లాదేశ్‌తో తొలి టెస్టును నాలుగు రోజుల్లోనే ఘనంగా ముగించిన టీమిండియా మరో విజయంపై కన్నేసింది. తాజాగా ఇరు జట్ల మధ్య శుక్రవారం నుంచి సిరీస్‌లో ఆఖరిదైన రెండో టెస్టు జరుగనుంది. మూడేళ్ల తర్వాత కాన్పూర్ వేదిక ఈ సుదీర్ఘ ఫార్మాట్ మ్యాచ్‌కు ఆతిథ్యం ఇవ్వబోతోంది. 1-0తో సిరీస్‌లో ఆధిక్యంలో ఉన్న భారత్ నేటి మ్యాచ్‌లో క్లీన్‌స్వీప్ లక్ష్యంగా బరిలోకి దిగబోతోంది. అదే జరిగితే వరుసగా 18వ సిరీస్ విజయాన్ని ఖాతాలో వేసుకున్నట్టవుతుంది. మరోవైపు ఈ సిరీస్ ఆరంభానికి ముందు బంగ్లాపై భారీ అంచనాలే నెలకొన్నాయి. కానీ భారత బౌలర్ల ధాటికి ఆ జట్టు బ్యాటర్లు ఎలాంటి ప్రభావమూ చూపలేదు. దీంతో పాక్‌ను వైట్‌వాష్ చేసి ఊపు మీదున్న బంగ్లాను రోహిత్ సేన నేలకు దించింది. కానీ కాన్పూర్ టెస్టులో మాత్రం ఆతిథ్య జట్టుకు దీటుగా బదులివ్వాలనే కసితో ఉంది. తద్వారా భారత్‌పై తొలి విజయంతో పాటు సిరీస్‌ను సమం చేయాలనుకుంటోంది.

విరాట్, రోహిత్‌పైనే దృష్టి: చెన్నై టెస్టులో అశ్విన్, జడేజా, పంత్, గిల్ విశేషంగా రాణించినా టాపార్డర్ కలిసికట్టుగా ఆడలేకపోయింది. ఓపెనర్‌గా జైస్వాల్ అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. కానీ స్టార్ బ్యాటర్లు విరాట్ కోహ్లీ, కెప్టెన్ రోహిత్ మాత్రం దారుణంగా విఫలం కావడం టీమ్ మేనేజ్‌మెంట్‌ను ఆందోళనపరుస్తోంది. సుదీర్ఘ సీజన్ ముందుండడంతో ఈ ఇద్దరు వెటరన్స్ తమ బ్యాట్లను ఝుళిపించాల్సిన అవసరం ఎంతో ఉంది. అలాగే కేఎల్ రాహుల్ తనకు దక్కిన అవకాశాలను సద్వినియోగం చేసుకోలేకపోతున్నాడు. ఇక గ్రీన్‌పార్క్ వికెట్ సహజంగానే స్పిన్‌కు అనుకూలిస్తుంటుంది. దీంతో భారత జట్టు తుది కూర్పులో మార్పులు తప్పవు. చెన్నై మ్యాచ్‌కు ముగ్గురు పేసర్లు అవసరమైనా.. ఇక్కడ మాత్రం ఇద్దరితోనే వెళ్లాలనుకుంటోంది. అందుకే పేసర్ ఆకాశ్ దీప్‌నకు విశ్రాంతినిచ్చి కుల్దీప్ లేక అక్షర్‌లలో ఒకరిని ఆడించనున్నారు. అలాగే మరో ఎనిమిది టెస్టులుండడంతో బుమ్రాకు విశ్రాంతినిచ్చే విషయాన్నీ తోసిపుచ్చలేం. ఏడాదిన్నర కాలంగా కుల్దీప్ అద్భుతంగా రాణిస్తుండడంతో కెప్టెన్, కోచ్ గంభీర్ అతడివైపే మొగ్గు చూపవచ్చు. 2021లో ఇక్కడ జరిగిన చివరి టెస్టులో భారత్ అశ్విన్, జడేజా, అక్షర్‌లతో బరిలోకి దిగింది.


కోహ్లీ

షకీబ్ సందేహమే: తొలి టెస్టులో బ్యాటింగ్ వైఫల్యంతో ఇబ్బందిపడిన బంగ్లాకు తాజా టెస్టు ఆరంభానికి ముందే తడబాటు తప్పేట్టు లేదు. షకీబ్ అల్ హసన్ వేలి గాయంతో బాధపడుతున్నాడు. అయితే కోచ్ మాత్రం అతను బరిలోకి దిగుతాడని చెబుతున్నాడు. బ్యాటింగ్‌లో కెప్టెన్ షంటోపైనే భారం పడుతోంది. మోమినుల్, ముష్ఫికర్ రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ విఫలమయ్యారు. ఇక బంగ్లా కూడా మూడో స్పిన్నర్‌గా తైజుల్ ఇస్లాంను బరిలోకి దింపాలనుకుంటోంది. టెస్టుల్లో బంగ్లా బలం వారి స్పిన్నర్లే. ఇప్పుడు అదే బలంతో భారత్‌పై గెలుపు రుచి చూడాలనుకుంటోంది.

2 టెస్టుల్లో 300 వికెట్ల క్లబ్‌లో చేరేందుకు జడేజా మరో వికెట్ దూరంలో ఉన్నాడు. అదే జరిగితే సుదీర్ఘ ఫార్మాట్ చరిత్రలో అత్యంత వేగంగా (74 టెస్టుల్లో) 300 వికెట్లు, 3000+ పరుగులు సాధించిన రెండో ప్లేయర్ అవుతాడు. ఇయాన్ బోథమ్ (72 టెస్టులు) టాప్‌లో ఉన్నాడు.

భారత్: జైస్వాల్, రోహిత్ (కెప్టెన్), గిల్, విరాట్, పంత్, రాహుల్, జడేజా, అశ్విన్, కుల్దీప్, ఆకాశ్/బుమ్రా, సిరాజ్.
బంగ్లాదేశ్: షాద్‌మన్, జకీర్ హసన్, షంటో (కెప్టెన్), మోమినుల్ హక్, ముష్ఫికర్, షకీబ్, లిట్టన్ దాస్, మెహిదీ హసన్, హసన్ మహమూద్, టస్కిన్/నహీద్, తైజుల్.

పిచ్ కాన్పూర్ వికెట్ సమతూకంతో ఉంటుందని క్యూరేటర్ చెబుతున్నాడు. తొలి రోజు బౌన్స్‌తో పేసర్లు లాభపడనున్నారు. అయితే మ్యాచ్ సాగుతున్నకొద్దీ స్పిన్నర్లదే ఆధిక్యం కనిపించనుంది. ఇక బ్యాటర్లకు కూడా అనుకూలం కావడంతో భారీ స్కోర్లను ఆశించవచ్చు. ఇక్కడ తొలి ఇన్నింగ్స్ సగటు స్కోరు 370.

వరుణుడితో ఇబ్బందే భారత్-బంగ్లా రెండో టెస్టుకు తొలి మూడు రోజులు ఉరుములతో కూడిన వర్షం ఆటంకం కలిగించే అవకాశాలున్నాయి. గురువారం ఇక్కడ కురిసిన భారీ వర్షానికి బంగ్లా ప్రాక్టీస్ కూడా చేయలేకపోయింది. అయితే ఆధునిక డ్రైనేజీ వ్యవస్థ ఉన్నందున త్వరగానే పరిస్థితులను చక్కదిద్దగలమని స్టేడియం మేనేజర్ సంజయ్ కపూర్ చెబుతున్నాడు. చివరి మూడు రోజులు మాత్రం వరుణుడి నుంచి ఎలాంటి ముప్పు లేదట.

టీ20లకు గుడ్‌బై

స్వదేశంలో చివరి టెస్ట్ ఆడాలని ఉంది..
- కుదరకపోతే కాన్పూర్ టెస్టే ఆఖరిది
- చాంపియన్స్ ట్రోఫీతో వన్డేలకూ వీడ్కోలు
- బంగ్లాదేశ్ స్టార్ షకీబ్ సంచలన నిర్ణయం


షకీబ్ అల్ హసన్

కాన్పూర్: బంగ్లాదేశ్ దిగ్గజ క్రికెటర్ షకీబ్ అల్ హసన్ సంచలన నిర్ణయాలు తీసుకున్నాడు. అంతర్జాతీయ టీ20 క్రికెట్ నుంచి తక్షణమే రిటైరవుతున్నట్టు ప్రకటించాడు. అలాగే స్వదేశంలో టెస్ట్ ద్వారా సుదీర్ఘ ఫార్మాట్‌కు వీడ్కోలు పలకాలన్నది తన ఆకాంక్షని తెలిపాడు. కానీ పరిస్థితులు అనుకూలించకపోతే టీమిండియాతో కాన్పూర్‌లో జరిగే రెండో టెస్టే తనకు ఆఖరిదని వెల్లడించాడు. స్వదేశంలో తన భద్రతపై షకీబ్ ఆందోళనగా ఉన్నాడు. ఈ నేపథ్యంలో ఆ సిరీస్‌లో అతడు ఆడే అవకాశాలు లేవన్న వాదన వినిపిస్తోంది. ఇక..చాంపియన్స్ ట్రోఫీ తర్వాత వన్డేలనుంచీ వైదొలగనున్నట్టు తెలిపాడు.

అప్పుడే ఆఖరాట ఆడేశా..: 'గత జూన్‌లో జరిగిన టీ20 వరల్డ్ కప్‌లోనే నా చివరి పొట్టి క్రికెట్ మ్యాచ్ ఆడేశా. 2026 ప్రపంచ కప్‌ను దృష్టిలో పెట్టుకొని సరైన నిర్ణయమే తీసుకున్నా' అని షకీబ్ అన్నాడు. అయితే ఫ్రాంచైజీ క్రికెట్‌లో కొనసాగుతానని స్పష్టంజేశాడు. 129 టీ20లలో 2551 పరుగులు సాధించిన హసన్ 149 వికెట్లు తీశాడు. మరోవైపు..70 టెస్ట్‌ల్లో 4600 రన్స్, 242 వికెట్లు సాధించాడు. కాగా గత జనవరిలో జరిగిన ఎన్నికల్లో పాలక అవామీ లీగ్ పార్టీ నుంచి షకీబ్ పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికయ్యాడు. కానీ షేక్ హసీనాకు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనల్లో షకీబ్‌పై హత్య కేసు నమోదైంది. అయితే హత్య జరిగిన సమయంలో బంగ్లా మాజీ కెప్టెన్ స్వదేశంలో లేకపోవడం గమనార్హం. ఇక..వచ్చే నెలలో రెండు టెస్టుల సిరీస్‌కోసం దక్షిణాఫ్రికా జట్టు బంగ్లాదేశ్‌లో పర్యటించనుంది. ఇందులో మీర్పూర్‌లో జరిగే టెస్ట్ ద్వారా ఈ ఫార్మాట్‌కు షకీబ్ గుడ్‌బై చెప్పాలనుకుంటున్నాడు.

కమిందు ప్రపంచ రికార్డు

దినేశ్ శతకం
శ్రీలంక 306/3

గాలె: కీపర్ దినేశ్ చాందిమల్ (116) శతక మోత మోగించిన వేళ..న్యూజిలాండ్‌తో గురువారం ప్రారంభమైన రెండో టెస్ట్‌లో శ్రీలంక భారీ స్కోరు దిశగా సాగుతోంది. కమిందు (51 నాటౌట్), దినేశ్‌తోపాటు మాథ్యూస్ (78 బ్యాటింగ్) సత్తా చాటడంతో మొదటి ఇన్నింగ్స్‌లో తొలిరోజు ఆఖరికి ఆతిథ్య జట్టు 306/3 స్కోరు చేసింది. ఇక..132 ఏళ్ల సుదీర్ఘ ఫార్మాట్ చరిత్రలో అరంగేట్రం తర్వాత వరుసగా ఎనిమిది టెస్ట్‌ల్లోనూ అర్ధ శతకాలు సాధించిన మొదటి బ్యాటర్‌గా కమిందు మెండిస్ చరిత్రపుటలకెక్కాడు. కమిందు 2022లో ఆస్ట్రేలియాపై గాలెలోనే టెస్ట్ అరంగేట్రం చేశాడు.

పంత్ ఆస్ట్రేలియన్ అయితే బాగుండేది: మార్ష్



న్యూఢిల్లీ: వికెట్ కీపింగ్ బ్యాటర్ రిషభ్ పంత్ ఆస్ట్రేలియా ఆటగాడైతే బాగుండేదని ఆ దేశానికి చెందిన ఆల్‌రౌండర్ మిచెల్ మార్ష్ అన్నాడు. నవంబరు చివర్లో ఆస్ట్రేలియా టూర్‌కు భారత జట్టు వెళ్లనుంది. 'అతడు చీల్చి చెండాడుతాడు. పంత్ ఆస్ట్రేలియన్ అయితే బాగుంటుందని నేను కోరుకొంటున్నా. గత కొన్నేళ్లుగా అతడు ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నాడు. వాటి నుంచి బలంగా తిరిగి వచ్చాడు. ఎంతో సానుకూల మనస్తత్వం. ఎప్పుడూ గెలవడానికే పోరాడతాడు. సరదాగా నవ్వుతూ ఉంటాడని మార్ష్ అన్నాడు.

యువ భారత్‌దే సిరీస్

మూడో వన్డేలోనూ విజయం
పోరాడిన ఆసీస్ అండర్-19

పుదుచ్చేరి: ఆస్ట్రేలియా అండర్-19తో జరిగిన మూడు వన్డేల సిరీస్‌ను భారత కుర్రాళ్లు 3-0తో క్లీన్‌స్వీప్ చేశారు. గురువారం జరిగిన చివరి మ్యాచ్‌లో భారత్ 7 పరుగులతో గెలిచింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 50 ఓవర్లలో 324/8 స్కోరు సాధించింది. రుద్ర పటేల్ (77), అమాన్ (71) అర్ధసెంచరీలతో చెలరేగారు. ఐడన్ ఓకానర్‌కు నాలుగు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత భారీ ఛేదన కోసం బరిలోకి దిగిన ఆసీస్ ఇన్నింగ్స్‌లో ఒల్లీ పీక్ (111), స్టీవెన్ హోగన్ (104) శతకాలు సాధించారు. అయితే ఆఖర్లో తడబడి 50 ఓవర్లలో 317/7 స్కోరు మాత్రమే చేయడంతో ఓటమి తప్పలేదు. హార్దిక్ రాజ్‌కు మూడు వికెట్లు దక్కాయి.


ఐపీఎల్‌కు ధోనీ దూరమైనట్టేనా?



న్యూఢిల్లీ: ఐపీఎల్‌లో ధోనీ ఆడతాడా? లేదా? అనే దానిపై సందిగ్ధం కొనసాగుతోంది. 2025 ఐపీఎల్‌కు ధోనీ (43) అందుబాటులో ఉంటాడా? లేదా? అనే దానిపై ఎటువంటి స్పష్టతా లేదు. 'మాకు అతడి నుంచి సమాచారం అందాల్సి ఉంది. రిటెన్షన్ పాలసీని బీసీసీఐ ప్రకటిస్తే కానీ స్పష్టత రాదు' అని సీఎస్‌కే వర్గాలు తెలిపాయి. నవంబరు చివర్లో లేదా డిసెంబరు ఆరంభంలో మెగా వేలం జరిగే అవకాశాలున్నాయి. కాగా, ఐదుగురు ఆటగాళ్లను రిటైన్ చేసుకొనేందుకు బోర్డు అవకాశం కల్పిస్తుందన్న ప్రచారం బలంగా వినిపిస్తోంది. ఈ క్రమంలో రైట్ టు మ్యాచ్‌ను రద్దు చేసే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. మరో రెండు రోజుల్లో విధివిధానాలు వెలువడవచ్చని బోర్డు వర్గాలు చెబుతున్నాయి.

హీరోయిన్‌తో డేటింగ్ చేశా!

బయటపెట్టిన యువరాజ్



న్యూఢిల్లీ: ఓ హీరోయిన్‌తో డేటింగ్ చేసినట్టు టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్‌సింగ్ సంచలన విషయం బయటపెట్టాడు. 2007-08 ఆస్ట్రేలియా పర్యటనకు సంబంధించిన విషయాలను ఓ పాడ్‌కాస్ట్‌లో గుర్తు చేసుకొన్నాడు. మంకీ గేట్ వివాదం రాజుకొన్న సమయంలో యువీ డేటింగ్‌లో బిజీగా ఉన్నాడు. 'గతంలో నేను ఓ సినీ నటితో డేటింగ్ చేశా. ఆమె షూటింగ్ కోసం అడిలైడ్‌లో వచ్చింది. మేం కాన్‌బెర్రాలో ఉన్నాం. 'ఆటపై దృష్టి పెట్టాలి. నువ్వు ఇక్కడకు రావద్దు'అని చెప్పా. నేను చెప్పినా వినకుండా ఆమె కాన్‌బెర్రాకు వచ్చేసింది. 'ఆమెను చూసి ఇక్కడేం చేస్తున్నావు?' అని అడిగా. 'నీతో సమయం గడుపుదామని వచ్చాన'ని చెప్పింది. దీంతో ఆ రోజు ఆమెతోనే ఉండిపోయాన'ని యువీ తెలిపాడు. ఆ తర్వాత కాన్‌బెర్రా నుంచి అడిలైడ్ వెళ్లేందుకు సిద్ధం కాగా.. తన సూట్‌కేస్‌ను ఆమే ప్యాక్ చేసిందని తెలిపాడు. అయితే, తన బూట్లను కూడా సర్దేయడంతో.. బయల్దేరే సమయానికి ఏం చేయాలో అర్థం కాలేదన్నాడు. అప్పుడు తను తన పింక్ షూస్‌ను వేసుకొని వెళ్లమనడంతో.. తప్పలేదని యువీ చెప్పాడు. అమ్మాయిలు వేసుకొనే షూతోనే టీమ్ బస్సు దగ్గరకు వచ్చా. సహచరులకు కనిపించకుండా సూట్‌కేస్‌ను అడ్డుపెట్టుకొన్నా. కానీ, ఎలాగో వారి కంట పడడంతో.. చప్పట్లు కొడుతూ ఆటపట్టించారు. అయితే, ఆ హీరోయిన్ ఎవరనేది మాత్రం యువీ బయటపెట్టలేదు. 2007లో దీపిక పదుకోన్‌తో యువరాజ్ కథ నడిపినట్టు గాసిప్‌లు వచ్చాయి.

క్వార్టర్స్‌కు శ్రీకాంత్, గాయత్రి జోడీ

మకావు: ఏస్ షట్లర్ కిడాంబి శ్రీకాంత్, గాయత్రి జోడీ మకావు ఓపెన్ క్వార్టర్స్‌కు చేరుకొన్నారు. గురువారం జరిగిన రెండో రౌండ్‌లో సహచరుడు ఆయుష్ షెట్టిపై శ్రీకాంత్ 21-13, 21-18తో వరుస గేముల్లో నెగ్గాడు. రౌండ్-8లో ఎన్‌జి క లాంగ్ అంగస్ (హాంకాంగ్)తో కిడాంబి తలపడనున్నాడు. మహిళల డబుల్స్ ప్రీక్వార్టర్స్‌లో ట్రీసా జాలీ-గాయత్రి జంట 22-20, 21-11తో లిన్ చి చున్-టెంగ్ చు సన్ (చైనీస్ తైపీ)పై గెలిచింది. కాగా, మిక్స్‌డ్ డబుల్స్ రెండో రౌండ్‌లో సిక్కిరెడ్డి-సుమిత్ జంట 17-21, 14-21తో మలేసియాకు చెందిన వాంగ్ టి సి-లిమ్ చ్యు సియన్ చేతిలో చిత్తయ్యింది.

పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులివ్వండి

» ఉపాధి హామీ సొమ్ము విడుదల చెయ్యండి

» డిప్యూటీ సీఎం భట్టికి హరీశ్‌రావు లేఖ



హైదరాబాద్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం కేటాయించిన నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీఆర్‌ఎస్ నేత, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. అలాగే, జాతీయ ఉపాధి హామీ పథకానికి కేంద్రం రూ.1200 కోట్లు విడుదల చేసినా రాష్ట్ర ప్రభుత్వం తన మెటీరియల్ కాంపోనెంట్ కింద 25 శాతం నిధులను విడుదల చేయకపోవడాన్ని ఆక్షేపించారు. ఈ మేరకు ఆయా నిధులను తక్షణమే విడుదల చేయాలని కోరుతూ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు గురువారం ఓ లేఖ రాశారు. సచివాలయం ముందున్న రాజీవ్ గాంధీ విగ్రహం సాక్షిగా ప్రభుత్వం పంచాయతీరాజ్ చట్టాలను తుంగలో తొక్కడం దారుణమని హరీశ్ పేర్కొన్నారు. ఎనిమిది నెలలుగా నిధులు లేకపోవడంతో గ్రామాలు మురికి కుపాలుగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులకు వేతనాలు అందడం లేదని, పదవీకాలం పూర్తి చేసుకున్న సర్పంచ్‌లకు వేతన బకాయిలున్నాయని, ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులకు ఎనిమిది నెలలుగా గౌరవ వేతనాలు అందడం లేదని వివరించారు. అక్టోబరులో రాష్ట్రానికి హక్కుగా రావాల్సిన 15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధులను సాధించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా, "పంటల సాగులో మేటిగా.. దేశానికే ఆదర్శంగా తెలంగాణ నిలిచింది. ధాన్యం ఉత్పత్తిలో నంబర్ వన్ స్థానంతో పాటు పత్తి ఉత్పత్తిలో మూడోస్థానంలో నిలవడం గర్వకారణం" అని మాజీ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. ఇదంతా ఏదో మంత్రం వేస్తేనో.. మాయ చేస్తేనో జరిగింది కాదని, కేసీఆర్ తొమ్మిదేళ్ల కృషితో సాధించిన ఘనత అని 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.

కులగణన పేరిట కాంగ్రెస్ మళ్లీ మోసం: లక్ష్మణ్

కులగణన పేరిట కాంగ్రెస్, బీసీలను మరోసారి మోసం చేస్తోందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ కె.లక్ష్మణ్ దుయ్యబట్టారు. ఇంతకుముందు, కేసీఆర్ ప్రభుత్వం కూడా బీసీలను అణచివేసిందన్నారు. అధికారంలోకి వచ్చి 9 నెలలయినా, ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల్లో బీసీలకు 42% రిజర్వేషన్ ఎందుకు అమలు చేయలేదని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు. రిజర్వేషన్‌లను ఎత్తివేస్తామన్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ ప్రకటనకు అనుగుణంగా పనిచేస్తారా? లేక రాష్ట్రంలో 50 శాతానికి పైగా ఉన్న బీసీ సమాజం డిమాండ్‌కు అనుగుణంగా వ్యవహరిస్తారా తేల్చి చెప్పాలని సీఎం రేవంత్‌ను డిమాండ్ చేశారు. వీరనారి చాకలి ఐలమ్మ 126వ జయంతి సందర్భంగా పార్టీ నాయకులు, బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు.

బీజేపీదే తుక్కుగూడ మునిసిపల్ పీఠం

మహేశ్వరం, సెప్టెంబరు 26: రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ మునిసిపల్ చైర్మన్ ఎన్నిక వివాదంపై నాలుగున్నరేళ్ల తర్వాత హైకోర్టు బుధవారం సంచలన తీర్పునిచ్చింది. తుక్కుగూడ మునిసిపల్ చైర్మన్ ఎన్నికలో ఓటు వేసిన ఎక్స్‌అఫీషియో ఓట్లు చెల్లవని, ప్రజాతీర్పు ప్రకారం మెజార్టీ ఉన్న బీజేపీ అభ్యర్థినే మునిసిపల్ చైర్‌పర్సన్‌గా నియమించాలని హైకోర్టు తీర్పు ఇచ్చింది. దీంతో ఇప్పటి వరకు చైర్మన్‌గా ఉన్న మధుమోహన్.. కోర్టు ఉత్తర్వులను గౌరవిస్తూ చైర్మన్ పదవి నుంచి స్వచ్ఛందంగా తప్పుకున్నారు. ఈ నేపథ్యంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి, మునిసిపల్ కమిషనర్ వెంకట్‌రామ్ గురువారం తుక్కుగూడ మునిసిపల్ చైర్ పర్సన్‌గా బరిగెల హేమలతా రాజుగౌడ్‌తో ప్రమాణం చేయించారు. మునిసిపాలిటీలోని 15 వార్డులకు 2020 జనవరిలో జరిగిన ఎన్నికల్లో బీజేపీ 9, బీఆర్‌ఎస్ 5, ఒక స్వతంత్ర అభ్యర్థి గెలుపొందారు. అయితే నాడు మంత్రిగా ఉన్న ప్రస్తుత ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి తన పలుకుబడితో చైర్మన్ ఎన్నికకు ముందు తనతోపాటు అప్పటి రాజ్యసభ సభ్యుడు కేశవరావు, ఎమ్మెల్సీలు కాటేపల్లి జనార్దన్‌రెడ్డి, ఎగ్గె మల్లేశం, నాయిని నర్సింహారెడ్డిని ఎక్స్‌అఫీషియో సభ్యులుగా నమోదు చేయించారు. స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందిన మధుమోహన్‌ను బీఆర్‌ఎస్‌లో చేర్చుకొన్నారు. బీజేపీకి చైర్మన్ పదవి దక్కకుండా 2020 జనవరి 5న జరిగిన చైర్మన్ ఎన్నికలో మధుమోహన్ మునిసిపల్ చైర్మన్‌గా ఎన్నికయ్యేలా చేశారు. దీంతో బీజేపీ నాయకులు, కౌన్సిలర్లు హైకోర్టును ఆశ్రయించారు.

శ్రీవారి సేవలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

తిరుమల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వేకువజామున ఆలయంలో జరిగిన అర్చన సేవలో కుటుంబసమేతంగా పాల్గొన్నారు. గవర్నర్‌ను రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వదించగా అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు.



శ్రీవారిని దర్శించుకున్న గవర్నర్ దంపతులు

అక్రమ నిర్మాణాలు చేపడితే భారీ జరిమానా

» క్రెడాయ్, నారెడ్కో ప్రతినిధులకు టీజీపీసీబీ హెచ్చరిక

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నగరంలో నిర్మాణాలు చేపట్టే ముందు సదరు సంస్థలు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి(టీజీపీసీబీ) నుంచి తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని టీజీపీసీబీ సూచించింది. మండలిలోని వాటాదారులతో గురువారం టీజీపీసీబీ చీఫ్ ఇంజనీర్ బి.రఘు, సభ్య కార్యదర్శి జి.రవి సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అనుమతులు పొందకుండా ఎవరైనా అక్రమంగా నిర్మాణాలను చేపడితే భారీగా జరిమానా విధిస్తామని హెచ్చరించారు. నిర్మాణ కార్యకలాపాల వల్ల ఏర్పడుతున్న కాలుష్యంపై క్రెడాయ్, నారెడ్కో సంస్థల ప్రతినిధులకు అవగాహన కల్పించారు.

వ్యవసాయ పంపుసెట్ల కోసం 13 వేల డీటీఆర్‌లు

ఒక్కో డీటీఆర్ కింద 4 కనెక్షన్లు.. నిధుల విడుదల

హైదరాబాద్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం విద్యుత్తు లైన్లకు దూరంగా ఉన్న వ్యవసాయ పంపుసెట్లకు ప్రత్యేకంగా 25 కేవీఏల సామర్థ్యం కలిగిన 13,318 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫర్ల (డీటీఆర్)లను సమకూర్చాలని దక్షిణ డిస్కమ్ (ఎస్పీడీసీఎల్) నిర్ణయించింది. దీనికోసం రూ.508.95 కోట్లను విడుదల చేస్తూ ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ గురువారం ఉత్తర్వులిచ్చారు. ఒక్కో డీటీఆర్ నుంచి 5 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన నాలుగు వ్యవసాయ కనెక్షన్లు ఇవ్వనున్నారు. 37 మండలాల పరిధిలో 58,825 వ్యవసాయ పంపుసెట్లకు కనెక్షన్లు ఇవ్వాలని నిర్ణయించారు.

మన విద్యార్థి స్థానికుడు కాదా..?

» విద్య కోసం డెహ్రాడూన్ పంపింది సర్కారే కదా

» ఇప్పుడు కౌన్సెలింగ్‌లో నాన్‌లోకల్ అంటే ఎలా..?

» కాళోజీ హెల్త్ వర్సిటీని తప్పు పట్టిన హైకోర్టు

ఓ విద్యార్థిని డెహ్రాడూన్‌లోని సైనిక పాఠశాలకు రాష్ట్ర కోటాలో ఎంపిక చేసిన ప్రభుత్వం.. ప్రస్తుతం అతడు స్థానికుడు కాదంటూ.. స్థానిక కోటా కింద ఎంబీబీఎస్ కౌన్సెలింగ్‌కు అనుమతించకపోవడంపై హైకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. స్థానికత విషయంలో విచక్షణ ప్రదర్శించకుండా కఠినంగా వ్యవహరిస్తున్న కాళోజీ హెల్త్ యూనివర్సిటీ తీరును తప్పుబట్టింది. హైదరాబాద్ వనస్థలిపురంలోని దుర్గాసాయినగర్‌కు చెందిన చేపూరి అవినాశ్‌ను రాష్ట్ర కోటా కింద డెహ్రాడూన్ సైనిక పాఠశాలకు రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. ఆ విద్యార్థి 8 నుంచి 10 తరగతుల వరకు డెహ్రాడూన్‌లోని రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ స్కూల్‌లో చదివాడు. తర్వాత తెలంగాణకు వచ్చి ఇంటర్ పూర్తిచేశాడు. ప్రస్తుతం ఎంబీబీఎస్, బీడీఎస్ మెడికల్ కౌన్సెలింగ్‌కు సంబంధించిన స్థానికత జీవో 33 ప్రకారం రెండేళ్లు బయటి రాష్ట్రంలో చదివినందున అవినాశ్ స్థానిక కోటాకు అనర్హుడని అధికారులు తేల్చారు. వరుసగా నాలుగేళ్లు తెలంగాణలో చదవలేదు కాబట్టి 85 శాతం స్థానిక కోటా వర్తించదని చెప్పారు. దీంతో అవినాశ్ హైకోర్టును ఆశ్రయించాడు. రెండేళ్లు బయట చదివిన విద్యార్థిని లోకల్ అభ్యర్థిగా గుర్తించలేమని యూనివర్సిటీ తరఫు న్యాయవాది చెప్పడంపై హైకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. అదనపు అడ్వకేట్ జనరల్ ఇమ్రాన్‌ఖాన్ ఈ విషయంపై ప్రభుత్వ అధికారులతో మాట్లాడి.. వివరాలు తెలియజేయాలని ఆదేశించింది.



వనస్థలిపురంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్లకు వెళ్లేందుకు సిద్ధమైన బాలమణి, రాములు దంపతులు

డబుల్ బెడ్‌రూం ఇళ్లకు వెళ్లిన 10 కుటుంబాలు

చాదర్‌ఘాట్: మలక్‌పేట, ఎల్బీ నగర్ నియోజకవర్గాల మధ్యనున్న భవానీ నగర్‌లోని సాయిలు, అంబేడ్కర్ హట్స్‌లో నివాసముంటున్న పది కుటుంబాలవారు వనస్థలిపురంలోని డబుల్ బెడ్ రూం ఇళ్లకు వెళ్లేందుకు గురువారం సిద్ధమయ్యారు. అధికారులు వారికి వాహనాలను సిద్ధం చేశారు. 30 ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నామని, మూసీతో అనుబంధాన్ని మరువలేమని బాలమణి, రాములు దంపతులు కంటతడి పెట్టుకున్నారు.



మూసీ రివర్ బెడ్‌లో ఉందని సూచించేలా డిఫెన్స్ కాలనీలో ఓ ఇంటికి వేసిన 'ఆర్‌బీ-ఎక్స్' ముద్ర

మూసీ సర్వే ఉద్రిక్తం

పలుచోట్ల అడ్డుకున్న నివాసితులు.. ఆగ్రహంతో అధికారుల నుంచి పత్రాలు లాక్కుని చించివేత

» మార్కింగ్‌కు వాడే రంగును విసిరేసిన ఓ యువకుడు

» మాకు విషం ఇచ్చి ఇళ్లకు మార్కింగ్ చేయాలని నిరసన

» భారీ బందోబస్తు మధ్య నదీ గర్భంలో ఇళ్లకు మార్కింగ్

» కొన్నిచోట్ల ఆర్‌బీ-ఎక్స్' మార్కింగ్‌ను తుడిచేసిన స్థానికులు

» డబుల్ బెడ్‌రూం ఇళ్లకు వెళ్లిన 10 నిర్వాసిత కుటుంబాలు



సర్వేకు వ్యతిరేకంగా వెంకటసాయినగర్ కాలనీవాసుల ఆందోళన.. అడ్డుకుంటున్న పోలీసులు

చాదర్‌ఘాట్, రాజేంద్రనగర్, ఓల్డ్ మలక్‌పేట్, అంబర్‌పేట, కొత్తపేట, అఫ్జల్‌గంజ్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మూసీ నదీగర్భం (రివర్ బెడ్) పరిధిలోని నిర్మాణాలకు మార్కింగ్ చేసే ప్రక్రియ ఉద్రిక్తంగా మారింది. గురువారం హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లో పోలీసు బందోబస్తు మధ్య రెవెన్యూ, ఇరిగేషన్, సర్వే విభాగానికి చెందిన అధికారులు ఈ సర్వే చేపట్టారు. మూసీ రివర్ బెడ్‌లో ఉన్న ఇళ్లు, వాటి యాజమానుల వివరాలు నమోదు చేసేందుకు వచ్చిన అధికారులను పలు ప్రాంతాల్లో నివాసితులు అడ్డుకున్నారు. చైతన్యపురి ఫణిగిరి కాలనీ, వెంకటసాయినగర్ కాలనీ, న్యూ మారుతీ నగర్, సత్య నగర్‌లో అధికారులతో స్థానికులు వాగ్వాదానికి దిగారు. ఎట్టి పరిస్థితుల్లో సర్వే చేయనివ్వబోమన్నారు. 'సీఎం డౌన్ డౌన్' అని నినాదాలు చేశారు. రెవెన్యూ అధికారుల వద్ద ఉన్న పత్రాలను లాక్కొని చించివేశారు. మార్కింగ్ చేసేందుకు ఉపయోగించే ఎరుపురంగును ఓ యువకుడు సిబ్బంది చేతిలోంచి లాక్కుని దూరంగా విసిరేశాడు. దీంతో ఈ ప్రాంతాల్లో 235 ఇళ్లకు మార్కింగ్ చేయాలని వచ్చిన అధికారులు 10 ఇళ్లకు మాత్రమే మార్కింగ్ చేసి వెనుతిరిగారు. రివర్ బెడ్‌లో ఉన్నట్లు సూచిస్తూ ఎరుపురంగుతో వేసిన 'ఆర్‌బీ-ఎక్స్' అనే ముద్రను అధికారులు వెళ్లిపోగానే ఆ ఇళ్ల యాజమానులు అదే రంగుతో తుడిచేశారు. కాగా, మూసానగర్ మురికివాడలో రెవెన్యూ అధికారులకు అడ్డుకోడానికి చేసిన ప్రయత్నాలను పోలీసులు నిలువరించారు. దాంతో అక్కడ సుమారు 30 ఇళ్లకు మార్కింగ్ చేసినట్లు సమాచారం. చాదర్‌ఘాట్ మూసానగర్ మురికివాడలోని 225 ఇళ్లు మూసీ రివర్ బెడ్‌లో ఉన్నట్లు గుర్తించారు. రాజేంద్రనగర్, గండిపేట్ మండలాల్లో 332 నివాసాలు, షెడ్లకు మార్కింగ్ వేశారు. అత్తాపూర్ భరత్‌నగర్, అత్తాపూర్ బ్రిడ్జి, డిఫెన్స్ కాలనీ, మాపెల్ టవర్స్ ప్రాంతాలు, పురానాపూల్ హరదర్వాజా నుండి చాదర్‌ఘాట్ సాయిబాబా గుడి వరకు ఉదయం 8 నుంచి సాయంత్రం 3 గంటల వరకు మార్కింగ్ ప్రక్రియ కొనసాగింది. ముసారాంబాగ్ డివిజన్‌లోని శాలివాహన నగర్, ముసారాంబాగ్, తీగలగూడ సుమారు 70 ఇళ్లను గుర్తించారు. ప్రస్తుతానికి మూసీ రివర్ బెడ్‌లోని ఇళ్లను మాత్రమే గుర్తించామని, తర్వాత బఫర్ జోన్‌లో ఉన్న ఇళ్లను గుర్తిస్తామని అధికారులు తెలిపారు. నిర్వాసితులకు ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయిస్తుందని, ఆ తర్వాతే మార్కింగ్ చేసిన ఇళ్లను తొలగిస్తామని స్పష్టం చేశారు.



వనస్థలిపురంలోని జైభవానీ నగర్ డబుల్ బెడ్ రూం ఫ్లాట్ తాళాలను మూసీ నిర్వాసితులకు అందజేస్తున్న అధికారులు

మాకు విషమిచ్చి.. ఇళ్లకు మార్కింగ్ చేయండి!

'అయ్యా సీఎం రేవంత్ రెడ్డి సారూ.. మూసీ సుందరీకరణ పేరుతో ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేసిన ఇళ్లకు మార్కింగ్ ఇచ్చే ముందు మాకు విషమిచ్చి చంపేయండ'ని చైతన్యపురి ఫణిగిరి కాలనీ, వెంకటసాయినగర్ కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పైసా పైసా కూడబెట్టి కట్టుకున్న ఇళ్లు.. 10 నుంచి 20 ఏళ్ల తర్వాత ఇప్పుడు అడ్డువచ్చాయా అని ప్రశ్నించారు. ఇదే సర్వే అప్పట్లోనే చేస్తే ఈ కాలనీల్లో ఇళ్లు కట్టుకునే వాళ్లం కాదు కదా అన్నారు. తమ ఇళ్లను కూల్చి మూసీ సుందరీకరణ చేయాల్సిన అవసరం ఉందా అని ప్రభుత్వాన్ని నిలదీశారు. పలువురు కన్నీళ్లు పెట్టుకున్నారు. చైతన్యపురి డివిజన్ పరిధిలోని వినాయకనగర్ కాలనీలో అధికారులు సర్వే చేపట్టి మార్కింగ్ చేయడంతో, పక్కనే ఉన్న సత్యానగర్ జనప్రియ అవెన్యూ వాసులు సుమారు 500 మంది రోడ్డెక్కారు. ప్రజల తీవ్ర నిరసనతో అధికారులు వెనుదిరిగారు.

చిన్న పరిశ్రమల యజమానుల ధర్నా

ప్రత్యామ్నాయం చూపిన తర్వాతే తమ ఇళ్లు, షాపులు తొలగించాలంటూ అంబర్‌పేటలో చిన్న పరిశ్రమల యజమానులు అలీ కేఫ్ చౌరస్తాలో ధర్నా చేశారు. తాము పట్టా భూములు కొనుక్కుని చిన్నా చితకా పరిశ్రమలు పెట్టుకున్నామని తెలిపారు. వాటి ద్వారా సుమారు 5 వేల మంది ఉపాధి పొందుతున్నామన్నారు. హైకోర్టు స్టే ఉన్నా మార్కింగ్ చేస్తున్నారన్నారు. తమకు ప్రత్యామ్నాయ స్థలాలు, పరిహారం ఇచ్చిన తర్వాతే ఖాళీ చేస్తామని, లేకుంటే ప్రాణాలర్పించడానికైనా సిద్ధమన్నారు. కాగా, రాజేంద్రనగర్, గండిపేట్ మండలాల్లో మూసీ రివర్ బెడ్‌లో 332 అక్రమణలు ఉన్నాయని గుర్తించి సర్వే చేస్తున్నామని ఆర్డీవో వెంకటరెడ్డి తెలిపారు. 1998, 2000 సంవత్సరాల్లో వచ్చిన వరదలను దృష్టిలో ఉంచుకుని సర్వే చేస్తున్నామన్నారు.

చెరువులో భవనం.. డిటోనేటర్లతో కూల్చివేత

కొండాపూర్, సెప్టెంబరు 26: సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మల్కాపూర్ పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్‌లో నిర్మించిన భవనాన్ని కలెక్టర్ ఆదేశాలతో గురువారం కూల్చివేశారు. ప్రస్తుత వర్షాలకు ఆ భవనం చెట్టూ చెరువు నీరు చేరడంతో వాహనాలు వెళ్లే అవకాశం లేక డిటోనేటర్లతో పేల్చివేశారు. భారీ శబ్దానికి ఉలిక్కిపడి బందోబస్తుకు వచ్చిన ఓ హోంగార్డు వెనక్కి పడడంతో తలకు తీవ్ర గాయమైంది. ఈ చెరువులో 2012-13లో స్వామి అనే వ్యక్తి పంచాయతీ అనుమతులతో చెరువు ఎఫ్‌టీఎల్‌లో పిల్లర్లు వేసి నాలుగు అంతస్తుల భవనం నిర్మించాడు. అందులోకి వెళ్లేందుకు వంతెనలా కట్టుకున్నాడు.



డబుల్ కసరత్తు !



» మూసీ నిర్వాసితులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్ణయంతో జీహెచ్‌ఎంసీ అప్రమత్తం

» అసంపూర్తి పనులపై ప్రభుత్వానికి సమాచారం

» నిర్మాణాలకు 3 వేల కోట్లు కావాలని అంచనా

» మూసీ నిర్వాసితులకు 15 వేల ఇళ్లు అవసరం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మూసీ నిర్వాసితులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయిస్తామన్న ప్రభుత్వ ప్రకటనతో జీహెచ్‌ఎంసీ అప్రమత్తమైంది. వేర్వేరు కారణాల వల్ల గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఏడాదిన్నరగా నిలిచిపోయిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పనుల పునఃప్రారంభంపై కసరత్తు మొదలుపెట్టింది. ఇళ్ల నిర్మాణం ఏ దశలో ఉంది.? పనులు పూర్తి చేయడానికి ఎంత డబ్బు కావాలి ? ఇప్పటికే పూర్తయిన ఇళ్లెన్ని ? కేటాయించినవి ఎన్ని ? తదితర వివరాలతో ప్రభుత్వానికి ఓ నివేదిక పంపింది. దాని ప్రకారం వివిధ దశల్లో నిలిచిన 25వేలకు పైగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణానికి రూ.3000 కోట్లు అవసరమని జీహెచ్‌ఎంసీ అధికారులు అంచనా వేశారు. ఇప్పటికే నిర్మాణం పూర్తయిన ఇళ్లు 4500 ఉన్నాయి. మూసీ నిర్వాసితులకు 15వేల ఇళ్లు అవసరమున్న దృష్ట్యా మరో 10 వేల ఇళ్లు సిద్ధం చెయ్యాల్సి ఉంది. ఈ నేపథ్యంలో తుది దశకు చేరుకున్న ఇళ్ల నిర్మాణ పనులు తొలుత పూర్తి చేయాలని భావిస్తున్నారు.

జీహెచ్‌ఎంసీలో డబుల్ ఇళ్ల స్వరూపం

ప్రతిపాదిత డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు	1,00,000
అంచనా వ్యయం	9714.59 కోట్లు
నిర్మాణం మొదలైనవి	95,315
వివిధ కారణాలతో పనులు ప్రారంభించనవి	4,685
పూర్తయినవి	69,673
కేటాయించినవి	64,369
తాళాలు ఇచ్చినవి	59,366
సిద్ధంగా ఉన్న ఇళ్లు	4,591
వివిధ దశల్లో ఉన్న ఇళ్లు	25 వేలకుపైగా

4,591 ఇళ్లు సిద్ధం.. 10,500 అవసరం

గత ప్రభుత్వం జీహెచ్‌ఎంసీ పరిధిలోని 109 ప్రాంతాల్లో రూ.9714 కోట్ల అంచనా వ్యయంతో లక్ష డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టింది. వీటిలో 95,315 ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభం కాగా కోర్టు కేసులు ఇతర కారణాల వల్ల 4,685 ఇళ్ల పనులు ప్రారంభం కాలేదు. మొత్తం 69,673 ఇళ్ల నిర్మాణం పూర్తవగా 64,369 ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించారు. పూర్తయిన వాటిలో 4,591 ఇళ్లు ఖాళీగా ఉన్నాయి. ఇందులో అప్పటికే ఉన్న నిర్మాణాలు కూల్చి ఆ స్థలంలోనే కట్టిన 1952 ఇళ్లు కూడా ఉన్నాయి. మూసీ నిర్వాసితులకు ఇళ్లు కేటాయించాలంటే ప్రస్తుతం సిద్ధంగా ఉన్న 4591 ఇళ్లకు అదనంగా మరో 10,500 కావాలి. అయితే, పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించడంతోపాటు ప్రస్తుత ధరలకు అనుగుణంగా టెండర్లలో మార్పులు చేస్తేనే పనులు చేపట్టగలమని కాంట్రాక్టర్లు అంటున్నారు. వందల కోట్ల బిల్లులు బకాయి ఉండడంతో ఏడాదిన్నరగా కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు. అసెంబ్లీ ఎన్నికల ముందు కొన్ని నిధులు విడుదల చేయడంతో తుది దశలో ఉన్న ఇళ్ల నిర్మాణం పూర్తి చేశారు. ఆ తర్వాత పనులు పూర్తిగా నిలిచిపోయాయి. అసంపూర్తి పనులు పూర్తి చేయాలని జీహెచ్‌ఎంసీ.. కాంట్రాక్టర్లను కోరగా ఎనిమిదేళ్ల క్రితం ధరల ప్రకారం పనులు చేయలేమని తేల్చిచెప్పారు. తాజా ఎస్‌ఎస్‌ఆర్ ప్రకారం బిల్లులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. అదే జరిగితే నిర్మాణ వ్యయం మరింత పెరగనుంది.

మూసీ రివర్ ఫ్రంట్ బోర్డు ఏర్పాటు చేసిందెవరు?

» నిర్వాసితులు 12 వేల మంది అని నివేదిక ఇచ్చారుగా?

» రాజకీయ లబ్ధికే కేటీఆర్, హరీశ్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు: దానం నాగేందర్

అంబర్‌పేట, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో మూసీ నదిని ప్రక్షాళన చేస్తామని చెప్పి మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ బోర్డును ఏర్పాటు చేసింది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ వ్యాఖ్యానించారు. అప్పుడు 12 వేల మంది నిర్వాసితులు కానున్నారని నివేదిక ఇచ్చి ఇప్పుడు తొలగింపులను ఎందుకు వ్యతిరేకిస్తున్నారని ప్రశ్నించారు. రాజకీయ లబ్ధి కోసం కేటీఆర్, హరీశ్ అసత్య ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. సెంటిమెంట్‌తో ప్రజలను రెచ్చగొట్టి వారి పబ్బం గడుపుకొంటున్నారని దానం నాగేందర్ మండిపడ్డారు. గురువారం అంబర్‌పేటలోని సీవరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను ఆయన పరిశీలించారు. హైదరాబాద్‌లోని 20 ప్లాంట్లలో ఐదింటిని కూడా బీఆర్‌ఎస్ పూర్తి చేయలేదని విమర్శించారు. అధిక శాతం ఎస్టీపీ ప్లాంట్లు దివంగత సీఎం వైఎస్ హయాంలోనే దాదాపు పూర్తయినట్లు చెప్పారు.

పేదల ఇళ్లను కూల్చే హక్కు ప్రభుత్వానికి లేదు

» హఠాత్తుగా అక్రమ నిర్మాణం అంటే వాళ్లు ఎక్కడకు వెళ్లాలి

» రూ.కోట్లు ఖర్చు చేసి మౌలిక వసతులు ఎలా కల్పించారు?

» జీహెచ్‌ఎంసీ అనుమతులను 'హైడ్రా' తప్పు పడుతుందా?

» సీఎంరేవంత్‌కు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి లేఖ



హైదరాబాద్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): పేదలు జీవిత కాల సంపాదనతో నిర్మించుకున్న ఇళ్లను కూల్చే హక్కు రాష్ట్ర ప్రభుత్వానికి లేదని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీలు ఇచ్చిన అనుమతులు తప్పని 'హైడ్రా' ఎలా నిర్ణయిస్తుందని ప్రశ్నించారు. ఒక సంస్థ అనుమతులిస్తే.. కొత్తగా మరో సంస్థను ఏర్పాటు చేసి, అక్రమమంటూ కూలగొట్టడం ఎంతవరకు సమంజసం? అని నిలదీశారు. గతంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పాలనలో అక్రమ నిర్మాణాలను రెగ్యులరైజ్ చేశారని గుర్తు చేశారు. ఏ ప్రభుత్వాలైనా పేదలకు ఇళ్లు, రోడ్లు, భవనాలు, బ్యారేజీలు, బ్రిడ్జిలు, ఆస్పత్రులు, విద్యాసంస్థలను నిర్మిస్తాయని, ఈ సర్కారు హైడ్రా పేరుతో.. నిర్మాణాలను తొలగిస్తూ ఏకపక్షంగా వెళ్తోందని తప్పుబట్టారు. హైడ్రా కూల్చివేతల నేపథ్యంలో బాధితులు తన దృష్టికి తీసుకొచ్చిన అంశాలు, మేధావుల ఆలోచనలు, మీడియా ద్వారా తెలుసుకున్న అంశాలతో కిషన్‌రెడ్డి గురువారం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. పేదల ఆందోళన, ఆవేదనను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవడం లేదన్నారు. పైగా హైడ్రాకు మరిన్ని అధికారాలు కల్పించడాన్ని తప్పుబట్టారు. "బీఆర్‌ఎస్ ప్రభుత్వం విచ్చలవిడిగా అప్పులు చేసి రాష్ట్రాన్ని అధోగతి పాల్జేసింది. దీన్ని సాకుగా చూపి, మౌలిక వసతుల కల్పనకు డబ్బుల్లేవంటున్నారు. అక్రమ కట్టడాల పేరిట ఇళ్లను కూల్చివేస్తున్నారు. ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలను మేం సమర్థించం. అయితే, వాటిపై తీసుకునే చర్యలు న్యాయబద్ధంగా, సహజ న్యాయ సూత్రాలకు అనుగుణంగా ఉండాలి. ముఖ్యంగా.. పేద, మధ్య తరగతి ప్రజల విషయంలో వీటి ఆధారంగానే పని చేయాలి" అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. తప్పుడు లే అవుట్‌లతో మభ్యపెట్టి, పెట్టుబడులు పెట్టించి స్థలాలు, ఫ్లాట్లు అమ్మినవారిని కూడా బాధ్యులను చేసేలా కఠినమైన చట్టాలు తీసుకురావాలని కోరారు. పేదలపై ప్రతాపం చూపకుండా హైడ్రా తొలుత వారితో మాట్లాడాలన్నారు. ఇతర భాగస్వామ్య పక్షాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొన్నారు.

కోట్లు ఖర్చుపెట్టి వసతులు కల్పించారుగా?

ఇప్పుడు అక్రమ నిర్మాణాలుగా చెబుతున్న ప్రాంతాల్లో ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేసి రోడ్లు, వీధి దీపాలు, తాగు నీరు, డ్రైనేజీ, విద్యుత్తు కనెక్షన్లు, కమ్యూనిటీ హాళ్లు, చివరకు ఇంటి నంబర్లను కూడా ఇచ్చిందని కిషన్‌రెడ్డి ప్రస్తావించారు. దశాబ్దాలుగా జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏల ద్వారా పన్నులు తీసుకుంటూ హఠాత్తుగా అక్రమం అంటే పేద, మధ్య తరగతి ప్రజలు ఏమైపోవాలి? అని నిలదీశారు. అప్పులు చేసి, బ్యాంక్ రుణాలు పొంది.. ఫ్లాట్లు, అపార్టుమెంట్లు కొనుక్కున్నారని.. కొన్నిచోట్ల అన్ని అనుమతులున్న భవనాలనూ నేలమట్టం చేయటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మూసీ పరివాహకంలో 15 వేలపైగా పేద, మధ్య తరగతి కుటుంబాలున్నాయని.. వారి నివాసాలను హైడ్రా ద్వారా కూల్చేముందు చర్చించాలని కోరారు. 20 ఏళ్ల క్రితం కాంగ్రెస్, పదేళ్లు బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన మోసానికి ప్రజలు బలయ్యారని ఆరోపించారు. ముఖ్యమంత్రిగా రేవంత్ తీసుకునే నిర్ణయం.. అందరికీ న్యాయం జరిగేలా ఉండాలని కిషన్‌రెడ్డి ఆకాంక్షించారు.

హూవర్ డ్యామ్ స్ఫూర్తితో..
జల విద్యుత్తు ప్రాజెక్టుల సామర్థ్యం పెంచండి

» అమెరికా పర్యటనలో రాష్ట్ర అధికారులకు భట్టి సూచన



హైదరాబాద్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అమెరికాలోని నెవాడా, అరిజోన రాష్ట్రాల సరిహద్దులో కొలరాడో నదిపై నిర్మించిన హూవర్ జల విద్యుత్తు డ్యామ్‌ను స్ఫూర్తిగా తీసుకుని రాష్ట్రంలోని జల విద్యుత్తు ప్రాజెక్టుల సామర్థ్యం పెంపుపై దృష్టి పెట్టాలని రాష్ట్ర అధికారులకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సూచించారు. అమెరికా పర్యటనలో భాగంగా ఆయన బుధవారం హూవర్ డ్యామ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా అమెరికా అధికారులు ప్రాజెక్టు గురించి భట్టికి వివరించారు. తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్న 1931-36 మధ్య ఈ ప్రాజెక్టును నిర్మించారని, దీని ద్వారా 2080 మెగావాట్ల జల విద్యుత్తు ఉత్పత్తి అవుతుందని తెలిపారు. ఈ డ్యామ్ మూడు రాష్ట్రాల విద్యుత్తు అవసరాలను తీరుస్తుందని చెప్పారు. మూడు ప్రధాన పట్టణాల్లోని 80 లక్షల మంది ప్రజలకు మంచినీటిని అందిస్తుందని, సాగునీటి అవసరాలు కూడా తీరుస్తుందని వివరించారు. అనంతరం భట్టి మాట్లాడుతూ, హూవర్ డ్యామ్ జల విద్యుత్తు ఉత్పాదకతను స్ఫూర్తిగా తీసుకుని, రాష్ట్రంలోని ప్రాజెక్టుల సామర్థ్యం పెంపుదలకు, రక్షణకు గల అవకాశాలను పరిశీలించాలని ఆయనతో పాటు ఉన్న రాష్ట్ర విద్యుత్తుశాఖ కార్యదర్శి రొనాల్డ్ రోస్, సింగరేణి ఎండీ బలరామ్‌కు సూచించారు.

బీసీ గురుకులాలు, హాస్టళ్లపై
15 రోజులకో నివేదిక ఇవ్వాలి: మంత్రి పొన్నం



హైదరాబాద్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని బీసీ గురుకులాలు, హాస్టళ్లలో విద్యా ప్రమాణాలు, సౌకర్యాల మెరుగుదలకు తీసుకుంటున్న చర్యలపై 15 రోజులకోసారి పురోగతి నివేదిక ఇవ్వాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. గురుకులాల్లో విద్యాబోధనపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడమేకాకుండా పిల్లల వ్యక్తిగత నైపుణ్యాలను మెరుగుపరిచేలా ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖ అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ.. 'హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి. ఈ విషయంలో సంబంధిత అధికారులెవరూ అలక్ష్యంగా వ్యవహరించకూడదు. విద్యార్థుల స్టడీ అవర్స్, బ్రేక్‌ఫాస్ట్, లంచ్ టైమ్‌లలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలి' అని సూచించారు.

అటవీ నిబంధనలతో 'పెసా'కు ఆటంకం

» గ్రామసభల నిర్ణయాధికారాన్ని గౌరవించాలి: సీతక్క

న్యూఢిల్లీ, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ, గిరిజన ప్రాంతాల ప్రజల కోసం తీసుకొచ్చిన పెసా(షెడ్యూల్డ్ ప్రాంతాలకు పంచాయతీ చట్టాన్ని వర్తింప చేసే చట్టం) అమలుకు అటవీ, పర్యావరణ శాఖ నిబంధనలు ఆటంకంగా మారాయని మంత్రి సీతక్క అభిప్రాయపడ్డారు. పెసా వర్సెస్ ఫారెస్ట్ యాక్ట్ అన్నట్లుగా పరిస్థితి మారడంతో ఆదివాసీ, గిరిజనులు అభివృద్ధికి నోచుకోవడం లేదని అన్నారు. ఈ నేపథ్యంలో పెసా చట్టం అమలుకు ఆటంకంగా మారిన అటవీ, పర్యావరణ శాఖ చట్టంలోని పలు నిబంధనలను సవరించాలని ప్రతిపాదించారు. ఈ మేరకు న్యూఢిల్లీ వేదికగా పెసా చట్టంపై గురువారం జరిగిన జాతీయ సదస్సులో మంత్రి సీతక్క మాట్లాడారు. అటవీ, పర్యావరణ శాఖ అనుమతులు నిరాకరిస్తుండడంతో చాలా గిరిజన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన జరగడం లేదన్నారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న ములుగు నియోజకవర్గంలో పాఠశాల భవన నిర్మాణానికి అటవీ శాఖ అనుమతివ్వకపోవడంతో కంటైనర్‌లో తరగతులు నిర్వహిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. పెసా చట్టంలో పొందు పరిచిన విధంగా గ్రామసభలకు నిర్ణయాధికారాన్ని కట్టబెట్టాలని కోరారు. ఈ ప్రతిపాదను ఇతర రాష్ట్రాలకు చెందిన మంత్రులు కూడా సమర్థించారు. సదస్సు సందర్భంగా కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ సహాయ మంత్రి ఎస్పీ సింగ్ బఘేల్‌ను కలిసిన మంత్రి సీతక్క, రాష్ట్రానికి రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. కాగా, అమృత్ పథకం విషయంలో బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలు అర్థరహితమని సీతక్క అన్నారు. అమృత్ పథకం అమలులో తప్పిదాలు జరిగితే కేంద్రమే చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆమె విలేకరులతో మాట్లాడారు. సృజన్‌రెడ్డితో మీ ఇంటి ఆడపడుచు మద్యం వ్యాపారం చేసినట్టు ఆరోపణలు ఉన్నాయంటూ కేటీఆర్‌ను ఉద్దేశించి అన్నారు.

నివాస ప్రాంతాల్లోని పరిశ్రమలు తరలించాలి

» కాలుష్య నియంత్రణ మండలికి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా నివాస ప్రాంతాలకు కిలోమీటరు పరిధిలో ఉన్న ఐరన్ స్పాంజ్ పరిశ్రమలను తరలించాలని ప్రభుత్వం, కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ)లకు గురువారం హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. పర్యావరణ పరిరక్షణ చట్టం, వాటర్, ఎయిర్ చట్టాల నిబంధనల ప్రకారం వాటిని వేరే చోట నెలకొల్పాలని పేర్కొంది. ఆయా పిటిషన్లపై విచారణ చేపట్టిన చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం.. అన్ని పరిశ్రమల్లో తనిఖీలు చేసి నిబంధనలకు విరుద్ధంగా ఉన్న పరిశ్రమలను ఏడాదిలోగా తరలించాలని తుది తీర్పు ఇచ్చింది. ఈ మేరకు రెండునెలల్లో నివేదిక రూపొందించి హైకోర్టు రిజిస్ట్రార్ (జ్యుడీషియల్)కు సమర్పించాలని సూచించింది.

నేటి నుంచి వైద్య సీట్ల మొదటి దశ కౌన్సెలింగ్

హైదరాబాద్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేట్ మైనారిటీ, నాన్ మైనారిటీ మెడికల్ కళాశాలల్లో ఎంబీబీఎస్ కన్వీనర్ కోటా సీట్ల భర్తీకి సంబంధించి మొదటి దశ కౌన్సెలింగ్ ప్రక్రియకు సంబంధించిన నోటిఫికేషన్‌ను కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం గురువారం విడుదల చేసింది. అందులో మెరిట్ జాబితాలో పేర్లున్న అభ్యర్థులంతా ఈనెల 27వ తేదీ ఉదయం 6 గంటల నుంచి 29వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు వెబ్ ఆప్షన్లు ఇమ్ముకోవాలని సూచించింది. మొత్తం 60 ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లోని 5,658 ఎంబీబీఎస్ సీట్లను భర్తీ చేయనున్నారు. అందులో 5,125 ఎంబీబీఎస్ సీట్లు ప్రభుత్వ, ప్రైవేట్ నాన్ మైనారిటీ కాలేజీల్లోని కన్వీనర్ కోటా సీట్లు కాగా 330 మైనారిటీ కాలేజీల్లోని ఎంబీబీఎస్ కన్వీనర్ కోటా సీట్లు. రాష్ట్రంలో ఈడబ్ల్యూఎస్ కోటాను ఏడు కాలేజీల్లో అమలు చేస్తామని కాళోజీ వర్సిటీ ప్రకటించింది. గాంధీ, మహబూబ్‌నగర్, నిజామాబాద్, కాకతీయ మెడికల్ కాలేజీలు, ఆదిలాబాద్ రిమ్స్, సిద్దిపేట, ఈఎస్ఐ మెడికల్ కాలేజీల్లో ఈడబ్ల్యూఎస్ కేటగిరీ కింద 203 సీట్లు ఉండనున్నాయి.

సీనియర్ జర్నలిస్టు ఆదినారాయణ మృతి



హైదరాబాద్, అమరావతి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సీనియర్ జర్నలిస్టు, ఈటీవీ హైదరాబాద్ బ్యూరోచీఫ్‌గా పనిచేస్తున్న తన్నీరు ఆదినారాయణ (48) గురువారం ఉదయం మృతి చెందారు. తాను నివాసం ఉంటున్న అపార్ట్‌మెంట్ ఐదో అంతస్తులో వాకింగ్ చేస్తూ కళ్లు తిరగడంతో అక్కడి నుంచి ప్రమాదవశాత్తు జారిపడ్డారు. తీవ్ర గాయాలపాలైన ఆయన్ను కుటుంబసభ్యులు మియాపూర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆయన మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మియాపూర్ వినాయక్‌నగర్‌లో నివాసం ఉంటున్న ఆదినారాయణ, రమాదేవి దంపతులకు ఇద్దరు మగ పిల్లలు. ఆయన 25 ఏళ్లుగా ఈటీవీలో పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఈటీవీ హైదరాబాద్ బ్యూరో చీఫ్‌గా పనిచేస్తున్నారు. కొన్ని రోజులుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆదినారాయణ పార్థివదేహం వద్ద ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్, పలువురు జర్నలిస్టులు నివాళులర్పించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జర్నలిస్టు ఆదినారాయణ మృతి పట్ల తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన ఆకస్మిక మృతి బాధాకరమని, ఆయన కుటుంబసభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్నిప్రసాదించాలని కోరుకుంటున్నానని రేవంత్ తెలిపారు.

గుడెందొడ్డి రిజర్వాయర్ సామర్థ్యం పెంపు

1.5 టీఎంసీల నుంచి 15 టీఎంసీల మేర పెంపునకు సీఎం అంగీకారం

ప్రాధాన్య ప్రాజెక్టులకు ప్రతీనెల నిధులు: సీఎం రేవంత్.. 240 కోట్లు అవుతాయని అంచనా

హైదరాబాద్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జవహర్ నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో కట్టిన గుడెందొడ్డి రిజర్వాయర్ సామర్థ్యాన్ని 1.5 టీఎంసీల నుంచి 15 టీఎంసీలకు పెంచే ప్రతిపాదనలు పరిశీలించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. జూరాల రిజర్వాయర్ ప్రాజెక్టుపై ఉన్న 7 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించడంలో భాగంగా గుడెందొడ్డి రిజర్వాయర్ సామర్థ్యం పెంపునకు తగిన చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు. రిజర్వాయర్ సామర్థ్యం పెంపునకు రూ.4500 కోట్ల నుంచి రూ.5 వేల కోట్ల దాకా ఖర్చు అవుతాయని అధికారులు అంచనా వేశారు. నీటిపారుదల శాఖ కార్యాలయంలోని జలసౌధలో రేవంత్‌రెడ్డి మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డితో కలిసి, ప్రాధాన్య ప్రాజెక్టులపై సమీక్ష చేశారు. రేలంపాడు రిజర్వాయర్‌లో సీపేజీ భారీగా ఉండటంతో నీటిని నిల్వ చేయలేని పరిస్థితి ఉందని, దీనికి కర్టెన్ గ్రౌటింగ్ చేస్తే సీపేజీ తగ్గుముఖం పడుతుందని అధికారులు గుర్తు చేయగా మరమ్మతులు చేసి, రిజర్వాయర్ సామర్థ్యాన్ని 2 టీఎంసీల నుంచి 4 టీఎంసీలకు పెంచాలని ఆదేశించారు. శ్రీశైలం లెఫ్ట్ బ్యాంకు కెనాల్‌లో భాగంగా 7.5 టీఎంసీల సామర్థ్యం కలిగిన నక్కలగండి రిజర్వాయర్‌కు అటవీ భూమి సేకరణతో పాటు పునరావాసం, పునర్‌నిర్మాణ సమస్యలున్నాయని అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు. సమస్యలను పరిష్కరించి, పనులను వేగిరం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి చెందిన ఐదు మోటార్లు నడవడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. ప్రతీనెల రూ.240 కోట్లను ప్రాధాన్య ప్రాజెక్టుల కోసం విడుదల చేస్తామని, దీనికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును ఆదేశించారు. రాష్ట్రంలో ఉన్న మేజర్, మీడియం ప్రాజెక్టులలో పూడికతీతపై ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలు పరిశీలించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. చిన్న కాళేశ్వరం, మోడికుంటవాగు, లోయర్ పెన్‌గంగా, చనఖా కొరటా, జేచొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకం, ఎల్లంపల్లి ప్రాజెక్టు, కోయిల్ సాగర్ లిఫ్ట్, జవహర్ నెట్టెంపాడు లిఫ్ట్, రాజీవ్ భీమా లిఫ్ట్, ఎలిమినేటి మాధవరెడ్డి ఎస్ఎల్‌బీసీ, డిండి లిఫ్ట్, ఎస్సారెస్పీ-2, నీల్వాయి, సదర్‌మట్ బ్యారేజీ, పాలెంవాగు ప్రాజెక్టులను వీలైనంత తొందరగా పూర్తి చేసేందుకు అవకాశాలున్నాయని ఈ సమావేశంలో ఇరిగేషన్ అధికారులు పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు.

30 రోజుల్లో హెల్త్ కార్డులు

ఒక్క క్లిక్‌తో రాష్ట్రంలోని ప్రతి ఒక్కరి హెల్త్ ప్రొఫైల్.. నాలుగు కోట్ల మంది వివరాలు డిజిటైజ్

» ప్రమాదకరమైన క్యాన్సర్‌ను జయించాలి: సీఎం రేవంత్



రెనోవా క్యాన్సర్ ఆస్పత్రిలో నూతన పరికరాలను పరిశీలిస్తున్న సీఎం రేవంత్, మంత్రి దామోదర

రాంనగర్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజలందరికీ మరో 30 రోజుల్లో డిజిటల్ హెల్త్ కార్డులను తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలోని నాలుగు కోట్ల మంది హెల్త్ ప్రొఫైల్స్‌ను డిజిటైజ్ చేస్తారని, గత చికిత్స వివరాలను కూడా వాటిలో పొందుపరుస్తారని, ఒక్క క్లిక్‌తో ప్రతి ఒక్కరి హెల్త్ ప్రొఫైల్ తెలుసుకునే విధంగా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని వివరించారు. ఈ బృహత్తర కార్యక్రమంలో దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఆస్పత్రి వంటి ట్రస్ట్‌ల సహకారం తీసుకోవాలని ప్రయత్నిస్తున్నామన్నారు. విద్యానగర్‌లోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఆస్పత్రి ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన రెనోవా క్యాన్సర్ ఆస్పత్రిని గురువారం మంత్రి రాజనర్సింహతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం రాకముందు మనిషి జీవిత కాలం 32 ఏళ్లు ఉండేదని, నెహ్రూ నాయకత్వంలో వైద్య రంగానికి పెద్దపీట వేసి దానిని 60 ఏళ్లకు తీసుకొచ్చారని, దానిని వందేళ్లు దాటేలా కృషి చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా, వైద్య రంగానికి పెద్దపీట వేస్తోందన్నారు. "క్యాన్సర్ సోకిన నిరుపేదలు చికిత్స చేయించుకోలేక ప్రాణాలు కోల్పోవాల్సి వస్తోంది. సమాజాన్ని పట్టిపీడిస్తున్న క్యాన్సర్ వ్యాధిని జయించాల్సిన అవసరం ఉంది" అని వివరించారు. డీడీహెచ్; రెనోవా ఆస్పత్రి యాజమాన్యాలు క్యాన్సర్ రోగులకు అందించే సేవలకు ప్రభుత్వపరంగా సహకారం అందిస్తామన్నారు. పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో డిజిటల్ హెల్త్ తీసుకు వస్తున్నామని మంత్రి రాజనర్సింహ చెప్పారు. గ్రామ స్థాయిలో పేదలకు క్యాన్సర్ వైద్య చికిత్సలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. క్యాన్సర్ బారిన పడిన పేదలకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో రెనోవా ఆస్పత్రులను విస్తరింపజేస్తున్నామని ఆ గ్రూప్ ఛైర్మన్ శ్రీధర్ పెద్దిరెడ్డి తెలిపారు. ప్రభుత్వం ప్రతి జిల్లాలో 100 పడకలతో క్యాన్సర్ ఆస్పత్రులను నిర్మిస్తే తాము సేవలందిస్తామన్నారు. కాగా, ప్రజలకు హెల్త్‌కార్డులను అందించేందుకు వడివడిగా అడుగులు వేస్తున్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ.. హరియాణాలో అధ్యయనానికి ప్రత్యేక బృందాన్ని పంపినట్లు సమాచారం. ఎలాంటి కార్డులను అందించాలి? అందుకు అవలంబించాల్సిన అంశాలేంటి? అనేదానిపై ఈ బృందం ప్రభుత్వానికి నివేదిక సమర్పించనుంది.

మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ

» రాష్ట్రం కోసం అలుపెరగని కృషి చేసిన నాయకుడు: సీఎం
» నేడు కొండా లక్ష్మణ్ జయంతి
» చాకలి ఐలమ్మకు రేవంత్ నివాళి

హైదరాబాద్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కొండా లక్ష్మణ్ బాపూజీ మహనీయుడని.. మలిదశ తెలంగాణ ఉద్యమానికి తన ఇంటిని, ఆస్తులను దానం చేశారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మెచ్చుకున్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఐదు దశాబ్దాలుగా అలుపెరగని కృషి చేశారని కొనియాడారు. శుక్రవారం కొండా లక్ష్మణ్ జయంతి సందర్భంగా రేవంత్ ఆయనను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా బహుభాషా కోవిదుడైన బాపూజీ జీవితాంతం బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి పాటుపడ్డారని పేర్కొన్నారు. ఈ మేరకు సీఎం కార్యాలయం గురువారం మీడియాకు ప్రకటన విడుదల చేసింది. కాగా, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సీఎంతో పాటు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యే శ్రీ గణేశ్ ఉన్నారు. గాంధీభవన్‌లో ఐలమ్మ 129వ జన్మదినం సందర్భంగా ఆమె చిత్ర పటానికి కాంగ్రెస్ నాయకులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.



ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫెస్టివల్ సావనీర్ విడుదల చేస్తున్న మంత్రి శ్రీధర్ బాబు, పారిశ్రామికవేత్తలు.

యూనికార్న్‌లుగా స్టార్టప్‌లు ఎదగాలి

» ఆవిష్కర్తలకు రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహం
» ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు
» ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫెస్టివల్ ప్రారంభం

హైదరాబాద్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని, యువ ఆవిష్కర్తలు తమ సృజనాత్మకతతో యూనికార్న్‌లుగా (బిలియన్ డాలర్ల విలువ చేసే కంపెనీ) ఎదగాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో ఏర్పాటుచేసిన మూడు రోజుల ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫెస్టివల్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇక్కడి స్టార్టప్‌లు యూనికార్న్‌లుగా ఎదగాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఏఐ సిటీలో భాగస్వామ్యం అయ్యేందుకు అనేక అంతర్జాతీయ కంపెనీలు ఆసక్తి చూపిస్తున్నాయని, స్టార్టప్‌లకూ అద్భుత అవకాశాలు ఉంటాయన్నారు. సైయంట్ వ్యవస్థాపకులు బీవీఆర్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఏఐ రంగంలో ఎదిగేందుకు అద్భుతమైన అవకాశాలున్నాయని తెలిపారు. అపోలో హాస్పిటల్స్ జాయింట్ ఎండీ సంగీతా రెడ్డి మాట్లాడుతూ నేటికీ ప్రపంచవ్యాప్తంగా 300కోట్ల ప్రజలకు వైద్యం అందుబాటులో లేదని, ఇలాంటి సమస్యలకు స్టార్టప్‌లు పరిష్కారం చూపాలన్నారు. స్టార్టప్‌లుగా ఎదిగేందుకు యువ ఆవిష్కర్తలకు ప్రస్తుతం అద్భుతమైన అవకాశాలున్నాయని పారిశ్రామికవేత్త శ్రీనిరాజు అన్నారు. శనివారం వరకు కొనసాగనున్న స్టార్టప్ ఫెస్టివల్‌లో 15దేశాల నుంచి ప్రతినిధులు పాల్గొంటున్నారని ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు జేఏ చౌదరి తెలిపారు.

శ్రీశైలం ప్రాజెక్టుకు 97 వేల క్యూసెక్కుల వరద

» జూరాలకూ అంతే మొత్తంలో ఇన్ ఫ్లో
» శ్రీరాంసాగర్‌కు లక్ష క్యూసెక్కుల ప్రవాహం

గద్వాల/పుల్కల్/మెండోర, సెప్టెంబరు 26 : పరీవాహక ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో కృష్ణా నదిపై ఉన్న ప్రాజెక్టులకు వరద ప్రవాహం పెరిగింది. కర్ణాటకలోని నారాయణపూర్ ప్రాజెక్టుకు 75 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 25 గేట్లను ఎత్తి 80,240 క్యూసెక్కులను జూరాలకు విడుదల చేస్తున్నారు. జూరాలకు 97 వేల క్యూసెక్కుల వరద వస్తోంది. ఇందులో భీమా నుంచి 42 వేల క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. జూరాల 10 గేట్లను ఎత్తి 70,420 క్యూసెక్కులు.. విద్యుత్ ఉత్పత్తి ద్వారా 34,346 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలానికి 97,476 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతోంది. జలవిద్యుత్‌ను ఉత్పత్తి చేస్తూ 46,715 క్యూసెక్కులను వదులుతున్నారు. తుంగభద్ర ప్రాజెక్టుకు 12 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా విద్యుత్ ఉత్పత్తి ద్వారా 2 వేల క్యూసెక్కులు, కాలువలకు 10 వేల క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి గురువారం లక్షా 10 వేల క్యూసెక్కుల ఇన్ ఫ్లో నమోదైంది. దీంతో 22గేట్లను ఎత్తి 81,224 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. సంగారెడ్డి జిల్లాలోని సింగూరు ప్రాజెక్టుకు 14,563 క్యూసెక్కుల వరద ప్రవాహం నమోదైంది. రెండు గేట్ల ద్వారా 16,284 క్యూసెక్కులు, జలవిద్యుత్ ఉత్పత్తి ద్వారా 2,823 క్యూసెక్కుల జలాలను దిగువకు వదులుతున్నారు.

అధికారికంగా వెంకటస్వామి జయంతి, వర్ధంతి

» ఉత్తర్వులు జారీ

హైదరాబాద్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మాజీ మంత్రి జి.వెంకటస్వామి జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి గురువారం ఉత్తర్వులను జారీ చేశారు. ప్రతి సంవత్సరం అక్టోబరు 5న జయంతి కార్యక్రమాన్ని, డిసెంబరు 22న వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ కృషి అజరామరం

» బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

తెలంగాణ ఆత్మగౌరవం కోసం, పోరాటాలు నడిపిన తొలితరం ఉద్యమ నేతగా కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన కృషి అజరామరమని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కొనియాడారు. రాజకీయవేత్తగా తెలంగాణ అస్తిత్వాన్ని చాటేందుకు బాపూజీ నడిపిన రాజీలేని పోరాటాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని కేసీఆర్ పేర్కొన్నారు. శుక్రవారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించుకుని ఆయన కృషిని కేసీఆర్ స్మరించుకున్నారు. బడుగుబలహీన వర్గాల అభున్నతే లక్ష్యంగా తన జీవితకాలం పోరాడిన బాపూజీ ఆకాంక్షలకు అనుగుణంగా పదేండ్ల పాలన కొనసాగిందని కేసీఆర్ అన్నారు.

ఈ ఏడాదే 10 లక్షల ఇందిరమ్మ ఇళ్లు

తొలుత మంజూరు చేయాలనుకున్న 4.50 లక్షల కంటే రెట్టింపు

» బిల్లుల చెల్లింపునకు గ్రీన్ చానల్.. ఐదారుగురితో గ్రామ కమిటీలు
» అర్హుల ఎంపికకు 360 డిగ్రీ సాఫ్ట్‌వేర్, శాటిలైట్ జియో ట్యాగింగ్
» ఇళ్ల కమిటీకి అధ్యక్షుడిగా జిల్లా ఇంచార్జి మంత్రి, ఛైర్మన్‌గా కలెక్టర్

హైదరాబాద్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మకంగా భావిస్తూ.. అర్హులైన పేదలందరికీ లబ్ధి చేకూర్చాలని చూస్తున్న ఇందిరమ్మ ఇంటి పథకంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. పథకం అమలుకు కావాల్సిన విధివిధానాలు, మార్గదర్శకాలను కొలిక్కితెచ్చింది. తొలుత ఈ ఆర్థిక సంవత్సరంలో 4.50 లక్షల ఇళ్లను ఇవ్వాలని నిర్ణయించినా వాటిని 10 లక్షలకు పెంచినట్లు తెలిసింది. పథకాన్ని అత్యంత పారదర్శకంగా అమలు చేసేందుకు అప్ డేటెడ్ సాఫ్ట్‌వేర్ వినియోగంతో పాటు, గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కమిటీలను నియమించనుంది. పంచాయతీ కార్యదర్శి, రెవెన్యూ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్, ఒకరిద్దరితో కలిపి ఐదారుగురితో గ్రామ కమిటీలను వేయనున్నారు. మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి అధికారులతో ఆయా కమిటీలను ఏర్పాటు చేస్తారు. నియోజకవర్గానికి 3,500 చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 4,16,500 ఇళ్లు ఇవ్వాలని, రిజర్వ్ కోటా కింద 33,500ఇళ్లను ప్రభుత్వ విచక్షణ (రిజర్వ్ కోటా)లో ఉంచాలని గతంలో భావించింది. ఇప్పుడు 10 లక్షలకు పెంచనుండడంతో ఈ కోటా కూడా పెరగనుంది. డిసెంబరులో నిర్వహించిన ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కోసం 82 లక్షల దరఖాస్తులు రాగా, వీటిలో పట్టణాల్లోవి 23.50 లక్షలు, గ్రామాల్లోవి 58.50 లక్షలున్నాయి. మొదటి దశలో.. అంటే ఈ ఆర్థిక సంవత్సరంలో సొంత స్థలం ఉన్నవారికి, రెండో దఫాలో స్థలం లేనివారికి ఇవ్వనున్నారు.

సిబ్బంది వచ్చేశారు..

ఇందిరమ్మ పథకానికి ఉద్యోగులను సమకూరుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. హౌసింగ్ కార్పొరేషన్ కింద పనిచేసి వివిధ శాఖలు, సంస్థలకు డిప్యూటేషన్‌పై వెళ్లిన 242 మందిని వెనక్కి తీసుకొచ్చింది. వీరందరూ ఇందిరమ్మ పథకాన్ని పర్యవేక్షించాల్సి ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్ల పథకాన్ని చేపట్టినా హౌసింగ్ కార్పొరేషన్ సేవలను పెద్దగా వినియోగించుకోలేకపోయింది. ఉద్యోగులను వివిధ శాఖలు, కార్పొరేషన్లు, బోర్డులకు డిప్యూటేషన్‌పై పంపించింది. హౌసింగ్ కార్పొరేషన్‌ను రోడ్లు భవనాల శాఖలో విలీనం చేసింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 'అభయ హస్తం' కింద ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని చేపట్టింది. పర్యవేక్షణకు ఉద్యోగులు అవసరం కావడంతో డిప్యూటేషన్‌పై వెళ్లిన ఉద్యోగులను హౌసింగ్ కార్పొరేషన్‌కు రప్పించింది.

కేంద్ర పథకంతో అనుసంధానం..

ఇందిరమ్మ పథకాన్ని పీఎం ఆవాస యోజనకు అనుసంధానించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పథకానికి సంబంధించి సంయుక్త పర్యవేక్షణకు అధ్యక్షుడిగా జిల్లా ఇంచార్జి మంత్రి, జిల్లా ఛైర్మన్‌గా కలెక్టర్ ఉండనున్నారు. బిల్లులు దశలవారీగా చెల్లించనున్న నేపథ్యంలో.. ఆలస్యం లేకుండా అందించేలా గ్రీన్ చానల్‌ను ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. సాంకేతిక అంశాలపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. గ్రామ స్థాయిలో అర్హుల జాబితాను గ్రామ కమిటీ ఖరారు చేసి, ఎండీవోకు పంపుతారు. ఎండీవో మరోసారి పరిశీలన చేసి కలెక్టర్‌కు అందజేస్తారు. కలెక్టర్, జిల్లా ఇంచార్జి మంత్రి జాబితాపై నిర్ణయం తీసుకుంటారు. మరోవైపు అర్హుల ఎంపికలో 360 డిగ్రీల సాఫ్ట్‌వేర్‌తోపాటు, శాటిలైట్ జియో ట్యాగింగ్‌ను నియోగించనున్నారు. తొలి విడత లబ్ధి సొంత స్థలం ఉన్నవారికే అందనుంది. అందులోనూ మొదట నిరుపేదలకు, ఆ తరువాత పేదలకు ఇళ్లను అందించనున్నారు.

నవంబరు నుంచి కొత్త రిజిస్ట్రేషన్ చార్జీలు!

» సీఈజీఐఎస్ నివేదిక, అధికారుల ప్రతిపాదనలు పరిశీలించి తుది నిర్ణయం
» అక్టోబరు నుంచి కొత్త ఆర్వోఆర్ చట్టం
» ధరణి సమస్యలకు పూర్తి పరిష్కారం
» పరీక్షతో గ్రామ రెవెన్యూ ఉద్యోగుల ఎంపిక
» పాతవారూ పరీక్ష రాయాల్సిందే
» మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



హైదరాబాద్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): భూముల మార్కెట్ విలువలు పెంచాలని సర్కారు నిర్ణయించిన నేపథ్యంలో నవంబరు 1 నుంచి సవరించిన కొత్త రిజిస్ట్రేషన్ విలువలు అమల్లోకి రానున్నాయని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. పెంచనున్న మార్కెట్ విలువలపై విమర్శలు తలెత్తకుండా ఉండేందుకు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. గురువారం ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ.. విలువల పెంపు శాస్త్రీయంగా ఉండాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని చెప్పారు. కాంట్రాక్టు ఏజెన్సీ అయిన సెంటర్ ఫర్ ఎఫెక్టివ్ గవర్నెన్స్ ఆఫ్ ఇండియన్ స్టేట్స్ (సీఈజీఐఎస్) ఇచ్చే నివేదికపైనే ఆధారపడకుండా, రిజిస్ట్రేషన్ శాఖ అధికారుల నుంచి కూడా ప్రతిపాదనలనూ పరిశీలించి తుది నిర్ణయం తీసుకోనున్నామన్నారు. అక్టోబరు 15 లోపల నివేదిక ఇస్తుందని, ఆ వెంటనే మార్కెట్ విలువల సవరణపై నిర్ణయం తీసుకుంటామన్నారు. కాగా, ప్రస్తుతం చదరపు అడుగు ఫ్లాట్ ధర రిజిస్ట్రేషన్ శాఖ విలువ ప్రకారం నగరాల్లో సగటున రూ.3200గా ఉంటే దీన్ని 30 శాతం(రూ.960) మించకుండా పెంచే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. సాగు భూములు, స్థలాల విషయంలో ఇప్పుడున్న విలువను సవరించి గజం ధర రూ.1,000 ఉంటే దాన్ని రూ.2 వేలకు పెంచాలనే ప్రతిపాదనలున్నాయి.

వచ్చే నెల నుంచి అమల్లోకి..

వచ్చే నెల నుంచి కొత్త రికార్డ్ ఆఫ్ రైట్స్ (ఆర్వోఆర్-2024) చట్టం అమల్లోకి రానుందని మంత్రి తెలిపారు. ఇందుకు అవసరమైన సన్నాహాలు చేస్తున్నామని వెల్లడించారు. ఆర్వోఆర్ ముసాయిదాపై వివిధ వర్గాల నుంచి సేకరించిన సలహాలు, సూచనలు, కలెక్టర్లు పంపిన నివేదికలపై ఇప్పటికే తుది నిర్ణయం తీసుకున్నామన్నారు. అయితే ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేసి చట్టం తేవడమా లేక ఆర్డినెన్స్ ద్వారా తీసుకురావడమా అనే దానిపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. గత నెలలో కర్ణాటక పర్యటనకు వెళ్లి వచ్చిన ధరణి కమిటీ సభ్యులు.. ప్రతిపాదించిన అంశాలనూ చట్టంలో పొందుపరిచే విషయాన్ని పరిశీలిస్తున్నామన్నారు. కొత్త చట్టం అమల్లోకి వస్తే ధరణితో పాటు చాలావరకు భూసమస్యలకు పరిష్కారం దొరుకుతుందని చెప్పారు. ధరణిలో 3.10 లక్షల పెండింగ్ దరఖాస్తుల్లో ఇప్పటికీ 1.10లక్షలు అపరిష్కృతంగా ఉన్నాయని.. వీలైనంత త్వరగా వాటిని పరిష్కరించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించినట్లు వెల్లడించారు. గ్రామ స్థాయిలో రెవెన్యూ వ్యవస్థను తిరిగి బలోపేతం చేస్తామని చెప్పారు. వీఆర్వో, వీఆర్ఏ నియామకాలకు సంబంధించి... అభ్యర్థుల సామర్థ్యాలను గుర్తించేందుకు పరీక్ష పెట్టి ఎంపిక చేస్తామని వివరించారు. అభ్యర్థులకు డిగ్రీ విద్యా అర్హతగా నిర్ణయించామన్నారు. పాత వారిని తిరిగి రెవెన్యూ సర్వీసులోకి తీసుకోవాలన్నా పరీక్ష రాయాల్సిందేనని స్పష్టం చేశారు. కాగా, రిజిస్ట్రేషన్ శాఖలో ఇటీవల జరిగిన బదిలీల్లో కొంతమంది అధికారులు వసూళ్లకు పాల్పడటంపై మంత్రి పొంగులేటి ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని జాగ్రత్తలు తీసుకుని బదిలీలు చేసినా.. ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొచ్చిన వారిని ఊడ్చి కొడతానని ఘాటుగా వ్యాఖ్యానించారు. బదిలీల్లో ఎవరు వసూళ్లకు పాల్పడ్డారో ఆ వివరాలు తన దగ్గర ఉన్నాయని, వారిని ఉపేక్షించేది లేదన్నారు.

కార్మికులకు శుభవార్త..
కనీస వేతన రేట్లను పెంచిన కేంద్రం

» అక్టోబరు 1 నుంచి అమల్లోకి..

న్యూఢిల్లీ, సెప్టెంబరు 26: కేంద్ర ప్రభుత్వం కార్మికులకు శుభవార్త చెప్పింది. కార్మికులు ముఖ్యంగా అసంఘటిత రంగంలోని కార్మికుల కనీస వేతన రేట్లను పెంచుతున్నట్టు గురువారం ప్రకటించింది. జీవన వ్యయాలు పెరుగుతున్న నేపథ్యంలో ఆమేరకు కార్మికులకు ప్రయోజనం చేకూర్చే లక్ష్యంతో వేతనాలను సవరించినట్టు కార్మిక మంత్రిత్వ శాఖ ఓ ప్రకటనలో పేర్కొంది. వేతన రేట్ల సవరణ వల్ల భవన నిర్మాణం, లోడింగ్-అన్‌లోడింగ్, వాచ్ అండ్ వార్డ్, స్వీపింగ్, క్లీనింగ్, హౌస్‌కీపింగ్, గనులు వంటి రంగాల్లోని కార్మికులు లబ్ధి చేకూరుతుందని తెలిపింది. కొత్త వేతన రేట్లు ఈ ఏడాది అక్టోబరు ఒకటోతేదీ నుంచి అమల్లోకి వస్తాయి. తాజా సవరణ అనంతరం 'ఏ' ఏరియాకు సంబంధించి నిర్మాణం, స్వీపింగ్, క్లీనింగ్, లోడింగ్, అన్‌లోడింగ్‌లో పనిచేసే నైపుణ్యం అవసరంలేని కార్మికులకు కనీస వేతనం రోజుకు రూ.783 (నెలకు రూ.20,358) ఉంటుంది. సెమీ స్కిల్డ్ కార్మికులకు రోజుకు రూ.868 (నెలకు రూ.22,568), నైపుణ్యం కలిగిన.. క్లరికల్, నిరాయుధ వాచ్‌మెన్‌కు రోజుకు కనీస వేతనాన్ని రూ.954 (రూ.24,804)కు పెంచారు. అధిక నైపుణ్యం కలిగిన, సాయుధ వాచ్‌మెన్‌కు రోజుకు కనీస వేతనం రూ.1,035 (నెలకు రూ.26,910) ఉంటుంది. ఇంతకు ముందు ఈ ఏడాది ఏప్రిల్‌లో వేతన రేట్లను సవరించారు. కాగా రంగం, కేటగిరీలు, ఏరియాల వారీగా కనీస వేతన రేట్లకు సంబంధించిన సమాచారం వెబ్‌సైట్ clc.gov.inలో అందుబాటులో ఉంది.

సిద్దరామయ్యకు రాహుల్ మద్దతు

బెంగళూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ముడా (మైసూర్ నగరాభివృద్ధి సంస్థ) ఇళ్ల స్థలాల కేటాయింపులో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. సిద్దరామయ్యను లోకాయుక్త విచారించనున్న నేపథ్యంలో వెనుకడుగు వద్దని, మరింత శక్తివంతుడు కావాలని, అండగా ఉంటామని రాహుల్ భరోసా ఇచ్చారు. జమ్మూకశ్మీర్, హరియాణా అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఉన్న రాహుల్‌గాంధీ గురువారం సిద్దరామయ్యకు ఫోన్ చేశారు. కాగా పార్టీ పరువుకోసం సిద్దరామయ్య వెంటనే రాజీనామా చేయాలని కాంగ్రెస్ సీనియర్ నేత, కర్ణాటక అసెంబ్లీ మాజీ స్పీకర్ కేబీ కోళివాడ సూచించారు.

అమెరికాలో హిందూ ఆలయంపై దాడి

వాషింగ్టన్, సెప్టెంబరు26: కాలిఫోర్నియాలోని ఒక హిందూ ఆలయంపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. శాక్రమెంటోలోని బాప్స్ శ్రీ స్వామి నారాయణ్ మందిరంపై "హిందువులు వెళ్లిపోవాలి" అంటూ నినాదాలు రాసి అక్కడ విధ్వంసం సృష్టించినట్లు ఆసంస్థ తెలిపింది. పది రోజుల వ్యవధిలోనే హిందువులకు వ్యతిరేకంగా ఇలాంటి దాడులు జరగడం ఇది రెండోసారి అని బాప్స్ ప్రజా వ్యవహారాల విభాగం పేర్కొంది. ఈ నెల 17న న్యూయార్క్‌లోని స్వామి నారాయణ్ మందిర్ వద్ద కూడా ఇలాంటి సంఘటనే చోటుచేసుకుంది. ఈ ఘటనను తమ సంస్థ తీవ్రంగా ఖండిస్తోందని బాప్స్ పేర్కొంది. ఇలాంటి విద్వేషపూరితమైన నేరాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ యంత్రాంగంతో కలిసి పనిచేస్తామని తెలిపింది. తాజాగా కాలిఫోర్నియాలో జరిగిన దాడిపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

గృహ హింస చట్టం మతాతీతం: సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 26: 'గృహ హింస చట్టం, 2005' దేశంలోని ప్రతి మహిళకు గృహ హింస నుంచి రక్షణ కల్పిస్తుందని.. మతం, సామాజిక నేపథ్యంతో సంబంధం లేకుండా స్త్రీలందరికీ ఇది వర్తిస్తుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. రాజ్యాంగం మహిళలకు ఇచ్చిన హక్కుల రక్షణకు ఈ చట్టం ఇతోధికంగా దోహదపడుతుందని తెలిపింది. జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఎన్ కోటీశ్వర్‌సింగ్‌లతో కూడిన ధర్మాసనం గురువారం ఈ తీర్పును వెలువరించింది. తన భర్త నుంచి భరణం, పరిహారానికి సంబంధించిన కేసులో కర్ణాటక హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఒక మహిళ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ జరిపింది.

ఫార్మాసిటీ రద్దు వెనుక భూ కుంభకోణం

» సీఎం సోదరులకు వేల కోట్లు దోచిపెట్టే కుట్ర
» హైకోర్టును మోసగించిన సర్కారు
» బతుకమ్మ చీరలు ఆపేయడం దారుణం
» నాపై కోపంతో సిరిసిల్లకు ఆర్డర్లివ్వడం లేదు: కేటీఆర్


ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కేటీఆర్


సిరిసిల్ల/హైదరాబాద్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఫార్మాసిటీ రద్దు వెనుక భూ కుంభకోణం ఉందని, సీఎం రేవంత్‌రెడ్డి తన సోదరులకు వేలకోట్లు దోచిపెట్టేందుకు కుట్ర చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఫార్మాసిటీ వ్యవహారంలో కాంగ్రెస్ ప్రభుత్వం 4కోట్ల మంది ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. న్యాయమూర్తులను తప్పుదోవ పట్టించేలా కోర్టులో అబద్ధాలు చెబుతోందని ఆరోపించారు. ఫార్మా సిటీని రద్దు చేయకుండా కాంగ్రెస్ సర్కారు చెబుతున్న ఏఐ సిటీ, ఫోర్త్ సిటీ, ఫ్యూచర్ సిటీలను ఎక్కడ కడతారో చెప్పాలని సవాల్ విసిరారు. ఫార్మాసిటీ ని రద్దు చేయడం లేదని చెబుతూనే.. అదే స్థానంలో వివిధ సిటీలను నిర్మిస్తామంటూ అతి పెద్ద కుంభకోణానికి కాంగ్రెస్ సర్కార్ స్కెచ్ వేసిందని మండిపడ్డారు. ఇప్పటికైనా స్పష్టమైన ప్రకటన చేయాలని, హైకోర్టుకు వాస్తవ పరిస్థితులను తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఈమేరకు కాంగ్రెస్ ప్రభుత్వానికి గురువారం ఆయన బహిరంగ లేఖ రాశారు. అలాగే, సిరిసిల్లలో ఐలమ్మ జయంతి సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. బోయినపల్లి మండలం కొదురుపాకలో కేటీఆర్ తాతయ్య-అమ్మమ్మ కేశవరావు- లక్ష్మీబాయి స్మారకార్థం నిర్మించిన ప్రభుత్వ పాఠశాల భవనాన్ని ప్రారంభించి మాట్లాడారు. తొమ్మిది నెలల్లో హెడ్ లైన్, డెడ్ లైన్ మేనేజ్‌మెంట్ తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీ లేదని దుయ్యబట్టారు. రాష్ట్రంలో హైడ్రా పేరిట హైడ్రామాలు సాగుతున్నాయని, పేదల ఇళ్లను నిర్దాక్షిణ్యంగా కూల్చేస్తున్నారని మండిపడ్డారు. మూడు రోజుల క్రితం రిజిస్ట్రేషన్ అయిన ఇంటిని కూల్చివేశారంటే.. రాష్ట్రంలో సర్కార్ నడుస్తోందా? సర్కస్ నడుస్తోందా? అర్థం కావడం లేదన్నారు. హైడ్రా బాధితులకు తమ న్యాయ బృందం సాయం చేస్తుందని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక బతుకమ్మ చీరలను బంద్ చేయడం దారుణమైన నిర్ణయమని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. తన మీద కోపంతో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు ప్రభుత్వం ఆర్డర్లు ఇవ్వడం లేదని దుయ్యబట్టారు. సిరిసిల్లలో 54 రేషన్ దుకాణాల కేటాయింపులో అడ్డగోలుగా వ్యవహరించిన కాంగ్రెస్ నాయకులే.. మళ్లీ ఆందోళనలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. అధికారులు కూడా వారికి మద్దతు తెలపడం విడ్డూరంగా ఉందన్నారు. మళ్లీ తాము అధికారంలోకి వస్తామని, అతి చేస్తున్న అధికారులందరికీ మిత్తీతో సహా చెల్లిస్తామని హెచ్చరించారు. కర్ణాటకలో తమ ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తూ రాజ్యాంగంలోని పదోషెడ్యూల్‌ను బీజేపీ అపహాస్యం చేస్తోందంటూ ఎక్స్ వేదికగా సిబాల్ చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ స్పందిస్తూ.. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో జరుగుతున్న తప్పులను సరిదిద్ది విమర్శలు చేస్తే అర్థం ఉంటుందని పేర్కొన్నారు.

లోడెత్తలేదు.. సీఎంఆర్ ఇవ్వలేదు!

టెండర్లలో పాడిన 25 లక్షల టన్నుల ధాన్యం ఇంకా రైస్‌మిల్లుల్లోనే

» పౌరసరఫరాల సంస్థకు డబ్బు చెల్లించలేదు... ధాన్యం తీసుకెళ్లలేదు
» 35 లక్షల టన్నుల టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం
» ఎఫ్‌సీఐకి ఇవ్వాల్సిన సీఎంఆర్ లక్ష్యాన్ని పూర్తిచేయని మిల్లర్లు

హైదరాబాద్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): టెండర్ అగ్రిమెంటు చేసుకొని తొమ్మిది నెలలు గడిచినా.. ఇంతవరకూ పౌరసరఫరాల సంస్థకు చెల్లించాల్సిన డబ్బులు చెల్లించలేదు. రైస్‌మిల్లుల నుంచి ధాన్యం లోడెత్తలేదు. వేలంపాటలో దక్కించుకున్న కాంట్రాక్టు ఏజెన్సీలు.. ఆడిందే ఆట, పాడిందే పాట అన్నట్లుగా వ్యవహరిస్తున్నాయి. ఫలితంగా రెండేళ్ల కిందటి రబీ ధాన్యం 25 లక్షల మెట్రిక్ టన్నులు.. ఇంకా రైస్‌మిల్లుల్లోనే మూలుగుతోంది. మరోవైపు రైస్ మిల్లర్లు భారత ఆహార సంస్థకు ఇవ్వాల్సిన కస్టమ్ మిల్లింగ్ రైస్ లక్ష్యాన్ని పూర్తిచేయకుండా మొండికేస్తున్నారు. నాలుగురోజుల్లో అక్టోబరు నెల వస్తోంది. అక్టోబరులో 91 లక్షల టన్ను ఖరీఫ్ ధాన్యం సేకరణకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. కానీ.. పాత నిల్వలు లక్షల టన్నులు ఉండగా... కొత్త ధాన్యం నిల్వచేయటానికి చోటెక్కడ? అనే ఆందోళన వ్యక్తమవుతోంది. కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి కనీస మద్దతు ధరకు సేకరించిన ధాన్యాన్ని రాష్ట్ర పౌరసరసరఫరాల సంస్థ ఎప్పటికప్పుడు రైస్‌మిల్లులకు పంపిస్తుంది. మిల్లింగ్ చార్జీలు, నూకలు, పరం, తవుడు, ఊక తదితర ఉప ఉత్పత్తులు తీసుకొని.. ఆరు నెలల్లోపు 67- 68 శాతం రికవరీ రేటుతో రైస్ మిల్లర్లు ప్రభుత్వానికి బియ్యం అప్పగించాలి. కానీ ఈ ప్రక్రియ సజావుగా సాగటం లేదు. రైస్‌మిల్లర్లు కొందరు ప్రభుత్వం ఇచ్చిన ధాన్యాన్ని నేరుగా అమ్ముకుంటున్నారు. కొందరేమో ధాన్యాన్ని మిల్లింగ్ చేసి బియ్యం అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. ఇంకొందరేమో ప్రభుత్వం ఇచ్చిన ధాన్యం అమ్ముకొని... పీడీఎస్ బియ్యాన్ని తిరిగి ఎఫ్‌సీఐకి, సివిల్ సప్లైస్ కార్పొరేషన్‌కు అంటగడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ధాన్యం నిల్వలను కొంత మేరకు ఖాళీ చేసేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం 35 లక్షల మెట్రిక్ టన్నులకు టెండర్లు పిలిచింది. 2022- 23 యాసంగి సీజన్ ధాన్యానికి ఎన్నికల ముందు టెండర్లు పిలవగా.. సగటున క్వింటాలుకు రూ.1,700 చొప్పున రేటు వచ్చింది. టెండర్లలో అక్రమాలు జరిగాయని, పౌరసరఫరాల సంస్థకు భారీ నష్టం అని ఆరోపణలు రావటంతో టెండర్లు రద్దుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ టెండర్లు పిలిచారు.



ఇప్పుడు క్వింటాలుకు సగటున రూ.2 వేల రేటు వచ్చింది. కానీ అప్పుడు ఏ ఏజెన్సీలకు టెండర్లు దక్కాయో? ఇప్పుడు కూడా అవే ఏజెన్సీలకు టెండర్లు దక్కటం చర్చనీయాంశంగా మారింది. కానీ ఈ ఏజెన్సీలు నిర్ణీత గడువులో రైస్‌మిల్లుల నుంచి ధాన్యం లిఫ్టింగ్ చేయటంలేదు. ధాన్యం విక్రయిస్తే.. రూ.7 వేల కోట్ల తక్షణ ఆదాయం వస్తుందనే ఆలోచనతో ప్రభుత్వం టెండర్లు పిలిచింది. కానీ ఇప్పటివరకు రూ.2 వేల కోట్లు మాత్రమే రికవరీ అయ్యాయి. ఇంకా రూ.5 వేల కోట్లు రికవరీ కావాల్సి ఉంది. టెండర్ అగ్రిమెంటుచేసి 9 నెలలు గడిచినా.. కేవలం 10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే లిఫ్టింగ్ చేశారు. ఈలావాదేవీలు కూడా కాగితాలపైనే జరిగాయి. రైస్ మిల్లు నుంచి లారీ లోడు ఎత్తింది లేదు. ధాన్యం బయటకు పంపించింది లేదు.

ఎఫ్‌సీఐకి టన్నుల కొద్దీ బకాయిలు

2022- 23 యాసంగి సీజన్‌లో 35 లక్షలు టెండర్లు పెట్టింది పోగా... ఇంకో 16 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కస్టమ్ మిల్లింగ్ చేసి ఎఫ్‌సీఐకి రైస్ ఇవ్వాలని ప్రభుత్వం టార్గెట్ పెట్టింది. కానీ రైస్‌మిల్లర్లు ఇప్పటికీ ఆ టార్గెట్ కూడా పూర్తిచేయలేదు. 2018- 23 మధ్యకాలంలో కూడా ఏ ఏడాదీ 100% సీఎంఆర్ టార్గెట్ పూర్తికాలేదు. ఆ నిల్వలు కూడా మిల్లుల్లో ఉన్నాయి. టెండర్ల ప్రక్రియ తర్వాత మళ్లీ రెండు సీజన్లలో(2023-24)లో ప్రభుత్వం ధాన్యం ప్రొక్యూర్మెంట్ చేసింది. ఖరీఫ్‌లో 47.34 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలుచేసి రైస్‌మిల్లర్లకు అప్పగించింది. 32 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం సీఎంఆర్ రూపంలో ఇవ్వాల్సి ఉండగా... 21 లక్షల టన్నుల బియ్యం మాత్రమే ఎఫ్‌సీఐకి చేరింది. మిగిలిన ధాన్యం రైస్‌మిల్లుల్లోనే ఉంది. నిరుడు రబీ సీజన్‌లో 48 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ప్రొక్యూర్మెంట్ చేసి మిల్లర్లకు అప్పగించింది. 33 లక్షల టన్నుల బియ్యం సీఎంఆర్ రూపంలో తిరిగి రావాల్సి ఉండగా... ఇప్పటివరకు 12 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే రికవరీ అయ్యింది. ఇంకా 21 లక్షల టన్నుల సీఎంఆర్ రిక వరీ కాలేదు. ఇందుకు సంబంధించిన ధాన్యం కూడా రైస్‌మిల్లుల్లో నిల్వ ఉండటం గమనార్హం.

కొణిజర్లలో ఎస్‌ఏఆర్ రైస్ మిల్లుపై కేసు

రూ.81 కోట్ల ధాన్యం మాయమైందని ఫిర్యాదు

పెనుబల్లిలో కేపీఆర్ మిల్లుపై విజిలెన్స్ దాడి

రూ.2 కోట్ల బకాయిలు చెల్లించాలని హెచ్చరిక

కొణిజర్ల/పెనుబల్లి, సెప్టెంబరు 26: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు రైస్ మిల్లులపై పౌర సరఫరాల అధికారుల దాడులు కొనసాగుతున్నాయి. కస్టమ్ మిల్లింగ్ రైస్‌ను ప్రభుత్వానికి ఇవ్వకుండా ధాన్యాన్ని పక్కదారి పట్టించినందుకు ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం లాలాపురం సమీపంలోని ఎస్‌ఏఆర్ రైస్ మిల్లు యజమానిపై పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ గంటా శ్రీలత కొణిజర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో గురువారం మిల్లు యజమాని రమాజ్యోతిపై పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. ఎస్‌ఏఆర్ రైస్ మిల్లుకు ప్రభుత్వం 2022-23, 2023-24 రబీ, ఖరీఫ్ సీజన్లకుగాను 3,50,622 క్వింటాళ్ల ధాన్యాన్ని సరఫరా చేయగా.. మిల్లు వారు 99,122.68 క్వింటాళ్లు మాత్రమే మర ఆడించి ప్రభుత్వానికి పంపించారు. దాంతో టాస్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, సివిల్ సప్లైస్ అధికారులు తనిఖీలు నిర్వహించి 2,51,499 క్వింటాళ్ల ధాన్యాన్ని పక్కదారి పట్టించినట్లు తేల్చారు. దీని విలువ సుమారు 81,60,90,000 ఉంటుందని మిల్లు యజమానిపై సవిల్ సప్లైస్ డీఎం శ్రీలత పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా, ధాన్యాన్ని కొనుగోలు చేసి ప్రభుత్వానికి చెల్లించాల్సిన నగదు చెల్లించకపోవడం, నోటీసులకు స్పందించకపోవడంతో గురువారం విజిలెన్స్ అధికారులు ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం టేకులపల్లిలోని కేపీఆర్ రైస్‌మిల్లుపై దాడి చేశారు. టేకులపల్లిలోని కేపీఆర్ రైస్‌మిల్లు గత ఏడాది రబీ వేలంలో రూ.2.85 కోట్లకు ధాన్యాన్ని కొనుగోలు చేసింది. ఇప్పటి దాకా ప్రభుత్వానికి రూ.65 లక్షలు మాత్రమే చెల్లించింది. మిగిలిన నగదును చెల్లించాలని నోటీసులు పంపించినా స్పందించటం లేదని జిల్లా అధికారులు సంబంధిత శాఖ అధికారులకు నివేదిక అందజేశారు. రైస్‌మిల్లు యజమాని నుంచి రికవరీ కోసం విజిలెన్స్ అధికారులు ఈ దాడులు నిర్వహించారు. ప్రభుత్వానికి వెంటనే నగదును చెల్లించాలని, లేకుంటే మిల్లును బ్లాక్ లిస్టులో పెట్టి క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించినట్లు సివిల్ సప్లైస్ విజిలెన్స్ అధికారులు తెలిపారు.

తిరుపతిలో హైటెన్షన్

జగన్ పర్యటనపై జనాగ్రహం

» రెచ్చగొట్టొద్దు బాధపెట్టొద్దు: హిందూ సంఘాలు
» అడుగు ముందుకు వేయనీబోం: స్వామీజీలు
» తిరుపతిలో పెద్దఎత్తున నిరసన ప్రదర్శన

తిరుపతి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): లడ్డూ ప్రసాదాలను అపవిత్రం చేసిన వ్యవహారం కాక రేపుతుండగానే.. ఏపీ మాజీ సీఎం జగన్ తిరుమలకు వెళ్తుండడం మంట రాజేస్తోంది. ఐదేళ్లుగా తన చేష్టలు, లడ్డూ కల్తీపై తన మాటలతో హిందూ భక్తుల మనోభావాలు గాయపరిచిన జగన్‌ను తిరుపతిలో అడుగుపెట్టనీయబోమని హిందూ సంఘాలు హెచ్చరించాయి. ఈ నేపథ్యంలో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. తిరుపతి పరిధిలో 30 పోలీసు యాక్ట్‌ను విధించింది. రేణిగుంట విమానాశ్రయం నుంచి అలిపిరి వరకు భారీఎత్తున బలగాలను మోహరించింది. శ్రీవారి లడ్డూ కల్తీ వ్యవహారం అప్పటి టీటీడీ పాలకవర్గం, జగన్‌ను పూర్తిగా ఆత్మరక్షణలో పడేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన తిరుమలలో శ్రీవారిని దర్శించుకునేందుకు శుక్రవారం రాత్రి తిరుపతి చేరుకోనున్నారు. మరునాడు ఉదయం శ్రీవారిని దర్శించుకుని, మధ్యాహ్నం నుంచి బయలుదేరి బెంగళూరుకు వెళతారు. అయితే, తిరుమల పవిత్రతను దెబ్బతీసిన జగన్ కొండకు రాకూడదంటూ బీజేపీ, హిందూ సంఘాలు హెచ్చరికలు జారీ చేశాయి. డిక్లరేషన్ ఇచ్చిన తర్వాతే తిరుమలలో స్వామిని దర్శించుకోవాలని కూటమి పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. ఆయనను అడ్డుకునేందుకు సన్నద్ధమవుతున్నాయి. 'జగన్.. మీరు మా తిరుమలకు రావొద్దు. వస్తే అడ్డుకుని తీరుతాం. మీ వాహనాలు మా సాధుసంతులు, హిందువుల శరీరాల పైనుంచి వెళ్లాల్సిందే తప్ప మిమ్మల్నైతే ఒక్క అడుగు కూడా ముందుకు వెళ్లనివ్వం' అని శ్రీనివాసానంద స్వామి స్పష్టం చేశారు. హిందూస్థాన్ పార్టీ వ్యవస్థాపకుడు తుమ్మ ఓంకార్ ఆధ్వర్యంలో పలువురు స్వామీజీలు తిరుపతిలోని గరుడ సర్కిల్‌వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. రెచ్చగొట్టొద్దు... బాధపెట్టొద్దు... మా తిరుమలకు రావొద్దు... ఐనా వస్తే ఖబడ్దార్ అని శ్రీనివాసానంద స్వామి హెచ్చరించారు. ఓంకార్ మాట్లాడుతూ... జగన్ తిరుమల పర్యటన సందర్భంగా అందరితో చర్చించి నిరసన కార్యాచరణను రూపొందిస్తామని తెలిపారు. శుక్రవారం స్వామీజీలు, అన్ని పార్టీల నాయకులతో సమావేశం కానున్నట్టు తెలిపారు. కాగా, జగన్ పర్యటన కోసం జిల్లా వైసీపీ నేతలు భారీ ఎత్తున జన సమీకరణకు యత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో తిరుపతిలో ఉద్రిక్త వాతావరణం నెలకుంది. జగన్ విమానం దిగే రేణిగుంట విమానాశ్రయం నుంచి అలిపిరి వరకు పెద్దఎత్తున పోలీసులను మోహరించారు. జిల్లాలో గురు, శుక్రవారాల్లో పోలీస్ 30 యాక్ట్ అమలు చేస్తున్నట్టు ఎస్పీ ప్రకటించారు.

కూతురు ఆత్మహత్యతో రగిలిపోయి..
వియ్యంకుడి దారుణ హత్య

» వాస్తవానికి అల్లుడే టార్గెట్.. ఆ సమయంలో లేకపోవడంతో తప్పిన ముప్పు
» వియ్యంకుడి కంట్లో కారం కొట్టి కర్రతో దాడి
» అక్కడికక్కడే మృతి.. నిజామాబాద్ జిల్లాలో ఘటన..

మోపాల్, సెప్టెంబరు 26: కూతురు ఆత్మహత్యకు అల్లుడే కారణం అని రగిలిపోతున్న ఓ తండ్రి.. తన అల్లుడిని ఎలాగైనా చంపాలని పథకం వన్నాడు. నేరుగా అల్లుడి ఇంటికి వెళ్లగా అతడు కనిపించకపోవడంతో వియ్యంకుడిపై తన కోపాన్నంతా చూపాడు. కంట్లో కారం చల్లి.. కర్రతో విచక్షణారహితంగా కొట్టి చంపాడు. నిజామాబాద్ జిల్లాలో ఈ ఘటన జరిగింది. మోపాల్ మండలం కంజర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సత్యనారాయణ తన కూతురు భవితను అదే గ్రామానికి చెందిన గోవర్ధన్‌కు ఇచ్చి పదేళ్ల క్రితం పెళ్లి జరిపించాడు. భవిత-గోవర్ధన్‌కు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. మూడు నెలల క్రితం భవిత ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. అల్లుడి వేధింపుల కారణంగానే కూతురు బలవన్మరణానికి పాల్పడిందంటూ గోవర్ధన్‌పై సత్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు గోవర్ధన్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇటీవలే గోవర్ధన్ బెయిల్‌పై ఇంటికి తిరిగొచ్చాడు. ఈ క్రమంలో తన కూతురు పిల్లలకు ఆస్తిని రాసి ఇవ్వాలని సత్యనారాయణ తన అల్లుడు గోవర్ధన్‌ను కోరగా.. ఇందుకు అతడు అంగీకరించలేదు.. బుధవారం రాత్రి సత్యనారాయణ కారం, కర్ర పట్టుకొని గోవర్ధన్ ఇంటికి వెళ్లాడు. ఆ సమయానికి గోవర్ధన్ ఇంట్లో లేడు. అతడి తండ్రి నరహరి (55) ఇంట్లో పడుకొని ఉన్నాడు. సత్యనారాయణ అతడి కంట్లో కారం చల్లి, కర్రతో తలపై చితకబాది పరారయ్యాడు. తీవ్రగాయాలతో నరహరి అక్కడికక్కడే మృతిచెందాడు. నిజామాబాద్ ఏసీపీ రాజావెంకట్రెడ్డి, సీఐ సురేశ్ గురువారం ఘటనా స్థలికి చేరుకొని పరిశీలించారు. హత్యలో సత్యనారాయణతో పాటు మరికొంత మంది ఉన్నారని తాము భావిస్తున్నామని ఎస్సై యాదగిరి తెలిపారు. నిందితుడు ప్రస్తుతం పరారీలో ఉన్నాడని, త్వరలోనే అతన్ని పట్టుకుంటామన్నారు.

కేటీఆర్‌కు సృజన్‌రెడ్డి లీగల్ నోటీసులు

హైదరాబాద్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు సూదిని సృజన్‌రెడ్డి లీగల్ నోటీసులు పంపారు. తెలంగాణ సర్కారు తన కంపెనీ శోభ కన్‌స్ట్రక్షన్‌కు ఇచ్చిన అమృత్ టెండర్లలో అవినీతి జరిగిందంటూ చేసిన ఆరోపణలపై ఈ నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. బీఆర్ఎస్, కేటీఆర్ చేస్తున్న ఆరోపణలు నిరాధారమైనవని.. తాను కష్టపడి సంపాదించుకున్న పేరు, ప్రతిష్ఠలను దెబ్బతీసే ఉద్దేశంతోనే ఇవన్నీ చేస్తున్నారని మండిపడ్డారు. పత్రికలు, సోషల్ మీడియాలో తన గురించి తప్పుడు ప్రచారానికి పాల్పడ్డారన్నారు. సోషల్ మీడియా, వెబ్‌సైట్లలో ప్రచురించిన కథనాలను తొలగించాలని సృజన్‌రెడ్డి కోరారు. తన పరువుకు నష్టం కలిగించే ప్రకటనలను ఉపసంహరించుకొని, 24 గంటల్లోగా బహిరంగ క్షమాపణలు చెప్పాలని కేటీఆర్‌ను డిమాండ్ చేశారు. లేని పక్షంలో చట్టపరమైన చర్యలకు బాధ్యులు కావాల్సి వస్తుందని హెచ్చరించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ ● శుక్రవారం 27 సెప్టెంబరు 2024
diksuchi@andhrajyothy.com

ఎన్ఎస్ఐసీలో టెక్నికల్ కోర్సులు




న్యూఢిల్లీలోని ఎన్ఎస్ఐసీ టెక్నికల్ సర్వీసెస్ సెంటర్- జాబ్ ఓరియంటెడ్ టెక్నికల్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. కోర్సును అనుసరించి ఎనిమిదోతరగతి/పదోతరగతి /ఇంటర్/ ఐటీఐ/డిప్లొమా /బీటెక్/ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. నిబంధనల ప్రకారం కోర్సు పూర్తిచేసినవారికి కేంద్ర ప్రభుత్వ సర్టిఫికెట్ ప్రదానం చేస్తారు. ఉద్యోగావకాశాలు కూడా కల్పిస్తారు. పూర్తి సమాచారం కోసం సెప్టెంబరు 21 నాటి ఎంప్లాయిమెంట్ న్యూస్ చూడవచ్చు.

ప్రోగ్రామ్‌లు
- అడ్వాన్స్ ట్రెయినింగ్ ఆన్ ఎలక్ట్రిక్ వెహికిల్(నెల/రెండు నెలలు)
- సోలార్ ఎనర్జీ విత్ పీవీఎస్‌టీఎల్(నెల/రెండు నెలలు)
- ఎలక్ట్రికల్ ఆటో క్యాడ్(నెల/ఆరు వారాలు)
- హోమ్ అప్లయన్స్ రిపేర్ అండ్ మెయింటెనెన్స్(రెండు నెలలు/అర్నెల్లు)
- సీసీ టీవీ ఇన్‌స్టలేషన్ టెక్నీషియన్(నెల/రెండు నెలలు)

ముఖ్య సమాచారం
- **చిరునామా:** ఎన్ఎస్ఐసీ టెక్నికల్ సర్వీసెస్ సెంటర్, ఓఖ్లా ఇండస్ట్రియల్ ఎస్టేట్, ఫేజ్-3, గోవింద్‌పురి మెట్రో స్టేషన్, న్యూఢిల్లీ-110020
- **వెబ్‌సైట్:** www.nsic.co.in

తెలంగాణ ఐటీఐల్లో అయిదో విడత ప్రవేశాలు

హైదరాబాద్‌లోని ఉపాధి-శిక్షణ కమిషనర్ కార్యాలయం- రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఐటీఐ కళాశాలల్లో అయిదో విడత ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది. ప్రభుత్వ, ప్రైవేట్, మైనారిటీ కళాశాలల్లో మిగిలిన సీట్లు భర్తీ చేయనున్నారు. అకడమిక్ మెరిట్, రిజర్వేషన్ నిబంధనల ప్రకారం అడ్మిషన్స్ ఇస్తారు. ఇప్పటి వరకు అప్లయ్ చేసుకోనివారు, దరఖాస్తు చేసుకున్నప్పటికీ సీటు లభించనివారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. గతంలో దరఖాస్తు చేసుకున్నవారు మరల అప్లయ్ చేయనవసరం లేదు. వీరు తాము చేరదలచుకున్న ఐటీఐ కళాశాలలో నిర్వహించే వాక్ ఇన్ అడ్మిషన్స్‌కు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలి. అక్కడ సీటు రాని పక్షంలో నిర్దేశిత గడువులోపు మరో కళాశాలలో ప్రయత్నించవచ్చు. ఈ ఏడాది నుంచి ఖమ్మం, నిజామాబాద్ ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో ఒక్కోదానిలో ఆరు కోర్సులు; మల్లేపల్లి ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో నాలుగు కోర్సులను నూతనంగా ప్రారంభిస్తున్నారు. వీటి వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.



ఐటీఐ కోర్సులు(ట్రేడ్‌లు): కార్పెంటర్, సీవోపీఏ, డ్రాఫ్ట్స్‌మన్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఫౌండ్రీమన్, మెషినిస్ట్, ప్లంబర్, టర్నర్, వెల్డర్ వైర్‌మన్ తదితరాలు

కొత్త కోర్సులు
- మాన్యుఫాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటొమేషన్
- ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మాన్యుఫాక్చరింగ్
- ఆర్టిసన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్స్
- బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫయర్(మెకానికల్)
- అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మెషినింగ్ టెక్నీషియన్
- మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికిల్

అర్హత: ట్రేడ్‌ను అనుసరించి ఎనిమిదోతరగతి లేదా పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. కొత్త కోర్సులకు మాత్రం పదోతరగతి ఉత్తీర్ణత తప్పనిసరి. అభ్యర్థుల వయసు ఆగస్టు 1 నాటికి 14 ఏళ్లు నిండి ఉండాలి. డ్రోన్ టెక్నాలజీ కోర్సుకు మాత్రం 16 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ఠ వయోపరిమితి నిబంధనలు లేవు.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 28
- **వాక్ ఇన్ అడ్మిషన్స్‌కు చివరి తేదీ:** సెప్టెంబరు 28
- **వెబ్‌సైట్:** iti.telangana.gov.in

కొండా లక్ష్మణ్ వర్సిటీలో ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ



సిద్దిపేట్ జిల్లా ములుగులోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ స్టేట్ హార్టికల్చరల్ యూనివర్సిటీ(ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ)- ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. అకడమిక్ ప్రతిభ, నిర్దేశిత ఎంట్రెన్స్ ఎగ్జామ్ స్కోర్, కౌన్సెలింగ్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎమ్మెస్సీ(హార్టికల్చర్): ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. మొత్తం 30 సీట్లు ఉన్నాయి. వీటిలో ఫ్రూట్ సైన్స్ 8, వెజిటబుల్ సైన్స్ 11, ఫ్లోరికల్చర్ అండ్ ల్యాండ్‌స్కేప్ ఆర్కిటెక్చర్ 8, ప్లాంటేషన్-స్పయిసెస్-మెడిసినల్ అండ్ అరోమాటిక్ క్రాప్స్ 3 సీట్లు ఉన్నాయి.

అర్హత: ఐకార్ గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బీఎస్సీ ఆనర్స్(హార్టికల్చర్)/బీఎస్సీ(హార్టికల్చర్) ఉత్తీర్ణులై ఉండాలి. 10 పాయింట్ల స్కేల్ మీద కనీసం 5.5 ఓజీపీఏ ఉండాలి. ఐకార్ ఏఐఈఈఏ(పీజీ)2024 ఎంట్రెన్స్ ఎగ్జామ్‌లో స్కోర్ సాధించి ఉండాలి.

ఎంపిక: బీఎస్సీ మార్కులకు 40 శాతం, ఐకార్ ఏఐఈఈఏ(పీజీ)2024 ఎంట్రెన్స్ ఎగ్జామ్ స్కోర్‌కు 60 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేసి కౌన్సెలింగ్, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ నిర్వహిస్తారు.

పీహెచ్‌డీ(హార్టికల్చర్): ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. మొత్తం 6 సీట్లు ఉన్నాయి. వీటిలో ఫ్లోరికల్చర్ అండ్ ల్యాండ్‌స్కేప్ ఆర్కిటెక్చర్ 1, ప్లాంటేషన్-స్పయిసెస్-మెడిసినల్ అరోమాటిక్ క్రాప్స్ 1, ఫ్రూట్ సైన్స్ 2, వెజిటబుల్ సైన్స్ 2 సీట్లు ఉన్నాయి.

అర్హత: సంబంధిత స్పెషలైజేషన్‌తో ఎమ్మెస్సీ(హార్టికల్చర్) ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. 10 పాయింట్ల స్కేల్ మీద కనీసం 6.5 ఓజీపీఏ ఉండాలి. ఐకార్ ఏఐసీఈ-జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్(పీహెచ్‌డీ)2024 ఎంట్రెన్స్ ఎగ్జామ్‌లో స్కోర్ సాధించి ఉండాలి. అభ్యర్థుల వయసు డిసెంబరు 31 నాటికి 40 ఏళ్లు మించకూడదు.

ఎంపిక: బీఎస్సీ మార్కులకు 20 శాతం, ఎమ్మెస్సీ మార్కులకు 20 శాతం, ఐకార్ ఏఐసీఈ-జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్(పీహెచ్‌డీ)2024 ఎంట్రెన్స్ ఎగ్జామ్ స్కోర్‌కు 60 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేసి కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. తరవాత డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ ఉంటుంది.

- **రిజిస్ట్రేషన్ ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1500; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.750
- **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 14
- **చిరునామా:** రిజిస్ట్రార్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ, ములుగు, సిద్దిపేట్-502279
- **వెబ్‌సైట్:** skltshu.ac.in

ఐఐసీడీలో కోర్సులు

- బీ డిజైన్
- ఎం డిజైన్
- ఎం ఒకేషనల్



జైపూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రాఫ్ట్స్ అండ్ డిజైన్(ఐఐసీడీ)- బీ డిజైన్, ఎం డిజైన్, ఎం ఒకేషనల్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. నిబంధనల మేరకు స్కాలర్‌షిప్‌లు అందిస్తారు. డిగ్రీలో మూడేళ్లు, పీజీలో ఏడాది కోర్సు పూర్తయ్యాక ఎనిమిది వారాల ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్ పూర్తిచేయాల్సి ఉంటుంది. నాన్ రెసిడెంట్ ఇండియన్స్, సార్క్ దేశాల అభ్యర్థులు, ఇతర విదేశీ విద్యార్థులు కూడా ఈ ప్రోగ్రామ్‌లకు దరఖాస్తు చేసుకోవచ్చు. వీరు ఐఈఎల్‌టీఎస్/టోఫెల్ స్కోర్, రెసిడెన్షియల్ పర్మిట్ సబ్మిట్ చేయాలి.

డిగ్రీ, పీజీ స్పెషలైజేషన్‌లు
- ☆ హార్డ్ మెటీరియల్ డిజైన్
- ☆ సాఫ్ట్ మెటీరియల్ డిజైన్
- ☆ ఫైర్డ్ మెటీరియల్ డిజైన్
- ☆ ఫ్యాషన్ క్లాతింగ్ డిజైన్
- ☆ జ్యువెలరీ డిజైన్
- ☆ క్రాఫ్ట్స్ కమ్యూనికేషన్

బోధనాంశాలు
- ☆ డిగ్రీ ప్రోగ్రామ్‌లో క్రాఫ్ట్స్ అండ్ డిజైన్, స్కిల్స్ అండ్ అప్లికేషన్స్, హిస్టరీ ఆఫ్ క్రాఫ్ట్స్, మెటీరియల్స్-సైన్స్, టూల్స్-టెక్నిక్స్-ప్రాసెస్, ఫీల్డ్ ఎక్స్‌పోజర్, కస్టమర్-మార్కెట్ నీడ్స్, డిజైన్ ప్రాసెస్ తదితర అంశాలు బోధిస్తారు.
- ☆ పీజీ ప్రోగ్రామ్‌లలో రీసెర్చ్, కాన్సెప్ట్, డిజైన్-సిస్టమ్స్ అండ్ సొల్యూషన్ థింకింగ్, అడ్వాన్స్ ఎక్స్‌ప్లొరేషన్ ఆఫ్ మెటీరియల్స్-డిజైన్ పాజిబిలిటీస్, ఇన్నోవేషన్స్, బిజినెస్ ఆఫ్ క్రాఫ్ట్స్ అండ్ డిజైన్, సోషల్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ అండ్ లీడర్‌షిప్ అంశాలు వివరిస్తారు.

బీ డిజైన్: ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఇందులోనే ఏడాది వ్యవధిగల ఫౌండేషన్ కోర్సు ఉంటుంది. ఏడాదికి రెండు చొప్పున మొత్తం ఎనిమిది సెమిస్టర్లు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 180 సీట్లు ఉన్నాయి. గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

ఎం డిజైన్: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌లో 90 సీట్లు ఉన్నాయి. బీ డిజైన్/బీఆర్క్/బీఏ డిజైన్/బీఎస్సీ డిజైన్/బీ ఒకేషనల్ డిజైన్/తత్సమాన కోర్సులు పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎం ఒకేషనల్: దీనిని నాన్ డిజైన్ డిగ్రీ కోర్సులు చేసిన అభ్యర్థులకు ప్రత్యేకించారు. ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. మొత్తం ఆరు సెమిస్టర్‌లు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌లో 90 సీట్లు ఉన్నాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా మొదటి ఏడాది ఐఐసీడీ అందించే పీజీ ఫౌండేషన్ కోర్సు పూర్తిచేయాల్సి ఉంటుంది.

ఎంట్రెన్స్ టెస్ట్ వివరాలు: దీనిని ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. ఇందులో రెండు దశలు ఉంటాయి. మొదటిది జనరల్ అవేర్‌నెస్-క్రియేటివిటీ అండ్ పర్సెప్షన్ టెస్ట్. ఇందులో అభ్యర్థి పరిశీలన శక్తి, ఎస్టిమేషన్ సామర్థ్యం, విజువల్ ఇంటర్‌ప్రిటేషన్‌పై అవగాహన తదితరాలు పరీక్షిస్తారు. రెండోది మెటీరియల్-కలర్స్-కాన్సెప్ట్ టెస్ట్. ఇందులో పోర్ట్ ఫోలియో సబ్మిషన్ ఉంటుంది. ఇది పూర్తిగా అభ్యర్థి క్రియేటివ్ వర్క్‌కు సంబంధించింది. ఇందులో స్కెచింగ్, పెయింటింగ్, ఎంబ్రాయిడరీ, ఫొటోగ్రఫీ, మోడల్స్, ఎక్స్‌ప్లొరేషన్ విత్ మెటీరియల్స్, క్రియేటివ్ రైటింగ్ తదితర అంశాలు ఉండేలా చూసుకోవాలి. అభ్యర్థులు పెన్స్, పెన్సిల్స్ (హెచ్‌బీ, 2బీ, 4బీ, 6బీ), సిజర్స్, స్కేల్, సెల్లో టేప్, పేపర్ కట్టర్, ఫెవీ స్టిక్, ఎరేజర్, కంపాస్, కలర్ పెన్సిల్స్, వాటర్ కలర్స్, బ్రష్‌లు వెంట తెచ్చుకోవాలి. తరవాత పర్సనల్ ఇంటర్వ్యూ ఉంటుంది. ఇందులో ఆప్టిట్యూడ్ టు క్రాఫ్ట్స్, ఇంటెలిజెన్స్ కోషంట్, కమ్యూనికేషన్ ఎబిలిటీ, క్రాఫ్ట్స్ అండ్ డిజైన్‌కు సంబంధించిన జనరల్ అవేర్‌నెస్, పర్సనల్ అచీవ్‌మెంట్స్, కరిక్యులర్ యాక్టివిటీస్ ఆధారంగా అభ్యర్థుల ప్రావీణ్యాన్ని పరీక్షిస్తారు. జనరల్ అవేర్‌నెస్-క్రియేటివిటీ అండ్ పర్సెప్షన్ టెస్ట్‌కు 35 శాతం, మెటీరియల్-కలర్స్-కాన్సెప్ట్ టెస్ట్‌కు 45 శాతం, పర్సనల్ ఇంటర్వ్యూకు 20 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

- **ఫీజు:** ఇండియా సహా సార్క్ దేశాల అభ్యర్థులకు రూ.1,750; ఎన్ఆర్ఐలు సహా విదేశీ విద్యార్థులకు రూ.3,500
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** అక్టోబరు 7 నుంచి
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 7
- **క్వశ్చన్ పేపర్, అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** 2025 జనవరి 16 నుంచి
- **క్వశ్చన్ పేపర్‌కు సంబంధించిన రెస్పాన్స్ షీట్లు పంపేందుకు చివరి తేదీ:** 2025 జనవరి 25
- **పర్సనల్ ఇంటర్వ్యూలు:** ఫిబ్రవరి 3
- **ఫలితాలు విడుదల:** 2025 ఫిబ్రవరి 21
- **అడ్మిషన్ ఫీజు చెల్లింపు:** 2025 ఫిబ్రవరి 28 నుంచి
- **వెబ్‌సైట్:** iicd.ac.in

జాబ్ కార్నర్

ఐటీబీపీలో హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ పోస్టులు

ఖాళీలు 128

కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖకు చెందిన ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్(ఐటీబీపీ)... నాన్ గెజిటెడ్(నాన్ మినిస్టీరియల్) గ్రూప్-సి విభాగంలో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు
1. హెడ్ కానిస్టేబుల్(డ్రెస్సర్ వెటర్నరీ)(పురుషులు/మహిళలు): **9 పోస్టులు**
2. కానిస్టేబుల్(యానిమల్ అటెండెంట్)(పురుషులు/మహిళలు): **115 పోస్టులు**
3. కానిస్టేబుల్(కెన్నెల్‌మన్)(పురుషులు మాత్రమే): **4 పోస్టులు**

అర్హత: హెడ్ కానిస్టేబుల్ పోస్టులకు 12వ తరగతి, వెటర్నరీలో సర్టిఫికెట్/డిప్లొమా కోర్సు; కానిస్టేబుల్ పోస్టులకు పదో తరగతి ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు ఉండాలి.

వయోపరిమితి: 2024 సెప్టెంబరు 10 నాటికి హెడ్ కానిస్టేబుల్(డ్రెస్సర్ వెటర్నరీ), కానిస్టేబుల్(కెన్నెల్‌మన్) పోస్టులకు 18-27 ఏళ్లు; కానిస్టేబుల్(యానిమల్ అటెండెంట్) పోస్టులకు 18-25 ఏళ్ల మధ్య ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, రాత పరీక్ష, డిటైల్డ్ మెడికల్ ఎగ్జామినేషన్, రివ్యూ మెడికల్ ఎగ్జామినేషన్, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

పే స్కేల్: హెడ్ కానిస్టేబుల్‌కు రూ.25,500. కానిస్టేబుల్‌కు రూ.21,700.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 29

వెబ్‌సైట్: https://itbpolice.nic.in/

అనంతపురం జిల్లాలో అంగన్‌వాడీ ఖాళీలు

ఖాళీలు 80

అనంతపురం జిల్లాలోని ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఉద్యోగాల భర్తీకి జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: అంగన్‌వాడీ వర్కర్/మినీ అంగన్‌వాడీ వర్కర్/అంగన్‌వాడీ హెల్పర్

ప్రాజెక్టుల వారీగా ఖాళీలు: అనంత అర్బన్- 8; శింగనమల-6; నార్పల-9; అనంత రూరల్-10; తాడిపత్రి-14; గుత్తి-5; ఉరవకొండ-12; కళ్యాణదుర్గం-6; కనేకల్లు-5; కంబదూరు-7; రాయదుర్గం-2

అర్హత: 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి.

వయసు: 21 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉండాలి

జీతం: నెలకు అంగన్‌వాడీ వర్కర్ పోస్టులకు రూ.11500, మినీ అంగన్‌వాడీ వర్కర్‌కు రూ.700, అంగన్‌వాడీ హెల్పర్‌కు రూ.7000.

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ దరఖాస్తులను సంబంధిత ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో అందజేయాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 1

వెబ్‌సైట్: https://ananthapuramu.ap.gov.in/



ఎంటీపీఎఫ్‌లో టెక్నీషియన్లు

ఖాళీలు 81

ఆర్మర్డ్ వెహికిల్స్ నిగమ్ లిమిటెడ్(ఏవీఎన్ఎల్)కు చెందిన మహారాష్ట్ర థానే జిల్లా అంబర్‌నాథ్‌లోని మెషిన్ టూల్ ప్రోటోటైప్ ఫ్యాక్టరీ...ఫిక్స్‌డ్ టర్మ్ ఒప్పంద ప్రాతిపదికన ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు:
1. జూనియర్ మేనేజర్: **26 పోస్టులు**
2. డిప్లొమా టెక్నీషియన్: **34 పోస్టులు**
3. అసిస్టెంట్: **2 పోస్టులు**
4. జూనియర్ టెక్నీషియన్: **19 పోస్టులు**

విభాగాలు: మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, సివిల్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఫైనాన్స్ అండ్ అకౌంట్స్, మార్కెటింగ్ అండ్ ఎక్స్‌పోర్ట్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీరింగ్, సీఎన్‌సీ ఆపరేటర్, టూల్ డిజైన్, గ్రైండర్, ఎలక్ట్రీషియన్.

అర్హత: సంబంధిత విభాగంలో డిప్లొమా, ఇంజనీరింగ్ డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

జీతం: నెలకు జూనియర్ మేనేజర్ పోస్టులకు రూ.47,610, జూనియర్ టెక్నీషియన్ పోస్టులకు రూ.34,227; మిగతా పోస్టులకు రూ.37,201.

వయోపరిమితి: 28 ఏళ్లు మించకూడదు. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్ల సడలింపు ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: స్క్రీనింగ్, రాతపరీక్ష, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ దరఖాస్తులను 'ఆర్మర్డ్ వెహికిల్స్ నిగమ్ లిమిటెడ్, మెషిన్ టూల్ ప్రోటోటైప్ ఫ్యాక్టరీ, ఆర్డినెన్స్ ఎస్టేట్, అంబర్‌నాథ్, థానే, మహారాష్ట్ర' చిరునామాకు పంపాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 11

వెబ్‌సైట్: https://avnl.co.in/

లిటిల్స్

అంతు లేని కథ


ఒక రోజు అక్బరు, చక్రవర్తి తన కొలువులో కూర్చుని సభికులకు ఒక పోటీ పెట్టాడు. అదేమిటి అంటే చక్రవర్తి తాను ఆపు అనే అంత వరకు కథ చెబుతూనే ఉండాలి. అలా చెప్పగల వారికి బంగారం వజ్రాల వంటి విలువైన బహుమతులు ఎన్నో ఉంటాయని ప్రకటించాడు.

పోటీ మొదలయే రోజు రానే వచ్చింది.అందరూ ఆ పోటీలో ఎప్పటిలాగే బీర్బల్ గెలుస్తాడని ఊహించారు. ఆ రోజు ఒక్కో కదకుడు వచ్చి మంచి మంచి కథలు చెబుతూఉంటే అక్బరు వాటిని కళ్లు మూసుకుని హాయిగా వింటున్నాడు. కానీ ప్రతి కథ అయిపోయిన వెంటనే అయ్యో..అపుడే కథ అయిపోయిందా?!అంటున్నాడు, ఎక్కడా చక్రవర్తి ఎవరినీ ఆపమని అనడంలేదు. ఇదంతా చూసి చివరగా బీర్బల్ కథ చెప్పడానికి వచ్చాడు. తన కథను ఇలా మొదలు పెట్టాడు. 'మహారాజా.. ఒక అడవిలో పెద్ద చెట్టు కింద సింహం నిద్రపోతూఉంది, అందరినీ ఎల్లపుడూ భయపెట్టే ఆ సింహం అంత ప్రశాంతంగా నిద్రపోతూఉంటే మొదట దాన్ని చూడటానికి ఒక ఎలుగుబంటి వచ్చింది. అలా వరుసగా




అడవిలోని జంతువులన్నీ రాసాగాయి. ఆ పక్కనఅడవిలో మరో ఇరవై సింహాలున్నాయి, అందులో మొదటి సింహం వచ్చింది. నిద్రలో ఉన్న సింహాన్ని చూసి వెళ్లింది. ఆ తరువాత రెండవ సింహం వచ్చింది అలాగే చూసి వెళ్లింది ఆ తర్వాత మూడవ సింహం వచ్చింది, ఆ వెంటనే అయిదవ సింహం వచ్చిందిఅని చెబుతూఉండగా అక్బరు బీర్బల్‌ను ఆపి ఇలా అన్నాడు 'ఏమిటి నీకు అసలు లెక్కలే రానట్టు ఉన్నాయి, మూడు తరువాత ఏకంగా ఐదు అని లెక్కపెడుతున్నావు మధ్యలోనాలుగవ సింహం లెక్కఏది? ఆపు'అని చిరాకుగా అరిచాడు. వెంటనే బీర్బల్ 'మహారాజా నాకు ఇస్తాను అన్న విలువైన బహుమతులేవో ఇచ్చేస్తే,నేను ఇక వెళ్లిపోతాను అన్నాడు.

దానికి అక్బరు 'నేనెపుడు నిన్ను కథ ఆపమన్నాను?నేను చాలు అనలేదు కదా అనేసి వెంటనే తన పొరపాటు గ్రహించి, నాలిక కరుచుకున్నాడు, ఆ తర్వాత నీ తెలివికి చమత్కారానికి నీకు ఏమిచ్చినా తక్కువే బీర్బల్ ఇదిగో నువ్వే గెలిచావు' అని నవ్వుతూ బీర్బల్‌కి తాను ముందుగా చెప్పిన దానికంటే ఎక్కువ కానుకలు ఇచ్చి పంపాడు.



10 తేడాలను కనుక్కోండి

సరైన నీడ ఏది?





దారి కనుక్కోండి

డైలీ సుడోకు - 420

	3	6	5	4				7
			7					
7	8	5				6		
		3		7		4	9	
9				2				5
	6	8		9		7		
		1				8	4	9
					9			
8				1	4	5	3	

సుడోకు - 419 సమాధానం

5	2	7	3	9	6	8	1	4
9	3	4	8	2	1	7	6	5
1	6	8	7	5	4	3	2	9
2	4	6	5	1	8	9	3	7
8	9	3	4	6	7	2	5	1
7	1	5	2	3	9	6	4	8
4	7	2	6	8	5	1	9	3
6	5	1	9	7	3	4	8	2
3	8	9	1	4	2	5	7	6

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.